సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 123

గురువారం 24-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నా అక్కలూ..చెల్లెళ్లు...
తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినప్పుడే
నా నిజమైన పుట్టిన రోజు



చరిత్ర సృష్టించిన దివ్య

ప్రపంచకప్ చెస్ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా ఘనత - 14లో



'ట్రేడ్ డీల్స్' లాభాలు

బ్లూ చిప్ షేర్లలో కొనుగోళ్లు.. సెన్సెక్స్ 540 పాయింట్లు ప్లస్ -15లో



'సిందూర్'పై 28న ప్రత్యేక చర్చ

'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంట్‌లో ఈనెల 28న లోక్‌సభలో, 29న రాజ్యసభలో చర్చ జరిగే అవకాశం ఉంది.

వివరాలు 6లో ▸



చెప్పకుండా వచ్చి లేఖ ఇచ్చేసి..

తన రాజీనామా లేఖను తానే స్వయంగా వెళ్లి రాష్ట్రపతి ముర్ముకు ధన్‌ఖడ్ అందజేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాలు 6లో ▸



గాజాలో అన్నమో రామచంద్ర!

కల్లోలిత గాజాలో ఆకలికేకలతో జనం పిట్టల్లా రాలిపోతున్నారు. 24 గంటల వ్యవధిలోనే కనీసం 15 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



పట్టువీడని ప్రతిపక్షాలు

పార్లమెంట్ ఉభయ సభల్లో వరుసగా మూడో రోజూ విపక్షాల ఆందోళనలు, నిరసనలు, నినాదాలు కొనసాగాయి.

వివరాలు 6లో ▸

కేంద్రం మెడలు వంచుతాం



బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు ఇండియా కూటమి నేతల మద్దతు కూడగడతాం

42 శాతం రిజర్వేషన్లపై అన్ని పక్షాల సహకారంతో ఒత్తిడి పెంచుతాం

లొంగకపోతే ప్రధాని మోదీని దింపి, మా నేతను కూర్చోబెట్టి సాధించుకుంటాం

- ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు..42% రిజర్వేషన్ల అమలుకు కృతనిశ్చయంతో ఉన్నాం
- ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది
- రిజర్వేషన్లపై నేడు పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- ఓబీసీ నేత బండారు దత్తాత్రేయను ఉప రాష్ట్రపతిని చేయాలన్న సీఎం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పిలిస్తే వెళ్తానని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రం మెడలు వంచి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ అంశంలో కేంద్రాన్ని ఒప్పించేలా కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు ఇండియా కూటమి పక్షాల నేతల మద్దతును సైతం కూడగడతామని చెప్పారు. తద్వారా ఒత్తిడి పెంచుతామని, ఒత్తిళ్లకు లొంగని పక్షంలో ప్రధాని మోదీని కుర్చీ దింపి, తమ నేతను కుర్చీలో కూర్చోబెట్టి బీసీ రిజర్వేషన్లను సాధించుకుంటామని అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవి తెలంగాణకు ఇవ్వాలని, ఓబీసీ నేత బండారు దత్తాత్రేయకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్ విచారణకు పిలిస్తే వెళ్తానని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్ర ఎంపీలతో కలిసి ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

రెండు బిల్లులు పంపించాం..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే పూర్తి చేసింది. అందులో వెల్లడైన వివరాల మేరకు బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించాం. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఆ మేరకు రిజర్వేషన్ల కోసం ఒకటి, స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ల కోసం ఒకటి..ఇలా శాసనసభలో రెండు బిల్లులు చేసి

మిగతా 2వ పేజీలో ▶



> రాత్రికి రాత్రి 30-40 బుల్డోజర్లను పెట్టి అడవుల్లో చెట్లను నరికించేయాల్సిన అవసరం ఏమొచ్చింది?. అభివృద్ధి కోసం అడవులను నరకడం సమంజసం కాదు. అడవులను సంరక్షించాలా? లేదా మీ అధికారులను జైలుకు పంపాలా? అనే దానిపై నిర్ణయం తీసుకోండి.
> ..: సీజేఐ జస్టిస్ గవాయ్ :..

రాత్రికి రాత్రే అడవులపై బుల్డోజర్లు ఎందుకు?

అంత అత్యావశ్యకత ఏమొచ్చిందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

- వారాంతంలో అటవీ భూమిని ధ్వంసం చేయాల్సిన అవసరం ఏంటి?
- అటవీ భూముల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- అడవులను సంరక్షించాలా లేదా మీ అధికారులను జైలుకు పంపాలా అనేది మీరే నిర్ణయించుకోండి
- కంచ గచ్చిబౌలి కేసులో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యలు
- ప్రస్తుతం పనులు నిలిపి వేసినట్లు తెలిపిన ప్రభుత్వ న్యాయవాది సింఘ్వీ

సాక్షి, న్యూఢిల్లీ: రాత్రికి రాత్రి 30–40 బుల్డోజర్లను పెట్టి అడవుల్లో చెట్లను నరికించేసి సుస్థిర అభివృద్ధి కోసమేనని సమర్థించుకోలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అక్కడ ఉన్న అటవీ భూమిని అంత అత్యావశ్యకంగా ధ్వంసం చేయాల్సిన అవసరం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. అటవీ సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనంటూ సున్నితంగా హెచ్చరించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ జోమలయ బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, మేనక గురుస్వామి, బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, పి.మోహిత్‌రావు, మరో పిటిషనర్ తరఫున ఎస్.నిరంజన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం

మిగతా 16వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మంచి కాలేజీకే మొగ్గు!



కొన్ని కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలో సీటు వచ్చినా ఇంజనీరింగ్ విద్యార్థులు ససేమిరా అంటున్నారు. మంచి కాలేజీ వస్తేనే చేరుతాం అంటున్నారు. ఇలా 12,224 మంది కంప్యూటర్, ఐటీ కోర్సుల్లో సీట్లు వచ్చినా చేరలేదు.

- వివరాలు 16లో▶

ఆ ఐదు గ్రామాల్లో సర్వే మ్యాప్, భూధార్ అమలు



పైలట్ పద్ధతిలో భూముల రీసర్వే నిర్వహించిన రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో త్వరలోనే సర్వే మ్యాప్ నిబంధనతో పాటు భూధార్ కార్డుల జారీని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు మంత్రి పొంగులేటి చెప్పారు.

- వివరాలు 3లో▶

1.8 భూగోళాలు కావాలి



కెనడాలోని యోర్క్ యూనివర్సిటీ అంచనాల ప్రకారం.. ఈ ఏడాది డిసెంబర్ ఆఖరు నాటికి మానవాళి పర్యావరణ అప్పు 80%కి చేరుతుంది. అంటే 1.8 భూగోళాలు పునరుత్పత్తి చేసి సమకూర్చవలసినంత ఎక్కువగా ప్రకృతి వనరుల్ని మనం వాడేస్తున్నాం.

- వివరాలు 2లో▶

ఆస్కార్ దారిలో తెలుగమ్మాయ్



వందకు పైగా దేశాలు.. 3,127 షార్ట్ ఫిల్మ్‌లు, 30 రోజుల పాటు వడపోతలు.. చివరికి మిగిలింది 60 షార్ట్ ఫిల్మ్‌లు.. అందులో ఒకటి ఏపీలోని ఎస్‌ఐడీ సంస్థకు చెందిన లావణ్య లోధది కావడం విశేషం.

- వివరాలు 13లో▶



కేసీకి 18.51 టీఎంసీలు చాలు!

- మిగిలిన 26.59 టీఎంసీలను మాకు కేటాయించండి
- కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట తెలంగాణ వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఏపీలోని కర్నూలు–కడప (కేసీ) కాల్వ కింద ఆయకట్టుకి 18.51 టీఎంసీల జలాలే అవసరమని తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. ఇవిపోగా ఈ కాల్వకు ఉన్న వాస్తవ నీటి లభ్యత 45.1 టీఎంసీల్లో మిగిలిన 26.59 టీఎంసీలను తమ రాష్ట్రానికి కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కి తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునః పంపిణీ కోసం విచారణ నిర్వహిస్తున్న ట్రిబ్యునల్ బుధవారం ఢిల్లీలో నిర్వహించిన విచారణలో తెలంగాణ తరఫున సీనియర్

మిగతా 12వ పేజీలో ▶

మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ సమీపంలో పొంగి పొర్లుతున్న మున్నేరు వాగు



రాష్ట్రమంతా కుండపోత

హైదరాబాద్ సహా పలు జిల్లాలు అతలాకుతలం

- కరీంనగర్ జలమయం..
- భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- నీట మునిగిన పర్ణశాలలోని సీతమ్మ నారచీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఏజెన్సీలో ఉప్పొంగిన వాగులు, వంకలు
- పిడుగు పాటుకు యువకుడి మృతి... ఈతకు వెళ్లిన బాలుడు, చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు ..
- ఉత్తర తెలంగాణకు భారీ వర్షసూచన
- ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

సాక్షి,నెట్‌వర్క్: రాష్ట్రాన్ని కుండపోత వాన ముంచెత్తింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో కురిసిన ఏకధాటి వానతో దారులన్నీ ఏరులయ్యాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. బుధవారం ఉదయం నుంచి కుండపోత వానతో కరీంనగర్ తీవ్రంగా ప్రభావితమైంది. ఆకాశానికి చిల్లులు పడినట్టు ఉదయం 6 గంటల నుంచే వాన విరుచుకుపడటంతో నగర వీధులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా కరీంనగర్ స్మార్ట్ సిటీ వరదతో అతలాకుతలమైంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కలెక్టరేట్, పోలీసు కమిషనరేట్ ప్రాంగణాలు, ప్రధాన జంక్షన్లు, రహదారులు నీటమునిగాయి. కరీంనగర్

మిగతా 5వ పేజీలో ▶



పోలవరం వద్ద 651 టీఎంసీల మిగులు!

- తెరపైకి ఏపీ సరికొత్త వాదన
- కేవలం 200 టీఎంసీల తరలింపునకే గోదావరి–బనకచర్ల అనుసంధానం
- బొల్లపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 200 టీఎంసీలకు పెంచుకోవచ్చు
- తమ రాష్ట్రానికి వచ్చే జలాలు తమవేనని స్పష్టీకరణ
- బనకచర్లపై సీడబ్ల్యూసీ కొర్రీలకు ఏపీ ప్రభుత్వ సమాధానాలు

- వివరాలు 12లో▶



మీరు నటనకు ఎప్పుడూ దూరంగా లేర్సార్! నటిస్తూనే ఉన్నారు!

ఆర్డినెన్స్ చుట్టే అంతా!

'స్థానిక' రిజర్వేషన్ల పెంపుపై తొలగని సందిగ్ధత

- ఇప్పటివరకు వెలువడని ఆర్డినెన్స్
- ఇంకా రాజ్‌భవన్‌కే చేరలేదంటూ అధికార వర్గాల్లో చర్చ
- ఏజీని గవర్నర్ పిలిపించి ఆరా తీశారనే ప్రచారం
- ఎన్నికల సన్నాహాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీరాజ్ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాజకీయాలన్నీ బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు ఉద్దేశించిన ఆర్డినెన్స్ చుట్టే తిరుగుతున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రాతిపదికగా సర్వత్రా చర్చ సాగుతోంది. కేంద్రం అనుమతి పొందేలా ఒత్తిడి తీసుకుని వస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఇదే జరిగితే స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించిన రిజర్వేషన్లతో ఎన్నికల నిర్వహణకు ఏ మేరకు అవకాశం ఉందన్నదీ ఆసక్తికరంగా మారింది. అయితే

మిగతా 3వ పేజీలో ▶

'అసెంబ్లీ'కి ప్రీఫైనల్

స్థానిక ఎన్నికలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- పార్టీ కోసం కష్టపడిన కేడర్‌ను గెలిపించుకుంటాం.. కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను అందిపుచ్చుకోవాలి
- పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా పని చేస్తున్నారు.. గులాబీ జెండా ఎగిరితే అధికారుల వైఖరిలో మార్పు వస్తుందని వెల్లడి
- బీఆర్‌ఎస్‌లోకి వికారాబాద్, సిర్పూర్ నుంచి చేరికలు



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలకు ప్రీఫైనల్ లాంటివని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. పార్టీ యంత్రాంగం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ తిరిగి వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన కేడర్‌ను గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. వికారాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన

మిగతా 3వ పేజీలో ▶

నాలుగేళ్ల స్థానికత నిబంధన పక్కకు

- నీట్ కౌన్సెలింగ్‌కు ఆ విద్యార్థులను అనుమతించాలి
- కాళోజీ వర్సిటీకి హైకోర్టు ఆదేశం
- తుది ఉత్తర్వుల మేరకే సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టీకరణ.. తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా



విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు: సుప్రీం 2లో

సాక్షి, హైదరాబాద్: 'స్థానికత'కు సంబంధించిన నాలుగేళ్ల నిబంధనను పక్కకు పెట్టి నీట్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థులను అనుమతించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. 2025 సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సులకు అనుమతి ఇవ్వాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తాము ఇచ్చే తుది ఉత్తర్వుల మేరకే సీట్ల కేటాయింపు ఉంటుందని విద్యార్థులకు

మిగతా 2వ పేజీలో ▶

మనకు 1.8 భూగోళాలు కావాలి



జూలై 24తో భూగోళంపై 'పర్యావరణ బడ్జెట్' ఖాళీ!

భూమి తిరిగి పూడ్చుకోగల దానికన్నా వేగంగా వాడకం

25 నుంచి పీల్చే గాలి, తాగే నీరూ అన్నీ అప్పు తెచ్చుకునేవే

మానవాళి ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వాడేస్తోంది. మనం చేస్తున్న పనుల వల్ల కలిగే వనరుల నష్టాన్ని భూగోళం తిరిగి పూడ్చుకోగలిగిన దానికన్నా చాలా ఎక్కువగా.. ఏకంగా 80% ఎక్కువ వేగంగా వాడేస్తున్నాం. ఈ ఏడాది డిసెంబర్ ఆఖరు నాటి వరకు ఈ భూగోళం పునరుత్పత్తి చేయగల వార్షిక నాచురల్ క్యాపిటల్ మొత్తాన్నీ మానవాళి రేపటితో (జూలై 24 కల్లా) తుడిచిపెట్టేయనుంది. 25 నుంచి మన పర్యావరణ ఓవర్ డ్రాఫ్ట్ వాడకం ప్రారంభమవుతుంది. కెనడాలోని యోర్క్ యూనివర్సిటీ అంచనాల ప్రకారం.. ఈ ఏడాది డిసెంబర్ ఆఖరు నాటికి మానవాళి పర్యావరణ అప్పు 80%కి చేరుతుంది. అంటే 1.8 భూగోళాలు పునరుత్పత్తి చేసి సమకూర్చవలసినంత ఎక్కువగా ప్రకృతి వనరుల్ని మనం వాడేస్తున్నాం.

- సాక్షి, సాగుబడి

54 ఏళ్లలో ఎంతో తేడా..

ఏయే దేశంలో ఉన్న ప్రకృతి వనరులు ఏటేటా పునరుత్పత్తి చేయగల జీవ సామర్థ్యం (బయో కెపాసిటీ) ఎంత? ఆ దేశం వాడుకుంటున్న వనరుల ఖర్చు (ఎకలాజికల్ ఫుట్ ప్రింట్) ఎంత? అని యోర్క్ యూనివర్సిటీ 55 ఏళ్ల క్రితం శాస్త్రీయంగా లెక్కలు కడుతోంది. 1971లో ప్రకృతి వనరుల బడ్జెట్ డిసెంబర్ చివరి వరకూ వచ్చేది. క్రమంగా ముందే ఖాళీ అయిపోవటం ప్రారంభమైంది. మధ్యలో అప్పుడప్పుడూ ఒకటి, రెండేళ్లు తప్ప మార్పు లేదు. జనాభా పెరగటం, సాంకేతికత పెరిగి వనరుల వినియోగం పెరగటంతో 2012 నాటికల్లా ఆగస్టు లోపే పర్యావరణ బడ్జెట్ ఖాళీ అయిపోయే స్థితికి చేరాం. ఇప్పుడు జూలై 24కు దిగజారాం.

2.7 భారతదేశాలు కావాలి

పునరుత్పత్తయ్యే పర్యావరణ వనరులు, మానవాళి వాడుకుంటున్న వనరుల ఖర్చును 'గ్లోబల్ హెక్టార్ల'(జీహెచ్‌ఏల)లో లెక్కగడుతుంటారు. 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి ఒకరికి ఎర్త్ బయో కెపాసిటీ 1.5 జీహెచ్‌ఏలు కాగా.. తలసరి ఎకలాజికల్ ఫుట్ ప్రింట్ మాత్రం 2.6. అంటే.. బయో కెపాసిటీ లోటు -1.1. భారతీయుల బయో కెపాసిటీ 0.3 జీహెచ్‌ఏలైతే తలసరి ఫుట్ ప్రింట్ 1.1 జీహెచ్‌ఏలు. అంటే.. మన దేశంలో ప్రతి ఒక్కరం ఏటా భూదేవికి 0.8 జీహెచ్‌ఏల మేరకు రుణగ్రస్తులమవుతున్నాం! మన వాడకం ఇలా కొనసాగితే.. మన అవసరాలకు 2.7 భారతదేశాలు కావాలి లేదా 0.8 భూగోళాలు కావాలి.

ఖతర్ ఖాళీ.. ఉరుగ్వే నయం

భౌగోళికంగా ఆయా దేశాల్లో ప్రకృతి వనరుల సుసంపన్నత, అడవుల విస్తీర్ణం, జనాభా, వనరుల వినియోగం తీరుతెన్నులు వంటి అనేక అంశాల ఆధారంగా ఆయా దేశాల జీహెచ్‌ఏలు మారిపోతూ ఉంటాయి. బయో కెపాసిటీ తక్కువగా ఉండి వనరుల వాడకం ఎక్కువగా ఉండే దేశంలో పర్యావరణ వార్షిక బడ్జెట్ చాలా కొద్ది రోజుల్లోనే అడుగంటిపోతుంది. ఉదాహరణకు.. ఎడారి దేశమైన ఖతర్ పర్యావరణ ఖాతా ఫిబ్రవరి 6 నాటికే ఖాళీ అయిపోయింది. డిసెంబర్ వరకు తన పర్యావరణ బడ్జెట్‌ను వాడుకోగలుగుతున్నది ఒక్క ఉరుగ్వే మాత్రమే.

తేదీని వెనక్కి జరిపేదెలా?

పర్యావరణ వార్షిక బడ్జెట్ గడువును వెనక్కి జరపాలంటే ప్రకృతి వనరుల వినియోగాన్ని తగ్గించుకుంటూ పర్యావరణ పరిరక్షణకు మనం నడుం బిగించాలి. ముఖ్యంగా జనాభా పెరుగుదల, ఆహారోత్పత్తి పద్ధతులు, ఇంధన వినియోగం, నగరాల నిర్వహణ, భూగోళం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనుల్లో మార్పులు తేవాల్సి ఉంటుంది. ఆహార వృథాని అరికట్టడం, శాకాహారానికి ప్రాధాన్యం ఇవ్వటం, ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించటం, పచ్చదనాన్ని, అడవుల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడం ద్వారా ఎర్త్ ఓవర్ షూట్ డేని 32 రోజుల పాటు వెనక్కి నెట్టవచ్చని యోర్క్ యూనివర్సిటీ నిపుణుల అంచనా. ఆ దేశం ఈ దేశం అని కాకుండా, భూతల వాసులంతా అన్ని విధాలుగా వనరుల వినియోగాన్ని కనిష్ట స్థాయికి నియంత్రించుకుంటేనే ఈ 'పర్యావరణ లోటు బడ్జెట్'కొంతైనా భర్తీ అవుతుంది. లేదంటే ఎప్పటికీ పూడదు, పెరగటం తప్ప!

ఏయే దేశానికి ఎన్ని భూగోళాలు కావాలంటే..	అమెరికా	ఆస్ట్రేలియా	రష్యా	ఫ్రాన్స్	భారత్
	5	4.7	3.8	3.3	0.8

అదే జపాన్ వాసుల్లా ఉంటే...	జపాన్	చైనా	ఇటలీ	యూకే	భారత్
	6.6	4.7	4.4	3.6	3.1

క్లుప్తంగా...

ఢిల్లీకి పీసీసీ చీఫ్, బీసీ మంత్రులు

నేడు రాహుల్, ఖర్గేలతో సమావేశం.. రేపు బాగీదారి సమ్మేళనానికి హాజరు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకత్వమంతా ఢిల్లీకి వెళ్లింది. రెండ్రోజుల పాటు అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి బుధవారం ఢిల్లీ వెళ్లారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో వీరు భేటీ కానున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం 25న ఢిల్లీ వేదికగా జరిగే బాగీదారి సమ్మేళనానికి కూడా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ బీసీ నేతలు హాజరు కానున్నారు.

రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 25న సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో సమావేశం కానుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, వర్షాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. గిగ్ వర్కర్స్ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లుతోపాటు గోసంరక్షణ విధివిధానాలపై చర్చించి మంత్రివర్గం ఆమోదించనుంది. కేంద్రం తీసుకున్న పాలసీ నిర్ణయం ఆధారంగా ప్రైవేటు క్యాబ్ సేవలను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడం వంటి అంశాలపై మంత్రివర్గ భేటీలో చర్చించే అవకాశం ఉంది.

సబ్ కలెక్టర్లుగా ట్రైనీ ఐఏఎస్‌లు

ఆరుగురు నియామకం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్‌కు చెందిన ఆరుగురు 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమాహారతిని సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ సబ్ కలెక్టర్‌గా, అజ్మీరా సంకేత్‌కుమార్‌ను నిర్మల్ జిల్లా భైంసా సబ్ కలెక్టర్‌గా, అభిజ్ఞ మాలవీయను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా, అజయ్‌యాదవ్‌ను ఖమ్మం జిల్లా కల్లూరు సబ్ కలెక్టర్‌గా, మ్రినాల్ శ్రేష్ఠను భద్రాచలం సబ్ కలెక్టర్‌గా, ఐఈఎస్‌ఎస్‌డీ మనోజ్‌ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా నియమించారు.

కేంద్రం మెడలు వంచుతాం

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రానికి పంపించాం. ఈ విషయంలో సహకరించాలని, సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. కేంద్రం తాత్సారం చేస్తోంది.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేసేలా వివిధ మార్గాల్లో ఒత్తిడి తెస్తున్నాం. అయితే కేంద్రం ఆమోదించకుండా తాత్సారం చేస్తోంది. గతంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెస్తే, కాంగ్రెస్ అనేక పోరాటాలు చేసి వాటిని వెనక్కి తీసుకునేలా చేసింది. కులగణనను చేయబోమన్న కేంద్రాన్ని జనగణనలో కులగణనను భాగం చేసేలా ఒప్పించింది. అదే మాదిరి ఇప్పుడు కూడా కేంద్రం మెడలు వంచుతాం. మా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచేలా చేయాలన్న ఉద్దేశంతో నేను, మా ఎంపీలు, మంత్రులు ఢిల్లీకి వచ్చాం. వారిని కలవడంతో పాటు కాంగ్రెస్ ఎంపీలందరినీ కలిసి రాష్ట్రంలో నిర్వహించిన సర్వే గురించి వివరిస్తాం. ఇండియా కూటమిలోని ఇతర సభ్యులను కలుస్తాం. సహకరించాలని విజ్ఞప్తి చేస్తాం. గురువారం కాంగ్రెస్ ఎంపీలకు బీసీ రిజర్వేషన్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం. అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకురావాలని అంటున్నరు. అసలు అఖిల పక్షం ఎక్కడుంది? ప్రధాన ప్రతిపక్ష నేత నిద్రపోతున్నడు. ఆయన పిల్లలు కొట్లాడుకుంటున్నరు. తాను చెడిన కోతి వనమెల్లా చెరిచినట్లు వ్యవహరిస్తున్నారు. ఇంకేం అఖిలపక్షం. బీజేపీ రిజర్వేషన్లు వద్దంటోంది. ఎంఐఎం మద్దతిస్తోంది.

బీజేపీది వితండ వాదం..

ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ వితండ వాదం చేస్తోంది. ఏకగ్రీవ తీర్మానానికి బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతిస్తే, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు మాత్రం వితండ వాదం చేస్తున్నారు. బీజేపీకి ఒకటి, కాంగ్రెస్‌కు మరొక రాజ్యాంగం లేదు. అంబేడ్కర్ రాజ్యాంగమే అందరికీ అమలవుతోంది. ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తే మద్దతు ఇస్తామని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. వాళ్లకు కనీస అవగాహన లేదు. గుజరాత్, యూపీ, మహారాష్ట్రల్లో ముస్లిం రిజర్వేషన్లు 50 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. మీకు ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే ఈ మూడు రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు తొలగించిన తర్వాత తెలంగాణకు అలా సూచించండి. గుజరాత్‌లో ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్న అమిత్ షాను బీజేపీ నుంచి సస్పెండ్ చేస్తారా? మొండి, తొండి వాదనను పక్కనబెట్టాలి. బలహీన వర్గాలకు న్యాయం చేయాలి.



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు చామల కిరణ్, మల్లు రవి

వచ్చే ఎన్నికలు లిట్మస్ టెస్టువంటివి

2029 లోక్‌సభ ఎన్నికలు ఓబీసీ రిజర్వేషన్లకు లిట్మస్ టెస్ట్ వంటివి. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఎక్కడా ఇవ్వలేదు. కేవలం వెనుకబాటుతనంలో ఉన్నవారికే రిజర్వేషన్ ఇస్తున్నాం. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన నివేదికను మొదట మంత్రివర్గంలో చర్చించి త్వరలో శాసనసభలో ప్రవేశపెడతాం. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు తర్వాత మొత్తం 50 శాతం రిజర్వేషన్లే అనేది ఎప్పుడో పోయింది. కొందరు వితండవాదులు చేసే వాదనలకు కోర్టులే సమాధానం చెబుతాయి. మొదట రిజర్వేషన్లు అమలు అయిన తర్వాత సబ్ కేటగిరైజేషన్ గురించి ఎక్స్‌పర్ట్ కమిటీ చర్చిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది.

దత్తాత్రేయకు చాన్స్ ఇవ్వాలి

ఉప రాష్ట్రపతి పదవి తెలంగాణకు ఇవ్వాలి. గతంలో వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయనను రాష్ట్రపతి చేసే అంశంపై చర్చ జరిగింది. ఆయనను ఢిల్లీ నుంచి వెనక్కి పంపించేశారు. తెలుగు మాట్లాడే ఆయనను ఘర్‌వాపసీ చేయించారు. ఆ తప్పును సరిదిద్దుకోవడానికి బండారు దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వాలి. గవర్నర్‌గా ఆయన పదవీకాలం పూర్తయింది. గతంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఆ పదవి నుంచి తొలగించి కిషన్‌రెడ్డికి ఇచ్చారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తొలగించారు. ఇప్పుడు ఆ పదవి బ్రాహ్మణుడైన ఎన్.రామచందర్‌రావుకు ఇచ్చారు. బీజేపీ తెలంగాణలోని ఓబీసీ నేతల గొంతు కోసింది. ఈ తప్పులన్నింటినీ క్షమించాలంటే దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వాలి. తెలంగాణ ప్రజల తరఫున దత్తాత్రేయకు, ఓబీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నా. దత్తాత్రేయ అభ్యర్థిత్వానికి అందరి ఆమోదం ఉంటుంది.

సొంత ఇంటివాళ్ల ఫోన్లే ట్యాప్ చేశారంట..

మీడియా సమావేశానంతరం రేవంత్‌రెడ్డి విలేకరులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఫోన్ ట్యాపింగ్‌పై మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ జరుగుతోంది. సొంత ఇంటివాళ్ల ఫోన్లే ట్యాప్ చేశారని తెలుస్తోంది. నా ఫోన్ ట్యాప్ అయిందో? లేదో నాకు తెలియదు. నా ఫోన్ ట్యాప్ అయ్యుంటే నన్ను విచారణకు పిలిచేవారు కదా. ఒకవేళ సిట్ విచారణకు పిలిస్తే కచ్చితంగా వెళతా. మా ప్రభుత్వానికి ఫోన్ ట్యాపింగ్‌లు చేసే ఉద్దేశం లేదు. దానివల్ల ఒనగూరేది లేదు. ఇది గత ఎన్నికల్లోనే రుజువైంది..'అని అన్నారు.

నిబంధనల మేరకే సీఎం రమేశ్ కంపెనీకి కాంట్రాక్టు

ఫ్యూచర్ సిటీలో రోడ్ల కాంట్రాక్టు టెండర్‌ను బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు ఇవ్వడంపై ప్రశ్నించగా.. 'రూ.1,600 కోట్ల ఈ–టెండర్‌ను నిబంధనల మేరకే వారి కంపెనీ దక్కించుకుంది. ఎల్‌అండ్‌టీ సైతం ఈ–టెండర్‌లో పాల్గొంది. నా మిత్రుడని ఈ టెండర్ కట్టబెట్టలేదు. ఓపెన్ టెండర్‌లోనే వారికి దక్కింది..'అని రేవంత్ వివరించారు. కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి ఎక్కడా రుణాలు తీసుకోలేదని, కేవలం తెలంగాణ ప్రభుత్వ సావరిన్ బాండ్లను వేరే కంపెనీలు కొనుక్కున్నాయని స్పష్టం చేశారు.

ఆగస్టు 1 నుంచి ఆసుపత్రుల్లో 'ఆధార్ హాజరు' తప్పనిసరి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగుల హాజరుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. వచ్చే నెల 1వ తేదీ 'ఆధార్ ఆధారిత హాజరు విధానం (అబాస్)'ను ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే అన్ని ఆసుపత్రుల్లో అమలు చేయనున్నారు. 'అబాస్'విధానంలో హాజరుకు సంబంధించి తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)తో పాటు ప్రజారోగ్య సంచాలకులు (డీపీహెచ్), ఆయుష్‌శాఖల పరిధిలోని అన్ని ఆసుపత్రుల్లో 'అబాస్'అమలుకు సంబంధించి ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సిట్ ఏసీపీకి బండి సంజయ్ లేఖ

వాంగ్మూలాలు నమోదు చేయాలని విజ్ఞప్తి




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎస్‌ఐబీ కేంద్రంగా జరిగిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో తనతో పాటు తన సహాయకుల వాంగ్మూలాలను సోమవారం నమోదు చేయాల్సిందిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిట్ ఏసీపీకి బుధవారం లేఖ రాశారు. ఈ కేసులో సంజయ్‌తో పాటు ఆయన పీఆర్వో, పీఏలను సాక్షులుగా పరిగణిస్తూ వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు గతంలో నోటీసులు ఇచ్చారు. సిట్ నోటీసులపై సానుకూలంగా స్పందించిన సంజయ్ గురువారం వాంగ్మూలం ఇవ్వడానికి అంగీకరించారు. ఆయన కేంద్ర మంత్రి కావడంతో తామే వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటంతో ఆయన ఢిల్లీలోనే ఉన్నారు. దీంతో గురువారానికి బదులు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు వాంగ్మూలం నమోదు చేయాలంటూ సంజయ్ లేఖ రాశారు. అదేరోజు తనతో పాటు తన పీఆర్వో పసునూరు మధు, పీఏ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, మాజీ పీఏ పోగుల తిరుపతి స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేయాలని కోరారు.

చంద్రబాబే మోదీని ఎక్కువ విమర్శించారు

అటువంటి వ్యక్తితోనే బీజేపీ పొత్తు పెట్టుకుంది

- బీఆర్‌ఎస్ నుంచి ఎవరైనా వస్తే పార్టీ చేర్చుకుంటుంది
- ఎట్టి పరిస్థితుల్లోనూ కే–ఫ్యామిలీతో మాత్రం పొత్తు ఉండదు
- ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: 'దేశ ప్రధాని మోదీపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కంటే ఎక్కువగా విమర్శలు చేసిన వ్యక్తి ఏపీ సీఎం చంద్రబాబు. అటువంటి చంద్రబాబుతోనే పొత్తు పెట్టుకున్నాం. పార్టీలోకి వచ్చే వారి విషయాలు అధిష్టానం పరిధిలో ఉంటాయి, అధిష్టానం నిర్ణయమే ఫైనల్..'అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయంటూ.. మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పై సమాధానమిచ్చారు. 'నాకు తెలిసి బీఆర్‌ఎస్‌తో బీజేపి పొత్తు అసాధ్యం. ఈ విషయంలో అధిష్టానం ఆలోచన నాకు తెలుసు. ఎట్టి పరిస్థితుల్లోనూ కే–ఫ్యామిలీ (కేసీఆర్ ఫ్యామిలీ)తో పొత్తు ఉండదు. అయితే బీఆర్‌ఎస్ నుంచి ఎవరైనా వస్తే మాత్రం పార్టీ చేర్చుకుంటుంది..'అని చెప్పారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు.

రాజాభాయ్ సస్పెండ్ కాలేదు.. రిజైన్ చేశాడు

ఈటల, బండి విషయంలో నోడల్ ఎంక్వయిరీ కమిషన్ వేయాలని పార్టీ నేతలకు అర్వింద్ సూచించారు. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన రాజాసింగ్ ఎక్కడున్నా తాము గౌరవిస్తామని, ఆయన సస్పెండ్ కాలేదని, రిజైన్ చేశాడని, పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇస్తే మెంబర్షిప్ తీసుకోవచ్చన్నారు.

కొత్త పరిశ్రమలతో యువతకు ఉపాధి

- ఎంఎస్‌ఎంఈ రంగానికి అన్ని విధాలుగా సహకరిస్తాం
- పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను రప్పించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమవుతున్న పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటామని తెలిపారు. బుధవారం సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్‌టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్ టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. 'రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటాం. ప్రత్యేకించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్‌ఎంఈ రంగానికి అన్ని విధాలుగా సహకరిస్తాం. అదే సమయంలో కార్మికుల ప్రయోజనాలను కాపాడతాం. గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించకుండా అందరినీ కలుపుకొని వెళతాం..'అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో రోల్ మోడల్

'పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారింది. ఏడాదిన్నర పాలనలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చాం. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించాం. అయినా రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్‌ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి'అని మంత్రి విమర్శించారు. సమావేశంలో తెలంగాణ కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డుతో టీ–వాలెట్‌లోకి నగదు బదిలీ

క్రెడిట్ కార్డుతో టీ–వాలెట్‌లోకి నగదు బదిలీ చేసేలా కొత్త సదుపాయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇకపై వినియోగదారులు క్రెడిట్ కార్డు నుంచి నేరుగా టీ–వాలెట్ ఖాతాల్లోకి నిధులు బదిలీ చేసుకోవచ్చు.

'కుసుమ్'ను ఇప్పటికైనా సద్వినియోగం చేసుకోండి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన



సాక్షి, న్యూఢిల్లీ: పీఎం కుసుమ్ పథకాన్ని అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం విఫలమైందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతును సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సూచించారు. 'పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, రైతులపై విద్యుత్ భారం తగ్గించే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనల మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కుసుమ్ పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్లు, సబ్సిడీతో పంప్‌సెట్లు, గ్రిడ్ అనుసంధానం కలిగిన వ్యవస్థలు అమలవుతాయి. అయితే, ఈ పథకాన్ని అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది'అని కిషన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా కిషన్‌రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పథకానికి అనుగుణంగా తెలంగాణకు 450 మెగావాట్ల డీసెంట్రలైజ్డ్ సోలార్ విద్యుత్ సామర్థ్యం, అదనంగా 20 వేల సోలార్ అగ్రికల్చర్ పంప్‌సెట్లు కేటాయించినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. కాగా తెలంగాణలో సౌర విద్యుత్ ఉత్పత్తికి విస్తృత అవకాశాలున్నాయని కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ అంశంలో కేంద్ర పునరుత్పాదక శక్తి శాఖ మంత్రి ప్రల్హాద్ జోషికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 'పీఎం కుసుమ్ పథకం 2026లో ముగియనుంది. కనీసం ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా చొరవ తీసుకోవాలి' అని కిషన్‌రెడ్డి కోరారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

నీట్‌లో స్థానికత అంశంపై పరిష్కారంతో రండి

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వచ్చే నెల 5కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: నీట్ కౌన్సెలింగ్, మెడికల్ సీట్ల వ్యవహారంలో స్థానికత అంశానికి సంబంధించి పరిష్కారంతో రావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించింది. లేదంటే ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. అడ్మిషన్లకు సంబంధించి నీట్‌కు ముందు నాలుగేళ్లు స్థానికంగా చదివి ఉండాలనే నిబంధనతో తెలంగాణ ప్రభుత్వం గతంలో జీవో 33 తీసుకొచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్‌తోపాటు మరో 160 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం..గతేడాది సెప్టెంబర్ 5న విద్యార్థులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సెప్టెంబర్ 11న ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఎస్‌ఎల్పీపై బుధవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ జోమలయ బగ్చీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

అయినా స్థానిక కోటా దక్కడం లేదు..

ప్రతివాదుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ..తెలంగాణలో పుట్టి పదోతరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదన్నారు. 11, 12వ తరగతులను చదవని కారణంగా నీట్‌లో స్థానిక కోటా దక్కక నష్ట పోతున్నట్లు కోర్టుకు నివేదించారు. పలు సందర్భాల్లో కేంద్ర పారామిలటరీ, ఇతర ఉద్యోగాలరీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో పని చేయాల్సి వస్తోందని, అలాంటి వారి పిల్లలు ఈ నిబంధనతో అవకాశాల్ని కోల్పోతున్నారని వాదించారు.

సలహాలతో వస్తాం..: తెలంగాణ తరఫు న్యాయవాది వాదిస్తూ..గతంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. తాజాగా ఈ విషయంలో స్పష్టతతో వస్తామని ధర్మాసనానికి తెలిపారు. దీంతో ఎలాంటి సలహాలతో (అడ్వైజ్‌లతో) కోర్టు ముందుకు వస్తారో తదుపరి విచారణలో చెప్పాలని, స్థానికతపై పరిష్కారంతో రావాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది.

తప్పులను సరిదిద్దే కొత్త ఎంజైమ్

సీసీఎంబీ పరిశోధనల్లో గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: బ్యాక్టీరియాల మనుగడకు కీలకమైన సెల్‌వాల్ నిర్మాణంలో జరిగే లోపాలను సరిదిద్దే ఒక కొత్త ఎంజైమ్‌ను హైదరాబాద్‌లోని సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ) శాస్త్రవేత్తలు గుర్తించారు. డాక్టర్ మంజులా రెడ్డి నేతృత్వంలోని పరిశోధక బృందం చేసిన ఈ అధ్యయనం వివరాలు ప్రముఖ జర్నల్ పీఎన్‌ఏఎస్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం, బాక్టీరియా సెల్‌వాల్ పటిష్టతలో, అలాగే మానవుల్లో అనారోగ్యాలపై కొత్త చికిత్సా మార్గాలను చూపించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బ్యాక్టీరియా సెల్‌వాల్‌ను నిర్మించేటప్పుడు, ఎల్–అలనైన్‌కు బదులుగా ఎల్–సెరైన్ లేదా గ్లైసిన్ వంటి అమైనో ఆమ్లాలను పొరపాటున జోడిస్తుంది. ఇది బ్యాక్టీరియా యాంటీబయాటిక్స్‌కు హాని కలిగిస్తుంది. దీంతో సెల్‌వాల్ బలహీనమవుతుంది. ఈ లోపాన్ని గుర్తించి సరిదిద్దే పని పెప్‌ఈఎఫ్ (పెప్టైడోగ్లైకాన్ ఎడిటింగ్ ఫ్యాక్టర్) అనే ఎంజైమ్ చేస్తుందని డా. మంజులా రెడ్డి బృందం కనుగొంది.

నాలుగేళ్ల స్థానికత నిబంధన పక్కకు

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా వేసింది. స్థానికతకు సంబంధించి మెడికల్, డెంటల్ కోర్సుల అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ గతేడాది జూలై 19న ప్రభుత్వం జీవో 33ను జారీ చేసిన విషయం తెలిసిందే. నీట్‌కు ముందు తెలంగాణలో వరుసగా నాలుగేళ్లు చదివి ఉండాలన్నది నిబంధన. కాగా ఈసారి కౌన్సెలింగ్‌లో కూడా ఇదే జీవో అమలు చేస్తుండటాన్ని పలువురు నీట్ అభ్యర్థులు సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ శామ్‌కోషి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నట్లే..

విద్యార్థుల తరఫున సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. '2025 జూలై 15న అడ్మిషన్ల నోటిఫికేషన్ సందర్భంగా ఈ నిబంధనను తెరపైకి తీసుకొచ్చారు. అయితే నివాస ధ్రువీకరణ పత్రాలున్న శాశ్వత నివాసితులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని గత సంవత్సరం హైకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వును నిలిపివేసినప్పటికీ సంబంధిత గడువు ముగిసింది. అలాంటప్పుడు హైకోర్టు ఉత్తర్వు అమలులో ఉంటుంది. పిటిషనర్లను దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలి..'అని కోరారు. కాగా ఈ అంశంపై సుప్రీంకోర్టు బుధవారమే విచారణ జరుపుతోందని వర్సిటీ న్యాయవాది తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రస్తుతానికి పిటిషనర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించాలని వర్సిటీని ఆదేశించింది. గత సంవత్సరం హైకోర్టు తీర్పు ప్రకారం వారిని రాష్ట్ర నివాసితులుగా నమోదు చేసుకోవడానికి అనుమతించాలని తెలిపింది. నాలుగేళ్లు తెలంగాణలో చదువుకోలేదనే కారణంతో వారి దరఖాస్తులను తిరస్కరించకూడదని స్పష్టం చేసింది.

గతేడాదీ ఇలాగే పిటిషన్లు..

గతేడాది కూడా ఇలాగే పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం.. నాలుగేళ్ల నిబంధనతో సంబంధం లేకుండా స్థానికతను ధ్రువీకరిస్తూ తహసీల్దార్ ఇచ్చే పత్రాన్ని అనుమతించాలని వర్సిటీని ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే విచారణ సందర్భంగా.. 134 మంది పిటిషనర్లు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అంగీకరించింది. అయితే నివాస ధ్రువీకరణ పత్రం ఆధారంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరింది. దీనికి అంగీకరించిన సుప్రీంకోర్టు హైకోర్టు ఉత్తర్వులను నిలిపివేసింది.

క్లుప్తంగా...

బీజేపీ, బీఆర్‌ఎస్‌లు బీసీలకు వ్యతిరేకం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ, బీఆర్‌ఎస్‌లు బీసీ వ్యతిరేక పార్టీలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితి పెంపు ఆర్డినెన్స్‌కు రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బిల్లుకు కేంద్రంలో బీజేపీ మోకాలడ్డుతున్నాయని బుధవారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పొందుపరచడం సాధ్యం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అంటున్నారని గుర్తు చేశారు. అలాంటప్పుడు మరి అసెంబ్లీలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నించారు. బిల్లు ఢిల్లీకి వెళ్లగానే ఎందుకు మాట మార్చారని నిలదీశారు. బీసీ బిల్లు కోసం పార్లమెంటును స్తంభింపజేస్తామని, ఓబీసీ సదస్సులో రాహుల్ గాంధీ బీసీల గొంతుక కాబోతున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నుంచి ఆ పార్టీల్లోని బీసీ నేతలు బయటకు రావాలని కోరారు. అగ్రకుల పార్టీల ఆధిపత్యాన్ని ఎదిరించి కాంగ్రెస్ పార్టీతో జత కట్టాలని మహేశ్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం

మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ తీరని ద్రోహం చేస్తోందని శాసన మండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. బీసీల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు దొందూదొందేనని బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాధికారంలో బీసీలకు వాటా దక్కకుండా చేసింది, కులగణన చేయకుండా, బీసీ మంత్రిత్వ శాఖ లేకుండా, బీసీలకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్రమైన ద్రోహానికి ఒడిగట్టింది కాంగ్రెసేనని ఆరోపించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే చరిత్ర క్షమించదని స్పష్టం చేశారు. కుట్రలతో బీసీ రిజర్వేషన్లను వివాదాస్పదం చేసింది చాలక.. బీఆర్‌ఎస్‌పై మంత్రి పొన్నం, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. మరోవైపు ముదిరాజ్, గంగపుత్ర, విశ్వకర్మ, నాయీబ్రాహ్మణ, గౌడ, గొల్లకురుమలు, పద్మశాలి, రజక, మున్నూరు కాపు తదితర బీసీ కులాలకు ఇచ్చిన హామీల ఊసే లేదని విమర్శించారు. రిజర్వేషన్లు మాత్రమే కాదు.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని ఆయన హెచ్చరించారు.

సీఎం రేవంత్, కేబినెట్.. బీసీలను మోసం చేస్తున్నాయి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, న్యూఢిల్లీ: సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కేబినెట్ కలిసికట్టుగా బీసీలను మోసం చేస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. కులగణన పేరుతో లక్ష మంది ఉద్యోగులను పెట్టుకుని, రూ.160 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన బూసాని వెంకటేశ్వరరావు కమిషన్ నివేదిక, జస్టిస్ సుదర్శన్‌రెడ్డిల నివేదికలను బయటపెట్టడం లేదని మండిపడ్డారు. కులగణన చేసినప్పుడు బీసీలు ఎంతమంది ఉన్నారనే విషయాలకు సంబంధించిన నివేదికలను బయటపెట్టకపోవడంలో ఆంతర్యం ఏంటని దాసోజు ప్రశ్నించారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ ఏర్పాటు చేసి, రిపోర్ట్‌లను పబ్లిక్ డొమైన్స్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ కోటా బిల్లులు, ఆర్డినెన్స్‌లపై గోప్యత ఎందుకు అని సీఎంకు దాసోజు లేఖ రాశారు. దీనిపై బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌లపై అనుమానాలున్నాయన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనలు కేవలం రాహుల్ గాంధీ, ఖర్గేల మెప్పుకోసమే అని విమర్శించారు.

ఆ ఐదు గ్రామాల్లో సర్వే మ్యాప్, భూధార్ అమలు

- నక్షా మ్యాప్‌లు కూడా ఖరారు
- నక్షా లేని గ్రామాల్లో రీసర్వే చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: పైలట్ పద్ధతిలో భూముల రీసర్వే నిర్వహించిన రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో త్వరలోనే సర్వే మ్యాప్ నిబంధనతో పాటు భూధార్ కార్డుల జారీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందని, సర్వే పూర్తయిన ఐదు గ్రామాలకు త్వరలోనే నక్షా మ్యాప్‌లు కూడా ఖరారు చేస్తామని ఆయన వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టు కింద సలార్‌నగర్, కొమ్మనాపల్లి, ములుగుమాడ, నూగూరు, షాహిద్‌నగర్ గ్రామాల్లో జరిగిన రీసర్వేపై బుధవారం సచివాలయంలో ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్‌కుమార్, సర్వే శాఖ కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతులతో పాటు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, ఆ గ్రామాల్లో భూముల రీసర్వేలో పాల్గొన్న ఏజెన్సీల ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా ఆయా గ్రామాల్లో సర్వే జరిగిన తీరును మంత్రి తెలుసుకున్నారు. సర్వే నిర్వహించిన విధానం, సర్వే సందర్భంగా వెలుగు చూసిన సమస్యల గురించి అధికారులు మంత్రికి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

అనంతరం పొంగులేటి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలోని భూసమస్యలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలోని 413 గ్రామాల్లో నక్షాలు లేకపోయినా పట్టించుకోలేదని, ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం అనేక సంస్కరణలు, విధానాలు అమల్లోకి తెచ్చామని చెప్పారు. పైలట్ పద్ధతిన భూముల రీసర్వే విజయవంతంగా అమలైనందున ఆయా గ్రామాల్లో వచ్చిన ఫలితాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో నక్షాలు లేని మిగిలిన గ్రామాల్లో భూముల సర్వేకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ఐదు గ్రామాలకు నక్షాలు తయారవుతున్నందున భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా భూముల క్రయవిక్రయాల సందర్భంగా జత చేయాల్సిన సర్వే మ్యాప్, ప్రతి భూమికి ఆధార్ తరహాలో ఇచ్చే భూధార్ నెంబర్‌ను కేటాయించే ప్రక్రియను కూడా అమలు చేయాలని యోచిస్తున్నామని చెప్పారు. ఈ ఐదు గ్రామాల్లో ఐదు గుంటలకు పైగా ఉండి రికార్డుల్లో లేని భూములకు కొత్త సర్వే నెంబర్లు ఇవ్వాలని, ఆయా గ్రామాల్లోని రెవెన్యూ, అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూముల వివరాలను కూడా రికార్డుల్లో నమోదు చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

భూములు విలువల సవరణపై కీలక భేటీ

రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువలను సవరించే ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. ఇందుకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. సీఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆ శాఖ ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలోని భూములు, ఆస్తుల ప్రభుత్వ విలువలను ఎప్పటి నుంచి సవరించాలి, ఎలా సవరించాలన్న దానిపై చర్చించారు. వ్యవసాయ భూములకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా విలువల సవరణ ప్రతిపాదనలను మంత్రి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఔటర్ రింగురోడ్డు లోపలి భాగంలో ఉన్న 38 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విలువల సవరణలను అమలు చేసే విషయంపై సమాలోచనలు జరిపారు. త్వరలోనే మరోమారు సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

విద్యార్థుల ఎన్నికలు నిర్వహించండి

సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, ఓయూ ఆర్ట్స్ కాలేజీ మాజీ అధ్యక్షుడు పటోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, ఇంటర్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో స్టూడెంట్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. దీంతో విద్యార్థులకు మంచి విద్య అందుతుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, హాస్టల్స్ సమస్యలు పరిష్కారం అవుతాయని లేఖలో శశిధర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు.

ఉచిత ప్రయాణంతో లాభాల్లోకి ఆర్టీసీ

- ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- ఆర్టీసీకి రూ.6,680 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- మహిళా సంఘాల నిర్వహణలో 150 బస్సులు
- డిప్యూటీ సీఎం భట్టి, రవాణా మంత్రి పొన్నం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లుగా పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ ఇప్పుడు లాభాల బాటలో పరుగులు తీస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.6,680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారని తెలిపారు. 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ, 200 కోట్ల ప్రయాణాలు పూర్తి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన సంగతి గుర్తు చేశారు. ఆయా చార్జీల కింద ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.6,680 కోట్లు చెల్లించిందని చెప్పారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడానికి ముందు టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రతీరోజు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారన్నారు. ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం నుంచి 97కు చేరిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలు సొంతంగా బస్సులను కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన ఆర్టీసీలో నడిపే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు భట్టి తెలిపారు. ఇలా ఇప్పటివరకు 150 బస్సులకు రూ.కోటి చెల్లించినట్లు చెప్పారు.



రూ.6,680 కోట్ల చెక్కుతో భట్టి, కోమటిరెడ్డి, పొన్నం

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కృషి వల్లనే..

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కృషి వల్లనే 200 కోట్ల ఉచిత ప్రయాణాలు సాధించగలిగామని మంత్రి పొన్నం చెప్పారు. మహిళలు తమ దైనందిన ప్రయాణ అవసరాలకు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. బస్సులకు మహిళలను యజమానులను చేయడమే కాకుండా ప్రభుత్వం పెట్రోల్ బంకులను కూడా మహిళలకు కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి కొత్తగా డబుల్ రోడ్ల నిర్మాణం వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు.

‘హ్యామ్’ తొలి విడతలో రూ.6,478 కోట్లతో రోడ్ల నిర్మాణం

రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హ్యామ్ విధానంలో జిల్లాల వారీగా మొదటి దశలో 17 ప్యాకేజీల్లో 373 రోడ్లను నిర్మించనున్నట్టు రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. 5,190.25 కి.మీ. నిడివితో ఉండే ఈ రోడ్ల నిర్మాణానికి రూ.6,478.33 కోట్లను ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలో టెండర్లను పిలవనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి నాణ్యమైన రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లేన్ రోడ్డు నిర్మించనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన రోడ్లు ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, మంచిరోడ్లు అభివృద్ధికి చిహ్నలుగా భావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణానికి పూనుకోవడమేకాక ఉత్తర్వులు జారీ చేయించడంపై సీఎంకు.. కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హ్యామ్ విధానంలో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణానికి సంబంధించి పలు మార్లు ఫీల్డ్ విజిట్ చేసి ప్రభుత్వానికి పూర్తి స్థాయి సమగ్ర నివేదిక అందించిన ఆర్‌అండ్‌బీ అధికారులను, మానిటరింగ్ చేసిన స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్‌ను మంత్రి అభినందించారు.

28న అత్యాధునిక ప్రకృతి వ్యవసాయంపై ‘ఏటీఎం’ ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: ఆధునిక ప్రకృతి వ్యవసాయంపై దేశంలో చేస్తున్న కృషిని పరిచయం చేయబోయే డాక్యుమెంటరీ ‘ఏటీఎం–ఎనీ టైం మనీ’ని ఈనెల 28న హైదరాబాద్‌లో ప్రదర్శించనున్నారు. సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (సీఎస్‌ఏ), యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బరోలోని సెంటర్ ఫర్ పెస్టిసైడ్ సూసైడ్ ప్రివెన్షన్ (సీపీఎస్‌పీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచ ప్రీమియర్ ప్రదర్శనను బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో 28న సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ డాక్యుమెంటరీకి హెషానీ సోతిరాజ్ ఎడిల్బన్ దర్శకత్వం వహించగా, సీఎస్‌ఏ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సంఘాలతో కలిసి రూపొందించారు. రైతులు, విద్యార్థులు, గ్రామీణ ప్రజల గొంతులతో సాగే ఈ చిత్రం రసాయన రహిత వ్యవసాయ ప్రభావాన్ని తెలియజేస్తుందని నిర్వాహకులు తెలిపారు. భూమిలోని జీవసౌష్టవం పునరుద్ధరణ, ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు, వాతావరణ మార్పులను ఎదుర్కోవడం వంటి కీలక అంశాలు ఇందులో ప్రాధాన్యం పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, ఐకార్, నాబార్డ్, ఎపెడా, సెర్ప్, అటారీ వంటి సంస్థల ప్రతినిధులు, ప్రముఖ విద్యా సంస్థల అధ్యాపకులు హాజరుకానున్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం దళారులను ఆశ్రయించొద్దు

గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతోందని, ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ విజ్ఞప్తి చేశారు. అర్హులైనవారికి ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం స్పష్టమైన విధానాన్ని పాటిస్తోందని ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలోనే గ్రామ సభల ద్వారా, పారదర్శకంగా అర్హుల జాబితాను రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. సొంత స్థలం లేని నిరుపేదలకు అందుబాటులో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పనిచేసిన ఓ వ్యక్తి ఇళ్లను మంజూరు చేయిస్తానంటూ, పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గౌతమ్ కోరారు. దళారుల జాడ తెలిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరికైనా అనర్హులకు ఇల్లు మంజూరైనట్లయితే, వారి ఇంటి నిర్మాణం ఏ స్థాయిలో ఉన్నా ఇంటి మంజూరును రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

‘అసెంబ్లీ’కి ప్రీఫైనల్

▶ మొదటి పేజీ తరువాయి

వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కేడర్ ఒకే తాటిపైకి వచ్చి పనిచేయాలని చెప్పారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, బాల్కొండ పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు ప్రెస్‌మీట్ పెట్టడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. మల్కాజిగిరిలో గూండాలు రోడ్డు మీద షో చేసినా పోలీసులు చేతులు ముడుచుకుని కూర్చున్నారని ధ్వజమెత్తారు. స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తే అధికారులందరూ తమ పద్ధతి మార్చుకుంటారన్నారు. స్థానిక సంస్థల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా గెలుపొందితే అధికారుల వేధింపులకు అవకాశం ఉండదని చెప్పారు.

కళ్లలో పెట్టుకుని చూసుకుంటాం

పదేళ్ల అధికారాన్ని తపస్సుగా భావించి తెలంగాణలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేశాం. ప్రజల కోసం పనిచేసే క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోలేదనేది వాస్తవం. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పును పునరావృతం చేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలను కళ్లలో పెట్టుకుని చూసుకుంటాం. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కానీ బీఆర్‌ఎస్ హయాంలో 6.5 లక్షల రేషన్ కార్డులను అర్హులకు ఇచ్చాం. మీ సేవ కార్యాలయాల్లో ఇచ్చే రేషన్ కార్డులను కూడా పెద్దసభలు పెట్టి పంపిణీ చేస్తూ రేవంత్ గొప్పగా చెప్పుకుంటున్నాడు. కాంగ్రెస్ పట్ల అసంతృప్తితో ఉన్న ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ముఖం బాగా లేక అద్దం పగలగొట్టుకున్నట్టు రేవంత్‌రెడ్డి ప్రవర్తిస్తున్నాడు’ అని కేటీఆర్ మండిపడ్డారు. చేరికల కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నూలి శుభప్రద్ పటేల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, పోలీస్ రాజకీయం చెల్లదు

- విద్యావ్యవస్థను ప్రభుత్వం భ్రష్టు పట్టించింది
- విద్యార్థి విభాగం నేతలతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న విద్యార్థి నేతలపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న పోలీస్ రాజకీయం చెల్లదని చెప్పారు. కేటీఆర్ బుధవారం బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ నివాసంలో విద్యార్థి విభాగం నాయకులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ సంక్షోభానికి దారితీసిన పరిస్థితిపై కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన ప్రభుత్వం.. దాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో సాగుతున్న అణిచివేత పాలనపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేసే ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆర్డినెన్స్ చుట్టే అంతా!

▶ మొదటి పేజీ తరువాయి

ఇందుకు వీలుగా గత ప్రభుత్వం చేసిన పంచాయతీరాజ్ చట్టం–2018ని సవరిస్తూ, కాంగ్రెస్ సర్కార్ తాజాగా ముసాయిదా ఆర్డినెన్స్‌ను ఆమోదించడం తెలిసిందే కాగా..ఇప్పుడు ఆ ఆర్డినెన్స్ ఏమైందనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్ ఇంకా రాజ్‌భవన్‌కే చేరలేదనే చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది. మరోవైపు గవర్నర్ న్యాయ సలహా కోరినట్టు, అడ్వకేట్ జనరల్‌ని పిలిపించి 50 శాతానికి మించి రిజర్వేషన్ల పెంపుదలకు ఏ మేరకు అవకాశం ఉందని అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో వాస్తవంగా ఆర్డినెన్స్ పరిస్థితి ఏంటి? ఎక్కడుంది? అనే సందిగ్ధత ఏర్పడింది.

ఎన్నికలపై నేతల్లో ఉత్కంఠ

హైకోర్టు ఆదేశాల మేరు సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పక్షాల్లో, పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది. గతంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు, జెడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు రెండు టర్మ్‌ల పాటు ఉండగా...ఇప్పుడు ఒక్కసారికే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు జెడ్పీపీలు 31కే (మేడ్చల్ మల్కాజిగిరి జెడ్పీపీ కనుమరుగు) పరిమితం కావడం, మేడ్చల్ జిల్లాతో పాటు పలు జిల్లాల్లోని పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం లేదా కొత్త పురపాలికల ఏర్పాటు వంటి వాటితో రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకోనున్నాయి.

ఎన్నికల ఏర్పాట్లలో పీఆర్‌శాఖ, ఎస్‌ఈసీ బిజీ బిజీ...

రిజర్వేషన్ల పెంపుదల ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొంది, స్థానిక సంస్థల ఎన్నికల తేదీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకున్నా..ఆ వెంటనే కార్య రంగంలోకి దూకేలా పంచాయతీరాజ్ శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) సన్నద్ధమౌతున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లలో పీఆర్‌ఆర్‌డీ అధికారులు, ఉద్యోగులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలను సరిపోల్చుతూ గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను కార్యదర్శులు ఇప్పటికే రూపొందించారు. ఈ జాబితాలను ఎస్‌ఈసీ వెబ్‌సైట్‌లోనూ రిజిష్టర్ అయ్యాయి. ఇదిలా ఉంటే..స్థానిక ఎన్నికల నిర్వహణకు జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఎస్‌ఈసీ ఆదేశించింది. ఈ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది, తదితర అంశాలకు సంబంధించి నిర్దేశిత ఫార్మాట్లలో వివరాలు పంపించాలని సూచించింది. సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున కలెక్టర్లు సంసిద్ధంగా ఉండాలని స్పష్టం చేసింది. జిల్లాల్లోని పరిస్థితులు, శాంతిభద్రతల సమస్యలు, తదితరాల ప్రాతిపదికన రెండు లేదా మూడుదశల్లో ఎన్నికల నిర్వహణపై అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరింది. ఒక మండలంలోని అన్ని పంచాయతీలకు ఒకేదశలో ఎన్నికల జరిపేలా చూడాలని పేర్కొంది. కొన్ని మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొత్తగా పోలింగ్ స్టేషన్లజాబితాలను సిద్ధం చేసి పంపించాలని ఎస్‌ఈసీ సూచించింది.



నిద్ర అనేది అత్యున్నత మేధాస్థాయి.
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 24 జూలై 2025

దర్యాప్తు ప్రశ్నార్థకం కారాదు!

అంతా ఎప్పటిలాగే గడిచిపోతున్నదనుకునే వేళ హఠాత్తుగా సంభవించిన పేలుడు జనాన్ని భయకంపితుల్ని చేస్తుంది. తేరుకున్న వెంటనే అది మిగిల్చిన ప్రాణనష్టాన్నీ, విధ్వంసాన్నీ కళ్లారా చూశాక ఆ భయాందోళనలు ఎన్నో రెట్లు పెరుగుతాయి. తీవ్ర గాయాలై కాళ్లూ చేతులూ తెగిపడినవారి ఆర్తనాదాలు మిన్నంటుతాయి. సమాజంలో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతాయి. నేరగాళ్లను పట్టి బంధించాలన్న డిమాండు ఊపందుకుంటుంది. తీరా దీర్ఘకాలం గడిచాక నిందితులు నిర్దోషులనీ, దర్యాప్తు లోపభూయిష్టమనీ తేలితే ప్రజానీకంలో నిరాశా నిస్పృహలు ఆవరించవా? బాధిత కుటుంబాలు మరోసారి రోదించవా? 189 మంది మరణానికీ, 816 మంది క్షతగాత్రులు కావటానికీ కారణమైన 2006 నాటి పేలుళ్ల ఘటనల్లో బొంబాయి హైకోర్టు దాదాపు 20 యేళ్లు కావస్తుండగా వెలువరించిన తీర్పు అందరినీ దిగ్భ్రాంతి పరిచింది. పోలీసులు ఈ కేసులో వెనువెంటనే 13 మందిని అరెస్టు చేశారు. వారంతా ప్రధాన నిందితులని, మరో 15 మంది పరారీలో వున్నారని తేల్చారు. నిషేధిత ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)కి చెందిన ఈ నిందితులకు పాకిస్తాన్ ఉగ్ర సంస్థ లష్కరే తొయిబాతో సంబంధ బాంధవ్యాలున్నాయని ఆరోపించారు. పేలుళ్ల ఘటనలు జరిగిన కొద్ది రోజుల్లోనే నిందితులను అరెస్టు చేయటంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యేక కోర్టు 2015 సెప్టెంబర్‌లో ఒకరు మినహా మిగిలిన 12 మందినీ దోషులుగా నిర్ధారించింది. వారిలో అయిదుగురికి ఉరిశిక్ష, మిగిలినవారికి వేర్వేరు రకాల శిక్షలు పడ్డాయి. 2021లో ఒకరు కోవిడ్ వ్యాధితో మరణించారు. జనం కిక్కిరిసి ప్రయాణించే సాయంత్రం సమయాన్ని పేలుళ్లకు ఎంచుకుని ఏడు లోకల్ రైళ్లలో బాంబులుంచి ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

తమ ముందు విచారణకొచ్చిన కేసుల్లో న్యాయస్థానాలు సాక్ష్యాధారాలను నిశితంగా పరిశీలిస్తాయి. నిందితులుగా చూపించిన వారికి ఆ ఘటనలతో వున్న సంబంధం ఏమిటో, ఏ ప్రాతిపదికన వారే కారకులని పోలీసులు నిర్ధారణకొచ్చారో తరచి చూస్తాయి. ఎంతమంది దోషులైనా తప్పించుకోవచ్చుగానీ, ఒక్క నిరపరాధికి కూడా శిక్షపడరాదన్న సూత్రమే దానికి మూలం. ఉగ్రవాదం మన దేశానికి కొత్తగాదు. దశాబ్దాలుగా అడపా దడపా ఏదో ఒక మూల అది తలెత్తుతూనే వుంది. వివిధ సంఘటనల్లో పదులకొద్దీ మంది మరణిస్తున్నారు. ఉగ్రవాదాన్ని కట్టడి చేయడానికన్నట్టు కొత్త చట్టాలు వస్తున్నాయి. ఉన్న చట్టాలు మరింత కఠినతరమవుతున్నాయి. కానీ చాలా సందర్భాల్లో జరుగుతున్నదేమిటో 2006 నాటి ముంబై పేలుళ్ల ఉదంతమే తార్కాణం. 671 పేజీల తీర్పులో ముంబై హైకోర్టు ధర్మాసనం ప్రస్తావించిన లోటుపాట్లు గమనిస్తే ఇంత నాసిరకంగా దర్యాప్తు జరిగిందా అనిపిస్తుంది. నిందితుల ప్రమేయాన్ని సందేహాతీతంగా నిరూపించాలన్న కర్తవ్యం కన్నా, ఏదో అయిందనిపిద్దామన్న ధోరణే ఉగ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్) దర్యాప్తులో కనబడిందని న్యాయమూర్తులు వ్యాఖ్యానించాల్సి వచ్చిందంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు.

పేలుళ్ల ఉదంతాలప్పుడు పౌరుల్లో ఆగ్రహావేశాలు కలుగుతాయి. ప్రభుత్వాలు సక్రమంగా పని చేయటం లేదన్న ఆవేదన వ్యక్తమవుతుంది. రాజకీయ పక్షాల, ఇతర సంస్థల ఆరోపణలు సరేసరి. అందువల్ల దర్యాప్తు చేసేవారిపై ఒత్తిళ్లు పెరుగుతాయన్నది కూడా వాస్తవం. కానీ ఇవేవీ వారిని ప్రభావితం చేయకూడదు. ఘటనాస్థలిలో దొరికిన చిన్న చిన్న ఆధారాలతో అల్లుకుపోతూ ఒక పెద్ద కుట్రను ఛేదించినప్పుడే, నిజమైన నిందితులను పట్టుకున్నప్పుడే సమాజం సురక్షితంగా వుంటుంది. ధర్మాసనం వ్యాఖ్యానించినట్టు నిందితులను పట్టుకున్నామని, అంతా పరిష్కరించామన్న తప్పుడు అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించటం వల్ల సమాజానికి ఒరిగేదేమీ వుండదు. తప్పించుకున్న అసలు నిందితులు మరో దురంతానికి పథక రచన చేస్తారు. నిందితులుగా ముద్రపడినవారి కుటుంబాలు దిక్కుతోచక అల్లాడతాయి. జనానికి కావాల్సింది ఆ దారుణానికి పాల్పడ్డ నేరగాళ్లను పట్టుకోవటం తప్ప ఆ పేరిట ఎవరో కొందరిని నిందితులుగా చూపటం కాదు.

దేశం మొత్తాన్ని పట్టికుదిపిన కేసులో సాదాసీదా దర్యాప్తు సరికాదని పోలీసు ఉన్నతాధికారులకు అనిపించకపోవటం ఆశ్చర్యం. ఎన్నో కేసుల దర్యాప్తులో పాలుపంచుకొని, ఎంతో అనుభవాన్ని గడించిన వారంతా తమ స్థాయిలోనే ఈ లోటుపాట్లను పట్టుకోవటం అసాధ్యం కాదు. కనీసం న్యాయస్థానం ముందుకెళ్తే ఎలాంటి సందేహాలు ఎదురవుతాయోనన్న బెరుకు ఎవరిలోనూ లేకపోవటం విస్మయం కలిగిస్తుంది. సాంకేతిక కారణాలతోనే ఈ కేసు కొట్టేశారని, సుప్రీంకోర్టుకు వెళ్లి దోషులకు శిక్షపడేలా చేస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. సాంకేతిక కారణాల సంగతలా వుంచి నిందితుల ఒప్పుకోలు పత్రాలన్నీ దాదాపు ఒకే మాదిరి వుండటం, పొంతన లేని సాక్ష్యాలు నిందితుల అపరాధత్వంపై సందేహాలు కలిగించాయి. తాము నిర్దోషులమని నిరూపించుకునే బాధ్యత నిందితులపైనే వుండేలా చట్టాలు పదునెక్కాయి. కానీ పోలీసులు సక్రమంగా వ్యవహరించి నేరాంగీకారంతో సరిపోలే విధంగా తిరుగులేని సాక్ష్యాధారాలు చూపలేకపోతే ఆ నిబంధన కొరగానిదవుతుంది. దర్యాప్తు ప్రక్రియకు అవరోధంగా మారుతుంది. కనీసం పేలుళ్లలో వాడిన బాంబులేమిటో ఏటీఎస్ నికరంగా చెప్పలేకపోయింది. రేపు సర్వోన్నత న్యాయస్థానం ఏం నిర్ధారిస్తుందో చెప్పలేం. ఇప్పటికైతే బాధిత కుటుంబాలకు ఖేదం మిగిలింది. ఈ తీర్పు దర్యాప్తు సంస్థల తీరుతెన్నులను మరింత పదునెక్కించగలగాలి. నిజమైన నేరగాళ్లను బోనెక్కించాలి.

బిహార్ ఎన్నికల దిక్సూచి ఎటువైపు?

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన బిహార్ రాజకీయాలది ఎప్పుడూ ప్రత్యేకతే! రెండు వేల యేళ్లకు పైగా చరిత్ర కలిగిన నాటి పాటలీపుత్ర, నేటి పట్నా రాజధానిగా గల బిహార్... సంకీర్ణ ప్రభుత్వాలకు పుట్టినిల్లు. 1990లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం తర్వాత రాష్ట్రంలో 35 సంవత్సరాలుగా ప్రాంతీయ పార్టీలదే హవా! రాష్ట్ర శాసన సభ ఎన్నికల ఫలితాలు జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలుండటంతో దేశ వ్యాప్తంగా బిహార్‌పై ఆసక్తి నెలకొంది.

అస్థిర ప్రభుత్వాల రాష్ట్రం

బిహార్ రాజకీయాల్లో కుల ప్రభావం ఎక్కువ. రూ. 28,485 తలసరి ఆదాయంతో దేశంలోనే పేద రాష్ట్రంగా నిలిచిన బిహార్ అస్థిరమైన ప్రభుత్వాలతో మరింత వెనుకబడింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో ఉన్న నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ (యూ) కొద్ది కాలం తర్వాత మహాఘట్ బంధన్‌తో చేతులు కలిపింది. అనంతరం తిరిగి ఎన్డీఏతో జత కట్టింది. తొమ్మిది సార్లు బిహార్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నితీశ్ కుమార్ పలుమార్లు కూటములు మారడం రాజకీయ అస్థిరతకు నిదర్శనం. ఈ నేపథ్యంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూటముల కూర్పు కూడా ఆసక్తి కలిగిస్తోంది. నితీశ్ నేతృత్వంలో ఎన్డీఏ ఎన్నికలకు సిద్ధమవుతున్నా, కూటమిలోని బీజేపీ ఎత్తుగడలను అంచనా వేయలేము. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్న మహాఘట్ బంధన్ కూటమిలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌దే ఆధిపత్యం. ఈ రెండు కూటములకు పోటీగా బరిలోకి దిగుతున్న ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

బీజేపీ, జేడీ (యూ) సంస్థాగతంగా బలంగా ఉన్నాయి. బీజేపీకి క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ఉండటంతో పాటు దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ ప్రచారం కలిసి వచ్చే అంశం. గత ఎన్నికల్లో 115 స్థానాల్లో పోటీ చేసిన జేడీ(యూ) 43 స్థానాల్లో గెలవగా, 110 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 74 స్థానాల్లో గెలిచింది. ఈ నేపథ్యంలో తామే అధిక స్థానాల్లో పోటీ చేస్తామని బీజేపీ చెబుతుంటే, 2024 పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను చూపుతూ, సమ స్థానాల్లో పోటీ చేయాలని జేడీ(యూ) వాదిస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 17 స్థానాల్లో, జేడీ (యూ) 16 స్థానాల్లో పోటీ చేయగా ఈ రెండు పార్టీలు చెరో 12 చోట్ల గెలిచాయి. ఎన్డీఏ కూటమికి హిందువుల్లోని అగ్రవర్ణాలు, యాదవేతరుల ఓబీసీ వర్గాలు ఓటు బ్యాంకుగా ఉన్నాయి. సీఎం నితీశ్ బిహార్ మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్లు ఇటీవల ప్రకటించడంతో ఎన్డీఏకు మహిళల మద్దతు రెండింతలైంది. దీంతోపాటు రోడ్ల నిర్మాణం, మద్య నిషేధం, సంక్షేమ పథకాలు కూడా ఎన్డీఏకు లబ్ధి చేకూర్చనున్నాయి. నితీశ్ రాష్ట్రంలో నిర్వహించిన కులగణనతో ఓబీసీలు ఎన్డీఏకు సానుకూలంగా ఉన్నారు.

పార్టీల బలాబలాలు

బలం సంగతి అలా ఉంటే, నిజానికి పాలక ఎన్డీఏ కూటమికి బిహార్‌లో ఆశించినంత సానుకూలత లేదు. చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న వేళ ఎన్డీఏ ఓట్లు చీలే ఆస్కారముంది. మరో పార్టీ హిందుస్థాని అవామ్ మోర్చ (హెచ్ఏఎమ్) ఎక్కువ స్థానాలు కోరుతుండటంతో గందరగోళం నెలకొంది. అలాగే 20 ఏళ్లుగా జేడీ (యూ) అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేకత గుదిబండగా మారనుంది. ప్రభుత్వోద్యోగాల భర్తీ ఆశించిన మేర జరగకపోవడంతో యువత అసంతృప్తిగా ఉంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడాన్ని మహాఘట్ బంధన్ సానుకూలంగా మలచుకుంటే ఎన్డీఏకు తిప్పలు తప్పవు.



◆ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్, ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని 'జన్ సురాజ్ పార్టీ' రానున్న బిహార్ శాసనసభ ఎన్నికల్లో తలపడుతున్నాయి. ఎన్డీఏ కూటమికి హిందువుల్లోని అగ్రవర్ణాలు, యాదవేతరుల ఓబీసీ వర్గాలు ఓటు బ్యాంకుగా ఉన్నాయి. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్ల ప్రకటన వల్ల ఎన్డీఏకు మహిళల మద్దతు రెండింతలైంది. ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో పాటు వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)ల మధ్య సీట్ల పంపకంలో సయోధ్య పైనే మహాఘట్ బంధన్ విజయావకాశాలు ఆధారపడ్డాయి. జన్ సురాజ్ గెలుపు మాట అలా ఉంచితే... ఆ పార్టీ చీల్చే ఓట్లు ఎన్డీఏ, మహాఘట్ బంధన్ కూటముల జయాపజయాలను నిర్ణయించనున్నాయి.

ప్రతిపక్ష మహాఘట్ బంధన్ ఆశలన్నీ ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలు ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ పైనే ఉన్నాయి. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆయనకు ప్రజాదరణ ఉందని కొన్ని సర్వేల్లో వెల్లడైంది. నిరుద్యోగం, ఉపాధి కోసం బిహారీ యువత వలసలు, ద్రవ్యోల్బణంతో నిత్యావసర ధరలు పెరగడం, రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం వంటి అంశాలను యువనేత తేజస్వీ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయవంతమయ్యారు. వామపక్ష పార్టీలు కూటమికి అదనపు బలం. మైనారిటీ, ఓబీసీ ఓట్లపై గంపెడాశలు పెట్టుకున్న ఈ కూటమి భవితవ్యం ముస్లిం, యాదవ సామాజిక వర్గాల చేతుల్లోనే ఉంది.

ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో పాటు వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)ల మధ్య సీట్ల పంపకంలో సయోధ్య పైనే మహాఘట్ బంధన్ విజయావకాశాలు ఆధారపడ్డాయి. 2020 శాసనసభ ఎన్నికల్లో 70 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ గెలుపు 19 చోట్లకు పరిమితం అవడం వల్లే అధికారానికి దూరమయ్యామనే భావన ఉంది. ఆ ఎన్నికల్లో 75 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచిన ఆర్జేడీ ఈసారి జాగ్రత్త పడుతోంది. ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌కు ప్రజాదరణ ఉన్నా, ఆయన తండ్రి లాలు ప్రసాద్ యాదవ్ హయాంలో అవినీతి, శాంతి భద్రతల వైఫల్యంతో 'జంగల్ రాజ్'గా ముద్రపడటం ఆర్జేడీకి నష్టం చేకూర్చే అంశం.

జాతీయ స్థాయిలో ఎన్నికల వ్యూహకర్తగా పేరు గడించిన ప్రశాంత్ కిశోర్ బిహార్‌లో రాజకీయ అదృష్టంపై దేశ వ్యాప్త రాజకీయ పండితులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జన్ సురాజ్ పార్టీ స్థాపించిన ప్రశాంత్ కిశోర్ రాష్ట్రంలో అన్ని స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ పార్టీకి పట్టణ ప్రాంతాల్లో, యువతలో ఆదరణ ఉన్నా రాష్ట్ర కుల రాజకీయాలు, పొత్తు జిత్తుల మధ్య ఆయన వ్యూహాలు ఫలించడం అంత తేలిక కాదు. సోషల్ మీడియా వేదికలపై జన్ సురాజ్ బలంగా కనిపిస్తున్నా, సంస్థాగతంగా బలహీనంగా ఉంది. జన్ సురాజ్ గెలుపు కంటే, ఆ పార్టీ చీల్చే ఓట్లు ఎన్డీఏ, మహాఘట్ బంధన్ కూటమి అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయడం ఖాయం.

'సర్' వివాదం

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీలు వ్యూహరచనలు, ప్రణాళికలు రూపొందిస్తుంటే బిహార్ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం... బిహార్‌లో 40 లక్షలకుపైగా ఓటర్లపై అనుమానాలున్నాయి. వీటిలో 14 లక్షలకుపైగా మృతుల పేర్లు జాబితాలో ఉన్నాయంటున్నారు. 19 లక్షలకు పైగా ఇతర ప్రాంతాలకు వెళ్లారు. 7 లక్షల మంది ఇతర చోట్ల కూడా ఓటర్లుగా నమోదయ్యారు. 11 లక్షలకు పైగా ఓటర్లకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదని ఎన్నికల కమిషన్ చెబుతోంది. ఓటర్లలో బంగ్లాదేశ్, మయాన్మార్, నేపాల్ దేశస్థులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఏడాది కిందటి లోక్‌సభ ఎన్నికలప్పుడు రాని ఈ అంశాలన్నీ ఇప్పుడే రావడం వివాదాస్పదమవుతోంది. ((నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో జేడీ(యూ) మద్దతు కీలకమైన నేపథ్యంలో బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది.)) ఎన్డీఏ కూటమి సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వస్తే ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో ఇబ్బంది ఉండకపోవచ్చు. తేడావస్తే మాత్రం నితీశ్ వైఖరిలో మార్పు వచ్చినా ఆశ్చర్యం లేదని గత అనుభవాలే చెబుతున్నాయి. ఎన్డీఏకు మెజారిటీ వచ్చినా నితీశ్ విషయంలో బీజేపీ వైఖరి మారితే కేంద్ర ప్రభుత్వంపై ప్రభావం పడుతుంది. ఈ సమీకరణాల దృష్ట్యా బిహార్ ఎన్నికల రాజకీయ దిక్సూచి ఎటు వైపు మళ్లేనో అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిస్ట్

సోషల్ మీడియా

లక్షల ఉద్యోగాలు



ఇండియాలో ఉద్యోగాల కల్పనకు జవాబు వస్త్రాలు, దుస్తుల పరిశ్రమలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ పరిశ్రమ మార్కెట్‌లో 70 శాతం వాటా మానవ తయారీ పోగులదే (ఎంఎంఎఫ్). మిగతా 30 శాతం పత్తి. కానీ ఇండియాలో ఇది తారుమారు అవుతోంది. మన ఎంఎంఎఫ్ పరిశ్రమ ప్రపంచంతో పోటీ పడాలంటే, దిగుమతి సుంకాలను సున్నా చేయాలి. దీనివల్ల లక్షలాది చిన్న పరిశ్రమలు వర్ధిల్లుతాయి. ఇండియా గ్లోబల్ టెక్స్‌టైల్ పవర్‌హౌజ్‌గా మారుతుంది.

– అమితాభ్ కాంత్, నీతీ ఆయోగ్ మాజీ సీఈఓ

చిన్న సమస్యా?



2024 సంవత్సరంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 37,17,336 కుక్క కాటు ఘటనలు జరిగినట్టూ, అనుమానిత మానవ రేబీస్ మరణాలు 54 సంభవించినట్టూ 'నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్' చెబుతోంది. ఈ సమస్యను ఇంకా పట్టించుకోకుండా ఉండలేం.

– కార్తీ పి. చిదంబరం, పార్లమెంట్ సభ్యుడు

నిద్రా ధ్యానం



నిద్ర పట్టకపోతే మంచంలో పడుకున్న స్థితిలోనే ధ్యానం చేయండి. వెంటనే నిద్రలోకి జారుకోకపోయినా అన్ని ఆరోగ్య లాభాలు పొందుతారు. ధ్యానం చేసేవాళ్లు ఒకసారంటూ నిద్రలోకి జారుకున్నాక, నెమ్మదైన తరంగాల వంటి నిద్రా క్రమాలతో గాఢనిద్రలోకి వెళ్తారని పరిశోధనలు చెబుతున్నాయి.

– ఫ్రాంక్ లిప్‌మాన్, వెల్‌నెస్ కోచ్

పచ్చి సమస్య



పచ్చి పాలు ఉబ్బసం, అలెర్జీలను నయం చేయవు. పాలు పడకపోవడాన్ని పచ్చిపాలు నయం చేయవు. అవి రోగ నిరోధక శక్తిని పెంచవు. ఆహార పదార్థాల నుంచి వ్యాపించే అంటువ్యాధులకు కారణం అవుతాయి. అందులో మిత్ర బ్యాక్టీరియా ఉండదు.

– జోయీతా, ఫిజీషియన్

కఠిన నిర్ణయం



ఒక మగవాడు తీసుకోవాల్సిన అత్యంత కఠిన నిర్ణయం ఏమిటంటే, అతడిని ప్రేమించే 6/10కూ, అతడు వాంఛిస్తున్న 9/10కూ మధ్య ఎంపికచేసుకోవడం.

– ఆడమ్ యోడర్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

నవయుగ కవి చక్రవర్తి

''రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకలయందు''– అని చాటిచెప్పిన కవి కోకిల గుర్రం జాషువాది ఆధునిక తెలుగు కవులలో విశిష్ట స్థానం. చిన్నప్పటి నుంచి ఛీత్కారాలు, అవమానాలను ఎదుర్కొని నిలిచిన ధీశాలి. తొలినాళ్లలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన జాషువా తర్వాత మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో పనిచేశారు. స్వతహాగా సృజనశీలి అయిన ఆయన దీపాల పిచ్చయ్య శాస్త్రిని చూశాక కవిత్వంపై ఇష్టం పెంచుకున్నారు.



గుర్రం జాషువా

ఆయన రచనల్లో 'గబ్బిలం' అత్యంత ప్రాచుర్యం పొందింది. అంటరాని కులానికి చెందిన యువ కుడొకరు తన బాధను గబ్బిలం ద్వారా కాశీ విశ్వనాథుడికి పంపే సన్నివేశాలను అద్భుతంగా వర్ణించారు. ఆ తర్వాతిస్థానం 'ఫిరదౌసి'ది. ఇంకా కోకిల, బాపూజీ, కృష్ణదేవరాయలు, గిజిగాడు, తెలుగు తల్లి, సాలీడు, రణచ్యుతి, భీష్ముడు, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర, ఆంధ్ర భోజుడు, కాందిశీకుడు, నేతాజీ, నాగార్జున సాగరం వంటి ఎన్నో జనాదరణ పొందిన రచనలు చేశారు.

తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి... జాషువా కాలికి గండపెండేరం తొడగడం విశేషం. కవి కోకిల, కవి విశారద, కవి దిగ్గజ, నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ తదితర బిరుదులు పొందిన ఘనుడాయన. 1964లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా జాషువా నియమితులయ్యారు. అదే ఏడాది 'క్రీస్తు చరిత్ర' రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 1970లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించగా, కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం అందించింది. 1895 సెప్టెంబరు 28న అప్పటి గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించిన గుర్రం జాషువా, 1971 జూలై 24న గుంటూరులో కన్నుమూశారు.

– చెన్నాప్రగడ శర్మ । సీనియర్ జర్నలిస్ట్
(జూలై 24న గుర్రం జాషువా వర్ధంతి)

ఢిల్లీ ఉల్లంఘనల రాజధాని కూడానా?!

అభిప్రాయం



ఎన్ వేణుగోపాల్

దేశమంతా ఎలా ఉన్నా, కనీసం రాజధాని ఆదర్శప్రాయంగా, ఉదాహరణప్రాయంగా ఉండాలంటారు. రాజధానిలోనే సుప్రీం కోర్టు, పార్లమెంటు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కీలకమైన అధికార యంత్రాంగం వంటి అత్యున్నత అధికార పీఠాలు, విదేశీ రాయబార కార్యాలయాలు, విదేశీ ప్రచార సాధనాల ప్రతినిధులు ఉంటారు. దేశమంతటికీ అది కూడలి. అందరి దృష్టీ రాజధాని మీదనే ఉంటుంది. (కొన్నేళ్ల కిందనైతే జంతర్ మంతర్ రోడ్డు మీద అరగంట తిరిగితే దేశపు సమస్యలన్నీ తెలిసేవి. ఇప్పుడది మారిందనుకోండి. సమస్యలు పోయాయని కాదు, జంతర్ మంతర్‌ను మార్చేశారు!) మొత్తం మీద రాజధానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అందువల్ల ఢిల్లీని పూర్తి స్థాయి రాష్ట్రంగా మార్చకుండా, కేంద్ర పాలిత ప్రాంతంగానే ఉంచి, పోలీసు యంత్రాంగాన్ని స్థానికంగా ఎన్నికైన ప్రభుత్వం చేతిలో కాక, కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంచారు. ఢిల్లీ ప్రభుత్వం ఏ పార్టీదైనప్పటికీ, పోలీసు యంత్రాంగం నేరుగా కేంద్ర ప్రభుత్వ హోం శాఖ నిర్వహణలో ఉంటుంది.

అటువంటి మహా ఘనత వహించిన ఢిల్లీ పోలీసుల ఇటీవలి పనులు వారు స్థానిక ప్రభుత్వం కన్న పై స్థాయిలో మాత్రమే కాదు, భారత రాజ్యాంగం కన్న, భారత ప్రజాస్వామిక ఉద్యమాలలో వెల్లువెత్తి, చట్టాలుగా మారిన విలువల కన్న, అసలు మానవత కన్న, నాగరికత కన్న పైన ఎక్కడో అతీతంగా, వాటన్నిటినీ లెక్క చేయనక్కర లేని స్థితిలో ఉన్నారని చూపుతున్నాయి.

దేశంలో పాలనా విధానాల పట్ల, తమ జీవితాలను అతలాకుతలం చేస్తున్న ఆర్థిక, రాజకీయ పరిణామాల పట్ల విద్యార్థి లోకంలో అసంతృప్తి నానాటికీ పెరుగుతున్నది. ఉద్వేగభరితమైన వయసు వల్ల ఆ అసంతృప్తి వ్యక్తీకరణలు తీవ్రంగా ఉండటం కూడా సహజమే. ఢిల్లీలో జేఎన్‌యూ, జామియా మిలియా, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలు అటువంటి అసంతృప్తికి, ఆందోళనలకు కేంద్రాలుగా మారుతున్నాయి. అక్కడి విద్యార్థి లోకాన్ని బెదిరించి, ప్రశ్నను, ఆలోచనను చిదిమేయాలని ఢిల్లీ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యేకంగా అక్కడ విద్యార్థులలో పని చేస్తున్న భగత్ సింగ్ ఛాత్ర ఏకతా మంచ్, దిశ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నజరియా పత్రిక, ఫోరం అగెనెస్ట్ కార్పొరేటైజేషన్ అండ్ మిలిటరైజేషన్ (ఫాకమ్) వంటి సంస్థల సభ్యులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు.

భగత్ సింగ్ ఛాత్ర ఏకతా మంచ్‌కు చెందిన గురుకీరత్ అనే విద్యార్థిని, గౌరవ్, గౌరంగ్ అనే విద్యార్థులు జూలై 9న కనబడకుండా పోయారు. జూలై 11న ఫాకమ్‌కు చెందిన పరిశోధక విద్యార్థి ఎహెతమామ్ ఉల్ హక్, విద్యార్థిని బాదల్‌



◆ ఈ క్రమంలో పోలీసులు రాజ్యాంగ నిబంధనలను, చట్ట నిబంధనలను, వివిధ హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులను, చివరికి మానవత్వాన్ని కూడా ఉల్లంఘిస్తున్నారు.

లను వారి ఇంటి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుపోయారు. జూలై 12న పొరుగున హరియాణా యమునా నగర్‌లో సామాజిక కార్యకర్త, మనస్తత్వ శాస్త్రవేత్త సామ్రాట్ సింగ్‌ను ఢిల్లీ పోలీసులు స్థానిక హరియాణా పోలీసులకు సమాచారం కూడా ఇవ్వకుండా పట్టుకుపోయారు. జూలై 19న విద్యార్థి రుద్రను న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి పట్టుకుపోయారు.

ఇలా నాలుగు దఫాలుగా జరిగిన ఏడుగురు విద్యార్థి, యువజనుల అపహరణలను చట్టబద్ధమైన అరెస్టు అనడానికి వీలులేదు. వారిని పట్టుకుంటున్నప్పుడు పోలీసులు ఎటువంటి వారంట్, నోటీసు చూపలేదు. రాజ్యాంగ అధికరణం 22, చట్టాలు, అనేక కోర్టుల ఆదేశాలు చెపుతున్నట్టుగా ఇరవై నాలుగు గంటల లోపు ఏదైనా కేసు పెట్టి న్యాయస్థానం ముందు హాజరు పరచలేదు. చట్టం నిర్దేశిస్తున్నట్టుగా వారి కుటుంబ సభ్యులకు తెలపలేదు, వారు కోరుకున్న న్యాయవాదిని పిలిపించి వారి ముందే నిర్బంధితులను ప్రశ్నించలేదు. వారందరినీ రోజుల తరబడి ఢిల్లీలో న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో భయంకరమైన చిత్రహింసలకు గురిచేశారు. ఏడు రోజుల అక్రమ నిర్బంధం తర్వాత జూలై 16న గురుకీరత్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి పోలీసు స్టేషన్‌కు వచ్చి కూతురిని తీసుకుపోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు చూసేటప్పటికి ఆమె శారీరకంగా, మానసికంగా శిథిలమైన స్థితిలో ఉంది. అదే స్థితిలో జూలై 17న బాదల్, గౌరవ్, గౌరాంగ్‌లను, జూలై 18న ఎహెతమామ్, సామ్రాట్‌లను, జూలై 21న రుద్రను వదిలిపెట్టారు.

ఈ దౌర్జన్యం, అక్రమ నిర్బంధం, చిత్రహింసలు ఇరవైలలో ఉన్న నవయువత మీద కాగా, ఏడు పదులు నిండిన హర్ష్ మందర్, అరవై ఆరేళ్ల జీన్ డ్రీజ్, నందితా నారాయణ్ వంటి సుప్రసిద్ధుల విషయంలో కూడా రాజ్యాంగ అధికరణం 19ని, భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించబోమని పోలీసులు చూపారు. వారితోపాటు వంద మంది జూలై 19న నగరం నడిబొడ్డున నెహ్రూ ప్లేస్‌లో జరుపుతున్న శాంతియుత ప్రదర్శన మీద మూకదాడి జరుగుతుంటే దౌర్జన్యకారులను అడ్డుకోవలసిన పోలీసులు చోద్యం చూస్తూ నిలబడ్డారు. హర్ష్ మందర్ ఐఏఎస్ వదులుకుని ప్రజా ఉద్యమాలతో పని చేస్తున్నారు. జీన్ డ్రీజ్ ప్రపంచ ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త. నందితా నారాయణ్ ఢిల్లీ విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్. వారితోపాటు పౌర సమాజ ప్రముఖులు, విద్యార్థి యువజనులు గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న మారణహోమానికి నిరసనగా జరుపుతున్న ప్రదర్శన అది. వారి ప్రదర్శన మొదలయిందో లేదో, ఒక పెద్ద మూక చుట్టూ ఉన్న భవనాల మొదటి అంతస్తుల నుంచి ప్రదర్శనకారుల మీద కోడిగుడ్లు, టమాటాలు, పేడ, రాళ్లు విసిరింది. పోలీసులు ఘర్షణను నివారించడానికి ప్రయత్నించలేదు. రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామిక సంప్రదాయాలను, నాగరిక విలువలను, మానవత్వాన్ని తుంగలో తొక్కడంలో కూడా తమది రాజధాని అని ఢిల్లీ పోలీసులు చూపదలిచారా?

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

అంతరాత్మే సాక్షి

ప్రతి జీవిలోని అంతరాత్మయే చేస్తున్న పనులకు సాక్షి. సృష్టిలో కనబడేది అంతా పంచభూతాత్మకం. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి ఈ ఐదింటినీ పంచభూతాలంటారు. మనం వీటి సహాయం లేకుండా ఏ పనీ చేయలేము. మన శరీరమే పంచభూతాలతో తయారయింది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

అందువల్ల శరీరం 'పాంచభౌతికం' అంటారు. ఈ శరీరంతో ఏ పని చేసినా పంచభూతాలకు తెలియకుండా ఏమీ చేయలేరు. ఇవికాక సూర్యుడు, చంద్రుడు ఉన్నారు. వీళ్ళకు తెలియకుండా ఏ పనీ జరగదు. అసలు అన్నిటికంటే ప్రధానమైన సాక్షి ఒకటి ఉండనే ఉంది. అదే అంతరాత్మ.

ఈ ఆత్మ లేని చోటు లేదు. 'ఆత్మన ఆకాశస్సంభూతః' అని శ్రుతి. నిత్యమై, సత్యమై, అణువణువున వ్యాపించి ఉన్న ఈ ఆత్మ ప్రతి జీవిలోను ప్రత్యగాత్మగా, అంతరాత్మగా ప్రకాశిస్తూ ఉంది. ఈ ఆత్మ సాక్షికి తెలియకుండా ఏ పనీ జరుగదు. కనుక ఇది సర్వసాక్షి.

కర్ణాటక సంగీతంలో ఎన్నో కీర్తనలు రచించిన పురందర దాసు పాండురంగని భక్తుడు. ఆయన చిన్నతనంలో... ఉపాధ్యాయుడు కొంతమంది విద్యార్థులతో బాటు పురందర దాసును కూడా దగ్గరకు పిలిచి తలొక అరటి పండు ఇచ్చి, ఎవ్వరూ చూడకుండా తిని రండని పంపించాడు. కొంతసేపటికి పురందర దాసు అరటిపండు తినకుండా చేతిలోనే ఉంచుకొని ఉపాధ్యాయుని దగ్గరకొచ్చి నిలబడ్డాడు. 'ఎవరూ చూడకుండా పండు తిన్నారా?' అని గురువు అడగంగానే అందరూ 'ఎవరూ చూడకుండా చాటుకు వెళ్లి తిని వచ్చామండీ!' అని చెప్పారు. పురందర దాసు మాత్రం, 'గురువు గారూ, నేను ఎవ్వరూ లేని చోటును చూడలేక పోయాను. రహస్య స్థలం దొరకనే లేదు. ఎక్కడ చూచినా పంచభూతాలుండనే ఉన్నాయి. అన్నింటికంటే నిత్య సన్నిహితంగా అంతరాత్మ సాక్ష్యం ఉండనే ఉంది. అలాంటప్పుడు ఎవరూ చూడకుండా ఎలా తినగలను స్వామీ!' అని అన్నాడు. పురందర దాసు తత్త్వదర్శనంగల మహనీయుడు. జయ గురు దత్త.


పాండవుల జలపాతం


రాయికల్..


బొగత జలపాతం


భీమునిపాద..

జలజల.. జలపాతాలు

- పరవళ్లు తొక్కుతున్న బొగత...
- పర్యాటకుల సందర్శన నిలిపివేత
- కనువిందు చేస్తున్న భీమునిపాద జలపాతం
- చూడచక్కని రాయికల్ జలపాతం

సాక్షి, నెట్‌వర్క్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జలపాతాలన్నీ పరవళ్లు తొక్కుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాతం జాలువారుతోంది. పాల నురుగలు కక్కుతూ ఎగిసి పడుతున్న తుంపరులతో కనువిందు చేస్తోంది. కాగా, బొగత జలపాతం ఉప్పొంగి ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో తాత్కాలికంగా పర్యాటకుల సందర్శనను నిలిపివేసినట్టు ములుగు డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు.

- మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలోని భీమునిపాద జలపాతం జాలువారుతూ చూపరులను కనువిందు చేస్తోంది. బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం, చింతోనిగుంపు సమీపంలోని వంకమడుగు జలపాతం అందాలను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారు.
- ఆకాశాన్ని తాకుతున్నట్టుగా ఉన్న ఎత్తయిన కొండల మధ్య నుంచి జాలువారుతోంది కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రాయికల్ జలపాతం. రెండు రోజులుగా కురుస్తున్న వానలతో దాదాపు 200 మీటర్ల ఎత్తు నుంచి ఈ జలపాతం పారుతోంది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం మందగూడ పంచాయతీ పరిధిలోని చింతలమాదర(తిర్యాణి) జలపాతం జలకళను సంతరించుకుంది. దాదాపు 50 అడుగుల ఎత్తు నుంచి దూకుతున్న నీళ్లు పాలధారను తలపిస్తున్నాయి.


చింతలమాదర జలపాతం

ఆర్టీసీ బస్సుకు నిప్పు

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్లలో ఘటన



మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వ్యక్తులు ఆర్టీసీ బస్సుకు నిప్పుపెట్టారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును మూడు నెలలుగా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి తడకమళ్లకు నడుపుతున్నారు. రాత్రి వేళ తడకమళ్లలోనే నైట్‌హాల్ట్ ఉంటుంది. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి డ్రైవర్ శంకరయ్య, కండక్టర్ బాలకృష్ణ బస్సును గ్రామంలోని బస్టాప్ సమీపంలో నిలిపి పాఠశాలలో నిద్రించారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత బస్సు లోపలికి వెళ్లి మద్యం సేవించారు. అనంతరం బస్సు వెనుక భాగంలోని రెండు టైర్లపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో బస్సులో మంటలు ఎగిసిపడుతుండటంతో అటుగా వెళ్తున్న వ్యక్తి గమనించి డ్రైవర్, కండక్టర్‌ను నిద్రలేపాడు. వారు మిర్యాలగూడ డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డికి విషయం తెలుపగా.. ఆయన ఆర్టీసీ నల్లగొండ ఆర్‌ఎం జానిరెడ్డికి, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసినప్పటికీ అప్పటికే సీట్లు మొత్తం దగ్ధమయ్యాయి. ప్రతిరోజూ అర్ధరాత్రి వరకు ప్రభుత్వ పాఠశాల సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నారని స్థానికులు పోలీసులకు చెప్పారు. కాగా, ఆరుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఘటనపై విచారణ జరుగుతోందని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని మిర్యాలగూడ రూరల్ సీఐ ప్రసాద్ తెలిపారు.

కృష్ణాలో జలకళ

- శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత


శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తిన దృశ్యం


573 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

సాక్షి, నెట్‌వర్క్: జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినా...ప్రస్తుత వర్షాలతో వాటర్ క్యాచ్‌మెంట్ ఏర్పడటంతో శ్రీశైలం ప్రాజెక్టు మరో గేట్‌ను ఎత్తారు. జూరాల నుంచి 39,746, సుంకేశుల నుంచి 36,975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శ్రీశైలం ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 54,956 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.7 అడుగుల నీటిమట్టం వద్ద 208.2841 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

నాగార్జునసాగర్‌కు పెరిగిన వరద: ఎగువన కృష్ణానది నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వరద పెరిగింది. మొత్తంగా 1,21,967 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తోంది. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. బుధవారం సాయంత్రానికి 573 అడుగులకు (264 టీఎంసీలు) చేరింది.

దుందుబి జోరు.. డిండిలోకి నీరు

నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద భారీగా వస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షానికి తోడు కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా వస్తున్న నీటితో దుందుబి వాగు దిగువకు పరవళ్లు తొక్కుతోంది.

కడెం ప్రాజెక్టు గేటు ఎత్తివేత

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు గేటు బుధవారం రాత్రి ఎత్తారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులుగా, ప్రస్తుతం 695.100 అడుగుల మేర నీరు ఉంది.

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారంలో బుధవారం పిచ్చికుక్క దాడి చేయడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఉదయం ఓ వీధికుక్క గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గాయపడిన వారికి గ్రామంలోని సబ్‌సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతి

- కామారెడ్డి జిల్లా దేమికలాన్ గ్రామంలో పలువురికి అస్వస్థత


భూమయ్య


స్వామి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామంలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గత నాలుగు రోజుల నుంచి గ్రామంలో పలువురు వ్యక్తులు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. వీరిలో కొంతమంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరి కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరారు. వీరి అస్వస్థతకు స్పష్టమైన కారణాలు ఇంకా వెల్లడి కాలేదని గ్రామస్తులు చెపుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొనింటి భూమయ్య (70)కు సోమ వారం వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యు లు చికిత్సకోసం కామారెడ్డికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ భూమయ్య మంగళవారం మృతి చెందాడు. అలాగే మెట్టు స్వామి (32)కి మంగళవారం విరేచనాలు కావడంతో కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. దీంతో జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమై బుధవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 30 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో ఏడుగురిని కామారెడ్డి ఏరి యా ఆస్పత్రికి తరలించారు. జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ ఇతర అధికారులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బాధితులకు వాంతులు, విరేచనాలు తక్కు వయ్యేంతవరకు వైద్యశిబిరాన్ని కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో తాగునీటి శాంపిళ్లను సేకరించి పరీక్షలకోసం ల్యాబ్‌కు తరలించాలన్నారు.

అవి డయేరియా మరణాలు కాదు

దేమికలాన్ గ్రామంలో ఇద్దరి మరణానికి డయేరియా కారణం కాదని కామారెడ్డి ఆర్డీవో కె. వీణ ఒక ప్రకటనలో తెలిపారు. మెట్టు స్వామి, భూమయ్య అనే వ్యక్తులు డయేరియాతో చనిపోయినట్టు జరిగిన ప్రచారంపై డీఎంహెచ్‌వో, మిషన్ భగీరథ ఈఈ, తహసీల్దార్, ఎంపీడీవోలతోపాటు వైద్య సిబ్బందితో గ్రామంలో విచారణ జరిపినట్టు వివరించారు. భూమయ్య కొంత కాలంగా కామెర్లు, ఇతర జబ్బులతో బాధపడుతూ చనిపోయారని, స్వామి తన తండ్రి దినకర్మ సందర్భంగా మద్యం సేవించి, మాంసం తినడం, తర్వాత ఎలాంటి జాగ్రత్తలు లేకుండా పత్తి పంటపై పురుగు మందు పిచికారి చేయడం వల్ల మరణించినట్టు వెల్లడైందని తెలిపారు.

కారును ఢీకొట్టిందని లారీని ఆపబోతే..

- వ్యక్తిపై నుంచి దూసుకెళ్లిన లారీ.. అక్కడికక్కడే దుర్మరణం


సత్తిరెడ్డి

చిన్నశంకరంపేట (మెదక్): తమ వాహనాన్ని ఢీకొట్టిన లారీని ఆపేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై నుంచి లారీ దూసుకెళ్లడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. నార్సింగి మండలం వల్లూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఈ ఘటన జరిగింది. సిద్దిపేట జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన సత్తిరెడ్డి (51) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో సమీప బంధువు అంత్యక్రియలకు సోదరులు లచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డితో కలసి కారులో వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో నార్సింగి మండలం వల్లూర్ శివారులో వెనుక నుంచి కారును లారీ ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు దిగిన సత్తిరెడ్డి లారీ ఆపేందుకు ప్రయత్నించగా లారీని డ్రైవర్ వేగంగా అతడిపై నుంచి తీసుకెళ్లాడు. దీంతో సత్తిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.


ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు


భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు సమీపాన పగిడేరు గ్రామంలోని నివాసాల వద్దకు చేరిన వరద


భద్రాచలం వద్ద పర్ణశాలలో సగం మేర మునిగిన సీతమ్మ తల్లి విగ్రహం

▶ మొదటి పేజీ తరువాయి

పట్టణంలో 9.3, మానకొండూరులో 7.5 సెం.మీ., గంగిపెల్లి 7.5 సెం.మీ., చింతకుంట 6.3 సెం.మీ., జగిత్యాల జిల్లా ధర్మపురి (నేరెళ్ల) 9.1 సెం.మీ., బీర్పూర్ 5.4 సెం.మీ., ఎండపల్లి 7.3 సెం.మీ., గుళ్లకోట 7.3 సెం.మీ., చొప్పున వర్షం కురిసింది.

రాష్ట్రమంతా కుండపోత

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జోరువాన

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో పలుచోట్ల వాగుల ప్రవాహం, లో లెవల్ చప్టాలపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుండగా, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సీతమ్మ నారచీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం నీట మునిగాయి. కిన్నెరసాని, వైరా రిజర్వాయర్లలో సైతం నీటి మట్టం పెరిగి వైరా రిజర్వాయర్ అలుగు పోస్తోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు ప్రవాహం పెరగడంతో 15 గేట్లు ఎత్తి 33వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్‌లోని సీతారామ కాలువ వద్ద నలుగురు బాలురు ఈతకు వెళ్లగా ప్రవాహంలో బొర్రా శివ(16) గల్లంతయ్యాడు. కారేపల్లి మండల వ్యవసాయ అధికారి గాదెపాడు రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వరదలో కారు చిక్కుకుపోయింది. దీంతో స్థానికులు గుర్తించి తాళ్ల సాయంతో గంటపాటు శ్రమించి బయటకు తీశారు.

- కుమురంభీం జిల్లావ్యాప్తంగా బుధవారం వర్షం దంచికొట్టింది. భారీ వరదతో చింతలమానెపల్లి, అహేరి మధ్య రవాణా నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు రద్దు చేశారు.
- మంచిర్యాల జిల్లాలో ఎర్రవాగు ఉప్పొంగింది. కన్నెపల్లి మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన రైతు బోరుకుంట రాజం తన భార్య, మరో ఇద్దరు కూలీలతో కలిసి మంగళవారం తిమ్మాపూర్‌లోని పత్తి చేనుకు వెళ్లాడు. పని ముగించుకుని వస్తుండగా అప్పటికే కురిసిన భారీ వర్షానికి ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ట్రాక్టర్‌పై వాగు దాటుతుండగా ప్రవాహం పెరిగింది. ట్రాక్టర్‌పై ఉన్న వారంతా దూకి ప్రాణాలతో బయటపడ్డారు.


కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై వరద

ఏజెన్సీలో ఉప్పొంగిన వాగులు

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని జంపన్నవాగు ఉప్పొంగింది. కొండాయి వద్ద తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. ఎస్ఎస్‌తాడ్వాయి మండలం పస్రా- తాడ్వాయి మధ్యలోని జలగలంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క బుధవారం పరిశీలించారు. మంగపేట మండల కేంద్రంలోని గిరిజన పెట్రోల్ బంక వద్ద ప్రధాన రోడ్డుపై నిర్మించిన కల్వర్టు సగం వరకు కోతకు గురై కొట్టుకు పోవడంతో ప్రమాదకరంగా మారింది. గార్ల సమీపంలోని పాకాల ఏరు బుధవారం చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండల కేంద్రమైన గార్ల నుండి రాంపురం, మద్దివంచ పంచాయతీలకు చెందిన 12 గ్రామాలు, తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

- ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధి అల్లిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి గుమ్మడి కృష్ణవేణికి పురిటినొప్పులు రావడంతో నర్సాపూర్ వాగు వరదలో నుంచి వైద్య సిబ్బంది గ్రామస్తుల సహాయంలో బుధవారం వాగు దాటించారు.
- ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన తోటపల్లి వేణు(20) భద్రాచలంలో ఉంటున్న తమ్ముడికి బైక్ ఇవ్వడానికి వెళుతుండగా, మార్గమధ్యలో పెద్ద గొళ్లగూడెం వద్ద పిడుగు పడి చనిపోయాడు.
- మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలకేంద్రానికి చెందిన ఆగబోయిన నరేష్(30) రాళ్ల ఒర్రెవాగులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు.
- హైదరాబాద్‌లోని పలుచోట్ల మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మళ్లీ అర్ధరాత్రి భారీ వర్షం పడింది.

రానున్న రెండ్రోజులు వానలేవానలు

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వరకు ఏడు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. 20 సెంటీమీటర్లకు పైబడి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అతిభారీ, ఒకట్రెండు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వివరించింది.

- నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ మహబుబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్షాలు కురుస్తాయని సూచిస్తూ... ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.
- నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు 29.78 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... బుధవారం నాటికి 26.79 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 10 శాతం లోటు వర్షపాతం ఉంది. నెలాఖరు కల్లా వర్షపాతం నమోదు గణాంకాలు మరింత మెరుగుపడతాయని అధికారులు చెబుతున్నారు. బుధవారం రాష్ట్రంలో సగటు వర్షపాతం 2.83 సెం.మీ.గా నమోదైంది.


ములుగు జిల్లా నర్సాపూర్ వాగులో నుంచి ఓ గర్భిణిని దాటిస్తున్న గ్రామస్తులు

పట్టువీడని ప్రతిపక్షాలు

పార్లమెంట్ ఉభయ సభల్లో కొనసాగిన ఆందోళనలు, నిరసనలు

- ప్లకార్డులు ప్రదర్శించే వారిపై చర్యలుంటాయని స్పీకర్ ఓం బిర్లా హెచ్చరిక
- వీధుల్లో చేయాల్సిన ప్రదర్శనలు సభలో చేస్తున్నారని మండిపాటు
- అయినా వెనక్కి తగ్గని ప్రతిపక్ష ఎంపీలు
- లోక్‌సభ, రాజ్యసభ గురువారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల్లో వరుసగా మూడో రోజు బుధవారం సైతం విపక్షాల ఆందోళనలు, నిరసనలు, నినాదాలు కొనసాగాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఢిల్లీలో మురికివాడల కూల్చివేత, బెంగాలీ వలస కార్మికుల పట్ల వివక్ష వంటి అంశాలపై వెంటనే చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. సభకు సహకరించాలని కేంద్రం పదేపదే విజ్ఞప్తి చేసినా వినిపించుకోకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉభయ సభల్లో ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. వెల్‌లోకి దూసుకొచ్చి ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నాయి. వారిపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''సభలో ఎంపీలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజల ఆకాంక్షలను వెల్లడించాలి. ఇలా నిరసనలతో సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదు. ఇది పార్లమెంటరీ విధానం కాదు. ఎంపీల ప్రవర్తనను దేశమొత్తం గమనిస్తోంది. సభా మర్యాదను కాపాడండి. వీధుల్లో చేయాల్సిన ప్రదర్శనలు సభలో చేస్తున్నారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించే సభ్యులపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాల్సి ఉంటుంది'' అని హెచ్చరించారు. అయినా విపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభ తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు, తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ అదే తీరు

రాజ్యసభలోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సహా పలు కీలక అంశాలపై చర్చకు ఇచ్చిన వాయిదా తీర్మానాలను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. సభను సజావుగా కొనసాగించేందుకు సహకరించాలని కోరినా విపక్షాలు వినిపించుకోలేదు. దాంతో సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. మళ్లీ ప్రారంభమయ్యాక ప్రశ్నోత్తరాలు చేపట్టినా విపక్షాల ఆందోళన, నిరసనలతో 2 గంటల వరకు, తర్వాత గురువారానికి వాయిదా పడింది.



లోక్‌సభలో వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేస్తున్న విపక్షపార్టీల సభ్యులు

నల్ల దుస్తులతో నిరసన

తమ డిమాండ్లపై పార్లమెంట్‌లో చర్చ చేపట్టాల్సిందేనని తేల్చిచెబుతూ విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంట్ మకరద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన(ఉద్ధవ్), జేఎంఎం, ఆర్‌జేడీ, వామపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి', 'ఓటు బందీని ఆపండి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. చాలామంది ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తంచేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై 28న ప్రత్యేక చర్చ

ప్రతిపక్షాల డిమాండ్ మేరకు 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 28న లోక్‌సభలో, 29న రాజ్యసభలో చర్చ జరిగే అవకాశం ఉంది. దిగువ సభలో ఈ అంశంపై 16 గంటలపాటు చర్చ జరపడానికి ఈ నెల 21న జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. బుధవారం జరిగిన రాజ్యసభ బీఏసీ సమావేశంలోనూ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణలో భారత సైన్యం దాదాపు ఆరు యుద్ధ విమానాలు కోల్పోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు బహిర్గతం చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో తొలుత లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చ జరుగుతుందని, ఆ తర్వాత రాజ్యసభలో చర్చ ప్రారంభిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తారా? లేదా? అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. బుధవారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లిన మోదీ ఈనెల 28వ తేదీ కల్లా స్వదేశానికి తిరిగివస్తారు.

చెప్పకుండా వచ్చి లేఖ ఇచ్చేసి...

- ముందస్తు షెడ్యూల్‌లేకుండానే రాష్ట్రపతితో ధన్‌ఖడ్ భేటీ
- విషయం ఆలస్యంగా వెలుగులోకి

సాక్షి, న్యూఢిల్లీ: అత్యంత వివాదాస్పదంగా, చర్చనీయాంశంగా మారిన జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా ఉదంతంలో కొత్త విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన రాజీనామా లేఖను అధికారుల ద్వారా పంపకుండా తానే స్వయంగా వెళ్లి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ధన్‌ఖడ్ అందజేశారు. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్ని బహిరంగంగా ప్రకటించారు. అయితే వాస్తవానికి అరగంట ముందే ఆయన ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండానే నేరుగా రాష్ట్రపతిభవన్‌కు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వెళ్లారు. రాష్ట్రపతి ముర్ముతో ప్రత్యేకంగా భేటీ అయి తన రాజీనామా లేఖను అందజేశారు. తర్వాత వెనుతిరిగారు. ఆ తర్వాతే 'ఎక్స్'లో రాజీనామా అంశాన్ని బయటపెట్టారు.

'ఉపరాష్ట్రపతి ఎన్నిక'కు రంగం సిద్ధం

ధన్‌ఖడ్ రాజీనామా చేసిన నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఎన్నిక షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు ఈసీ తెలిపింది. అయితే, షెడ్యూల్‌కు ముందుగా పలు ముఖ్యమైన ప్రాథమిక కార్యకలాపాలు చేపట్టాల్సి ఉందని, ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైనట్లు ఈసీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి లోక్‌సభ, రాజ్యసభలలోని ఎన్నుకోబడిన, నామినేట్ అయిన సభ్యులతో కూడిన ఓటర్ల జాబితా(ఎలక్టోరల్ కాలేజీ)ను సిద్ధం చేయనున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికను నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారుల నియామకం చేపట్టనున్నారు. ఎన్నికైన సభ్యులతోపాటు నామినేటెడ్ సభ్యులకూ ఈ ఎన్నికల్లో ఓటేసేందుకు అర్హత ఉంటుంది. గత ఉపరాష్ట్రపతి ఎన్నికల వివరాలపై విశ్లేషణాత్మక నేపథ్య సమాచారం సేకరించి అన్ని పక్షాలకు అందుబాటులో ఉంచడంపై ఈసీ దృష్టి సారించనుంది. ఈ ఏర్పాట్లు పూర్తయ్యాక ఉపరాష్ట్రపతి ఎన్నికల తుది షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు ఈసీ వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ డైరెక్టర్ పి.పవన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామాచేయడం తెల్సిందే. అయితే కొత్తగా ఎన్నికయ్యే వ్యక్తి మిగిలిన ఆ రెండేళ్ల కాలానికికాకుండా పూర్తిగా వచ్చే ఐదేళ్లపాటు ఉపరాష్ట్రపతిగా సేవలందిస్తారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్‌డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యత ఉంది. 543 స్థానాలున్న లోక్‌సభలో పశ్చిమబెంగాల్‌లోని బసీర్‌హాట్, 245 స్థానాలున్న రాజ్యసభలో పంజాబ్ నుంచి ఒక సీటు, జమ్మూకశ్మీర్ నుంచి నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రస్తుత సభ్యుల సంఖ్య 786కాగా అభ్యర్థి గెలవాలంటే కనీసం 394 ఓట్లు సాధించాలి. లోక్‌సభలో 542 మంది సభ్యులకుగాను ఎన్‌డీఏ కూటమికి 293 మంది సభ్యుల మద్దతుంది. రాజ్యసభలో 129 మంది ఎన్‌డీఏకు మద్దతిస్తున్నారు. మొత్తంగా చూస్తే అధికార కూటమికి 422 మంది సభ్యుల మద్దతుంది. దీంతో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి గెలుపు సునాయాసం కానుంది.



రాష్ట్రపతితో ధన్‌ఖడ్ (ఫైల్ ఫొటో)

మూడుసార్లు చెప్పినా పట్టించుకోలేదు!

ధన్‌ఖడ్ వ్యవహారంలో తెరమీదకు ప్రభుత్వ వాదనలు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి మండలి సలహాలు, సూచనల మేరకే ఉపరాష్ట్రపతి నిర్ణయాలు తీసుకోవాలన్న రాజ్యాంగానికి జగదీప్ ధన్‌ఖడ్ బద్ధుడై లేడని తాజాగా మోదీ సర్కార్ వాదనలు తెరమీదకొస్తున్నాయి. సగం కాలిన కరెన్సీ కట్టల ఉదంతంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై లోక్‌సభలో ప్రభుత్వం తీర్మానం తెచ్చే పనిలో ఉంటే ఆ విషయం తెల్సి కూడా ఉద్దేశపూర్వకంగా రాజ్యసభలో విపక్ష నేతలు సమర్పించిన నోటీసును ధన్‌ఖడ్ ఆమోదముద్రవేశారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ అంశంలో కాంగ్రెస్ సీనియర్ నేతతో ధన్‌ఖడ్ ప్రత్యేకంగా సంప్రతింపులు జరిపారని విశ్వసనీయ వర్గాల సమాచారం. తమను సంప్రతించకుండా రాజ్యసభలో తుది నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వ పెద్దలు అప్పటికే మూడుసార్లు ధన్‌ఖడ్‌కు చెప్పిచూశారని, అయినా ఆయన వినిపించుకోలేదని తెలుస్తోంది. రాజ్యసభలో ఎన్‌డీఏ కూటమి ఎంపీల సంతకాలు లేని విపక్షాల నోటీస్‌కు ధన్‌ఖడ్ ఆమోదం తెలిపారు. ఈ నోటీస్‌కు బదులు ఏకాభిప్రాయంతో ఎన్‌డీఏ ఎంపీల సంతకాలతో కూడిన నోటీస్ రూపకల్పనకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్ మేఘ్వాల్, రాజ్యసభ పక్షనేత జేపీ నడ్డాలు ప్రయత్నిస్తున్నారని ధన్‌ఖడ్‌కు ప్రభుత్వ వర్గాలు సూచించాయి. ఆ నోటీస్ కార్యరూపం దాల్చేలోపే విపక్షాల నోటీస్‌ను ధన్‌ఖడ్ అంగీకరించి ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించారని తెలుస్తోంది. వర్షాకాల సమావేశాలకు నాలుగైదు రోజుల ముందే ధన్‌ఖడ్‌కు ప్రభుత్వం ఒక కబురు పంపింది. లోక్‌సభలో అన్ని పార్టీల సమ్మతితో అభిశంసన తీర్మానం తీసుకొస్తామని, తర్వాత రాజ్యసభలోనూ ఇలాంటి తీర్మానం తీసుకొస్తామని ధన్‌ఖడ్‌కు సమాచారమిచ్చారు. సోమవారం వర్షాకాల సమావేశాలు మొదలుకాగా ఒకరోజు ముందే అంటే ఆదివారమే విపక్ష నేతలతో ధన్‌ఖడ్ ప్రత్యేకంగా సమావేశమై అభిశంసన అంశంపై చర్చించారు. ఈ విషయం ఆలస్యంగా ప్రభుత్వ పెద్దలకు తెల్సింది. భేటీ విషయం బయటకు పొక్కిందని తెల్సికూడా అసలు విపక్ష నేతలకు తన కు ఏం చెప్పారనే అంశాలను ధన్‌ఖడ్ ప్రభుత్వ పె ద్దలకు వివరించకుండా మిన్నకుండిపోయారని తెలుస్తోంది. అయితే విపక్ష నేతలిచ్చే నోటీస్‌కే ఆమోదం తెలపాలని ముందే ధన్‌ఖడ్ నిర్ణయించుకున్నారని సోమవారం మోదీ సర్కార్‌కు అర్థమైపోయింది. వెంటనే ధన్‌ఖడ్‌ను కలిసి బీజేపీ ఎంపీల సంతకాలు చేశాక విపక్షాల నోటీస్‌కు ఆమోదం తెలపాలని ఆయనకు సూచించినా వినిపించుకోలేదు. ఇలా మూడుసార్లు బీజేపీ సీనియర్ నేతలు చెప్పిచూసినా ధన్‌ఖడ్ వైఖరిలో మార్పురాలేదని తెలుస్తోంది. మొదటిసారి నడ్డా, రిజిజు, రెండోసారి రిజిజు, మేఘ్వాల్, మూడోసారి మేఘ్వాల్ ఒక్కరే ధన్‌ఖడ్‌ను కలిసి ఎన్‌డీఏ కూటమి ఎంపీల సంతకాలు ఆ నోటీస్‌లో ఉండటం అత్యంత కీలకమని గుర్తుచేశారని, ధన్‌ఖడ్ అస్సలు పట్టించుకోలేదని తెలుస్తోంది. ఆ నోటీస్‌లోని విపక్ష ఎంపీల పేర్లు మాత్రమే రాజ్యసభాముఖంగా చదివుతానని కరాఖండీగా చెప్పారు. ఆదివారం కలిసిన అదే సీనియర్ కాంగ్రెస్ నేతను ఈ వివాదం తర్వాత సోమవారం సాయంత్రం సైతం ధన్‌ఖడ్ కలిసినట్లు తెలుస్తోంది. వీహెచ్‌పీ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు జడ్జి శేఖర్ యాదవ్ అభిశంసననూ తాను స్వయంగా పర్యవేక్షిస్తానని ధన్‌ఖడ్ మాట ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఆమోదం పొందకముందే అన్నీ సర్దేసుకుంటూ..

అలా లేఖ ఇచ్చి ఇలా ప్యాకింగ్ మొదలెట్టేసిన ధన్‌ఖడ్

న్యూఢిల్లీ: రాజీనామా చేయాలని శరవేగంగా నిర్ణయం తీసుకున్న జగదీప్ ధన్‌ఖడ్ అంతేవేగంగా తన అధికారిక నివాసం నుంచి ఖాళీచేసేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రపతి ముర్ముకు రాజీనామా లేఖ ఇచ్చేసి అధికారిక నివాసానికి రాగానే తనకు సంబంధించిన వస్తువులు, సామగ్రి ప్యాకింగ్‌ను మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. సెంట్రల్ విస్టా పునర్‌అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా ఉపరాష్ట్రపతి అధికారిక నివాసం కోసం మోదీ సర్కార్ అత్యంత అధునాతన, సౌకర్యవంతమైన ఇంటిని నిర్మించిన విషయం తెల్సిందే. ఇప్పటికే ఉపరాష్ట్రపతిగా రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించిన నేపథ్యంలో వీలైనంత త్వరగా ఆయన పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ సమీపంలోని చర్చ్ రోడ్ ఉపరాష్ట్రపతి అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంది. అందుకే ఆ పనిని ఆయన ఇప్పటికే మొదలుపెట్టారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఈ ఇంట్లోకి ఆయన మారారు.

జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు ప్రత్యేక బెంచ్

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ పిటిషన్‌పై విచారణకు ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు బుధవారం ప్రకటించింది. ఆయన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఢిల్లీలో తన నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను జస్టిస్ వర్మ తప్పుపట్టిన సంగతి తెలిసిందే. ఈ నివేదికను రద్దు చేయాలని ఆయన సుప్రీంకోర్టును అభ్యర్థించారు. పిటిషన్ దాఖలు చేశారు. అలాగే జస్టిస్ వర్మను అభిశంసించాలంటూ పార్లమెంట్‌కు అప్పటి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా చేసిన సిఫార్సును కూడా రద్దు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయబోతున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. ఆ బెంచ్‌లో తాను ఉండడం సరైంది కాదని భావిస్తున్నట్లు చెప్పారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్న సమయంలో ఆయన అధికారిక నివాసంలో ఈ ఏడాది మార్చి 14న అగ్నిప్రమాదం జరిగింది. మంటలు ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి అక్కడ భారీగా నోట్ల కట్టలు లభించాయి. జస్టిస్ వర్మ అవినీతికి పాల్పడి ఆ సొమ్ము కూడబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత కమిటీ దర్యాప్తు చేపట్టింది. జస్టిస్ వర్మను దోషిగా తేల్చింది.

జపాన్‌పై 15 శాతం టారిఫ్‌లు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: జపాన్‌తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టత ఇచ్చారు. జపాన్ నుంచి తమ దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై 15 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఒప్పందం వల్ల వేలాది ఉద్యోగాల సృష్టి జరుగుతుందని తెలిపారు. జపాన్‌తో అమెరికాకు అద్భుతమైన సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ దేశంలో జపాన్ 550 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టబోతోందని వెల్లడించారు. అలాగే అమెరికా ఉత్పత్తులకు జపాన్ తలుపులు తెరవబోతోందని అన్నారు. జపాన్‌పై ట్రంప్ గతంలో 25 శాతం టారిఫ్‌లు ప్రకటించారు. తాజాగా దాన్ని 15 శాతానికి తగ్గించడం గమనార్హం. ఈ సుంకాలు ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. టారిఫ్‌ల విషయంలో ట్రంప్ వివిధ దేశాల అధినేతలకు ఇప్పటికే లేఖలు రాశారు. ఫిలిప్పైన్స్‌పై 19 శాతం, ఇండోనేసియాపై 19 శాతం టారిఫ్‌లు ప్రకటించారు. ఇదిలా ఉండగా, యూరోపియన్ యూనియన్‌తోపాటు ఇండియాతో అమెరికా వాణిజ్య చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు.

విదేశీ పర్యటనకు మోదీ

యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్న ప్రధానమంత్రి



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ బుధవారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఆయన నాలుగు రోజులపాటు యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), మాల్దీవుల్లో పర్యటిస్తారు. తన పర్యటనతో ఆయా దేశాలతో మన దేశానికి సంబంధాలు మరింత బలపడతాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పర్యటనకు వెళ్లే ముందు మోదీ ఈ మేరకు సందేశం విడుదల చేశారు. భారత్-యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని, ఇరుదేశాల మధ్య ఇటీవలి కాలంలో సంబంధాలు మెరుగయ్యాయని వెల్లడించారు. కీలక రంగాల్లో రెండు దేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయని తెలిపారు. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో భేటీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని ఉద్ఘాటించారు. మోదీ యూకే పర్యటనలో కింగ్ చార్లెస్-3 సైతం కలుసుకుంటారు. యూకే అనంతరం ఆయన మాల్దీవులకు చేరుకుంటారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మోదీ విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లడానికి కంటే ముందు ఆయనతో మంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. పార్లమెంట్‌లోని మోదీ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.

ఎఫ్‌టీఏతో భారత్‌కు తీవ్ర నష్టం

భారత్-యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)తో మన దేశానికి భారీ నష్టం వాటిల్లుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు. యూకే మేలు చేసేలా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఎఫ్‌టీఏపై దేశ ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఏ కారణంగా భారత్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) తీవ్రంగా నష్టపోతాయని స్పష్టం చేశారు. ఆటోమొబైల్, ఫార్మా స్యూటికలు రంగాలు సైతం నష్టపోతాయన్నారు. యూకే నుంచి దిగుమతి అయ్యే పలు ఉత్పత్తులపై సుంకాలను 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడాన్ని జైరామ్ రమేశ్ తప్పుపట్టారు.

చైనీయులకు ఇండియా పర్యాటక వీసాలు

నేటి నుంచే పునఃప్రారంభం

బీజింగ్: చైనా పౌరులకు పర్యాటక వీసాలు ఇచ్చే ప్రక్రియను గురువారం నుంచి మళ్లీ ప్రారంభించబోతున్నట్లు బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. చైనీయులు భారత్‌లో పర్యటించవచ్చని సూచించింది. ఐదేళ్ల క్రితం గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఘటన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. చైనా పౌరులకు పర్యాటక వీసాలు ఇవ్వడాన్ని భారత ప్రభుత్వం నిలిపివేసింది. సంబంధాలను పునరుద్ధరించుకోవాలని ఇరుదేశాలు ఇటీవలే నిర్ణయించుకున్నాయి. ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో పర్యాటక వీసాలు జారీ చేసే ప్రక్రియ పునఃప్రారంభించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. టూరిస్టు వీసాల కోసం గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని బీజింగ్‌లోని ఇండియన్ ఎంబసీ సూచించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. భారత ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని చైనా విదేశాంగ శాఖ స్వాగతించింది. ఇదొక సానుకూలమైన ముందడుగు అని హర్షం వ్యక్తం చేసింది.

బిహార్‌లో లక్ష మంది ఓటర్లు 'దొరకట్లేదు'

ఎన్నికల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ: బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగిస్తోంది. బిహార్‌లో 7.17 కోట్లకుపైగా ఓటర్లు ఉన్నారు. అనర్హులైన ఓటర్లు బయటపడుతున్నట్లు తెలిసింది. సుమారు లక్ష మంది ఓటర్ల జాడ తెలియట్లేదని ఎన్నికల సంఘం బుధవారం వెల్లడించింది. ఓటర్ల జాబితాలో వారి పేర్లు ఉన్నప్పటికీ భౌతికంగా ఎక్కడున్నారో కనిపెట్టలేకపోతున్నామని స్పష్టంచేసింది. 20 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు ఈ ప్రత్యేక సవరణలో తేలిందని పేర్కొంది. అలాగే మరో 28 లక్షల మంది చిరునామాలు శాశ్వతంగా మారాయని తెలిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ తొలి దశ ఆగస్టు ఒకటో తేదీ నాటికి పూర్తికానుంది. తర్వాత ముసాయిదా ఎన్నికల జాబితాను ప్రచురిస్తారు. ఇందులో లోపాలు ఉన్నట్లు ఎవరైనా గుర్తిస్తే అభ్యంతరాలు వ్యక్తం చేయొచ్చు. ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు లేకపోతే సెప్టెంబర్ ఒకటో తేదీ దాకా ఫిర్యాదులు సమర్పించవచ్చు.

గాజాలో అన్నమో రామచంద్రా!

వెంటాడుతున్న ఆహార కొరత, పౌష్టికాహార లోపం

- తిండి లేక 111 మంది మృతి... 80 మందికిపైగా చిన్నారులే
- మానవతా సాయంపై ఇజ్రాయెల్ ఆంక్షలు

కల్లోలిత గాజాలో ఆకలి కేకలతో జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ఎటు చూసినా మనసును కలిచివేసే దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ కఠిన ఆంక్షలతో ఆహారం, మానవతా సాయం అందక పాలస్తీనా పౌరుల డొక్కలెండిపోతున్నాయి. రోజుల తరబడి తిండి లేక నీరసించి, ప్రాణాలు విడిచేస్తున్నారు. తాజాగా 24 గంటల వ్యవధిలోనే కనీసం 15 మంది మరణించారు. వీరిలో నలుగురు చిన్నారులు ఉన్నట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఆకలి చావులు ఎలా అడ్డుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేసింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం మొదలైన తర్వాత గాజాలోని పాలస్తీనా పౌరులకు ఒక్కసారిగా కష్టాలు వచ్చిపడ్డాయి. కనీస సౌకర్యాల సంగతి పక్కనపెడితే కడుపునిండా తిండి దొరకడమే గగనంగా మారింది. అధికారిక గణాంకాల ప్రకారమే ఇప్పటివరకు 111 ఆకలి చావులు సంభవించాయి. వీరిలో 80 మందికిపైగా చిన్నారులే ఉండడం గమనార్హం. గాజాలో అత్యంత భయానక వాతావరణం కనిపిస్తోందని సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసింది. నిత్యం ఇజ్రాయెల్ దాడుల్లో అమాయక జనం బలైపోతున్నారని వెల్లడించింది. ఆకలి చావులు సంభవిస్తుండడం ఇటీవలి కాలంలో అతిపెద్ద సంక్షోభమని స్పష్టంచేసింది.

ప్రాణాలకు తెగిస్తేనే..

ఉత్తర గాజాలోని ఓ ఆసుపత్రిలో ఆరేళ్ల బాలుడు యూసుఫ్ అల్-సఫాదీ మరణించాడు. తల్లి పాలు అందక అతడు మృతిచెందినట్లు బంధువులు చెప్పారు. యూసుఫ్ తల్లికి కొన్ని నెలలుగా సరైన పౌష్టికాహారం దొరకడం లేదు. అనారోగ్యం బారినపడింది. తన బిడ్డకు స్తన్యం ఇవ్వడానికి ఆమె వద్ద పాలు లేకుండాపోయాయి. చివరకు యూసుఫ్ ప్రాణమే పోయింది. బయట ఆవు పాలు, గేదె పాలు కొందామన్న ఎక్కడా లేవు. ఒకవేళ దొరికినా లీటర్ 100 డాలర్లు(రూ.8,639) చెబుతున్నారు. 13 ఏళ్ల బాలుడు అబ్దుల్ హమీద్ అల్-గల్బాన్‌ది మరో వ్యథ. అతడికి చాలా రోజులుగా తిండి లేదు. చివరకు మృత్యువు కబళించింది. గాజాలో ఆకలి చావులుగా గత ఐదు నెలలుగా కొనసాగుతున్నాయి. గాజాలోకి మానవతా సాయం సరఫరా కాకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటోంది. విదేశాల నుంచి ఆహారం, నీరు, ఇంధనం, ఔషధాలు, నిత్యావసరాలు రానివ్వడం లేదు. ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి మేరకు మే నెలలో ఆంక్షలు కొంత సడలించింది. మానవతా సాయాన్ని పరిమితంగానే అనుమతిస్తోంది. ఐక్యరాజ్యసమితి మద్దతున్న గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్ఎఫ్) గాజా ప్రజలకు ఆహారం, నిత్యావసరాలు సరఫరా చేస్తున్నప్పటికీ అవి ఏ మూలకూ చాలడం లేదు. ఆహార పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన జనంపై ఇజ్రాయెల్ సైన్యం విచ్చలవిడిగా కాల్పులు జరుపుతోంది. ఈ కాల్పుల్లో 1,000 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. కడుపు నింపుకోవాలంటే ప్రాణాలకు తెగించాల్సిన పరిస్థితి దాపురించింది.



పోషకాహార లోపంతో చిక్కిశల్యమైన బాలుడు

అభాగ్యుల ఎదురుచూపులు

ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పేరుగాంచిన గాజా స్ట్రిప్‌లో 20 లక్షల మందికిపైగా నివసిస్తున్నారు. ఒకవైపు ఆహార లేమి, మరోవైపు పౌష్టిహాకార లోపం జనాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఆహారం దొరకడం ఒక ఎత్తయితే, అది నాణ్యంగా లేకపోవడం మరో సవాల్‌గా మారింది. చాలినంత తిండి లేక అల్లాడుతున్నారు. చాలామంది అర్ధాకలితో కాలం గడపాల్సి వస్తోంది. ఆకలి భూతం ప్రతి ఇంటి తలుపును తడుతోంది. ఆదుకొనే ఆపన్నహస్తాల కోసం అభాగ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇజ్రాయెల్ దయ తలిస్తే తప్ప గాజా పౌరులు బతికి బట్ట కట్టే పరిస్థితి లేదని ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు.

నిండిపోయిన ఆసుపత్రులు

పౌష్టికాహార లోపంతో అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో చేరుతున్న బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. బాధితులకు చికిత్స చేయడానికి సరైన సదుపాయాలు కూడా లేవని, వారు తమ కళ్ల ముందే మరణిస్తున్నారని, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని సెంట్రల్ గాజాలోని అల్-అక్సా హాస్పిటల్ వైద్యుడు ఖలీల్ అల్-డక్రాన్ తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల్లో గాయపడిన వారితో ఆసుపత్రులు నిండిపోయాయని, ఇతర రోగులను చేర్చులేకపోతున్నామని మరికొందరు డాక్టర్లు వెల్లడించారు. గాజాలో ప్రస్తుతం 6 లక్షల మందికిపైగా జనం పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు అంచనా. వీరిలో 60 వేల మంది గర్భిణులే కావడం గమనార్హం. ఆహార లేమికి తోడు డీహైడ్రేషన్, రక్తహీనతతో గర్భిణులు మరణం అంచులకు చేరుకుంటున్నారు. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం గాజాను పూర్తిగా ఖాళీ చేయించే పనిలో నిమగ్నమైంది.



సహాయ కేంద్రం వద్ద ఆహారం కోసం ఏడుస్తూ అర్థిస్తున్న బాలుడు

సాక్షి, నేషనల్ డెస్క్

ప్రపంచ దేశాలు స్పందించాలి

గాజా పరిణామాలపై 100కిపైగా అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఆకలి చావులు ఆపడానికి వెంటనే చర్యలు చేపట్టాలని, తక్షణమే కాల్పుల విరమణ పాటించేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. టన్నుల కొద్దీ ఆహారం, నీరు, ఔషధాలు గాజా బయటే ఉండిపోయాయని, ఇజ్రాయెల్ ఆంక్షల కారణంగా అవి పాలస్తీనా పౌరులకు అందడం లేదని మెర్సీ కార్ప్స్, నార్వేజియన్ రెఫ్యూజీ కౌన్సిల్, డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ తదితర సంస్థలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ దమనకాండ వల్ల గాజాలో మృత్యుఘోష మొదలైందని, ఆకలి చావులు పెరిగిపోతున్నాయని వెల్లడించాయి. ప్రపంచ దేశాలు ఇప్పటికైనా స్పందించాలని, గాజా ప్రజల ప్రాణాలు కాపాడాలని స్వచ్ఛంద సంస్థలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు బుధవారం ఉమ్మడిగా లేఖ విడుదల చేశాయి.



ఈ వ్యర్థం.. ఏ అనర్థానికో..
ఈ వేస్ట్.. రీసైక్లింగ్‌పై అధికారుల్లో కొరవడిన శ్రద్ధ.. ప్రజల్లో అవగాహన లోపం.. పర్యావరణానికి ప్రమాదం.. వెరసీ విశ్వనగరానికి ఈ వేస్ట్ విపత్తు పొంచి ఉంది. -10లో



మెమరీ రాక్స్.. మాన్సూన్ క్లిక్స్..
వర్షాకాలం కేవలం సీజన్ మాత్రమే కాదు. మనం చూసే అనేక ప్రదేశాలను సినిమాటిక్ ఫ్రేమ్‌లుగా మార్చేసే కాలం. నగర ఫొటోగ్రాఫర్‌లకు కలల కాన్వాస్‌గా మారుతోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0/23.0
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.


బుధవారం రాత్రి బంజారాహిల్స్‌లో జోరువాన


సిటీసెంటర్ మాల్ సమీపంలో..


సాగర్ రింగ్‌రోడ్డు వద్ద..


బేగంపేట- పంజాగుట్ట మార్గంలో ట్రాఫిక్‌జాం

ఆగని మేఘ ధారలు!

నగరంలో మేఘం వర్షిస్తూనే ఉంది. మంగళవారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురవగా.. బుధవారం అక్కడక్కడా జల్లులు పడటంతో రహదారులు జలమయమయ్యాయి. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాత్రిపూట వరుణుడు మళ్లీ ఉరిమాడు. పలు ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. లోతట్టు బస్తీలు, కాలనీల్లో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.


పంజాగుట్టలో..


బేగంపేట్ మార్గంలో..

కాపలా భారం 'డబుల్'

ఇప్పటికే రూ.కోట్లు ఖర్చు చేసిన బల్దియా

- ఎప్పటికప్పుడు సెక్యూరిటీ పొడిగింపు
- లబ్ధిదారులు చేరకపోవడంతో నష్టాలపాలు
- ఇదీ రెండు పడక గదుల ఇళ్ల పరిస్థితి



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు 70వేల డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం ఒక ఎత్తయితే.. పూర్తయ్యాక అలాట్‌మెంట్ జరగక.. అలాట్‌మెంట్ జరిగినప్పటికీ లబ్ధిదారులు ఇళ్లలో చేరక ఖాళీగా ఉన్న ఇళ్లకు సెక్యూరిటీ కాపలా పెట్టడం మరో ఎత్తుగా మారింది. కొన్ని ప్రాంతాల్లో దాదాపు నాలుగేళ్లుగా సెక్యూరిటీ కొనసాగుతోంది. దీంతో ఇళ్లనిర్మాణ బాధ్యతలు తీసుకున్న జీహెచ్‌ఎంసీకి సెక్యూరిటీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పటికే రూ.కోట్లు ఖర్చు కాగా, ఇంకెంత కాలం ఈ ఏర్పాట్లు చేయాలో, అప్పటి వరకు ఇంకెంత ఖర్చు కానుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

రూ.7 కోట్ల విలువైన సామగ్రి మాయం

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక లబ్ధిదారులు నివాసం ఉండకపోవడంతో ఖాళీగా ఉన్నవాటిలో దాదాపు రూ.7 కోట్ల విలువైన విద్యుత్ వైర్లు, శానిటరీ సామగ్రి వంటివి దొంగల పాలయ్యాయి. వినియోగంలో లేకపోవడంతో జనరేటర్లు పాడైపోయాయి. కొత్తవి ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఇళ్లలోని సామగ్రి దొంగల పాలుకాకుండా ఉండేందుకు, ఇళ్లను ఇతరులు కబ్జా చేయకుండా అడ్డుకునేందుకు జీహెచ్‌ఎంసీ సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు నాలుగేళ్లుగా సెక్యూరిటీ గార్డులను నియమిస్తోంది. సుమారు నాలుగు వేల ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో ఖాళీగానే ఉన్నాయి. వాటికి సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాల్సి వస్తోంది.

తప్పని సెక్యూరిటీ పాట్లు

కొన్ని ప్రాంతాల్లో ఇతరేతర సమస్యలతోనూ లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లలేదు. అలాంటి మూడు ప్రాంతాల్లో (మంఖాల్-1, మంఖాల్-2, మురహరిపల్లి) సెక్యూరిటీ ఏర్పాట్ల కోసం తాజాగా టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. వీటిలో మంఖాల్-1, మంఖాల్-2 హౌసింగ్ కాలనీల్లోని ఇళ్లను నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి కేటాయించడంతో, స్థానికులైన తమకు ఇళ్లు కేటాయించాలనే డిమాండ్‌తో స్థానికులు కోర్టుకు వెళ్లారు. కోర్టు స్థానికులకు అవకాశం కల్పించాల్సిందిగా సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇళ్ల కేటాయింపుల అంశం మొదటికొచ్చింది. మురహరిపల్లి హౌసింగ్ కాలనీలో కనీస మౌలిక వసతుల్లేవని లబ్ధిదారులు ఉండటం లేదు. ఇలాంటి కాలనీలకు సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తుండటంతో జీహెచ్‌ఎంసీకి ఆర్థిక భారం తప్పడం లేదు.

పట్టుకోవడానికి వస్తే కాల్చేద్దామని!

తుపాకీ సమీకరించుకున్న డ్రగ్ పెడ్లర్

- కాటేదాన్‌లో ప్రాంతంలో టెస్ట్ ఫైరింగ్
- రాజస్థానీల నుంచి మెఫిడ్రిన్ ఖరీదు
- స్థానికంగా పలువురికి విక్రయం
- ముగ్గురి అరెస్టు, 100 గ్రాములు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మాదకద్రవ్యాల దందా చేస్తున్న డ్రగ్ పెడ్లర్లు మారణాయుధాలు సమీకరించుకున్నారనే అనుమానాలు పోలీసులకు ఎప్పటి నుంచో ఉన్నాయి. వీటిని రూఢీ చేస్తూ కాటేదాన్ ప్రాంతానికి చెందిన పెడ్లర్ జితేందర పన్వార్ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు (హెచ్-న్యూ) చిక్కాడు. ఇతడి నుంచి 100 గ్రాముల మెఫిడ్రిన్, తుపాకీ, ఆరు తూటాలు స్వాధీనం చేసుకున్నట్లు కొత్వాల్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, ఇన్‌స్పెక్టర్లు జీఎస్ డానియేల్, ఎస్.బాలస్వామిలతో కలిసి బుధవారం వివరాలు వెల్లడించారు.

వలస వచ్చి.. వ్యాపారాల్లో నష్టపోయి...

రాజస్థాన్‌కు చెందిన జితేందర పుష్కరకాలం క్రితం నగరానికి వలస వచ్చి కాటేదాన్‌లో స్థిరపడ్డాడు. వివిధ స్వీట్ షాపుల్లో పని చేసిన ఇతగాడు ఓ దశలో సొంతంగా దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయి ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తుండగా రాజస్థాన్‌కే చెందిన పవన్ భాటీతో పరిచయమైంది. అక్కడ దొరికే మ్యావ్ మ్యావ్‌గా పిలిచే మెఫిడ్రిన్ డ్రగ్‌ను తీసువస్తానని, దాన్ని నగరంలో విక్రయించి సొమ్ము చేసుకుందామని చెప్పాడు. నగరానికి వలసవచ్చిన పవన్ సైతం స్వీటు షాపు, కిరాణా దుకాణం తదితరాలు పెట్టి నష్టపోయాడు. ఈ డ్రగ్ దందాకు జితేందర అంగీకరించడంతో పవన్... హేమ్ సింగ్‌ను సంప్రదించాడు.

అవసరమైతే వాడటానికి తుపాకీ ఖరీదు..

రాజస్థాన్‌లో మెఫిడ్రిన్‌ను హేమ్ సింగ్ ఖరీదు చేసి పవన్‌కు పంపేవాడు. ఇతగాడు జితేందర సహకారంతో నగరానికి చెందిన మనోజ్, నరేష్, రామదాస్, రాజు, వికాస్ తదితరులకు ఎక్కువ రేటుకు విక్రయించే వాడు. ఇటీవల కాలంలో పోలీసులు వరుసపెట్టి డ్రగ్ పెడ్లర్స్‌ను పట్టుకోవడం గమనించిన జితేందర రూ.70 వేలు వెచ్చించి ఓ తుపాకీ, ఏడు తూటాలు కొన్నాడు. కాటేదాన్ ప్రాంతంలో ఓ తూటాను టెస్ట్‌ఫైర్ చేసి తుపాకీ పని తీరుపై సంతృప్తి చెందాడు. తనను పట్టుకోవడానికి పోలీసులు వస్తే వారిపై కాల్పులు జరపాలని పథకం వేశాడు. డ్రగ్స్ దందాపై సమాచారం అందుకున్న హెచ్-న్యూ అధికారులు పవన్, జితేందర, హేమ్‌సింగ్‌లను పట్టుకున్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్ విలువ రూ.10 లక్షలు ఉంటుందని తేల్చారు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ, డ్రగ్స్‌ను చూపిస్తున్న కొత్వాల్ సీవీ ఆనంద్

వానల్లోనూ ఆన్‌లోనే..



ఫ్యాన్లు, ఏసీలు గిరగిరా.. వినియోగంలోనే గీజర్లూ..

- వర్షాకాలంలోనూ తగ్గని విద్యుత్ డిమాండ్
- గత ఏడాదితో పోలిస్తే 18.30 శాతం అధికం
- 2024 జూలై 17న 65.58 ఎంయూలు..
- ఈ ఏడాది జూలై 17న 77.58 ఎంయూలు నమోదు



సాక్షి, సిటీబ్యూరో

వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. నగరంలో ఇటీవల ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి.. ఉక్కపోత తగ్గినప్పటికీ.. కరెంట్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. వానల్లోనూ మరింత రెట్టింపు స్థాయిలో నమోదవుతోంది. గత ఏడాది జూలై 17న గ్రేటర్‌లో 65.58 ఎంయూలు నమోదు కాగా, ఈ ఏడాది అదే రోజు ఏకంగా 77.58 ఎంయూలు నమోదైంది. గతంతో పోలిస్తే.. ప్రస్తుతం 18.30 శాతం అధికంగా నమోదు కావడం గమనార్హం.

అంచనాలు తలకిందులు

ఏటా విద్యుత్ వృద్ధిరేటు విషయంలో డిస్కం అంచనాలు తలకిందులవుతున్నాయి. సాధారణంగా వేసవిలోనూ అత్యధిక డిమాండ్ నమోదవుతుంది. కానీ ఇందుకు భిన్నంగా వర్షాకాలంలోనూ నమోదువుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కొత్త కనెక్షన్లతో పాటు గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో కొత్తగా అనేక ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు వచ్చి చేరుతున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా ఇంట్లోని ఏసీలు ఆన్‌లోనే ఉంటున్నాయి. స్నానాలకు చన్నీటికి బదులుగా వేడినీళ్లను వాడుతున్నారు. నిన్నా మొన్నటి వరకు ఆఫ్‌లో ఉన్న గీజర్లు ప్రస్తుతం ఆన్‌లో ఉండటం కూడా విద్యుత్ వినియోగం పెరుగుదలకు మరో కారణం.

అనూహ్యంగా విద్యుత్ వృద్ధిరేటు

సైఫాబాద్, అజామాబాద్, మెహిదీపట్నం, చార్మినార్, బేగంబజార్, ఆస్మాన్‌గఢ్, ప్యారడైజ్, బోయిన్‌పల్లి, కంటోన్మెంట్, బంజారాహిల్స్, గ్రీన్‌లాండ్స్ డివిజన్లలో విద్యుత్ వృద్ధిరేటు ఏటా పది శాతం ఉంటుందని డిస్కం అంచనా వేసింది. ఇందుకు భిన్నంగా ప్రస్తుతం ఇక్కడ 20 శాతం వృద్ధి రేటు నమోదైంది. అదే విధంగా కొండాపూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, హబ్సిగూడ, సైనిక్‌పురి, కీసర, సరూర్‌నగర్, చంపాపేట్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, షాద్‌నగర్, సంగారెడ్డి డివిజన్లలో ఏటా 15 శాతం వృద్ధి రేటు ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఏకంగా 30 శాతం నమోదవుతోంది. ఇక ఐటీ, ఇతర పారిశ్రామిక సంస్థలకు నెలవైన ఇబ్రహీంబాగ్, గచ్చిబౌలి, పటాన్‌చెరు, కందుకూరు, మేడ్చల్ డివిజన్ల పరిధిలో 20 శాతం నమోదవుతుందని అంచనా వేస్తే.. ఇందుకు భిన్నంగా 40 శాతం వృద్ధిరేటు నమోదైంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతుండటం, ఇప్పటికే ఉన్న పరిశ్రమల్లోనూ అదనపు యూనిట్లు ప్రారంభిస్తుండటం కూడా అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు కారణమని డిస్కం అభిప్రాయపడుతోంది.

అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

వర్షాలు, వరదల నేపథ్యంలో ఇంజినీర్లంతా అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ఏకధాటి వర్షాలు, వరదల నేపథ్యంలో నిత్యం ఆయన ఆయా సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులెవరూ తమకు కేటాయించిన హెడ్‌క్వార్టర్లను విడిచి వెళ్లొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది అంతా షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలని సూచించారు. డిమాండ్ ఎంత వచ్చినా.. నిరంతరాయంగా, మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఇంజినీర్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

గత ఏడాది జూలైతో పోలిస్తే ప్రస్తుత విద్యుత్ డిమాండ్ ఇలా..

తేదీ	2024	2025
17	65.58	77.58
18	67.13	73.91
19	64.94	69.83
20	57.94	65.49
21	53.15	71.79
22	58.07	71.98

వరద లేకుండా.. ట్రాఫిక్‌జాం కాకుండా..

- సత్వరం చర్యలు తీసుకోండి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్


అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌వీ కర్ణన్, ఏవీ రంగనాథ్

గచ్చిబౌలి: గ్రేటర్ నగరంలో వర్షం వచ్చినప్పుడు రోడ్లపై వరద లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలకకుండా సత్వర చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజారావు భూపాల్, శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బొర్ఖడేలతో కలిసి శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో కర్ణన్ పర్యటించారు. వెస్ట్ జోనల్ పరిధిలోని మాదాపూర్‌లోని జూబ్లీ ఎన్‌క్లేవ్ కమాన్, శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడి కుంట లేక్ ఔట్‌లెట్‌ను పరిశీలించారు. జేఎన్‌టీయూ రోడ్‌లోని స్మైల్ డెంటల్ హాస్పిటల్ సమీపంలోని వాటర్ లాగింగ్ పాయింట్‌తో కలిగే ట్రాఫిక్ అంతరాయంపై ఆరా తీశారు. యశోద హాస్పిటల్ రోడ్డులో వరద నీటి డ్రెయిన్‌ను నిర్మించాలని, తమ్మిడి కుంట చెరువు వ్యర్థాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. భారీ వర్షానికి వరదతో పాటు పెద్ద ఎత్తున చేరిన బురదను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరద నివారణతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రగ్ పెడ్లర్‌గా భగ్న ప్రేమికుడు!

ప్రియురాలు మోసం చేసిందని మత్తుకు అలవాటు

- వినియోగదారుడి నుంచి విక్రేతగా మారిన వైనం
- గోవా నుంచి సరుకు తీసుకువచ్చి సిటీలో విక్రయం
- నిందితుడిని అరెస్టు చేసిన హెచ్-న్యూ అధికారులు
- మరో ఇరువురు నైజీరియన్ల డిపోర్టేషన్‌కు నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తూ ప్రేమలో విఫలమైన గాజులరామారం వాసి హర్షవర్ధన్ మాదకద్రవ్యాలకు బానిసగా మారాడు. పలు మార్లు డ్రగ్స్ ఖరీదు చేసిన ఇతగాడు ఆ దందాలో ఎంత లాభం ఉంటుందో తెలుసుకున్నాడు. దీంతో గోవా, ముంబైల్లో ఉన్న సప్లయర్స్‌తో సంబంధాలు ఏర్పాటు చేసుకుని డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఇతడిని పట్టుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు 10 గ్రాముల కొకైన్, 11 ఎక్స్‌టసీ పిల్స్ తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు కొత్వాల్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, ఇన్‌స్పెక్టర్లు జీఎస్ డానియేల్, ఎస్.బాలస్వామిలతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

అందమైన జీవితాన్ని ఊహించుకుని..

బీటెక్ పూర్తి చేసిన హర్ష ఓ యువతిని ప్రేమించాడు. ఆమెతో అందమైన జీవితాన్ని ఊహించుకుంటున్న క్రమంలో.. ఆ యువతి మరొకరిని వివాహం చేసుకోవడంతో భగ్న ప్రేమికుడయ్యాడు. ఆ బాధను మర్చిపోవడానికి మత్తు పదార్థాలకు బానిసగా మారాడు. తొలినాళ్లల్లో ఓజీ డ్రగ్ వాడి ఆపై కొకైన్‌కు మారాడు. ఇలా ఇతగాడికి గోవా, బెంగళూరులకు చెందిన డ్రగ్ పెడ్లర్స్‌లో సంబంధాలు ఏర్పడ్డాయి. కొన్నాళ్లకు తానే పెడ్లర్‌గా మారాలని నిర్ణయించుకున్నాడు. ఆ రెండు నగరాల్లో ఉన్న వారితో సంబంధాలు కొనసాగించారు. వారి నుంచి కొకైన్, ఎక్స్‌టసీ తదితరాలు ఖరీదు చేసి బస్సులో లేదా కొరియర్ ద్వారా నగరానికి తెచ్చేవాడు. ఆపై ఇక్కడి కస్టమర్లకు ఎక్కువ రేటుకు అమ్మి సొమ్ము చేసుకోవడం మొదలెట్టాడు.

వివరాలు ఇలా వెలుగులోకి..

హర్ష వ్యవహారాలపై సమాచారం అందుకున్న హెచ్-న్యూ అతడిని పట్టుకుని సరుకు స్వాధీనం చేసుకుంది. ఇతడి విచారణ నేపథ్యంలో నైజీరియా నుంచి వచ్చిన అవుల్ క్లైమెంట్, లాజరస్ చిన్వెన్మెరి నగరంలో అక్రమంగా ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్నారు. వీరిద్దరినీ హెచ్-న్యూ పట్టుకున్న సందర్భంలో వారి వద్ద మాదకద్రవ్యాలు లభించకపోవడంతో ఎఫ్ఆర్ఆర్ఓ ద్వారా నైజీరియాకు డిపోర్టేషన్ చేయాలని నిర్ణయించారు.

విషపూరితం అనే విషయం చెప్పేలా..

మాదకద్రవ్యాలు మత్తు ఇచ్చినా ఇవి విషతుల్యమే. కొన్నాళ్లకు వినియోగదారుల శరీరాలను గుల్ల చేస్తాయి. ఈ నేపథ్యంలోనే వీటిని విక్రయించే పెడ్లర్స్ విష నాగులతో సమానమని చెప్పవచ్చు. ఇదే విషయాన్ని లాజరస్ టీ షర్ట్ స్పష్టం చేస్తోంది. అరెస్టు సమయంలో అతడు ధరించిన నల్లరంగు టీ షర్ట్‌పై 'వెనెమస్.. బోర్న్ హైబ్రీడ్ (విషపూరితమైన... పుట్టుకతోనే సంకరజాతి) అని రాసి ఉంది.



పని భారం తగ్గించాలంటూ బిల్ కలెక్టర్ల ధర్నా

సాక్షి, సిటీబ్యూరో: తమపై పని భారం పెరిగిందని, ఇటీవల తమకు అప్పగించిన ట్రేడ్ లైసెన్సుల వసూళ్ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ జీహెచ్‌ఎంసీ బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. జాబ్‌చార్ట్ మేరకు తమ పని ఆస్తిపన్ను వసూళ్లు కాగా, అధికారులు తమకు ట్రేడ్ లైసెన్సులు, జీహెచ్‌ఎంసీ దుకాణాల అద్దె వసూళ్ల బాధ్యతలు కూడా అప్పగించారని తెలిపారు. ట్రేడ్ లైసెన్సుల ఫీజులు పెంచాలంటున్నారని, వీటితో పాటు ఎన్నికల విధుల వంటివి కూడా అప్పగిస్తున్నారన్నారు. పని ఒత్తిడి తీవ్రమైందని, పెంచిన పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు వారు పేర్కొన్నారు.



సచివాలయం ముట్టడికి విద్యార్థి సంఘాల యత్నం



విద్యార్థి సంఘాల నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఖైరతాబాద్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థి సంఘాలు చేపట్టిన చలో సచివాలయం ఉద్రిక్తతకు దారితీసింది. సచివాలయ ముట్టడికి యత్నించిన నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని ముషీరాబాద్, బోయిన్‌పల్లితో పాటు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు పుట్ట లక్ష్మణ్, కె.మణికంఠ రెడ్డి, నాగరాజ్, రజనీకాంత్, సాయిబోల అనిల్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్నా విద్యారంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో పరోక్షంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 2253 పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేదని, 1500 పైగా పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెండు జతల యూనిఫాం ఇవ్వాల్సి ఉండగా ఒక జత మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. అడ్మిషన్ల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న 662 గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నా ఇప్పటి వరకు ఒక్క సారి కూడా సమీక్షించలేదన్నారు. మంత్రులకు సమస్యలు చెప్పాలని వస్తున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దిష్టి బొమ్మలు దహనం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రహదారులు ఛిద్రం..



రేతిబౌలి చౌరస్తాలో..



లంగర్ హౌస్ ప్రాంతంలో..



పద్మశ్రీ కాలనీలో..

నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు వాననీరు నిలిచి గోదారులను తలపిస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో గోతుల మయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–సాక్షి, సిటీ బ్యూరో



మెహిదీపట్నం బస్టాప్‌లో...

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సెల్‌ఫోన్ చోరీ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దర్శనానికి వచ్చి భక్తురాలి హ్యాండ్ బ్యాగ్ కత్తిరించి నగదు, సెల్ ఫోన్ చోరీ చేసిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్కాజిగిరి, ప్రశాంత్‌నగర్‌కు చెందిన పుష్పలత తన తల్లి లక్ష్మితో కలిసి ఎల్లమ్మ దేవాలయానికి వచ్చింది. దర్శనానికి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె హ్యాండ్ బ్యాగ్ కత్తిరించి రూ.8 వేల నగదు, సెల్ ఫోన్ కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇన్‌స్పెక్టర్ మృతి



రాజేశ్వర్ రావు (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓయూ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ రంగినేని రాజేశ్వర్ రావు (58) బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆదివారం రాత్రి బోనాల పండుల నేపథ్యంలో విధులు ముగించుకుని బైక్ పై బీఎన్ రెడ్డి నగర్‌లోని ఇంటికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అంతర్గతంగా తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగి కిడ్నీలు ఫెయిలైనట్లు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను బుధవారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందాడన్నారు. ఆయన మృతికి పోలీసు అధికారులతో పాటు ఓయూ వీసీ ప్రొ.కుమార్ సంతాపం తెలిపారు.

పోలీసులపై దాడి కేసులో నిందితుల రిమాండ్





నిందితులు శివ, లక్ష్మణ్

ఉప్పల్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేసినా, విధులకు ఆటంకం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ డీఐ రామలింగా రెడ్డి అన్నారు. ఈ నెల 20న రాత్రి రామంతాపూర్ బోనాల పండుగ ఫలహార బండ్ల ఊరేగింపు సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న ఉప్పల్ ఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ లకన్‌పై కొందరు యువకులు మద్యం మత్తులో దాడికి పాల్పడిని విషయం తెలిసిందే. నిందితులను భువనగిరి, రాజాపేటకు చెందిన ఇరానీ లక్ష్మణ్, అదే ప్రాంతానికి చెందిన నాగని శివ మనోహర్‌గా గుర్తించిన పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా ఫలహార బండ్ల ఊరేగింపులో నిర్లక్ష్యంగా కారు నడిపిన మామిడాల క్రాంతిని సైతం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

జోనల్ కార్యాలయంలో చిల్లర దొంగ వీరంగం

కంప్యూటర్ వైర్లు కత్తిరించడంతో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం



నిందితుడు ధనుంజయ్

మూసాపేట: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఓ చిల్లరదొంగ వీరంగం సృష్టించాడు. వెయిటింగ్ హాల్‌లో ఉన్న సర్వర్, ఇంటర్‌నెట్ వైర్లను కట్ చేయటంతో బుధవారం మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిల్ కార్యాలయాలతో పాటు, జోనల్ కార్యాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. మున్సిపల్ అధికారులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ధనుంజయ్ అనే వ్యక్తి గత కొన్నాళ్లుగా జోనల్ కార్యాలయంలో చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బాత్‌రూమ్‌లలో నల్లాలు, పైపులు, తదితర వస్తువులు చోరీ చేసి వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. బుధవారం తెల్లవారు జామున మున్సిపల్ కార్యాలయంలోకి ప్రవేశించిన అతను వెయిటింగ్ హాల్‌లోని కుర్చీలను, టేబుళ్లను చిందర వందర చేసి, ఇంటర్నెట్ మెయిన్ సర్వర్ వైర్లను, కంప్యూటర్ వైర్లను కట్ చేశాడు. దీనిని గుర్తించిన మున్సిపల్ సిబ్బంది అతడిని పట్టుకుని అక్కడే కట్టేశారు. అధికారులు వచ్చిన తర్వాత కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. అతను రోడ్లపై తిరుగుతూ అడుక్కునే వాడని, అతడి పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం





స్వప్న, దినేష్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వినాయక్‌నగర్ కాలనీలో యాదిరెడ్డి, స్వప్న(30) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి దినేష్‌రెడ్డి(7), మేఘనాథ్‌రెడ్డి(3) సంతానం. ఈ నెల 20న స్వప్న తన ఇద్దరు పిల్లలను తీసుకుని బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త యాదిరెడ్డి వారి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం..



కార్యక్రమంలో పాల్గొన్న ఉత్సవ సమితి ప్రతినిధులు

అబిడ్స్: వినాయకచవితి ఉత్సవాల్లో మండప నిర్వాహకులు హిందూ ధర్మాన్ని కాపాడేలా భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్ అన్నారు. సిద్ధిఅంబర్‌బజార్ బహెతిభవన్‌లో బుధవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని సమితి అధ్యక్షులు జి.రాఘవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రతి గణేష్ మండపం వద్ద ప్రచారం చేపట్టాలన్నారు. భాగ్యనగరంలో 1980లో ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉత్సవాలు 45 వసంతాలు పూర్తయ్యాయన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినాయక చవితి ఉత్సవాలు ఆగస్టు 27న ప్రారంభమై సెప్టెంబర్ 6న అనంత చతుర్దశి రోజు ముగుస్తాయన్నారు. 6న గణేష్ నిమజ్జనం పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రామరాజు, ఆలె భాస్కర్, మహేందర్, బద్దం మహిపాల్‌రెడ్డి, కరోడిమాల్, శ్రీరామ్‌వ్యాస్, గోవింద్‌రాఠీ, అరుణజ్యోతి, రాము, బండారు శ్రీధర్, రఘు కామ్లె తదితరులు పాల్గొన్నారు.

కొకైన్ ఫ్రమ్ ముంబై!

అక్కడ నుంచి తీసుకువచ్చి ఇక్కడ విక్రయం

- సముద్ర మార్గంలో ముంబైకి చేరవేత
- ఏడుగురు నిందితుల అరెస్టు, 276 గ్రాముల కొకైన్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల నుంచి సముద్రమార్గంలో ముంబై చేరుతున్న కొకైన్ డ్రగ్ రోడ్డు మార్గంలో సిటీకి వస్తోంది. కొన్నాళ్లుగా వ్యవస్థీకృతంగా ఈ దందాను చేస్తున్న ముఠా అనేక మందికి దీనిని విక్రయిస్తోంది. దీనిపై సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌–న్యూ) అధికారులు రూ.69 లక్షల విలువైన 276 గ్రాముల డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్వాల్ సీవీ ఆనంద్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, ఇన్‌స్పెక్టర్లు జీఎస్ డానియేల్, ఎస్.బాలస్వామిలతో వివరా వెల్లడించారు.

కస్టమర్లను పట్టుకుంటే పెడ్లర్ దొరికాడు..

నగరానికి చెందిన రవి కుమార్ వర్మ, సచిన్ కొన్నాళ్లుగా కొకైన్ వాడుతున్నట్లు హెచ్‌–న్యూకు సమాచారం అందింది. దీంతో వలపన్నిన అధికారులు వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని కొంత డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. విచారణ నేపథ్యంలో తమకు ఈ మాదకద్రవ్యాన్ని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రేమ్ ఉపాధ్యాయ అందిస్తాడని చెప్పారు. బీకాం చదివిన ప్రేమ్ కొన్నాళ్లు ఉద్యోగం చేసినా ఆపై డ్రగ్స్ దందాలోకి దిగాడు. గోవా వెళ్లి వస్తుండగా ఏర్పడిన పరిచయాలతో ఈ దందా మొదలెట్టాడు. 2022లో తొలిసారి నల్లకుంట పోలీసులకు చిక్కాడు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో క్వాలిటీ ఎనలిస్ట్‌గా చేరాడు. అయినా దందా కొనసాగిస్తున్నాడు. ఇతడిని పట్టుకుని విచారించిన పోలీసులు కీలక విషయాలు రాబట్టారు.

ముంబైకి చెందిన నలుగురు కీలకం...

విదేశాల్లో ఉంటున్న ఆండ్రూ ద్వారా సముద్ర మార్గంలో ముంబైకి వస్తున్న కొకైన్ ముంబైలో స్థిరపడిన ఉత్తరప్రదేశ్ వాసి ముజఫర్ వహీద్ షేక్‌కు చేరుతోంది. ఇతడి నుంచి ఈ డ్రగ్ మరో పెడ్లర్ పీటర్‌కు, అతడి నుంచి వినోద్ కిషన్‌లాల్ శ్రీవాస్తవ్ వద్దకు వస్తోంది. యూపీ నుంచి వచ్చి ముంబైలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్న వినోద్ గత ఏడాది ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి డ్రగ్స్ దందాలో దిగి సబ్‌–పెడ్లర్‌గా మారాడు. ఇతడి ద్వారా సరుకును ముంబైకే చెందిన త్రీడీ ఆర్ట్ డిజైనర్ చైతన్య వినాయక్ వద్దకు వస్తోంది. ముంబైకే చెందిన ముస్తాక్ ఖాన్ సోదరుడు డ్రగ్స్ పెడ్లర్‌గా ఉన్నాడు. అతడిని చూసిన ఇతనూ తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు ఈ దందాలో దిగాడు.

ప్రేమ్‌పై పీడీ యాక్ట్ ప్రయోగానికి నిర్ణయం...

ఇలా రవి కుమార్, సచిన్ నుంచి మొదలైన అరెస్టుల పర్వం ముజఫర్, వినోద్, చైతన్య, ముస్తాక్ వరకు వెళ్లింది. ఆండ్రూ, పీటర్ సహా వీరికి సహకరించిన మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రేమ్‌పై నల్లకుంట, గోల్కొండ ఠాణాల్లో రెండు కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈసారి ఇతడిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని నిర్ణయించినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. కొకైన్ విక్రయం ద్వారా సంపాదిస్తున్న సొమ్ముతో ఈ పెడ్లర్లు, సప్లయర్లు విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నట్లు హెచ్‌–న్యూ గుర్తించింది. ఈ ముఠాకు రవి వర్మ, సచిన్ కాకుండా నగరంలో మరికొందరు కస్టమర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వారి వివరాలు ఆరా తీస్తున్నారు.

ఆన్‌లైన్ పేమెంట్‌తో పట్టేశారు

మద్యం మత్తులో కారుపైకి ఎక్కిన యువకుడి అరెస్టు



నిందితుడు సింహాచలం

మూసాపేట: మద్యం మత్తులో రోడ్డుపై వెళుతున్న కారు పైకి ఎక్కి కారులో ఉన్న వ్యక్తులను భయభ్రాంతులకు గురి చేసిన యువకుడిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఓ షాపులో అతను రూ. 32 ఆన్‌లైన్ పేమెంట్ చేయడంతో దాని ఆధారంగా అతడిని గంటలోపే అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ గిరీష్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... విశాఖపట్నం జిల్లా పెద్ద గోగాడ గ్రామానికి చెందిన సింహాచలం నాయుడు మూసాపేటలోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను మూసాపేట చౌరస్తాలోని వైన్‌షాపులో మద్యం తాగాడు. మద్యం మత్తులో అమీర్‌పేట నుంచి కూకట్‌పల్లికి వెళుతున్న ఓ కారును అడ్డుకుని దాని పైకి ఎక్కి కూర్చున్నాడు. దీంతో భయాందోళనకు గురైన కారులో ఉన్న వ్యక్తులు అతడిని కిందకు దిగాలని బతిమాలినా ససేమిరా అన్నాడు. దీంతో స్థానికులు జోక్యం చేసుకుని అతడిని కిందకు దింపి కారును పంపించి వేశారు. సదరు వీడియో వైరల్ కావటంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్ఐ గిరీష్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. ఆన్‌లైన్ పేమెంట్ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



యామిని (ఫైల్)

గచ్చిబౌలి: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం పట్టణం, గాంధీనగర్‌కు చెందిన చింతల యామిని (27) ఇందిరానగర్‌లోని జేకే పీజీ హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. మంగళవారం ఉదయం ఖమ్మం వెళ్లేందుకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు బయలుదేరిన ఆమె వాంతులు కావడంతో కొద్దిసేపటికే హాస్టల్‌కు తిరిగి వచ్చింది. అనంతరం తన రూమ్మేట్స్ నిఖిత, రాణిలతో కలిసి టిఫిన్ చేసి హాస్టల్‌లోనే ఉండిపోయింది. ఆఫీసుకు వెళ్లిన ఆమె స్నేహితులు సాయంత్రం గదికి తిరిగి వచ్చి చూడగా లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో హాస్టల్ నిర్వాహకుల సహాయంతో కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా కిటికీ గ్రిల్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. యామినికి పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాకపోవడంతో పోలీసులు ఆమె కాల్ డేటాను పరిశీలిస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో టోకరా

నిందితుడి అరెస్ట్



నిందితుడు గిన్ని గోపి

ఉప్పల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసి రూ. లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని ఉప్పల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాలి ప్రాంతానికి చెందిన గిన్ని గోపి ఉప్పల్ ప్రాంతంలో లెన్స్ సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నకిలీ కంపెనీ పేరుతో నకిలీ లోగో సృష్టించి ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి రూ. లక్షలు వసూలు చేసి వారికి నకిలీ ఆఫర్ లెటర్‌లు ఇస్తున్నాడు. వారు ఆఫర్ లెటర్లు తీసుకుని లెన్స్ సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వెళ్లడంతో తాము ఎలాంటి లెటర్లు ఇవ్వలేదని తెలిపారు. కంపెనీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు గిన్ని గోపిగా గుర్తించారు. బుధవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీని ఢీకొన్న కారు

ఒకరికి గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: వేగంగా వచ్చిన కారు లారీని ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం అతను బడంగ్‌పేట్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో బాబుల్‌రెడ్డినగర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో శ్రీనివాస్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీలో ఇరుక్కుపోయిన కారును జేసీబీతో బయటికి లాగారు. గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జిమిర్చి 65, క్యాప్సికం 65, పచ్చి కాకరకాయ 23, పందిరిబీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండకాయ 18, గుండు బీన్స్ 60, గింజచిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 26, మొరంగడ్డ 35, కందగడ్డ 50, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 23, ముల్లంగి 4–5, ఉల్లిపొరక రూప 28 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నివాళి



నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ

రహమత్‌నగర్: ఇటీవల మరణించిన బీజేపీ రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ తండ్రి రాములు దశ దిన కర్మ మోతీనగర్‌లోని రాయల్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రావుల శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గ్యార నాగరాజులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు,రజక సంఘ ప్రతినిధులు దివంగత రాములు చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

నేడు కాలసర్ప దోష నివారణ పూజలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీవీరాంజనే భవానీ శంకర అయ్యప్పస్వామి సాయిబాబా ఆలయంలో గురువారం కాలసర్ప దోష నివారణ పూజలు, హోమం నిర్వహిస్తామని దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సంతాన అవరోధం, శారీరక హీనత, మానసిక అశాంతి, వైవాహిక జీవిత సమస్యలు, శత్రుబాధలు తదితర సమస్యలతో సతమతం అయ్యే వారు ఈ పూజాది కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ఆయన సూచించారు.

నిమ్స్‌కు బెంచ్‌లు వితరణ



లక్డీకాపూల్: నిమ్స్ కు ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం చారుణం లలితమ్మ – భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ రూ. 3 లక్షల విలువైన 30 సిమెంట్ బెంచీలను సమకూర్చింది. బుధవారం ఈ మేరకు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. గౌరీశంకర్ డైరెక్టర్ ప్రొ. నగరి బీరప్పకు అందజేశారు.

ఎన్టీఆర్ మార్గ్‌లో చెట్టును ఢీ కొట్టిన కారు



ఖైరతాబాద్: ఎన్టీఆర్ మార్గ్‌లో కారు అదుపు తప్పి భారీ చెట్టును ఢీకొంది. బుధవారం ఉదయంసచివాలయం వైపు నుంచి ఐమాక్స్ రోటరీ చౌరస్తా వైపు వస్తున్న కారు ఎన్టీఆర్ మార్గ్‌లో అదుపు తప్పి డివైడర్ పక్కనే ఉన్న భారీ చెట్టును ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఏయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న వ్యక్తి ప్రమాదం నుంచి బయట పడ్డాడు. కారు మలుపు వద్ద వెనుక టైర్‌లో గాలి తక్కువగా ఉండం వల్ల అదుపు తప్పి చెట్టును ఢీకొని ఉండవచ్చని భావిస్తున్నారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని తొలగించారు.

బీఎల్ఓలకు శిక్షణ



బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమం బుధవారం ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులను పర్మినెంట్ బీఎల్‌ఓలుగా నియమించగా వీరికి మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

'రంగనాథా'.. చూడవా

మా బాధ

బస్తీని ముంచెత్తుతున్న నాలా నీరు



బల్కాపూర్ నాలా నుంచి బయటికి వస్తున్న మురుగు నీరు..

బంజారాహిల్స్: పై చిత్రంలో కనిపిస్తున్న నీళ్ళు వరద నీరు అనుకుంటే పొరపాటు పడినట్లే... అవి మురుగు నీరు... వరద నీటి కాల్వలో నుంచి బస్తీలోకి పారుతున్న మురుగు నీరు...అవి వర్షం నీళ్ళనుకొని పాపం చిన్నారుల ఆ నీళ్ళలో నుంచి ఆడుకుంటూ ముందుకు వెళ్తున్నారు. గడిచిన 20 రోజులుగా ఈ బస్తీలో 10 మందికిపైగా విష జ్వరాల బారిన పడ్డారు. జూబ్లీహిల్స్ డివిజన్ బసవతారకం నగర్ బస్తీని ఆనుకొని ఉన్న నాలా గత కొద్ది రోజుల నుంచి ఓవర్ ఫ్లో అవుతూ బసవతారకం నగర్ బస్తీని ముంచెత్తుతోంది. ఫలితంగా బస్తీలో పగలు, రాత్రి తేడా లేకుండా మురుగు నీరు పారుతూనే ఉంది. పై బస్తీలో ఉన్న చాలా నివాసాల మురుగు నీటి కనెక్షన్లను ఈ నాలాలో కలిపేశారు. దీనికి తోడు గతంలో హకీంపేట కుంట నీళ్ళు పక్కనే ఉన్న సీవరేజి లైన్ నుంచి వెళ్లేవి తాజాగా కొన్ని రోజుల ఆ లైన్‌ను ఈ బల్కాపూర్ నాలాకు లింక్ చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న నాలా సామర్థ్యం సరిపోక నీళ్ళన్నీ పొంగి బస్తీని ముంచెత్తుతున్నాయి. రెండు రోజుల క్రితం నాలా ఓవర్ ఫ్లో కావడంతో ఇక్కడ పర్యటించిన హైడ్రా మాన్‌సూన్ సిబ్బంది తూతూ మంత్రంగా వ్యర్థాలు తొలగించి వెళ్లిపోయారు. నాలాల నుంచి సాఫీగా ముందుకు సాగాల్సిన బస్తీని ముంచెత్తుతుండటంతో స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. ఈ నాలాకు అపోలో ఆస్పత్రి నుంచి వినాయకనగర్, దుర్గా భవానీనగర్, బాబు నాయుడు నగర్, బాల్‌రెడ్డినగర్ బస్తీల నుంచి కలిపి ఉంది. గతంలో ఈ నాలా నుంచి నీరు సాఫీగా సాగేవని ఎప్పుడైతే హకీంపేట కుంట నీళ్ళు ఈ నాలాకు కలిపారో అప్పటి నుంచి సమస్య మొదలైందని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ నాలాలో డీసిల్టింగ్ సమయంలో వ్యర్థాలు సరిగ్గా తొలగించలేదని అదే విధంగా నాలా నుంచి ఎడమ వైపుకు వెళ్లే మార్గంలో నాలా చిన్నదిగా ఉండటం వల్ల కూడా నాలా నుంచి నీరు బయటిక వస్తుందని స్థానికులు వాపోతున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇక్కడ పర్యటిస్తేనే తమ సమస్య పరిష్కారం అవుతుందని లేదంటే తమకు వర్షాకాలమంతా ఇదే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు.



మురుగు నీటి నుంచి వస్తున్న చిన్నారి

'విద్యాసంస్థల బంద్ విజయవంతం'



బంద్‌లో పాల్గొన్న ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ విద్యార్థులను మోసం చేస్తోందని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర ఆరోపించారు. బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ విజయవంతం అయ్యిందని తెలిపారు. బంద్ సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల, కాచిగూడాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల తరగతులను బహిష్కరించి, నినాదాలు చేస్తూ బంద్‌ను విజయవంతం చేసినట్లు తెలిపారు. నెర్లకంటి శ్రీకాంత్, శ్రీమాన్, షేక్ మహమూద్, వంశీ, అరుణ్, చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రోడ్డుకు మరమ్మతులు



బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లో పర్యటిస్తున్న ట్రాఫిక్, జీహెచ్ఎంసీ ఇంజనీర్లు..

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14 ప్రధాన రహదారిలో రత్నదీప్ సూపర్ మార్కెట్ నుంచి మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ ఇంటి వరకు రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ అపార్ట్‌మెంట్ ముందు ఇటీవలనే మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తిచేశారు. ఇందుకోసం రోడ్డంతా తవ్వారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు మొత్తం గుంతలమయమై బురదతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ రోడ్డు రెస్టోరేషన్ పనులు చేసేందుకు జీహెచ్ఎంసీ రూ.24 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు వెంటనే చేపట్టేవిధంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఈ అభినయ్, ఏఈ సతీష్‌లతో పాటు ఇతర సిబ్బంది పర్యటించారు. ఈ రోడ్డు పనులు మొదలుపెట్టిన తర్వాత ఎప్పటిలోగా పూర్తవుతాయి.. ట్రాఫిక్‌పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ట్రాఫిక్ పోలీసుల అనుమతి రాగానే పనులు మొదలుపెడతామని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.

అనధికార వాణిజ్య భవనాన్ని సీజ్‌చేసిన అధికారులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ రోడ్డునెంబర్–13లోని ప్లాట్‌నెంబర్–51లో నివాస భవనాన్ని అనధికారికంగా వాణిజ్య భవనంగా మార్చడంతో జూబ్లీహిల్స్ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ భవనంలో వాణిజ్య ఆమోదం పొందకుండా జీ ప్లస్ 5 అంతస్తు నిర్మించి గీతాంజలి మోడల్ స్కూల్‌ను నడుపుతున్నట్లు వెల్లడించారు. అలాగే షేక్‌పేట వెటర్నరీ కాలనీలో అబ్దుల్ నవాజ్ అనే వ్యక్తి స్టిల్ట్ ప్లస్ 4 అనుమతులు తీసుకుని అక్రమంగా ఐదో అంతస్తు నిర్మాణం, అనధికార సెల్లార్ నిర్మాణం, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘన చేయడంతో సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–1లో ప్లాట్‌నెంబర్–96 యజమాని స్టిల్ట్ ప్లస 4 అంతస్తుల అనధికార నిర్మాణం చేపట్టగా సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని దుర్గానగర్‌కాలనీలో ఆర్కే అగర్వాల్ అనే వ్యక్తి అదనపు అంతస్తు అక్రమంగా నిర్మించగా సీజ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి మంజూరు చేయబడిన భవన ప్రణాళికల ఉల్లంఘనల ఆధారంగా వీటిని సీజ్ చేసినట్లు డీసీ సమ్మయ్య తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో ఎన్నో సంవత్సరాలుగా ముస్లిం గ్రేవ్‌యార్డ్ కోసం స్థలం కేటాయించాలని డిమాండ్లు ఉన్నాయని వాటిని పరిగణలోకి తీసుకొని స్థలాన్ని కేటాయించాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ అజారుద్దీన్ కోరారు. బుధవారం ఆయన వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుసేనిని కలిసి ముస్లిం గ్రేవ్‌యార్డ్‌కు స్థలం కేటాయించాలంటూ వినతి పత్రం అందజేశారు.



మహిళ పర్సు చోరీ..ఏటీఎం కార్డుతో రూ.40 వేలు డ్రా

బంజారాహిల్స్: దైవదర్శనం కోసం వచ్చిన భక్తురాలి పర్సు కొట్టేసిన దొంగ..అందులోని ఏటీఎం కార్డు ద్వారా బ్యాంకులో రూ.40 వేలు డ్రా చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దుండిగల్‌కు చెందిన జి.అనిత అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయానికి అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. దర్శనానికి వెళుతున్న క్రమంలో ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి పర్సును గుర్తుతెలియని వ్యక్తులు కొట్టేశారు. దర్శనం ముగించుకుని ఇంటికి వెళ్ళిన తర్వాత పర్సు మిస్ అయిన విషయాన్ని బాధితురాలు గుర్తించింది. కాసేపట్లోనే ఆమె ఫోన్‌కు బ్యాంకు నుంచి డబ్బులు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన బాధిత మహిళ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పర్సులోని ఏటీఎం కార్డు మీద పిన్ నెంబర్ రాసుకుని ఉండటంతో నిందితుడు సులభంగా డబ్బులు డ్రా చేసినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న జూబ్లీ హిల్స్ క్రైమ్ పోలీసులు ఆలయంలోని సీసీ పుటేజ్, ఏటీఎంలోని పుటేజ్ పరిశీలిస్తున్నారు.

బీసీ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం

పంజగుట్ట: రాష్ట్రంలోని బీసీ జర్నలిస్టులు ఏకమై రాజ్యాధికార, అస్థిత్వ ఉద్యమంలో భాగస్వామ్యులు కావాలని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతీ జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, చిన్న పత్రికలకు కూడా ప్రకటనలు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులకు సరైన శిక్షణ లేక గ్రామీణ, మండల ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. త్వరలో జరగబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ జర్నలిస్టులు కీలకంగా ఉండి బీసీలను చైతన్యవంతం చెయ్యాలని కోరారు. ముదిరాజ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నీలకంఠం ముదిరాజ్, యాదవ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్, విశ్వకర్మ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు గుండోజు శ్రీనివాస్, వెంకట్, సత్యనారాయణ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



రహమత్‌నగర్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో బుధవారం విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఇందులో భాగంగా బోరబండ బస్ స్టాప్ వద్ద ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ సునీల్ పవార్ మాట్లాడుతూ... విద్యా సంస్థల్లో వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డీవైఎఫ్ఐ నాయకులు కృష్ణ, వెంకట్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మాగంటి మరణం తీరనిలోటు

శ్రీనగర్‌కాలనీ: బస్తీలు, కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించి అన్ని విధాలా అభివృద్ధికి నిరంతరం కృషిచేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ మరణం నియోజకవర్గ ప్రజలకు తీరనిలోటు అని నాగార్జుననగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి మౌళి అన్నారు. బుధవారం నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో దివంగత ఎమ్మెల్యే మాగంటి సంతాప సభను నిర్వహించారు. మాగంటి సోద రుడు మాగంటి వజ్రనాథ్, మాగంటి మాతృమూర్తి కాలనీవాసులు, స్థానిక బస్తీవాసులు పూలమాలలతో నివాళులర్పించారు. నేతలు సుజాత, అరుణ, శ్రవంతి, బసవరావు, పెరుక రవి, కాలనీ సంక్షేమ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

25న ఫెర్టీ-9లో ఐవీఎఫ్ డే

హిమాయత్‌నగర్: ఈ నెల 25న ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతానోత్పత్తిపై ఫెర్టీ–9 సికింద్రాబాద్ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫెర్టీ–9 ఫెర్టిలిటీ సెంటర్ సీఈఓ దినేష్ గాంధీయా తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ లోగోలను ఫెర్టీ–9 మెడికల్ డైరెక్టర్ జ్యోతితో కలసి ఆవిష్కరించి మాట్లాడారు. దంపతులు, నిపుణులను ఒకే వేదికపై తీసుకువచ్చి, వెనకడుగు వేస్తున్న పురుషులను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఫెర్టీ–9 ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత సీమెన్ ఎనలైజర్‌ను ప్రవేశపెట్టి రెండు రాష్ట్రాల్లో మొట్ట మొదటిసారి ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



చిన్నారులను అభినందిస్తున్న మధురానగర్‌కాలనీ నేతలు

వెంగళరావునగర్: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నేతలు పేర్కొన్నారు. మధురానగర్‌కాలనీ డి.సిహెచ్.ఎస్.ఎన్. ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకున్న పలువురు చిన్నారులు ఈ నెల 21, 22వ తేదీల్లో జేఎన్‌టీయూలో ఇంటర్ స్కూల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్–9, 11, 13, 15, 17 విభాగాల్లో జరిగిన పోటీల్లో ఆరుగురు చిన్నారులు తమ ప్రతిభను చాటి పది బహుమతులను గెలుచుకున్నారు. వీరికి కాలనీలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ... చిన్నారులు అన్ని విభాగాల్లో విజయం సాధిస్తూ ముందుకు దూసుకెళ్లారని, అన్నింటా విజయం సాధించడం అభినందనీయమం అన్నారు. అండర్–9లో సి.హెచ్.దర్శిత్, టి.నూర్జాంత్, అండర్–11 విభాగంలో హర్షిత్‌రెడ్డి, సాయిదీక్ష, అండర్–13 విభాగంలో తన్మయి శ్రీ, హర్షిత్‌రెడ్డి, అండర్–15, 17 విభాగాల్లో ఎం.హర్షిత్ రెడ్డి బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. ఇందుకు కోచ్ శేషుతోపాటు చిన్నారుల ఆసక్తిని అర్థం చేసుకుని క్రీడల్లో ప్రోత్రహిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, ఉపాధ్యక్షులు మనోహర్‌రావు, కోశాధికారి సుగుణ, జాయింట్ సెక్రటరీ హనుమంతరావు, కోచ్ శేషు తదితరులు పాల్గొన్నారు.

నవ నిర్మాణ్‌నగర్‌లో విద్యుత్ అధికారుల బస్తీబాట



నవ నిర్మాణ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు..

బంజారాహిల్స్: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–71లోని నవనిర్మాణ్‌నగర్ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. నవ నిర్మాణ్‌నగర్‌కాలనీ గౌరవ చైర్మన్ సీహెచ్.వెంకటప్రసాద్, ప్రెసిడెంట్ బి.హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రామచందర్‌రాజు, సెక్రటరీ ఉమామహేశ్వరరావు తదితరులు టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ జి.రమేష్‌కు సమస్యలను వివరించారు. ముఖ్యంగా కరెంటు వైర్లకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని, వెంటనే ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ సబ్‌స్టేషన్ ఏఈ పవిత్ర పాల్గొన్నారు.

వినాయకనగర్ బస్తీలో ఆక్రమణల కూల్చివేత



వినాయకనగర్ బస్తీలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. బుధవారం షేక్‌పేట మండల తహసిల్దార్ అనితారెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది బస్తీలోని పర్వతాంజనేయస్వామి ఆలయం వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన గేటుతో పాటు గేటు లోపల ఇళ్ళ ముందు ఏర్పాటు చేసుకున గార్డెన్లను, పలు తాత్కాలిక నిర్మాణాలను నేల మట్టం చేశారు. మరోసారి ప్రభుత్వ స్థలాలపై కన్నేస్తే కఠిన చర్యలు తప్పవని క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

జూబ్లీహిల్స్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ జర్నలిస్ట్‌కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను బుధవారం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా రెగ్యులరైజేషన్ చేసుకున్నారని.. ఎం.మదన్‌మోహన్‌రెడ్డి అనే వ్యక్తి అడ్డదారుల్లో సరైన ధృవపత్రాలు లేకుండా ఎల్ఆర్ఎస్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నాడన్నారు. జీహెచ్ఎంసీ వెంటనే ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్‌ను క్యాన్సిల్ చేయాలని, బిల్డింగ్ అప్రూవల్స్ కూడా ఇవ్వవద్దని సూచించారు. ఈ స్థలం విలువ రూ.8 కోట్లు ఉంటుంది.

ఎమ్మెల్యే కాలనీలో ఉద్రిక్తత

బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీలో ఓ ప్రార్థనా మందిరాన్ని బుధవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. కూల్చివేసిన ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో మహిళలు చేరుకుని అధికారుల తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకోవడంతో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నాలా సమస్యను పరిష్కరించండి



బసవతారకం నగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బసవతారకం నగర్‌బస్తీని ఆనుకొని ఉన్న నాలాలోని వరద, మురుగు నీరు సాఫీగా ముందుకు వెళ్ళకుండా బస్తీని ముంచెత్తడంతో బస్తీవాసులు కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఆయన జీహెచ్ఎంసీ ఏఈ వెంకటేష్‌తో కలిసి అక్కడ పర్యటించారు. నాలాలో వ్యర్థాల వెలికితీతతో పాటు సాంకేతికంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని లేదంటూ వర్షాకాలంలో బస్తీలోకి మొత్తం మురుగు నీరు వస్తున్నాయని ఆయన అధికారులకు తెలిపారు. పిల్లలు, పెద్ద వయసు వాళ్ళు బస్తీలో కనీసం నడిచేందుకు కూడా వీల్లేనంతగా నాలా నుంచి మురుగు పొంగి ప్రవహిస్తున్నదని ఆయన అన్నారు. ఈ సమ్యను గతంలో జోనల్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్ళామని పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

హిమాయత్‌నగర్: దేశ విముక్తి కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన గొప్ప విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కొనియాడారు. బుధవారం ఆజాద్ 119వ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆజాద్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆజాద్ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, శ్రీమాన్, బి.వెంకటేశం, నేతలు వంశీ, అరుణ్, ఉమర్ ఖాన్, లతీఫ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



ఫిలింనగర్: బోనాల వేడుకలు ముగిసిన అనంతరం నిర్వహించే తొట్టెల ఊరేగింపు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలను ఆయా బస్తీల్లో నేతలు, ఆలయ కమిటీల ప్రతినిధులు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. పోత రాజుల విన్యాసాలు, శివశక్తుల నృత్యాల మధ్య జరిగిన ఘటాల ఊరేగింపు, భారీ అమ్మవారి విగ్రహాల ఊరేగింపులో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి
గురువారం
। 24 । జూలై । 2025

అందంగా.. ఆహ్లాదంగా..

ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో రూ.26.81 కోట్లతో అభివృద్ధి పనులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఉప్పుగూడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు రూ.26.81 కోట్లతో పనులు చేపట్టారు. ఇది ఫలక్‌నుమా- కాచిగూడ సెక్షన్‌లో ఉన్న సబర్బన్ గ్రేడ్–3 స్టేషన్ రోజుకు సగటున ఐదువేల మంది ఉప్పుగూడ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. సబర్బన్ రైళ్లతోసహా ఈ స్టేషన్‌లో రోజుకు 50 రైళ్లు ఆగుతాయి. స్టేషన్ ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు. రెండో ప్రవేశమార్గాన్ని అభివృద్ధి చేశారు. రెండు లిఫ్టులు, రెండు ఎస్కలేటర్లను ఏర్పాటు చేయడంతోపాటు ప్లాట్‌ఫామ్‌పై అదనపు పై కప్పులు, విశాలమైన వెయిటింగ్ హాళ్లు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం 12 మీటర్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పార్కింగ్ షెడ్‌లకు ప్రహరీ నిర్మాణం తుదిదశకు చేరుకుంది. లిఫ్టులు, ఎస్కలేటర్ల పనులు తుదిదశలో ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి అధునాత ఉప్పుగూడ స్టేషన్ వినియోగంలోకి రానుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో రైతు కమిషన్ చైర్మన్ తనిఖీ



రైతు కమిషన్ సభ్యులతో మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు సదుపాయాలు కల్పించాలని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కమిషన్ సభ్యులు రాములు నాయక్, భవానీరెడ్డి, కమిషన్ అధికారులు హరి వెంకటప్రసాద్, మహేష్‌లతో కలిసి బుధవారం ఉదయం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో తనిఖీలు చేపట్టారు. దాదాపు గంటన్నర సేపు యార్డులో కలియ తిరుగుతూ రైతులు, వ్యాపారులు, హమాలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగు రోజులుగా మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అందుబాటులో లేరనే విషయం తెలుసుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల చాంబర్లు, రసీదులు, అటెండెన్స్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. అమ్మకాలు, కొనుగోళ్ల వివరాలు సేకరించారు. తనిఖీల విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, ఇతర సభ్యులు మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకున్నారు. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి కమిటీ చేస్తున్న ప్రయత్నాలను కమిషన్ సభ్యులకు వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులకు త్వరితగతిన ఆమోదం లభించేలా చూడాలని ఆనంద్‌బాబు కోరారు.

30 ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ కార్మికులకు వైద్యశిబిరాలు



వెంగళరావునగర్: జీహెచ్‌ఎంసీ కార్మికులు, సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు నగరంలోని 30 ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో బుధవారం జీహెచ్‌ఎంసీ కార్మికులు, ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ ఇక్కడ 169 బస్తీ దవాఖానాలు, 91 ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 11 స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. సీజనల్ జబ్బుల బారి నుంచి కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడటానికి వైద్య బృందాలను తీసుకు వస్తున్నట్టు తెలిపారు. ప్రజాప్రభుత్వం ప్రజలకు నిరంతరం అండగా ఉంటుందన్నారు. కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫ్రంట్ లైన్‌లో ఉండే కార్మికులు బాగుంటేనే నగరం బాగుంటుందన్నారు. అనంతరం కార్మికులకు ఆరోగ్య కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు దేదీప్య విజయ్, సి.ఎన్.రెడ్డి, వనం సంగీత, జిల్లా వైద్యాధికారి వెంకటేష్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అడ్డుకున్న వారికి రాజకీయ సమాధి : సీపీఐ

హిమాయత్‌నగర్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా అడ్డుకున్నవారికి రాజకీయ సమాధి తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన వాగ్దానాల్లో భాగంగా 42 శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ ఆమోదం కోసం పంపిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్‌ఎస్ లాంటి ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ చర్యను విమర్శించటం, అనుమానాలు సృష్టించటం ప్రజాద్రోహమేనని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డినెన్స్‌ను ఎవరు తెచ్చారనే విషయం ఆలోచించకుండా బీసీల చిరకాలవాంఛ అయిన రిజర్వేషన్లను సాధించటానికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు.

ఈ-వ్యర్థం.. ఏ అనర్థానికో..!

- ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ 18 శాతమే!
- రీ సైక్లింగ్ యూనిట్ల సామర్థ్యం ఏటా 3.5 లక్షల టన్నులు..
- సేకరించేది 64,635 టన్నులే..
- ప్రజల్లో అవగాహనా లోపం.. రీసైక్లింగ్‌కు చేరని ఈ వ్యర్థాలు
- విశ్వనగరంలో పెరుగుతున్న ఈ వ్యర్థాలు
- పర్యావరణానికి పొంచి ఉన్న ప్రమాదం



సాక్షి, సిటీబ్యూరో: రోజురోజుకూ పెరుగుతున్న ఈ వేస్ట్.. రీసైక్లింగ్‌పై అధికారుల్లో కొరవడిన శ్రద్ధ.. ప్రజల్లో అవగాహన లోపం.. పర్యావరణానికి ప్రమాదం... వెరసీ విశ్వనగరానికి ఈ వేస్ట్ విపత్తు పొంచి ఉంది. ఈ వ్యర్థం ఏ అనర్థానికి దారితీస్తుందో మరి! హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ (ఈఈఈ) వినియోగంతోపాటు అదే స్థాయిలో ఈ వ్యర్థాలు కూడా గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నాయి. అయితే వీటిని సరిగా రీసైక్లింగ్ చేయడంలో కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడంలేదు. కొత్త కొత్త ఫోన్లు, టీవీలు, విద్యుత్తు పరికరాలు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ప్రజలు కూడా వాటి పట్ల మక్కువ చూపుతున్నారు. దీంతో పాతవి మూలకు చేరుతున్నాయి. కొత్తవి చెంతకు చేరుతున్నాయి. వీటి రీసైక్లింగ్ కోసం రాష్ట్రంలోని 31 సంస్థలకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు ఇచ్చింది. ఇందులో ఏటా సుమారు 3.5 లక్షల టన్నుల ఈ వ్యర్థాలను రీసైకిల్ చేసే సామర్థ్యం ఉంది. అయినప్పటికి 64,635 మెట్రిక్ టన్నులే రీసైకిల్ చేస్తున్నాయి. అంటే.. 18 శాతం మేర రీసైక్లింగ్ చేస్తున్నారన్నమాట. రాష్ట్రంలో ఈ వ్యర్థాల రీసైక్లింగ్ సామర్థ్యం, సేకరణకు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. అవగాహనాలోపం కారణంగా ప్రజలు వేలాది మెట్రిక్ టన్నుల ఈ వ్యర్థాలు చెరువులు, కాల్వలు, సాధారణ చెత్తలో కలిపేస్తున్నారు. రీసైక్లింగ్ యూనిట్లను ఖచ్చితమైన ఆడిట్ చేయాల్సిన అవసరం ఉందని పీసీబీ అధికారులు పేర్కొంటున్నారు.

బంగారం, రాగి, ఇతర లోహాలు..

కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023–24లో ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ పోర్టల్‌లో 64,635 మెట్రిక్ టన్నుల ఈ వ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో బంగారం, రాగి, అల్యూమినియం, ఇనుము వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులు ఉండగా, ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్నులుగా ఉన్నాయి.

మనమే టాప్..

హైదరాబాద్‌లో ఐటీ, వైద్యం, బల్క్ డ్రగ్స్, నిర్మాణ రంగాలు, ప్రభుత్వ, ప్రైవేటు పరిపాలనా కార్యాలయాలు, ప్రపంచ స్థాయి ఉత్తమ కంపెనీ(ఎంఎన్‌సీ)ల శాఖలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ (ఈఈఈ) వినియోగంతోపాటు ఈ వ్యర్థాలు అధికంగానే ఉంటున్నాయి. అయితే వీటిని రీసైక్లింగ్ చేయడంలోనూ దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తోందని నివేదికలు చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ వ్యర్థాల నిర్వహణ మెరుగ్గానే ఉందని పీసీబీ అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో ఏటా సరాసరిన 42 వేల మెట్రిక్ టన్నులు ప్రాసెసింగ్ చేస్తుండగా మహారాష్ట్ర 18 వేల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో నిలుస్తోంది. రీసైక్లింగ్ ప్రక్రియ ఇప్పటికీ చాలావరకు అనధికారికంగా నడుస్తోందని, సరైన పద్ధతులపై అవగాహన లోపం లోపించిందని పీసీబీ అధికారులు పేర్కొంటున్నారు. పాడైన ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల సేకరణ కేంద్రాలకు అప్పగించాలనే విషయంపై ప్రజల్లో అవగాహన లేదని, ఈఈఈ సేకరణ కేంద్రాలు ఎక్కడున్నాయో తెలియక సాధారణ చెత్తలో కలిపి పారేస్తున్నారని అధికారులు గుర్తించారు.

వికసిత్ తెలంగాణ లేకుండా వికసిత్ భారత్ లేదు



- రాష్ట్రంలో యూనిఫాం డెవలప్‌మెంట్ అవసరం
- ఎఫ్‌టీసీసీఐ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

సాక్షి, సిటీ బ్యూరో: వికసిత్ తెలంగాణ లేకుండా వికసిత్ భారత్ లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. బుధవారం ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో 'తెలంగాణలో సమగ్ర పారిశ్రామిక అభివృద్ధికి రోడ్ మ్యాప్'అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయంగా పోరాడుతాం. దేశ అభివృద్ధి విషయంలో అందరితో కలసి పనిచేస్తామన్నారు. రాష్ట్రాలు అభివృద్ధిచెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేట్ వ్యవస్థ లేకుంటే దేశం నడవదని, సహజ వనరులు, మానవ వనరులను వినియోగించుకోవాలని సూచించారు. యూకే, అమెరికా వంటి దేశాల్లో పేరుమోసిన సైంటిస్టులు, వైద్యులు, వ్యాపారులు భారతీయులేనని, ఆఫ్రికా అగ్రగామి వ్యాపారులు, కాంట్రాక్టర్లు భారతీయులేనని, 70 శాతం ఆఫ్రికన్ ఎకానమీని భారతీయులు కంట్రోల్ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాలు, కంపెనీల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని పేర్కొన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా ప్రయాస్, సబ్‌కా విశ్వాస్ నినాదంతో కేంద్రం పనిచేస్తుందన్నారు.

హైదరాబద్‌లో ప్రైవేట్ జెట్‌లు

హైదరాబాద్ ఫార్మాసిటీ క్యాపిటల్, హెల్త్ క్యాపిటల్, ఐటీ హబ్‌గా నిలిచింది. బేగంపేట్ ఎయిర్ పోర్టులో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ జెట్‌లో పార్కింగ్ చేసి ఉంటాయని రాంచందర్‌రావు అన్నారు. ఇక్కడ వ్యాపార కార్యకలాపాలకు అవసరమైన ప్రత్యేక పాలసీలను రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో మూడు నుంచి నాలుగు డ్రై పోర్టులను నిర్మించాలని పేర్కొన్నారు. వరంగల్, కరీంనగర్ వంటి టైర్–2, 3 సిటీలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. 'మహారాష్ట్రలో ముంబై అభివృద్ధి చెందింది, నాందేడ్ వెనుకబడిపోయింది, తెలంగాణలో హైదరాబాద్ అభివృద్ధి చెందింది, ఆదిలాబాద్ వెనుకబడిపోయింది. ఇది అభివృద్ధి కాదు. యూనిఫాం డెవలప్‌మెంట్ కావాలి. అన్ని ప్రాంతాలు ఒకే రకంగా ముందుకెళ్లాలి. ఉపాధి, వ్యాపారాలకు గ్రామంలో భూములు అమ్ముకుని హైదరాబాద్ వచ్చేస్తున్నారు. రాజకీయ నేతలు సైతం ఇక్కడే ఉంటున్నారు'అని రాంచందర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ చైర్మన్ శ్రీనివాస్, తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

లక్ష్మీ సెహగల్ సేవలు చిరస్మరణీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా వైద్య రత్న కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 13వ వర్ధంతి సభను బుధవారం బాగ్‌లింగంపల్లిలోని వీరనారి ఐలమ్మ భవన్‌లో ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ కెప్టెన్ లక్ష్మీ సెహగల్ సేవలు చిరస్మరణీయమని, ఆమె సమరశీల యోధురాలని, అన్నింటికి మించి గొప్ప మానవతా వాది అని కొనియాడారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించారని అన్నారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ ప్రముఖ సంఘ సేవకురాలిగా, రాజ్యసభ సభ్యురాలిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని, వామపక్షాల అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళ అని గుర్తు చేశారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా పనిచేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, కేఎస్ ఆశాలత, కవిత తదితరులు పాల్గొన్నారు.



కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ తదితరులు

విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు

బాలానగర్: నేటి సమాజంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు అన్నారు. తాను విద్యాభ్యాసం చేసేటప్పుడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిటికీలు, తలుపులు కూడా సరిగ్గా ఉండేవి కాదన్నారు. బుధవారం ఫతేనగర్ డివిజన్‌లోని శాస్త్రీనగర్ మురికివాడలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఉద్భవ్ ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర డైరెక్టర్ జెనరల్ ఆఫ్ పోలీసు జితేందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్భవ్ పాఠశాల ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు అలుమ్నిగా ఏర్పాటై చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇక్కడి విద్యార్థులు ఇంగ్లిషులో చాలా బాగా మాట్లాడటాన్ని గమనించానని అన్నారు. అట్టడుగు, పేద వర్గాల అభ్యున్నతి కోసం పారిశ్రామికవేత్తలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్న పిల్లలకు వాళ్ల సామర్థ్యాన్ని తెలియజేసే క్రమంలో 'నువ్వు తప్పకుండా సాధిస్తావు, సాధించగలవు, కమాన్'అంటూ ఉత్సాహపర్చాలని సూచించారు. పేదల కోసం మరిన్ని పాఠశాలలు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఐఎమ్ఏ చారిటబుల్ ట్రస్టు సభ్యులు మురళీధర్, శివ రంగ్టా, పాఠశాల కరస్పాండెంట్ హరీశ్ కుమార్, బాలానగర్ డీసీపీ సురేష్, బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉద్భవ పాఠశాల హాలులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్

సాహిత్యంతో సామాజిక ప్రయోజనం



దాశరథి శతజయంతి సందర్భంగా జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న ప్రముఖులు

తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డా.ఎన్ బాలాచారి

ఉప్పల్: మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ తెలుగు శాఖ సంయుక్తాధ్వర్యంలో 'అక్షర శరథి దాశరథి సాహిత్య సమాలోచన'అనే అంశంపై ఒక్క రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, విశిష్ట అతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ తెలుగు శాఖాధ్యక్షుడు డా. పిల్లలమర్రి రాములు, ఆత్మీయ అతిథులుగా తెలంగాణ భాషా చైతన్య సమితి సంపాదకులు డా.విజయప్రకాశ్ హాజరయ్యారు. సదస్సులో సాహిత్య అభిమానులు ఉత్సాహంగా పాల్గొని దాశరథికి ఘనంగా నివాళులు అర్పించారు. సాహిత్యం వల్ల కలిగే సామాజిక ప్రయోజనం విద్యార్థులకు చేరేలా రాష్ట్రవ్యాప్తంగా సాహిత్య సదస్సులకు అండగా ఉంటానని బాలాచారి చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి 47 మందికి పైగా కవులు, రచయితలు, రెండు తెలుగు రాష్ట్రాల అధ్యాపకులు, ప్రముఖులు పాల్గొని పత్ర సమర్పణ చేశారు. అంతకు ముందు బోనాల పండుగ వాతావరణం తలపించే విధంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.

మహిళా సాధికారతకు ముందడుగు

అప్నా గ్రీన్ ప్రొడక్ట్స్ వ్యవస్థాపకురాలు అరుణ దారా

రాయదుర్గం: సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని అధిగమిస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, ఇందుకు నైపుణ్యం, ఆత్మగౌరవం ఎంతో అవసరమని, ఇది సామాజిక పురోగతికి కీలకమని అప్నా గ్రీన్ ప్రొడక్ట్స్ వ్యవస్థాపకురాలు అరుణ దారా అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని స్పర్శ్ హాస్పిస్ సెంటర్‌లో బుధవారం అవగాహన, సంగీత ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. జీవితంలో ధైర్యం కోల్పోయిన మహిళలను, సవాళ్లను అధిగమించేలా ప్రేరేపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందడుగేస్తున్నారని, మరిన్ని రంగాల్లో నైపుణ్యాలను సాధించడం అవసరమని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు నీరజగోదావర్తి, సేవా ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, కార్యదర్శి రాహుల్‌జైన్, స్పర్శ్ టీమ్ ప్రతినిధులు సమత, రాధిక పాల్గొన్నారు.

అలరించిన సంగీత కార్యక్రమం..

స్పర్శ్ హాస్పిస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమంలో ప్రముఖ కర్ణాటక శాస్త్రీయ సంగీత కళాకారిణి జీ విశాలాక్షి తనదైన ప్రదర్శనతో సంగీతాభిమానులను అలరించారు. హాస్పిస్ సెంటర్‌లోని రోగులు, కుటుంబ సభ్యులు, ఇతర ఔత్సాహికులు సంగీత పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం విశాలాక్షిని నిర్వాహకులు సత్కరించారు.



కర్ణాటక శాస్త్రీయ సంగీత శిల్పి విశాలాక్షి సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

బోన్ క్యాన్సర్‌ను జయించినవారికి సత్కారం

బంజారాహిల్స్: సార్కోమా అవగాహన మాసాన్ని పురస్కరించుకుని అపోలో క్యాన్సర్ సెంటర్‌లో బోన్ క్యాన్సర్‌ను జయించిన పలువురు రోగులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి.విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ సార్కోమా వ్యాధి అనేది ఎముకలు, సాఫ్ట్ టిష్యూలో ఏర్పడే అరుదైన క్యాన్సర్ అని, ప్రారంభ దశలో గుర్తిస్తే సమర్థవంతంగా నయం చేయవచ్చని తెలిపారు. ఆర్థోపెడిక్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ బోన్ క్యాన్సర్‌ను జయించిన విజేతల విజయగాథలు ఇతరుల్లో ఆశలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత అపోలో హాస్పిటల్స్ సీఈఓ తేజస్వి రావు వీరపల్లి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు బోన్ క్యాన్సర్‌పై ప్రజల దృష్టిని ఆకర్షించడానికి సహాయపడతాయన్నారు. అపోలో హాస్పిటల్స్ జూబ్లీహిల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఇలాంటి సమ్మేళనాలు బోన్ క్యాన్సర్‌ను విజయవంతంగా ఎదుర్కొనవచ్చన్న బలమైన సందేశాన్ని ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా చికిత్స పొందిన 19 ఏళ్ల యువతి తన అనుభవాన్ని పంచుకుంటూ 'చికిత్సల ప్రయాణం బాధతో నిండినదైనా, ఇప్పుడు నేను బలంగా నిలబడ్డాను. నాకు మద్దతుగా నిలిచిన వైద్యులు, కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు'అని భావోద్వేగంతో తెలిపింది. కార్యక్రమంలో ప్రముఖ అంకాలజిస్టులు, ఆర్థోపెడిక్ సర్జన్లు, వైద్య నిపుణులు డాక్టర్ నిఖిల్ సురేష్, డాక్టర్ కేజీ రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, ఆజేష్ రాజేష్ సక్సేనా, డాక్టర్ రాము దాములూరి, శ్రీనాథ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



బోన్ క్యానర్సర్‌ను జయించిన వారితో అపోలో క్యాన్సర్ సెంటర్ వైద్యులు

పరిశ్రమల డిమాండ్లకు అనుగుణంగా బోధన

– సికా డైరెక్టర్ ప్రొఫెసర్ అనిర్బన్ ఘోష్



సెమినార్‌కు హాజరైన సికా డైరెక్టర్ అనిర్బన్ ఘోష్

బంజారాహిల్స్: పరిశ్రమల డిమాండ్లకు అనుగుణంగా దూరవిద్యలో పాఠ్యాంశాలను అభివృద్ధి చేసి బోధించాలని నేతాజీ సుభాష్ చంద్రబోస్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ (సికా) డైరెక్టర్ ప్రొఫెసర్ అనిర్బన్ ఘోష్ అన్నారు. బుధవారం ఇక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సికా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. 'దేశంలో సార్వత్రిక విద్య, నాణ్యత హామీ: సామర్థ్య నిర్ధారణ'అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దూరవిద్యలో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడం, స్కిల్ కోర్సుల్లో శిక్షణను ఇస్తూ ఉద్యోగాలు కల్పించడంపై మరింత దృష్టి సారించాలని సూచించారు. నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ–2020)కి అనుగుణంగా సాంకేతికతను పెంచడం, నాణ్యతను మెరుగుపరచడం ఉన్నత విద్యకు అత్యవసరమని వివరించారు. విద్యార్థుల్లో నైపుణ్యం–శిక్షణ ఆధారిత కార్యక్రమాలపై దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ జి.పుష్పాచక్రపాణి మాట్లాడుతూ దేశంలో దూరవిద్య, ఉన్నత విద్యలో సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకోవాలని అన్నారు. దూరవిద్యా విధానంలో అభ్యసించిన వారిని ఏ విషయంలోనూ తక్కువగా అంచనా వేయొద్దని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో చదివితే దూరవిద్యతో విజయాలను సాధించవచ్చని అన్నారు. కార్యక్రమ నిర్వహణ ఆవశ్యకత, లక్ష్యాలను సికా డైరెక్టర్ శ్రీదేవి వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, డీన్స్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మైదాన ప్రాంత ఎస్టీలకు బీఆర్‌ఎస్ అన్యాయం

ధ్వజమెత్తిన మాజీమంత్రి రవీంద్ర నాయక్

పంజగుట్ట: రాష్ట్ర గిరిజన జనాభాలో కేవలం రెండు నుంచి మూడు శాతం మంది ఉన్న ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 12 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించి, ఏడు నుంచి ఎనిమిది శాతం జనాభా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా బీఆర్‌ఎస్ తీరని అన్యాయం చేసిందని మాజీమంత్రి రవీంద్ర నాయక్ ఆరోపించారు. తెలంగాణ మైదాన ప్రాంత గిరిజనుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రతినిధి రాజు నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు వారి జనాభా ప్రకారం సీట్లు కేటాయించి, మైదాన ప్రాంత గిరిజనులకు ఏడు శాతం సీట్లు ఇవ్వాలన్నారు. అదే తరహాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కూడా ఎవరి జనాభా ప్రకారం వారికి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బంజారా, లంబాడీ, ఎరుకల తెగలను ఎస్టీలుగా గుర్తించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా త్వరలోనే స్వర్ణజయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని, ఇండియన్ ట్రైబల్స్ రిజర్వేషన్ ఇంప్లిమెంటేషన్ ఫ్రంట్ తరఫునే గిరిజనుల సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు. డాక్టర్ జగన్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాండునాయక్, బానోత్ శంకర్ నాయక్, విక్రమ్, జవహర్‌లాల్, భీముడు, సదానందం తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మైదాన ప్రాంత గిరిజన నేతలు

మినీ ట్యాంక్‌బండ్‌పై చెత్తకుప్పల తొలగింపు



సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఓపెన్ జిమ్ వద్ద పేరుకున్న చెత్త (పాత చిత్రం)



ఓపెన్ జిమ్ సమీపంలో ఉన్న చెత్తను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

చైతన్యపురి: 'మినీ ట్యాంక్‌బండ్‌పై చెత్త కుప్పలు'అన్న శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ స్పందించారు. మినీట్యాంక్ బండ్‌గా గుర్తింపు పొందిన సరూర్‌నగర్ చెరువు కట్టపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల అక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరిసరాల్లో కూడా అపరిశుభ్రత నెలకొంది. ఈ మేరకు గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ స్పందించి జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందిని పిలిపించి చెత్త కుప్పలను తొలగింపజేశారు. ఓపెన్ జిమ్ పరిసరాలను కూడా శుభ్రం చేయించారు. ఇక్కడ నిత్యం వందలాది మంది వాకింగ్ చేస్తుంటారని, సాయంత్రం వేళ సేదతీరేందుకు పరిసర కాలనీల పిల్లలు, పెద్దలు మినీట్యాంక్ బండ్‌కు వస్తుంటారని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుధ్య సిబ్బందికి కార్పొరేటర్ సూచించారు.

డిప్యూటీ సీఎంను ఆహ్వానించిన ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 26న జరిగే ఆర్ట్స్ కాలేజీ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఓయూ వీసీ ప్రొ.కుమార్, ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను బుధవారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడనున్నట్లు తెలిపారు.



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఓయూ వీసీ

ఉత్తమ వార్త చిత్రాల పోటీలు-2025కు ఆహ్వానం

– రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం

హిమాయత్‌నగర్: ప్రతిభావంతులైన ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించేందుకు ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించే 'బెస్ట్ న్యూస్ ఫొటో కాంటెస్ట్–25'పోటీల్లో పాల్గొనడానికి ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం(టీఎస్‌పీజేఏ) అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.నరహరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూస్ ఫొటోగ్రఫీ రంగానికి దోహదపడిన ఫొటో జర్నలిస్టులను ప్రశంసించడానికి మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ వార్త చిత్రాల పోటీలను నిర్వహించి, ఉత్తమ ఫొటో జర్నలిస్టులను నగదు బహుమతి అందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో సత్కరిస్తున్నామని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమ తి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలతోపాటు పది కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. మూడు 8/12 కలర్ ఫొటోలు లేదా బ్లాక్ అండ్ వైట్ ఫొటోలను ఆగస్టు 10వ తేదీలోగా టి.ఎస్.పి.జె.ఎ. రాష్ట్ర కార్యాలయం, దేశోద్ధార క భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్‌కు పంపాలని సూచించారు. 19న హైదరాబాద్‌లో ఉత్తమ వార్త ఛాయాచిత్రాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.



రెయిన్ డే వేడుకలు

- బీవీబీపీ స్కూల్లో చిన్నారుల సందడి

ఫిలింనగర్: వర్షంలో తడవడం అంటే ఎవరికి ఇష్టం ఉండదు! మరీ ముఖ్యంగా చిన్నారులైతే ఉత్సాహంగా కేరింతలు కొడతారు. ఈ నేపథ్యంలో నగరంలోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్లో రెయిన్ డే వేడుకలు నిర్వహించారు. ప్రీ–ప్రైమరీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వర్షాకాలంలో ధరించే, వినియోగించే ఉత్పత్తులను ప్రదర్శిస్తూ ఉల్లాసంగా గడిపారు. ముఖ్యంగా చిన్నారులు ధరించిన రంగురంగుల రెయిన్ కోట్లు, చేతబట్టిన గొడుగులు ఇంద్రధనస్సును తలపించింది. పలు రకాల రంగుల దుస్తులలో చిన్నారులు కనువిందుచేశారు.

బూమ్ బాక్స్.. మెలోడీ మిక్స్..

సాక్షి, సిటీబ్యూరో: గత జనవరిలో నగరంలో నిర్వహించిన సంగీతోత్సవం విజయం సాధించిన నేపథ్యంలో యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్‌తో కలిసి ప్రముఖ బ్రాండ్ రాయల్ స్టాగ్ నిర్వహించే సంగీత కార్యక్రమం బూమ్‌బాక్స్ మరోసారి సంగీతాభిమానులను అలరించనుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దఫా మెలోడీ హిప్–హాప్‌లను కలిపే ఒక ప్రత్యేక ఫార్మాట్‌తో ఈ మ్యూజిక్ ఫెస్టివల్ జరుగుతుందని, పెహ్లా జైసీ బాత్ నహీ, హువాడీ, మొహబ్బత్ ఇంతిహాన్ వంటి ట్రాక్‌లతో నగరవాసులను ఆకట్టుకోనుందని వెల్లడించింది. నిఖితా గాంధీ, డీనో జేమ్స్ వంటి ప్రముఖ సంగీత కళాకారులు పాల్గొనున్నారని తెలియజేశారు.

26న 'ది ఛాలెంజ్డ్ చిల్డ్రన్ నీడ్'

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ త్రివేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్మతః లోపాలతో సవాళ్లు ఎదుర్కొంటున్న చిన్నారుల కోసం ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. వారి విద్యార్జనలో ఎదురవుతోన్న అవరోధాలపై నగరంలోని రామకృష్ణ మఠంలో ఈ నెల 26న ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా నగరానికి చెందిన ప్రతిష్టాత్మక ప్రొఫెసర్ బీవీ చలపతిరావు ఎండోమెంట్ ఉపన్యాసాన్ని ప్రఖ్యాత దేవ్‌నార్ అంధుల పాఠశాల స్థాపకుడు, పద్మశ్రీ డాక్టర్ ఏ.సాయిబాబా గౌడ్ అందించనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. 'ది ఛాలెంజ్డ్ చిల్డ్రన్ నీడ్ ఎంపాటీ – సపోర్ట్ : ఫ్రమ్ విలేజ్ స్కూల్స్ టు ఐఐఎంస్ ఇన్ ఇండియా – ఏ కేస్ స్టడీ' అంశంపై సాయంత్రం 5గంటలకు ప్రసంగం ఉంటుంది. అదే విధంగా 'దేవనార్' చిన్నారులు, సాధించినా విజయాలపై ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తారు.





వర్షాకాలం కేవలం సీజన్ మాత్రమే కాదు, రోజువారీగా మనం చూసే అనేక ప్రదేశాలను సినిమాటిక్ ఫ్రేమ్‌లుగా మార్చేసే కాలం. చినుకులు పడుతున్న వేళ.. తడిగా మెరిసే వారసత్వ కట్టడాల నుంచి పొగమంచులో మునిగే సరస్సుల వరకు, నగర ఫొటోగ్రాఫర్‌లకు కలల కాన్వాస్‌గా మారుతుంది. ఇటీవలి కాలంలో మొబైల్ ఫొటోగ్రఫీకి కూడా క్రేజ్ ఏర్పడింది. పలువురు ఔత్సాహికులు తామేమీ తక్కువ కాదన్నట్లు తమ క్రియేటివిటీకి పదును పెడుతున్నారు. మొబైల్ కెమెరాలతో అద్భుతాలు సృష్టిస్తున్నారు. జల్లుల తర్వాత ప్రాణం పోసుకునే స్పష్టమైన పచ్చదనాన్ని చూడాలన్నా, వర్షాల సమయంలో హైదరాబాద్ అందాలను కెమెరాలో బంధించాలన్నా ఇదే రైట్ టైమ్ అంటున్నారు ఫొటోగ్రఫీ నిపుణులు.

- సాక్షి, సిటీబ్యూరో

మెమరీ రాక్స్ మాన్సూన్ క్లిక్స్..

సాధారణంగా వర్షాల సమయంలో ఔట్ డోర్ ఫొటోల గురించి ఆలోచించరు. కానీ సరైన వ్యూహంతో.. కాస్తంత ఉత్సాహంతో ఆలోచిస్తే, వర్షాకాలం ఫొటోగ్రాఫర్లకు అద్భుతమైన సీజన్ అవుతుందని మాన్సూన్ ఫొటోగ్రఫీ నిపుణులు చెబుతున్నారు. అవసరాన్ని బట్టి కొంచెం తడవడానికి సిద్ధంగా ఉండాలి. ఈ సాహసోపేతమైన నిర్ణయంతో వర్షాకాలంలో అద్భుతమైన దృశ్యాలను ఆవిష్కరించవచ్చని సూచిస్తున్నారు. ఇందుకోసం నిపుణులు అందిస్తున్న సూచనల సారాంశం ఇది..

నగరంలో ఎక్కడెక్కడంటే..

గండిపేటలోని ఉస్మాన్ సాగర్ వర్షాకాలంలో పూర్తిగా నిండిపోతుంది. మబ్బులు పట్టిన ఆకాశాన్ని, పచ్చని పరిసరాలను ప్రతిబింబించే నీటితో.. జలకళతో సరస్సు తీరప్రాంతం విస్తృత ఫ్రేమ్‌లను అందిస్తాయి. అదే గండిపేటలోని తారామతి బరాదరి కూడా వర్షం తర్వాత కొత్త అందాలను సంతరించుకుంటుంది. అయితే ఇక్కడ ఫొటో షూట్‌లకు అనుమతి అవసరం. అలాగే మౌలాలీ హిల్ కూడా. దాదాపు 614 మీటర్ల ఎత్తులో ఉన్న రాతి శిఖరంపైకి 484 మెట్లను ఎక్కితే.. అక్కడి నుంచి చూస్తే తడిసిన రాళ్లు మెరుస్తూ పొగలు కమ్మిన మేఘాల మధ్య కనువిందు చేసే నగర దృశ్యం ఫొటోలకు జీవం పోస్తుంది.

మరిన్ని ప్రదేశాలు..

ఆగా ఖాన్ ట్రస్ట్ పునరుద్ధరించిన కుతుబ్ షాహి టూంబ్స్‌లోని గోపురాలు మార్గాలు వర్షాల తర్వాత నాచు, నీటి కుంటలతో మెరుస్తాయి. బంజారాహిల్స్‌లోని అతిపెద్ద ఉద్యానవనం వర్షం తర్వాత ఆకుపచ్చ అడవిగా మారుతుంది. తరచూ దారుల వెంట కనిపించే నెమళ్లు, ఇతర వన్యప్రాణులు ఫొటోగ్రాఫర్లకు గొప్ప వనరుల్ని అందిస్తాయి. సికింద్రాబాద్‌లోని గోపురం లాంటి కొండ మహేంద్ర హిల్స్ అత్యంత విశాలమైన సూర్యోదయ ప్రదేశాల్లో ఒకటి. వర్షాకాలం దట్టమైన మేఘాల మధ్య ఆకాశంలో విస్తరించిన కాంతిని అద్భుతంగా బంధించవచ్చు. దట్టమైన పచ్చదనం, అప్పుడప్పుడు ఆనకట్టపైకి వచ్చే పొగమంచుతో హిమాయత్ సాగర్ ఆకట్టుకుంటుంది. ఇక్కడ స్థానిక పక్షి పరిశీలకులు హెరాన్లు, ఇతర వర్షాకాల జాతుల వీక్షణకు ఆసక్తి చూపిస్తారు. అలాగే నార్సింగి– గండిపేట రోడ్డు వైడ్ యాంగిల్ లేదా డ్రోన్ క్యాప్చర్స్‌కు అనువైన బహిరంగ ప్రదేశాలివి. ట్రావెల్ ఫొటోగ్రఫీకి ఇది అనుకూలమైన డ్రైవ్.

ఇవే కాక.. హైదరాబాద్‌లో వర్షాకాలపు అందాలను బంధించడానికి గోల్కొండ కోట, చౌమహల్లా ప్యాలెస్, మీర్ ఆలం ట్యాంక్, మాసబ్ ట్యాంక్ వంటి జలాశయాలను.. ప్రకృతి, వన్యప్రాణుల ఫొటోగ్రఫీ కోసం నెహ్రూ జూలాజికల్ పార్క్, షామీర్‌పేట్ డీర్ పార్క్ ఎంచుకోవచ్చు. కాస్తంత దూరం ప్రయాణించ గలిగితే.. అనంతగిరి హిల్స్, నాగార్జున సాగర్ డ్యామ్ వంటి ప్రదేశాలు ఉన్నాయి.

నగరంలో ఫొటోగ్రఫీకి అనువుగా ప్రదేశాలు

- జ్ఞాపకాలను పదిలపరుచుకుంటున్న ఔత్సాహికులు
- మొబైల్ ఫొటోగ్రఫీలో సత్తాచాటుతున్న యువత
- చినుకుల్లో 'సిత్రం'గా నగరంలోని అందాల ప్రదేశాలు
- నేచర్ ఫొట్రోగాఫర్లకు చేతినిండా పని కల్పించే సీజన్
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు

ఔత్సాహికులకు సూచనలు..



- ఫొటో తీసేటప్పుడు పొడిగా ఉండటానికి తగినంత అనువుగా ఉన్న ప్రదేశాలను వెతుక్కోవాలి.
- రుతుపవనాల సమయంలో మృదువైన, వెచ్చని కాంతిని అందించే సమయాన్ని (తెల్లవారుజాము, మధ్యాహ్నం) ఫొటోగ్రఫీకి గోల్డెన్ అవర్‌గా అభివర్ణించవచ్చు.
- వర్షాకాలంలో సూక్ష్మమైన, సాధారణంగా గుర్తించలేని విషయాలు ప్రాణం పోసుకుంటాయి. ఇది మ్యాక్రో ఫొటోగ్రఫీకి మంచి సమయం. స్పైడర్‌వెబ్, పూలు, ఆకులపై వర్షపు చినుకులను కెమెరాతో పసిగట్టి వాటిని బంధించడంలో మ్యాక్రో లెన్స్ మిస్ చేయవద్దు.
- అద్భుతమైన ఇంద్రధనస్సులు, మెరుస్తున్న చారికలను ఉత్పత్తి చేసే ఈ కాలం ఛాయా చిత్రాలకు గొప్ప వనరు.
- కెమెరా షట్టర్ వేగంతో ప్రయోగం చేయాలి. జలపాతాల్లో ప్రవహించే నీటిని బంధించడానికి, వర్షపు చినుకులు, చిమ్ముతున్న నీటిని పట్టుకోడానికి వేగవంతమైన షట్టర్స్ ఉపయోగించాలి.
- వర్షం నుంచి రక్షణకు కెమెరా ఎక్విప్‌మెంట్‌ను రెయిన్ కవర్ లేదా ప్లాస్టిక్ బ్యాగ్‌తో చుట్టి ఉంచుకోవాలి.
- తేమ కారణంగా బ్యాటరీ త్వరగా డ్రెయిన్ అవుతుంది. కాబట్టి అదనపు బ్యాటరీలను తీసుకెళ్లాలి.
- కెమెరాను ఉపయోగించనప్పుడు డ్రై బాక్స్‌లో క్యారీ చేయాలి.



- వర్షపు బిందువులు సాధారణ దృశ్యాలను పెయింటింగ్స్‌లా మార్చగలవు. కిటికీ అద్దాలపై పడే వర్షం అందమైన, సహజమైన నమూనా ప్రతిబింబాలను సృష్టిస్తుంది.
- బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రఫీ రుతుపవనాలకు తగినది. ప్రకృతి దృశ్యాలు, తడి ఉపరితలాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.





నగరంలో ఫుఫు డిష్..

ఫుఫు డిష్.. వినడానికి కాస్త వెరైటీగా ఉన్నా.. ప్రస్తుతం నగరంలో ఈ డిష్ ప్రాచుర్యం పొందుతోంది.. ఫుఫు అనేది పశ్చిమ ఆఫ్రికా దేశస్తుల ఫేవరెట్ ఆహారం.. ఆ దేశంలో పుట్టిన ఈ సాధారణ ఆహారం.. కాసావా (కర్రపెండలం), యమ్ లేదా ఆకుపచ్చని అరటి వంటి దుంప కూరగాయలతో తయారు చేస్తారు. ప్రధానంగా కాసావాని యుకా/మానియోక్ అని కూడా పిలుస్తారు. పశ్చిమ ఆఫ్రికాతో పాటు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఇది ప్రధాన ఆహారంగా ఉపయోగంచే పిండి పదార్థాలు కలిగిన దుంప కూరగాయ. దీని శాస్త్రీయ నామం మనిహోట్ ఎస్కులెంటా. ప్రస్తుతం ఈ వంటకం నగరంలో ఆఫ్రికా వాసులు నివాసముండే పలు ప్రాంతాల్లోని రెస్టారెంట్లలో ఆహారప్రియులను అలరిస్తోంది.

- శ్రీనగర్‌కాలనీ





ఫుఫు అనే వంటకాన్ని యమ్/ ఆకుపచ్చని **అరటి** వంటి దుంపను తొక్క(వెరడు) తీసి చిన్నచిన్న ముక్కలుగా కట్‌చేసి నానబెడతారు.. అనంతరం బాగా ఉడకబెట్టడం ద్వారా దీనిని తయారు చేస్తారు.. దీనిని మిక్సీలో మెత్తగా పిండి చేసి మృదువైన, సాగే ముద్దగా తయారుచేస్తారు. ఈ మిశ్రమాన్ని పెనంమీదపోసి రుచికి సరిపడా ఉప్పువేసి ఉడికిస్తారు. ఈ వేడివేడి మిశ్రమాన్ని రాగిముద్దలా చేసి చికెన్, మటన్ గ్రేవీ, ఫిష్ గ్రేవీలతో పాటు వెజిటబుల్ గ్రేవీలతోనూ.. సాధారణ సూప్‌లు, సాస్‌చ చిక్కుళ్లు లేదా ఇతర వంటకాలతో పాటు సైడ్ డిష్‌గానూ తింటారు.

పోషక విలువలు...

ఆఫ్రికన్ వాసులకు ఎంతో ఇష్టమైన ఈ ఫుఫు డిష్‌లో అనేక పోషక విలువలు దాగివున్నాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, విటమిన్–సీ తో కూడిన అనేక విటమిన్లు, ఖనిజాలతో పాటు క్యాలరీలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇది బరువు పెరగడం, జీర్ణక్రియ, రక్త ప్రసరణకు సహాయపడుతుందట. అంతేకాదు జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు గుండె ఆరోగ్యానికి ప్రయోజనకారంగా ఉంటుందట. అయితే కాసావాలో సైనోజెనిక్ గ్లూకోసైడ్లు ఉంటాయి. దీనిని సరిగ్గా ఉడికించకపోతే సైనైడ్‌ను విడుదల చేస్తుందట. పూర్తిగా ఉడికించడం వల్ల ఇందులోని టాక్సిన్లు పూర్తిగా నశించి ఆరోగ్యప్రయోజనాలను అందజేస్తుంది.



- ప్రపంచంలోనే మొట్టమొదటి టెక్స్‌టైల్ హెరిటేజ్ వాక్
- అబ్బురపరిచిన చేతివృత్తుల ప్రదర్శన
- అంజలి రుూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

ఆకట్టుకున్న భారత్ భ్రమణ్

రాయదుర్గం : చేతివృత్తి కళాకారులు రూపొందించిన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.. 'భారత్ భ్రమణ్' పేరుతో అంజలి రుూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే మొట్టమొదటి టెక్స్‌టైల్ హెరిటేజ్ వాక్ హైదరాబాద్ నాలెడ్జి సిటీలో నిర్వహించారు. ఐటీసీ కోహినూర్ ఈ అద్భుతమైన ప్రదర్శనకు బుధవారం వేదికైంది. ప్రముఖ డిజైనర్ అంజలి రుూ ఆధ్వర్యంలో లాభాపేక్ష లేని సంస్థగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చేతివృత్తి కళాకారులు రూపొందించిన పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. భారతదేశ వస్త్ర సంప్రదాయాన్ని ప్రచారం చేస్తూనే.. చేతివృత్తి కళాకారులను తమ సంస్థ ప్రోత్సహిస్తున్నట్లు అంజలి పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా తమ సంస్థ పనిచేస్తుందని, అంతరించిపోతున్న భారతీయ కళలను, వృత్తులను, వస్త్ర ఉత్పత్తులను అనుసంధానిస్తూ.. అభ్యాసన, ఆచరణ ద్వారా సమగ్ర, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను సృష్టించేందుకు పలు కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఐదువేల మంది కళాకారులు, సూపర్ మోడల్స్, విద్యార్థులు, కథకులు 90 రోజుల వాక్‌లో భాగస్వాములవుతారని తెలిపారు. ముఖ్యంగా కోటలు, రాజభవనాలు, ఇతర వారసత్వ ప్రదేశాలతో పాటు నేత, ఎంబ్రాయిడరీ వంటి వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు వివరించారు. చాందిని, కృష్ణయ్య, సుధార్కర్, గజం గోవర్ధన్‌జీ, సస్మితపాండా, జ్యోతిర్మయి, పృథ్వీరాజ్, రాజేష్ పాల్గొన్నారు.



క్లుప్తంగా...

పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపును ఆపించండి

కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసిన తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు నిండక ముందే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం నుంచి ఏపీ నీళ్లను తరలించుకోవడం పట్ల తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. సాగర్, పులిచింతల జలాశయాలు నిండే వరకు శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు తీసుకోకుండా ఏపీని వెంటనే నిలువరించాలని కోరుతూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) ఎండీ అంజాద్ హుస్సేన్ మంగళవారం లేఖ రాశారు. సాగర్ నిండడానికి 70.51 టీఎంసీలు, పులిచింతల నిండడానికి 28.89 టీఎంసీలు కలిపి మొత్తం 99.4 టీఎంసీలు జలాలు అవసరం కాగా, శ్రీశైలం నుంచి ఏపీ నీళ్లను తరలించుకుంటుండటంతో రెండు జలాశయాలు నిండటం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కృష్ణా ట్రిబ్యునల్-1 తీర్పు ప్రకారం శ్రీశైలం నుంచి ఏటా 19 టీఎంసీల తరలింపునకు మాత్రమే ఏపీకి అనుమతి ఉండగా, ఈ నెల 6 నుంచి 18 వరకు ఏకంగా 20.66 టీఎంసీలను పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ తరలించుకుందని ఫిర్యాదు చేశారు. దీనికి అదనంగా మల్యాల నుంచి హంద్రీనీవాకి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను కూడా ఏపీ చేపట్టిందని బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. శ్రీశైలం జలాశయానికి వచ్చే మిగులు జలాలపై సాగర్, కేడీఎస్ ఆయకట్టుకు తొలి హక్కు ఉందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ నీళ్లను తరలించడం అక్రమమన్నారు.

మా నాయినను చంపేశా!

- పోలీసులకు ఫోన్‌చేసి చెప్పిన కొడుకు
- తన వాటా భూమి తన పేరున చేయడం లేదని కక్ష


నిందితుడు రవి (ఫైల్)

తాండూరు రూరల్: వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన ఓ కొడుకు తండ్రి పాలిట యముడయ్యాడు. పక్షవాతంతో మంచం పట్టిన తండ్రిని మద్యం మత్తులో కనికరం లేకుండా కాటికి పంపాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గొట్లపల్లిలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ నగేశ్, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి హన్మంత్ (70), నర్సమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు. అందరికీ వివాహాలు కావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. వీరిలో మూడో కొడుకు రవి మేస్త్రీ పని చేస్తుంటాడు. ఇతని భార్య అనారోగ్యంతో మృతిచెందింది. రవికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. తల్లి చనిపోవడంతో నాయనమ్మ వీరి ఆలనాపాలనా చూస్తోంది. మద్యానికి బానిసైన రవి తన వాటా భూమిని తన పేరున చేయమంటూ కొంతకాలంగా తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. తాగుడుకు బానిసైన కొడుకు భూమిని ఎవరికైనా అమ్మేస్తే.. తల్లిలేని పిల్లలు ఆగమవుతారనే ఉద్దేశంతో రవికి పట్టా చేయడం లేదు. దీంతో కక్ష పెంచుకున్న నిందితుడు మంగళవారం రాత్రి తల్లితో గొడవపడి గాయపర్చాడు. చేయి విరిగిపోవడంతో నర్సమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రవి మంచంపై పడుకున్న తండ్రి హన్మంతు తలపై సుత్తితో మోది హత్య చేశాడు. అనంతరం 'మా నాయినను చంపేశా'అని 100కు డయల్ చేసి చెప్పాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి హన్మంతు చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

31న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ఉద్యోగ విరమణ

ఎఫ్ఏసీగా అలగు వర్షిణి

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.శరత్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆయన స్థానంలో ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి వీఎస్ అలగు వర్షిణిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీకి 18.51 టీఎంసీలు చాలు!

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపించారు. కేసీ కాల్వలకి 39.9 టీఎంసీలను కృష్ణా ట్రిబ్యునల్-1 కేటాయించగా.. నిప్పులవాగు, గాలేరు, కుందు వాగుల నుంచి వచ్చి చేరే మరో 5.2 టీఎంసీలతో కలిపి కాల్వకి మొత్తం నీటి లభ్యత 45.1 టీఎంసీలకు పెరిగిందని ఆయన వివరించారు. మరోవైపు ఈ కాల్వ ద్వారా ఏపీ ఏటా సగటున 54 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకుంటోందని అభ్యంతరం తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్-1 తీర్పుకి విరుద్ధంగా కేసీ కాల్వలకు సుంకేసుల బరాజ్‌తో పాటుగా ముచ్చుమర్రి, మల్యాల, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్-ఎస్కేప్ చానల్ అనే మూడు వనరుల నుంచి నీళ్లను తరలించుకుంటున్నారని తప్పుబట్టారు. కేసీ కాల్వ కింద పంటల సాగుకు శాస్త్రీయ పద్ధతిలో 18.51 టీఎంసీల జలాలు సరిపోతాయని తెలిపారు. కాగా.. గురు, శుక్రవారాల్లో కూడా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ తన వాదనలు వినిపించనుంది.

ఇంటింటా నిజం.. తల్లికి మోసం

రూ.15 వేలకు బదులు రూ.8,850 మాత్రమే పడ్డాయి

మొదటి ఏడాది ఒక్కరికీ ఇవ్వని చంద్రబాబు ప్రభుత్వం

- రెండో ఏడాది 30 లక్షల మందికి ఎగరగొట్టారు
- మిగిలిన వారికి రూ.13 వేలిస్తామని ప్రకటించారు
- చివరికి రూ.8వేలు, రూ.9వేలు మాత్రమే జమ చేసి చేతులు దులుపుకొన్నారు..


రూ.8,850 మాత్రమే పడ్డాయి

ఈమె పేరు కొండేటి మరియమ్మ. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు. ఈమె కుమారుడు అవినాష్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. తల్లికి వందనం పథకం ద్వారా కేవలం రూ.8,850 మాత్రమే ఆమె ఖాతాలో పడ్డాయి. ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వ వాటా అని, త్వరలో కేంద్ర ప్రభుత్వ వాటా జమ అవుతుందని సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని ఆమె చెబుతోంది. అందరితోపాటు తనకూ సమానంగా డబ్బులు పడ్డాయంటోంది. ఇప్పుడు రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇలా చేశారేమిటని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

సాక్షి, అమరావతి: 'అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్‌ను అమలు చేసి పేదరికాన్ని పారదోలుతాం.. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తాం..'అని చెప్పి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన చంద్రబాబు కూటమి సర్కారు ఆ తర్వాత ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. ప్రధానంగా తల్లికి వందనం పథకం గురించి చంద్రబాబు, లోకేశ్ సహా టీడీపీ శ్రేణులు ఊరూరా, ఇంటింటా ఊదరగొట్టాయి. అధికారం చేపట్టాక తొలి ఏడాది ఈ పథకాన్ని అమలు చేయకుండా మోసం చేయడం ఒక ఎత్తు అయితే.. రెండో ఏడాది అరకొరగా అమలు చేస్తూ.. చాలా గొప్పగా అమలు చేశామని డప్పు కొట్టు కోవడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి.. అమలు దశకు వచ్చే సరికి రూ.13 వేలే అన్నారు. వివిధ సాకులు చూపి ఏకంగా 30 లక్షల మందికి ఎగ్గొట్టారు. తీరా మిగిలిన లబ్ధిదారులకు కేవలం రూ.8-9 వేలు మాత్రమే ఖాతాల్లో వేసి.. అంతా ఇచ్చేశామంటున్నారు. ఇదొక్కటే కాదు.. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేశామని, ఇక వీటి గురించి ఎవరైనా మాట్లాడితే వారి నాలుక మందమే అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు దబాయిస్తూ మాట్లాడారు. 'తల్లికి వందనం'అమలుపై ఊరూరా మహిళలు, విద్యార్థులు రగిలిపోతున్నారు. కొన్ని ఊళ్లలో అయితే ఏకంగా స్కూలు మొత్తం మీద ఒక్కరికి కూడా ఇవ్వలేదు. నిరుపేదలకు సైతం ఎగనామం పెట్టేశారు. చెప్పిందేమిటి.. చేసిందేమిటి.. అంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెడ్‌మాస్టర్లు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తమకెందుకు డబ్బులు పడలేదంటూ నిలదీస్తున్నారు. 'మేమేం చేయలేం. అలా ఎందుకు జరిగిందో మాకు తెలీదు'అంటూ చేతులెత్తేస్తున్నారు. కనీసం ఇస్తామన్న రూ.13 వేలు కూడా ఎందుకు ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతుంటే సమాధానం చెప్పేవారే లేరు. నష్టపోయిన వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులే కావడం గమనార్హం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగదు జమ కాకుండానే మెసేజ్‌లు

రాష్ట్రంలో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు యూడైజ్‌లో నమోదైన విద్యార్థులు 87.42 లక్షల మంది ఉంటే తొలి ఏడాది అందరికీ తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టింది. రెండో ఏడాది లబ్ధిదారుల్లో 30 లక్షల మందిని తప్పించింది. మిగిలిన వారికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పినా.. ఆ తర్వాత రూ.13 వేలే అంది. తర్వాత సాకు దొరికిన చోటల్లా నిధుల్లో కోతపెట్టింది. కొందరికి రూ.9 వేలు, ఇంకొందరికి రూ.8 వేలు, మరికొందరికి రూ.8,800 చొప్పున ఇచ్చి, మిగిలిన డబ్బును ఎగవేసింది. ఇలా రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన లబ్ధిదారుల్లో కొందరికి నగదు జమ కాగా, ఇంకొందరికి నగదు జమ కాకుండానే నిధులు జమ చేశామని వారి ఫోన్లకు సంక్షిప్త (ఎస్ఎంఎస్) సందేశాలను పంపిస్తోంది. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

శరవేగంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ


పూర్తయ్యాక భవనం ఇలా ఉంటుంది

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయి వసతులతో రైల్వే స్టేషన్ల రూపురేఖలను ఆధునికీకరిస్తున్న రైల్వే శాఖ.. అమృత్‌భారత్ పథకంలో భాగంగా నగరంలోని ఉప్పుగూడ రైల్వే స్టేషన్ పనులను శరవేగంగా చేస్తోంది. ఈ ఏడాది డిసెంబరు ముగిసేనాటికి.. ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి వసతులతో సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్లను రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి స్థాయి ఆధునికీకరణతో పునర్నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కొన్ని స్టేషన్ల పనులు జరుగుతుండగా.. కరీంనగర్, వరంగల్, బేగంపేట రైల్వే స్టేషన్ల భవనాలను రైల్వే శాఖ ప్రారంభించింది. ఇటీవలే పాతనగరంలోని ఉప్పుగూడ స్టేషన్ పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది. రూ.26.81 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. దీన్ని డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనుల్లో వేగం పెంచారు. ఈ స్టేషన్ నుంచి రోజుకు సగటున 5వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.

ఆధునిక వసతులివి..

పునర్నిర్మాణంలో భాగంగా.. ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో నూతన ముఖద్వారం ఏర్పాటు చేస్తున్నారు. 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, 2 ప్యాసింజర్ లిఫ్టులు, 2 ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. కాన్కోర్స్ – వెయిటింగ్ హాళ్లను నిర్మిస్తున్నారు. దివ్యాంగులకు అనుకూలంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన టీజీఓ నేతలు

సాక్షి, హైదరాబాద్: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రీఆర్గనైజేషన్ ప్రక్రియను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీజీఓ ప్రతినిధి బృందంతో కలిశారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రీఆర్గనైజేషన్ ఫైలు సంబంధిత మంత్రి పేషీ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉందని, వేగంగా పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డులు, పదోన్నతులు, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, సాధారణ బదిలీలు, శాఖాపరమైన పదోన్నతుల కమిటీ తదితర అంశాలను మంత్రికి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. మంత్రివర్గ సమావేశంలో ఈ అంశాలను చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధి బృందంలో టీజీఓ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్యామ్, ఉపాధ్యక్షుడు నరహరిరావు, అధ్యక్షుడు ఎ.కిషన్, రామారావు, శ్రీరామ్ రెడ్డి తదితరులున్నారు.

జేఎన్‌టీయూలో జగడం

- తారస్థాయికి చేరిన అవినీతి ఆరోపణలు
- అటానమస్ అఫైర్స్ డైరెక్టర్ తొలగింపు
- 92 అటానమస్ కాలేజీల్లో అఫ్లియేషన్‌పై విమర్శలు

సాక్షి, హైదరాబాద్ : జేఎన్‌టీయూహెచ్‌లో అంతర్గత వివాదం తారస్థాయికి చేరింది. అవినీతి ఆరోపణలతో వర్సిటీ ప్రతిష్ట దిగజారే పరిస్థితి తలెత్తింది. అటానమస్ కాలేజీల అకడమిక్ ఆడిట్ డైరెక్టర్‌ను బోధకుడిగా బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అసలేం జరిగింది?

జేఎన్‌టీయూహెచ్ ప్రతి ఏటా 140 ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇస్తుంది. ఇందులో 92 అటానమస్ కాలేజీలున్నాయి. గత ఏడాది అటానమస్, నాన్-అటానమస్‌ను విడగొట్టి ఇద్దరు డైరెక్టర్లను నియమించారు. అటానమస్ కాలేజీలకు ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. వీటికి గుర్తింపు ఇచ్చే ముందు వర్సిటీ తనిఖీ బృందం ప్రతీ కాలేజీని పరిశీలిస్తుంది. చాలా కాలేజీల్లో సరైన ఫ్యాకల్టీ లేదని గుర్తించారు. మౌలిక వసతులు మచ్చుకైనా లేదని తనిఖీల కమిటీ నిగ్గు తేల్చినట్టు తెలిసింది. కంప్యూటర్ సైన్స్, ఎమర్జింగ్ వంటి కోర్సుల్లో చాలా కాలేజీల్లో అర్హులైన సిబ్బందే లేరని గుర్తించారు. ఇన్ని లోపాలున్నా అన్ని కాలేజీలకు జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ఈ వ్యవహారంపై అన్నివర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారితో ప్రత్యక్ష సంబంధాలున్న వ్యక్తి కన్సల్టెన్సీ ఏర్పాటు చేయడం, అక్కడ లావాదేవీలు నిర్వహించడం విమర్శలకు దారి తీసింది. వీటిపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అటానమస్ అకడమిక్ డైరెక్టర్ బదిలీ అవ్వడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

అసలు కథ పక్కదారి

తనిఖీ బృందాల నివేదిక ప్రకారం కొన్ని కాలేజీలకు జేఎన్‌టీయూహెచ్ జూన్‌లో నోటీసులు జారీ చేసింది. లోపాలు సరిచేసుకునేందుకు సమయం ఇచ్చినట్టు అధికారులూ చెప్పారు. కానీ ఎక్కడా కొత్తగా అర్హులైన ఫ్యాకల్టీని నియమించినట్టు గానీ, మౌలిక వసతులు కల్పించిన దాఖలాల్లేవు. వీటన్నింటికీ గుర్తింపు మాత్రం ఇచ్చారు. ప్రైవేటు కన్సల్టెన్సీ ద్వారా ఆ కాలేజీలు బేరం కుదుర్చుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. తీగ లాగితే డొంకంతా కదులుతుందన్న ఆందోళనతో ఉన్నతాధికారులు అటానమస్ డైరెక్టర్‌ను బదిలీ చేసి, చేతులు దులుపుకున్నట్టు తెలుస్తోంది. ఆరోపణలపై మాత్రం వీసీ ఇంత వరకూ నోరు మెదపలేదు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ప్రొఫెసర్లు తక్కువగా ఉన్నారనే బదిలీ

అటానమస్, నాన్-అటానమస్‌ను కలిపేశాం. బోధనకు ప్రొఫెసర్ల కొరత ఉందనే ఇలా చేశాం. రవీందర్‌రెడ్డిని సబ్జెక్టు బోధనకు వినియోగిస్తున్నాం. విద్యార్థుల నుంచి వచ్చిన ఆరోపణలకు, బదిలీకి సంబంధం లేదు. తనపై విద్యార్థులు నిరాధార ఆరోపణలు చేశారని రవీందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుపుతాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు రిజిస్ట్రార్


ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

త్వరలో గంగాధర మండలానికి విద్యాశాఖ బృందం

'బడి సంచి భారం కాదిక్కడ'కథనానికి స్పందన

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: విద్యార్థుల స్కూలు బ్యాగుల బరువు తగ్గిస్తున్న తీరుపై 'బడి సంచి భారం కాదిక్కడ'అన్న శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించారు. స్కూలుకు వెళ్లి ఎంఈవోను ఏనుగు ప్రభాకర్‌రావు, విద్యార్థులను అభినందించి సన్మానించారు. అనంతరం పాఠశాలలో పాత విధానంలో స్కూలు బ్యాగులకు, ప్రస్తుతం అమలవుతున్న స్కూలు బ్యాగులకు తేడా తెలుసుకున్నారు. గంగాధర మండలంలో అమలవుతోన్న ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సత్యం వెంటనే డైరెక్టర్ నికోలస్‌తో మాట్లాడారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే ఓ బృందాన్ని అధ్యయనం కోసం గంగాధర పాఠశాలలకు పంపిస్తా అని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితోనూ ఫోన్‌లో మాట్లాడి జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని కోరగా.. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ విధానాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కూడా తాను కోరతానని హామీ ఇచ్చారు.

పోలవరం వద్ద 651 టీఎంసీల మిగులు!

- తెరపైకి ఏపీ సరికొత్త వాదన
- కేవలం 200 టీఎంసీల తరలింపునకే గోదావరి–బనకచర్ల అనుసంధానం
- బొల్లపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 200 టీఎంసీలకు పెంచుకోవచ్చు
- బనకచర్లపై సీడబ్ల్యూసీ కొర్రీలకు ఏపీ ప్రభుత్వ సమాధానాలు

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు వద్ద 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 2,191 టీఎంసీల నీరు ఉండగా, 50 శాతం వార్షిక నీటిలభ్యత విశ్లేషణల ఆధారంగా అక్కడ తమ రాష్ట్రానికి 2,842 టీఎంసీల నీరు ఉందని ఏపీ ప్రభుత్వం సరికొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చింది. 75 శాతం లభ్యత ఆధారంగా గోదావరి ట్రిబ్యునల్ జరిపిన కేటాయింపుల మేరకు ఎగువ రాష్ట్రాలన్నీ తమ నీటి వాటాలను పూర్తిస్థాయిలో వాడుకున్నా, పోలవరం వద్ద 651 (2842–2191) టీఎంసీల మిగులు జలాల లభ్యత ఉంటుందని అభిప్రాయపడింది. తాము కేవలం 200 టీఎంసీల జలాల తరలింపు కోసమే గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును ప్రతిపాదించినట్టు స్పష్టం చేసింది. బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలు తమ ప్రస్తుత అవసరాల మేరకు నీటిని వాడుకున్నా ఏటా సగటున 3,000 టీఎంసీల గోదావరి నీరు పోలవరం ప్రాజెక్టు నుంచి సముద్రంలోకి కలిసిపోతున్నాయని పేర్కొంది. ఏపీ ప్రభుత్వం సమర్పించిన బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫిజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)పై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) లేవనెత్తిన అభ్యంతరాలు, సందేహాలకు వివరణలిస్తూ ఈ నెల 14న ఆ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. 75 శాతం లభ్యత ఆధారంగా గోదావరి ట్రిబ్యునల్ జరిపిన కేటాయింపుల మేరకు బేసిన్ పరిధిలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు తమ పూర్తి వాటా జలాలను వాడుకుంటే బనకచర్ల ప్రాజెక్టుకు నీటిలభ్యత ఉంటుందా? అని సీడబ్ల్యూసీ లేవనెత్తిన ప్రశ్నకు ఏపీ ప్రభుత్వం పైవిధంగా బదులిచ్చింది.

వరద జలాలంటే.. మిగులు జలాలే

బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 18,000 క్యూసెక్కుల వరద జలాలను కృష్ణానది (ప్రకాశం బరాజ్)కి తరలిస్తామని ఏపీ ప్రతిపాదించగా.. వరద జలాలను ఎలా నిర్వచిస్తారు? ఎలా లెక్కిస్తారు? ఈ మేరకు వరద జలాల తరలింపునకు గోదావరి ట్రిబ్యునల్ తీర్పు అంగీకరిస్తుందా? అని సీడబ్ల్యూసీ కొర్రీలు వేయగా, వరద జలాలు అంటే మిగులు జలాలే అని ఏపీ కొత్త భాష్యం చెప్పింది. 75 శాతం లభ్యత ఆధారంగా బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలకు కేటాయించిన జలాలు పోగా అదనంగా లభ్యతలోకి ఉండే మిగులు జలాలే వరద జలాలని ఏపీ సర్కారు నిర్వచించింది. గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు అనుగుణంగానే బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించినట్టు సమర్థించుకుంది. 75 శాతం లభ్యతకు మించి పోలవరం వద్ద ఉండే జలాలను మిగులు వరద జలాలుగా పరిగణించినట్టు తెలిపింది. గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో వరద జలాల ప్రస్తావన లేకపోవడం.. బేసిన్‌లో చివరి రాష్ట్రాలకు ఆ జలాలను వాడుకునే హక్కును నిషేధించదని స్పష్టం చేసింది. 2000–2015 మధ్యలోని 15 ఏళ్లలో ఏటా పోలవరం ప్రాజెక్టు నుంచి సముద్రంలోకి విడుదల చేసిన జలాల మొత్తం నుంచి ఎగువ రాష్ట్రాలు వాడుకోని జలాల వాటాను తీసివేయగా, మిగిలే జలాలను లెక్కించి వాటి లభ్యత ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించినట్టు తెలిపింది.

నిల్వ సామర్థ్యం 200 టీఎంసీలకు పెంచుకోవచ్చు..

ప్రణాళిక సంఘం సిఫారసుల ఆధారంగా 2010లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సాగునీటి ప్రాజెక్టులు కనీసం 75 శాతం లక్ష్యాలను సాధించాల్సి ఉంటుందని, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రోజూ 2 టీఎంసీల జలాలను తరలించాలనే లక్ష్యాన్ని ఎలా సాధిస్తారని సీడబ్ల్యూసీ ఏపీని ప్రశ్నించింది. 75–50 శాతం లభ్యత ఆధారంగా పోలవరం ప్రాజెక్టు వద్ద అందుబాటులో ఉండే మిగులు వరద జలాల ఆధారంగా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించామని, బొల్లపల్లి వద్ద నిర్మించనున్న జలాశయంలోకి 152 టీఎంసీలను నిల్వ చేస్తామని ఏపీ బదులిచ్చింది. నాలుగు వైపులా కొండలు ఉండడంతో ఈ జలాశయ సామర్థ్యాన్ని 200 టీఎంసీలకు పెంచుకోవచ్చని తెలిపింది.

మా రాష్ట్రానికి వచ్చే జలాలు మావే...

ఎగువ రాష్ట్రాలన్నీ తమ వాటా జలాలను వాడుకోగా తమ భూభాగంలోకి ప్రవేశించే మిగులు జలాలను వాడుకునే హక్కు బేసిన్‌లో చివరి రాష్ట్రంగా తమకు ఉంటుందని ఏపీ స్పష్టం చేసింది. న్యాయపరంగా, హైడ్రాలజికల్ సిద్ధాంతాల పరంగా బేసిన్ చివరి రాష్ట్రాలు మిగులు జలాలను వాడుకోవడం ఎగువ రాష్ట్రాల హక్కులను హరించినట్టు కాదని తేల్చి చెప్పింది.

'గురుకుల' విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఎస్సీ గురుకుల సొసైటీలోని జోనల్ అధికారులు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురుకుల విద్యాసంస్థల్లో పర్యావరణ అవగాహన పెంపొందించేందుకు మిషన్ ప్రకృతి పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా సంస్థతో కలిసి చేపట్టేందుకు మంత్రి సమక్షంలో ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా ప్రతినిధులు అనిల్‌కుమార్, శివప్రసాద్‌రెడ్డి ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల్లో ఇకపై అల్యూమినియం పాత్రలకు బదులుగా స్టీల్ పాత్రలు వినియోగించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాళ్ల సర్వీస్ నిబంధనలకు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరిస్తామన్నారు. ఇకపై హాస్టళ్లను స్వయంగా తనిఖీ చేస్తానని చెప్పారు. ప్రతి హాస్టల్‌లో 15 రోజులకోసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్య బృందం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

గ్రంథాలయాల్లో నిషేధాజ్ఞలా?

- ప్రజాపాలన పేరిట ఎమర్జెన్సీ రోజులు తెస్తున్నారు: హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తున్న అన్ని వర్గాలపై ఆంక్షలు విధిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగర గ్రంథాలయంలో నిషేధాజ్ఞలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయడంపై ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆందోళనపై నిషేధం విధించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ఆంక్షల పర్వం ప్రస్తుతం లైబ్రరీల దాకా విస్తరించిందన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాపాలనలో ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తెస్తోందన్నారు. ఎన్నికల సమయంలో లైబ్రరీల చుట్టూ తిరిగి రాజకీయాలు చేసిన కాంగ్రెస్, రాహుల్ గాంధీని తీసుకువచ్చి బూటకపు హామీలు ఇచ్చిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రంథాలయాల్లో పోలీసులతో దాడులు చేయిస్తూ విద్యార్థులు, నిరుద్యోగులపై దౌర్జన్యాలకు పాల్పడుతోందని హరీశ్‌రావు విమర్శించారు. సురక్షిత తాగునీటి సరఫరాలో గ్రామీణ నీటి సరఫరా విభాగం, పారిశుద్ధ్యం నిర్వహణలో పంచాయతీ రాజ్ విభాగం, నష్ట నివారణ చర్యలు చేపట్టడంలో రెవెన్యూ విభాగం విఫలమయ్యాయని హరీశ్‌రావు విమర్శించారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామంలో డయేరియా బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్

- కేంద్రం పంపిన ఎరువులను కొందరు పక్కదారి పట్టిస్తున్నారు.
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. కేంద్రం పంపిన ఎరువులను రాష్ట్రంలోని కొంతమంది బ్లాక్ మార్కెట్‌కి మళ్లిస్తున్నారన్న ఆరోపణలున్నాయని, ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్ తదితర ప్రాంతాల్లో కూడా కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఫెర్టిలైజర్ షాపులతో కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూరియా కొరత లేకుండా, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేస్తోందన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెట్, ఎరువుల డీలర్లపై పర్యవేక్షణ లేమి, సరఫరా వ్యవస్థపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం.. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రబీ సీజన్‌లో తెలంగాణ అవసరాలకు మించి 2.5 లక్షల టన్నులు అదనంగా యూరియాను కేంద్రం సరఫరా చేసిందన్నారు. అయినా రాష్ట్రంలోని ఫెర్టిలైజర్ షాపుల ముందు రైతులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయని మండిపడ్డారు. కాగా, బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇటీవల బీజేపీని బద్నాం చేయడానికి కొన్ని శక్తులు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు.

నేడు ఢిల్లీకి రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు గురువారం ఉదయం మరోసారి ఢిల్లీ వెళ్తున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ఆయన అపాయింట్‌మెంట్ ఫిక్స్ కావడంతో ఈ పర్యటన చోటు చేసుకోనుంది. రాష్ట్రానికి సంబంధించిన రాజకీయ వ్యవహారాలు, స్థానిక ఎన్నికలు, రాష్ట్ర పార్టీలో నెలకొన్న పరిస్థితులు తదితర అంశాలను అమిత్‌షా దృష్టికి ఆయన తీసుకెళ్లనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈనెల 26న మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాలు, 27న గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు.


ఎస్ఈడబ్ల్యూ కంపెనీల్లో ఈడీ సోదాలు

33 బ్యాంకు అకౌంట్లు.. రూ.120 కోట్ల విలువైన ఆస్తులు సీజ్

సాక్షి, హైదరాబాద్ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు నగరంలోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 33 బ్యాంకు అకౌంట్లు, రూ.120 కోట్ల మేరకు ఆస్తులను సీజ్ చేశారు. ఈడీ అధికారులు బుధవారం ఆ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని బ్యాంకులను మోసగించిన కేసుకు సంబంధించి ఎస్ఈడబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎస్ఐఎల్), ప్రసాద్ అండ్ కంపెనీ (ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్) ప్రైవేట్ లిమిటెడ్ గ్రూపు కంపెనీలు వాటి ప్రమోటర్లు, డైరెక్టర్ల కార్యాలయాల్లోనూ మంగళవారం సోదాలు నిర్వహించారు. కాంట్రాక్టు తీసుకున్న సంస్థ స్వతహాగా తన వాటాను వినియోగించాల్సి ఉన్నా.. అలా చేయకుండా బ్యాంకు రుణాన్ని తన వాటాగా చూపించిందని వివరించింది. ఈ విధంగా రూ. 603.68 కోట్లను తమ సొంతానికి మళ్లించుకుని తీసుకున్న కాంట్రాక్టు పనిని పూర్తిచేయలేదు. తమ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని, అందులో నిధులు మళ్లింపునకు సంబంధించినవి, ఆస్తుల కొనుగోళ్లు, ఆర్థిక డాక్యుమెంట్లను ఈ సందర్భంగా సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ సంస్థలకు సంబంధించిన ప్రమోటర్లు, డైరెక్టర్లు, వారి కుటుంబ సభ్యుల ఖాతాలను స్తంభింప చేశామన్నారు.

యూరియా కొరత లేదు

హనుమకొండ డీఏవో రవీందర్‌సింగ్


యూరియా నిల్వల రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఏవో బి.రవీందర్‌సింగ్, తదితరులు

కమలాపూర్: హనుమకొండ జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి బి.రవీందర్ సింగ్ స్పష్టం చేశారు. యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. 'పోలీస్ పహారాలో యూరియా పంపిణీ'శీర్షికతో సాక్షి ప్రధాన సంచికలో బుధవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. ఆయన బుధవారం ఏడీఏ ఆదిరెడ్డి, ఏవో (టెక్నికల్) కమలాకర్, ఏవో రాజ్‌కుమార్, ఏఈవో రహీంతో కలిసి హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని పీఏసీఎస్ గోదాంను సందర్శించారు. రికార్డులు, యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం డీఏవో రవీందర్‌సింగ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటి వరకు 5,798 బస్తాల యూరియా సరఫరా చేశామన్నారు. బుధవారం కూడా పీఏసీఎస్‌కు 888 బస్తాల యూరియా వచ్చిందని తెలిపారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 3,511 బస్తాల యూరియా ఉందని పేర్కొన్నారు.



- స్టూడెంట్ అవార్డ్స్ సెమీఫైనల్లో ఏపీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి
- ఆస్కార్ ప్రదానం చేసే అకాడెమీ సంస్థ ఆధ్వర్యంలో పోటీలు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో కమ్యునికేషన్ డిజైన్ ఫైనల్ ఇయర్ చదువుతున్న లావణ్య లోధి
- 'వీన్స్ ఆఫ్ గ్రేస్' షార్ట్ ఫిల్మ్ కి ప్రశంసల జల్లు
- ప్రపంచవ్యాప్తంగా మొత్తం 3,127 చిత్రాల్లో సెమీస్ కి చేరిన లావణ్య షార్ట్ ఫిల్మ్
- అక్టోబర్ 6న అవార్డుల ప్రదానోత్సవం
- విజయం సాధిస్తానంటూ ధీమా వ్యక్తం చేస్తున్న లావణ్య లోధి

వందకి పైగా దేశాలు... 3,127 షార్ట్‌ఫిల్మ్‌లు... 80 మందికిపైగా న్యాయ నిర్ణేతలు... 30 రోజుల పాటు వడపోతలు.. చివరికి మిగిలింది... 60 షార్ట్ ఫిల్మ్‌లు... అందులో ఒకటి భారత్‌కు చెందిన... అదీ... ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌ఐడీ కి చెందిన విద్యార్థి లావణ్య లోధది కావడం విశేషం. ప్రపంచ ప్రఖ్యాత అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52వ స్టూడెంట్ అకాడెమీ అవార్డుల్లో లావణ్య తన సత్తా చాటింది. తాను తీసిన 'వీన్స్ ఆఫ్ గ్రేస్' చిత్రం టాప్-15లో చోటు దక్కించుకుంది.

• స్టూడెంట్స్ ఆస్కార్ అవార్డ్

ఆస్కార్ దారిలో తెలుగమ్మాయ్!

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...

కాన్పూర్‌కి చెందిన లావణ్య లోధి తండ్రి ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కావడంతో ప్రతి మూడేళ్లకో సారి బదిలీలతో దేశంలోని పలు ప్రాంతాల్లో పెరుగుతూ విద్యనభ్యసించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలతో కలగలసి లావణ్య జీవితం సాగింది. తల్లి కథక్ నాట్య గురువు. ఆమె నుంచే లావణ్యకు నాట్యం, కథలపై ఆసక్తి పెరిగింది. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంలో రాణించడంతో పాటు.. సృజనాత్మకంగా బొమ్మలు గీస్తుండటంతో.. తల్లిదండ్రులు ప్రోత్సహించి.. లావణ్యని డిజైన్ రంగం వైపు అడుగులు వేయించారు. 2020లో ప్లస్-2 చదువుతున్న సమయంలో పరీక్ష పే చర్చా కార్యక్రమంలో లావణ్య కళాకృతుల గురించి ప్రధాని మోదీ ఆమెని ప్రశంసలతో ముంచెత్తారు. అనంతరం.. ఆమె విజయవాడ సమీపంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడీ)విద్యా సంస్థలో కమ్యునికేషన్ డిజైన్‌లో చేరింది. యానిమేషన్, మూవింగ్ ఇమేజెస్‌పై నిరంతరం తన డిజైన్లతో పరిశోధనలు చేస్తూనే ఉంది. ప్రస్తుతం ఎన్‌ఐడీలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. లావణ్య చదువులోనే కాకుండా.. యానిమేషన్, ఫిల్మ్ లాంగ్వేజ్, విజువల్ స్టోరీ టెల్లింగ్, సౌండ్, కల్చరల్ స్టడీస్‌లోనూ డ్యాన్సర్‌గా, స్టోరీటెల్లర్‌గా రాణిస్తూ.. యూనివర్సిటీల్లో అనేక బహుమతులు గెలుచుకుంది.

విన్స్ ఆఫ్ గ్రేస్ కథేంటీ..?

లావణ్య తీసిన ఈ షార్ట్ ఫిల్మ్‌లో ఎలాంటి సంభాషణలూ లేవు. కేవలం సంగీతం, నృత్యం, అభినయమే కథకు బలం. ఇది ఒక చిన్న యానిమేటెడ్ చిత్రం. ఒక యువతి తాను జీవితాన్ని కోల్పోయి సంస్కృతికి దూరమైపోతుంది. ఈ సమయంలో ఆమె తల్లి తనకు నేర్పినట్లుగా నాట్యం నేర్చుకోవడం మొదలు పెడుతుంది. ఆమెకు గుర్తుకొచ్చే పాత జ్ఞాపకాలన్నీ.. ఒక్కొక్కటిగా కనుమరుగవుతూ.. ఆ అమ్మాయి.. నృత్యంతో పాటుగా.. కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుంటుంది. సూర్యాస్తమయ సమయంలో ఓ ప్రశాంతమైన టెర్రస్‌పై కనిపించేలా ఈ చిత్రాన్ని లావణ్య ఆవిష్కరించింది. మనం ఎవరం.. ఎక్కడి నుంచి వచ్చాం.. మన సంస్కృతి సంప్రదాయాల్ని గుర్తు చేసుకునేందుకు నడక, నడత, నాట్యం ఎలా సహాయపడతాయన్నదే విన్స్ ఆఫ్ గ్రేస్.



అమ్మకే అంకితం!

నా నాట్య గురువు అమ్మకు ఈ విన్స్ ఆఫ్ గ్రేస్‌ని అంకితం చేస్తున్నాను. ఎన్‌ఐడీ సహకారంతో.. ఈ షార్ట్‌ఫిల్మ్‌ని పూర్తి నమ్మకంతో తీసి.. ఎస్‌ఏఏ అవార్డులకు పంపించాను. సెమీఫైనల్‌కు చేరుకోవడం చాలా ఆనందంగా ఉంది. అక్టోబర్ 6న ఒక్క అవార్డు అయినా.. విన్స్ ఆఫ్ గ్రేస్‌కు వస్తుందని కచ్చితంగా నమ్ముతున్నాను. ప్రతి ఒక్కరి జీవిత వారసత్వ కథే నా చిత్రం. ఆస్కార్ వేదికపై విన్స్ ఆఫ్ గ్రేస్ ప్రదర్శితమయ్యేలా భారతీయులందరి ఆశీస్సులు నాకు కావాలి.

అన్నీ ఆమే!

ఈ చిత్రానికి ఫిల్మ్ మేకర్, యానిమేషన్ ఫిల్మ్ డిజైనర్, మొత్తం సినిమా స్క్రిప్ట్, సౌండ్ డిజైన్, క్యారెక్టర్ డిజైన్, యానిమేషన్.. ఇలా అన్నీ.. లావణ్యే కావడం విశేషం. లావణ్యకు మెంటార్‌గా ఎన్‌ఐడీ కమ్యునికేషన్ డిజైన్ హెడ్ శ్రీకాకుళం జిల్లాకు చెందిన కూర్మనాథం వ్యవహరించగా.. ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు డా.అభిషేక్, గౌతమ్ చక్రవర్తి, జనాంతిక్ శుక్లా, బినితా దేశాయ్, శేఖర్ ముఖర్జీ సహకారం అందించారు.

ఈ అవార్డులు ఎవరిస్తారంటే.?

ఆస్కార్ అవార్డులు అందించే.. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆధ్వర్యంలో స్టూడెంట్ అకాడమీ అవార్డులు (ఎస్ఏఏ) అందిస్తారు. ఈ ఏడాది 52వ అవార్డుల్ని రోలెక్స్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. మే 18 వరకూ ఎంట్రీలు తీసుకున్నారు. ప్రపంచంలోని వివిధ డిజైన్ ఇనిస్టిట్యూట్స్, యానిమేషన్, ఫిల్మ్ ఇనిస్టిట్యూట్స్‌లలో విద్యనభ్యసిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్ విద్యార్థుల్ని చిత్ర రంగంలో ప్రోత్సహించేందుకు ఏటా ఈ అవార్డుల్ని అందిస్తుంటారు.

ఏయే విభాగాలంటే..

యానిమేషన్, డాక్యుమెంటరీ, లైవ్ యాక్షన్ కథనం, ప్రయోగాత్మక షార్ట్‌ఫిల్ములని ఆస్కార్.ఆర్గ్‌కు ఆన్‌లైన్‌లో పంపగా.... మే 18 వరకూ అందిన షార్ట్‌ఫిలింలని తీసుకున్నారు. ఆ తర్వాత వడపోత నిర్వహించారు. మొత్తం 3,127 చిత్రాల్లో వివిధ దశల్లో వడపోతలు నిర్వహించి.. సెమీఫైనల్‌కు 60 చిత్రాల్ని ఎంపిక చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 6న న్యూయార్క్‌లోని జీగ్‌ఫెల్డ్ బాల్ రూమ్‌లో జరిగే న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా.. ఈ 60 చిత్రాల్లో టాప్ చిత్రాల్ని ప్రకటించి.. అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. స్టూడెంట్ అకాడమీ అవార్డు గెలుచుకున్న చిత్రాలు యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్, లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ లేదా డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 98వ ఆస్కార్ అవార్డుల కోసం పోటీ పడేందుకు అర్హత సాధిస్తాయి.

– కరుకోల గోపీకిశోర్ రాజా,
సాక్షి ప్రతినిధి,
విశాఖపట్నం

• నేడు సెల్ఫ్‌కేర్ డే

మనకు మనమే స్పెషల్...



మనల్ని మనం ప్రేమించుకోకపోతే.. లోకం కూడా ప్రేమించదు! ఇదే సెల్ఫ్‌కేర్.. ఇదేమీ సెల్ఫిష్ థింగ్ కాదు.. అత్యవసరంగా ఆచరించాల్సిన అంశం! దీని మీద అవగాహన కల్పించడం కోసమే ఏటా జులై 24న **ఇంటర్నేషనల్ సెల్ఫ్‌కేర్ డే**గా ప్రకటించింది ఇంటర్నేషనల్ సెల్ఫ్‌కేర్ ఫౌండేషన్. ఈ సందర్భంగా...

వర్కింగ్ విమెన్‌తో పాటు గృహిణులు కూడా తమ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెట్టి.. కుటుంబ బాగోగుల మీద శ్రద్ధ పెడుతుంటారు. అలాంటి వాళ్లు ఒక్కసారిగా అనారోగ్యంతో మంచం ఎక్కితే.. మంచినీళ్లు అందించే దిక్కు ఉండదు. అందుకే అందరి గురించి ఆలోచించే ముందు తమ గురించి తాము ఆలోచించుకోవడం ముఖ్యం. సెల్ఫ్‌కేర్ సెల్ఫిష్ థింగ్ కాదు.. అత్యంత శ్రద్ధ పెట్టాల్సిన అంశం. దాని మీద అవగాహన కల్పించడానికే ఇంటర్నేషనల్ సెల్ఫ్‌కేర్ ఫౌండేషన్ 2011లో జులై 24ను ఇంటర్నేషనల్ సెల్ఫ్‌కేర్ డేగా ప్రకటించింది. నెలల్లో జులై ఏడో నెల.. తేదీ 24.. ఇది 24/7ను సూచిస్తుంది. అంటే ప్రతి ఒక్కరు ఏడాదికి ఈ ఒక్కరోజు కాకుండా 24 గంటలూ తమ మానసిక, శారీరక ఆరోగ్యం మీద శ్రద్ధపెడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుకరించాలని దీని అర్థం.. స్ఫూర్తి కూడా! అందుకే జూన్ 24 నుంచి జులై 24 వరకు సెల్ఫ్‌కేర్ మంత్‌నూ సెలబ్రేట్ చేస్తోంది సంస్థ. దీనితో సెల్ఫ్‌కేర్ ప్రయోజనాల మీద అవగాహన కల్పిస్తూ, సెల్ఫ్‌కేర్ ప్రాక్టీసెస్‌ను ప్రోత్సహిస్తోంది.

దేశంలో వివాహితలు వారంలో నగటున 44 గంటల కంటే ఎక్కువ సమయాన్నే జీతభత్యాలు, కనీసం గుర్తింపు కూడా లేని ఇంటి పనుల కోసం వెచ్చిస్తున్నారని న్యూస్‌రీల్ ఆసియా నివేదిక చెబుతోంది. అదే పెళ్లయిన మగవాళ్లు మాత్రం వారానికి అయిదు గంటలే వెచ్చిస్తున్నారట. ఈ లెక్కన సంసార బాధ్యతల్లో ఉన్న పురుషులతో పోల్చుకుంటే స్త్రీలు రోజుకు కనీసం గంటన్నర కూడా వ్యక్తిగత శ్రద్ధ కోసం కేటాయించట్లేదట. వ్యక్తిగత శ్రద్ధ లోపించడం వల్ల అది మహిళల్లో ఒత్తిడి, అలసటను పెంచి.. వాళ్లు నలుగురితో కలిసే కార్యక్రమాల్లో పాలుపంచుకోకుండా చేస్తోందని, అది మహిళల మానసిక, శారీరక ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపెడుతుందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

థీమ్... సెల్ఫ్‌కేర్ అనేది కేవలం శారీరక, మానసిక ఆరోగ్య క్రమశిక్షణే కాదు ఆర్థిక, ఆధ్యాత్మిక, సామాజిక, పర్యావరణ క్రమశిక్షణ కూడా అంటున్నారు నిపుణులు. కాబట్టి ఉదయం ఆరింటికి మొదలై రాత్రి ఒంటిగంటకు ముగిసే రోజులో కూడా అందరూ ముఖ్యంగా స్త్రీలు తమ కోసం తగినంత సమయాన్ని తప్పకుండా కేటాయించుకోవాలని చెబుతున్నారు. ఎందుకంటే ఇంట్లో మహిళలు బాగుంటేనే ఇంట్లో వాళ్లు క్షేమంగా ఉంటారు. ఇల్లు క్షేమంగా ఉంటే సమాజ సంక్షేమం ఖాయం!

• రంగస్థలం

అలా కుందేలు ఓడిపోయింది... ఆ తరువాత..?



రన్నింగ్ రేస్‌లో తాబేలుతో పోటీ పడి అతి ఆత్మవిశ్వాసంతో ఓడిపోయిన కుందేలు కథ గురించి మనకు తెలిసిందే. మరి ఆ తరువాత ఏం జరిగింది?'

కుందేలులో ఆత్మవిశ్వాసం లేకుండా పోయిందా? తాబేలులో వోవర్ కాన్ఫిడెన్స్ వచ్చేసిందా?

'అసలు ఆ తరువాత ఏం జరిగింది?' అనే పాయింట్‌పై వచ్చిన నాటకం....సూపర్ టార్టైస్, సూపర్ రాబిట్. హాంగ్ సెంగ్‌హీ దర్శకత్వం వహించిన ఈ కొరియన్ నాటకాన్ని ఇటీవల బెంగళూరులో ప్రదర్శించారు.

'ఒకసారి వచ్చిన ఫలితంతో వ్యక్తులను నిర్ణయించలేము అని చెప్పడానికి, పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఈ నాటకం ఉపయోగపడుతుంది' అంటున్నాడు హాంగ్.

కొరియన్ డ్రామా కంపెనీ ఈ నాటకాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శిస్తోంది.

'భారతీయ ప్రేక్షకుల ముందు నటించాలనే నా కల నెరవేరింది' అంటున్నాడు కిమ్ మిన్-కి అనే ఆర్టిస్ట్.

హాస్యాన్ని, సందేశాన్ని మిళితం చేస్తూ సాగే ఈ నాటకంలో సంగీతం, రిథమ్స్ ప్రత్యేక ఆకర్షణ.

నాటకంలో అత్యంత ఆకట్టుకునే ఘట్టం? డైరెక్టర్ హాంగ్ ఇలా అంటున్నాడు...

'చివరి ఘట్టం. నేనేమిటి? నేను నిజంగా కోరుకునేది ఏమిటి? అని నాటకంలో ప్రతి క్యారెక్టర్ తనను తాను తెలుసుకుంటుంది'.

బులియన్ జులై 23న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	99,780
బంగారం (22 క్యారెట్లు)	91,465
వెండి	1,15,770
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,03,790
బంగారం (22 క్యారెట్లు)	93,800
వెండి	1,19,200
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,02,330
బంగారం (22 క్యారెట్లు)	93,800
వెండి	1,29,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,03,790
బంగారం (22 క్యారెట్లు)	96,610
వెండి	1,19,200
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	99,750
బంగారం (22 క్యారెట్లు)	91,770
వెండి	1,17,800
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,02,320
బంగారం (22 క్యారెట్లు)	93,800
వెండి	1,29,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు

• మన(సు)లో మాట

విడాకులు మీ సమస్యకు పరిష్కారం కాదు!

నా పెళ్లయి సంవత్సరం అవుతోంది. నేనూ నా భర్త, బెంగళూరులో ఉంటాం. మాది పెద్దలు కుదిర్చిన సంబంధం. మా అమ్మా నాన్నలకు ఒక్కదాన్నే కూతురిని. నన్ను మా ఇంట్లో ఒక రాకుమారి లాగా పెంచారు. కానీ మా అత్త గారింట్లో నన్నెవరూ పట్టించుకోవడం లేదు! నా భర్త వాళ్ళ అమ్మ మాటకే విలువ ఇస్తాడు. నామాట అసలు వినడు. అత్త గారు అక్కడి నుంచే మా ఆయనకి డైరెక్షన్ ఇస్తుంది. మా ఆయన సంపాదించే డబ్బులు ఖర్చు పెట్టుకునే స్వాతంత్ర్యం నాకు లేదు. ఆయన కూడా ఏదైనా కొనమంటే... ఉన్నదానితో సర్దుకోమంటాడు. మా అత్తగారింటికి వెళితే నాకు ఊపిరి ఆడనట్లు అనిపిస్తుంది. ఆమె టార్చర్ తట్టుకోలేక వాళ్ళ ఇంటికి వెళ్ళడం కూడా మానేశాను. ఈ విషయం గురించి కూడా మా మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాకు ఇంక వేరే సమస్యలు ఏం లేవు. మా అమ్మ వాళ్ళేమో విడాకులు తీసుకుని వచ్చేయమని అంటున్నారు. నా భర్త మంచి వాడు, తనంటే నాకు చాలా ఇష్టం. నా భర్తని నేను పూర్తిగా కంట్రోల్‌లోకి తెచ్చుకోవడానికి ఏదైనా ఉపాయం చెప్పి నా కాపురాన్ని నిలబెట్టండి!

- **ప్రత్యూష**, బెంగుళూరు

ఇది మీ ఒక్కరి సమస్యే కాదు! చాలా కుటుంబాల్లో అత్త – కోడలు మధ్య ఈ రకమైన ఒత్తిళ్లు, మనస్పర్ధలు సర్వసాధారణం! కొడుక్కి గడ్డాలు, మీసాలు వచ్చినా తన వేలు పట్టుకుని నడిపించాలి అనుకుంటారు చాలా మంది తల్లి తండ్రులు. ఆ ఆలోచనలతోనే వారి జీవితాల్లో అతిగా జోక్యం చేసుకుంటారు. ఇవన్నీ పెళ్లికి ముందు బాగానే ఉన్నా, పెళ్లి తర్వాతే అసలు సమస్య మొదలవుతుంది. పిల్లల జీవితంలో ఒక భాగస్వామి వచ్చాక వారి నిర్ణయాలను వారే తీసుకునే స్వాతంత్ర్యం ఇవ్వాలి తల్లిదండ్రులు! ఒక తల్లి తన కోడలిని బయట నుంచి వచ్చిన అమ్మాయిలా కాకుండా, తన కొడుకుతో జీవితాంతం తోడుండే, ఒక ముఖ్యమైన వ్యక్తిగా గుర్తించాలి, అలాగే భర్త కూడా తన కుటుంబాన్ని వదిలి వచ్చిన భార్యని గౌరవించడం కనీస బాధ్యత అని గుర్తుపెట్టుకోవాలి.. ఇక్కడ మనం గమనించాల్సింది. 'సంసారం అంటే ఒకరినొకరు నియంత్రించుకోవడం కాదు, ఒకరి నొకరు అర్థం చేసుకోవడం'. మీ భర్త తన తల్లిని గౌరవించడం తప్పు కాదు. కానీ అదే సమయంలో మిమ్మల్ని చిన్నచూపు చూడడం కూడా తగదు. మీరు మీ భర్తను పూర్తిగా మీ నియంత్రణలోకి తీసుకోవాలనుకోవడం కూడా సరైనది కాదు. మీ తల్లితండ్రులు మీకు విడాకులు తీసుకోమని సలహా ఇస్తున్నా, అది ఈ సమస్యకి పరిష్కారం కానే కాదు! మీరు ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. మీ భర్తని గెలవాలంటే ముందు మీరు మీ అత్తగారిని గెలవాలి. అది ద్వేషంతో కాదు, ప్రేమతో, మీ మృదువైన మాటలతో కాస్త తెలివిగా ఆలోచించి, ఆమెతో మాట్లాడితే ఆమె కూడా కొన్ని విషయాల్లో మారతారు. నిదానంగా ఆమె కూడా మీ సమస్యను అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను కోపంతో, ఆవేశంతో కాకుండా ఓపికతో, చాకచక్యంగా ఎదుర్కొంటే మీ సమస్య పరిష్కారమవుతుంది. మీ భర్తతో మీరు ప్రశాంతంగా ఈ అంశం గురించి మాట్లాడండి. ఏదైనా అవసరం అయితే మీకు సహాయం చేయడం కోసం మానసిక నిపుణులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ. మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

• టెక్నో ఉమెన్

టెస్లా టు థింకింగ్ మెషిన్ ల్యాబ్



మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన మీరా మురాటీ ఎలక్ట్రిక్ కార్ కంపెనీ 'టెస్లా'లో ప్రాడక్ట్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ తరువాత వర్చువల్ రియాలిటీ స్టార్టప్ 'లిప్ మోషన్'లో పనిచేసింది. 2016లో 'ఓపెన్ ఏఐ'లో చేరిన మీరా రకరకాల ప్రాజెక్ట్‌లలో ముఖ్యపాత్ర పోషించింది. అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్స్, టూల్స్ డెవలప్‌మెంట్‌లో కీలకంగా వ్యవహరించింది. చీఫ్ టెక్నికల్ ఆఫీసర్(సీటీవో) స్థాయికి చేరింది.

సొంతంగా కంపెనీ స్థాపించాలనేది మీరా మురాటీ చిరకాల స్వప్నం

'డూ మై వోన్ ఎక్స్‌ప్లోరేషన్' అంటూ గత సంవత్సరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్‌ఏఐ'కి గుడ్‌బై చెప్పింది.

ఫిబ్రవరి 2025లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) స్టార్టప్ 'థింకింగ్ మెషిన్ ల్యాబ్' మొదలుపెట్టింది.

'టెస్లా'ను విడిచి 'ఓపెన్‌ఏఐ'లో చేరడానికి గల కారణం గురించి ఇలా చెప్పింది...

'నాకు మొదటి నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయాలపై ఆసక్తి. ఆ ఆసక్తితోనే ఓపెన్ ఏఐలో చేరాను'. 'ఓపెన్‌ఏఐ'ని విజయవంతం చేయడంలో మీరా కృషి ఎంతో ఉంది.

అల్బేనియాలో పుట్టిన మీరా మురాటీకి చిన్నప్పటి నుంచి సాంకేతిక విషయాలపై అమితమైన ఆసక్తి. 'జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు సాంకేతిక జ్ఞానం పరిష్కారం చూపుతుంది' అంటుంది మీరా.

టెక్నాలజీలో హాటెస్ట్ కంపెనీలుగా పేరున్న 'టెస్లా' 'ఓపెన్‌ఏఐ'లను వదులుకొని సొంత స్టార్టప్ మొదలుపెట్టిన మీరా మురాటీ విజయం సాధించగలదా?

'కచ్చితంగా' అని చెప్పడానికి ఎన్నో సంస్థలలో ఆమె అద్భుతమైన, ప్రతిభావంతమైన పనితీరు బలమైన సాక్ష్యం.

• సమ్‌థింగ్ స్పెషల్

స్లమ్ డాగ్స్ బాగుండాలీ





మన దేశంలోని తొలి పెయింటింగ్ డాగ్‌గా 'వావ్' అని ప్రశంసలు అందుకుంటోంది డాలీ. నోట్లో బ్రష్‌తో కాన్వాస్‌పై చకచకా బొమ్మలు వేస్తూ కళాప్రియులను అబ్బురపరుస్తోంది.

డాలీ వేసే చిత్రాలకు ప్రయోజనం, పరమార్థం ఉన్నాయి. ఈ చిత్రాలను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బును వీధికుక్కల సంక్షేమానికి ఉపయోగించాలనుకుంటున్నారు.

'నా భర్త ఆర్టిస్ట్. ఒకరోజు ఆయన దగ్గర నుంచి బ్రష్‌ను లాక్కుంది డాలీ. అలా ఎందుకు చేసిందో మొదట మాకు అర్థం కాలేదు. ఎప్పుడు చూసినా బొమ్మలు వేస్తుంటాడు అనే విసుగుతో చేసిందా? బొమ్మలు నేర్చుకోవాలనే తన మనసులో మాటను వ్యక్తీకరించడానికి అలా చేసిందా? అని ఆలోచిస్తున్నప్పుడు బ్రష్‌తో కాన్వాస్ దగ్గరకు పరుగెత్తుకు వెళ్లింది. బొమ్మలు వేయడం నేర్చుకోవాలనే తన కోరికను గ్రహించి ఆనాటి నుంచి డాలీకి మా ఆయన బొమ్మలు గీయడం నేర్పించాడు' అంటుంది హోయి చౌదరి.


ఎక్స్‌ప్రెసివ్ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్స్‌తో ఆహా అనిపిస్తుంది డాలీ.

డాలీ కోసం ప్రత్యేకంగా డాగ్-ఫ్రెండ్లీ బ్రష్‌ను రూపొందించారు. డాలీ వేసిన కొన్ని పెయింటింగ్స్‌తో క్యాలెండర్ రూపొందించారు.

• సోషల్ మీడియా

డుగ్గు డుగ్గుమని... బుల్లెట్ బండి మీద డాడీ వచ్చిండు!





'నాన్నా... కొత్త బుల్లెట్ కొన్నాను. ఎలా ఉంది?' తండ్రిని అడిగాడు కొడుకు.

'చాలా బాగుందిరా' అన్నాడు నాన్న.

'ఇది నా కోసం కాదు నీ కోసం' అని కొడుకు అన్నప్పుడు ఆ తండ్రి కళ్లు ఆశ్చర్యానందాలతో మెరిసిపోయాయి.

పద్నాలుగు సంవత్సరాల క్రితం కేరళలోని కొచ్చికి చెందిన అశ్విన్ తండ్రి బుల్లెట్ కొనాలని బలంగా అనుకున్నాడు. అయితే ఆర్థిక కష్టాలు కూడా అంతే బలంగా ఉండడంతో బుల్లెట్ బండి కొనలేకపోయాడు. పద్నాలుగు సంవత్సరాల తరువాత తండ్రి కోరికను నిజం చేశాడు చేతికి అందివచ్చిన కొడుకు అశ్విన్.

అశ్విన్ తన తండ్రికి బ్రాండ్-న్యూ రాయల్ ఎన్‌ఫీల్డ్ కీ అందించడం, తల్లిదండ్రులు ఆ బండిని చూసి మురిసిపోవడం... ఇలాంటి దృశ్యాలు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'తల్లిదండ్రులు పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేస్తుంటారు. అలాంటి వారి కోసం ఎంత చేసినా తక్కువే'

'ఈ తరం పిల్లలు అశ్విన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.



చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్

అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అద్భుత విజయాన్ని అందుకున్న భారత చెస్ ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించింది. మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా 19 ఏళ్ల దివ్య రికార్డు నెలకొల్పింది. జార్జియాలో జరుగుతున్న ఈ మెగా టోర్నీ సెమీఫైనల్లో మహారాష్ట్ర అమ్మాయి దివ్య 1.5–0.5తో 2017 ప్రపంచ చాంపియన్ టాన్ జోంగి (చైనా)పై గెలిచింది. మంగళవారం వీరిద్దరి మధ్య తొలి గేమ్ 'డ్రా'కాగా... బుధవారం జరిగిన రెండో గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన దివ్య 101 ఎత్తుల్లో టాన్ జోంగిని ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ విజయంతో దివ్య వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించింది. తాజా ప్రదర్శనతో దివ్య ఖాతాలో తొలి గ్రాండ్‌మాస్టర్ (జీఎం) నార్మ్ కూడా చేరింది. కోనేరు హంపి (భారత్)–లె టింగ్జి (చైనా) మధ్య సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో దివ్య ఆడుతుంది. హంపి–లె టింగ్జి మధ్య బుధవారం జరిగిన రెండో గేమ్ కూడా 75 ఎత్తుల్లో 'డ్రా' కావడంతో ఇద్దరూ 1–1తో సమంగా నిలిచారు. హంపి–టింగ్జి మధ్య ఈరోజు టైబ్రేక్ గేమ్స్ నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు.



ఇంగ్లండ్‌పై నెగ్గిన వన్డే సిరీస్ ట్రోఫీతో భారత మహిళల క్రికెట్ జట్టు సంబరం. చెస్టర్ లీ స్ట్రీట్‌లో జరిగిన మూడో వన్డేలో టీమిండియా 13 పరుగుల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2–1తో దక్కించుకుంది. భారత్ నిర్దేశించిన 319 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 305 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లు క్రాంతి గౌడ్ 6 వికెట్లు, శ్రీచరణి 2 వికెట్లు తీశారు. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్' అవార్డులు లభించాయి.

మొదటి రోజు మెరుగైన స్థితిలో...

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 264/4
- జైస్వాల్, సుదర్శన్ అర్ధసెంచరీలు
- బెన్ స్టోక్స్‌కు రెండు వికెట్లు

తొలి సెషన్‌లో ఒక్క వికెట్ కోల్పోకుండా ఓపెనర్ల పట్టుదల... ఆపై తక్కువ వ్యవధిలో మూడు వికెట్లు... కీలక సమయంలో రిషభ్ పంత్‌కు గాయం... చివరకు సంతృప్తిగా ముగింపు! మాంచెస్టర్ టెస్టులో భారత జట్టు పరిస్థితి ఇది. టాస్ ఓడినా సానుకూల ఆటతో భారత బ్యాటింగ్ కొనసాగింది. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ అర్ధ సెంచరీలతో ఆకట్టుకోగా, ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ బంతితో రాణించాడు. ఇంకా లోతైన బ్యాటింగ్ ఉండటంతో రెండో రోజు టీమిండియా ఎంత భారీ స్కోరు నమోదు చేస్తుందనేది చూడాలి.

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టును భారత్ ఆత్మవిశ్వాసంతో ప్రారంభించింది. బుధవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (151 బంతుల్లో 61; 7 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (107 బంతుల్లో 58; 10 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు చేశారు. రిషభ్ పంత్ (48 బంతుల్లో 37 రిటైర్డ్‌హర్ట్; 2 ఫోర్లు, 1 సిక్స్) గాయంతో మైదానం వీడాడు. ప్రస్తుతం రవీంద్ర జడేజా (19 బ్యాటింగ్), శార్దుల్ ఠాకూర్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానం చరిత్రలో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న జట్టు ఒక్కసారి కూడా మ్యాచ్ గెలవలేదు. అయినా సరే, స్టోక్స్ మరోసారి టాస్ గెలిచి అలాంటి సాహసం చేశాడు. ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ నాలుగు టాస్‌లూ గెలవగా... అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ వరుసగా 14 టాస్‌లు ఓడిపోయింది!

ఓపెనర్ల శుభారంభం...

భారత్‌కు మరోసారి ఓపెనర్లు జైస్వాల్, కేఎల్ రాహుల్ (98 బంతుల్లో 46; 4 ఫోర్లు) మెరుగైన ఆరంభాన్ని అందించారు. ఇంగ్లండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు చక్కటి షాట్లతో పరుగులు రాబట్టారు. లంచ్ సమయానికి జట్టు వికెట్ నష్టపోకుండా 78 పరుగులు చేసింది. అయితే రెండో సెషన్‌లో పరిస్థితి మారింది. తక్కువ వ్యవధిలో పదునైన బంతితో రాహుల్‌ను అవుట్ చేసి వోక్స్ జట్టుకు తొలి వికెట్ అందించాడు. 96 బంతుల్లో అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్న తర్వాత డాసన్ బౌలింగ్‌లో జైస్వాల్ వెనుదిరగ్గా... గత టెస్టు వైఫల్యాన్ని శుబ్‌మన్ గిల్ (12) ఇక్కడా కొనసాగించాడు. స్టోక్స్ బంతిని ఆడకుండా వదిలేసిన గిల్ రివ్యూ కోరినా లాభం లేకపోయింది. అంతకుముందు భారత్ కొన్ని ఉత్కంఠ క్షణాలను ఎదుర్కొంది. స్టోక్స్ బౌలింగ్‌లో 20 పరుగుల వద్ద సుదర్శన్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను కీపర్ స్మిత్ వదిలేయడం కాస్త కలిసొచ్చింది.


యశస్వి జైస్వాల్

కీలక భాగస్వామ్యం...

టీ విరామం తర్వాత సుదర్శన్, పంత్ చక్కటి సమన్వయంతో ఇన్నింగ్స్‌ను నడిపించారు. సుదర్శన్ ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేయగా, పంత్ కూడా సంయమనం ప్రదర్శిస్తూ పరుగులు రాబట్టాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 72 పరుగులు జోడించిన తర్వాత గాయంతో పంత్ తప్పుకోవాల్సి వచ్చింది. 134 బంతుల్లో కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న అనంతరం సుదర్శన్‌ను స్టోక్స్ వెనక్కి పంపాడు. ఈ దశలో జడేజా, శార్దుల్ కలిసి జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరు 55 బంతుల్లో అభేద్యంగా 29 పరుగులు జత చేసి తొలి రోజును ముగించారు. చివర్లో వెలుతురు మందగించడంతో అంపైర్ల సూచనతో ఇంగ్లండ్ స్పిన్ బౌలింగ్‌కే పరిమితమైంది. దాంతో 80 ఓవర్ల తర్వాత కూడా జట్టు కొత్త బంతి తీసుకునే ప్రయత్నం చేయలేదు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58; రాహుల్ (సి) క్రాలీ (బి) వోక్స్ 46; సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61; గిల్ (ఎల్బీ) (బి) స్టోక్స్ 12; పంత్ (రిటైర్డ్‌హర్ట్) 37; జడేజా (బ్యాటింగ్) 19; శార్దుల్ (బ్యాటింగ్) 19; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (83 ఓవర్లలో 4 వికెట్లకు) 264.**

వికెట్ల పతనం: 1–94, 2–120, 3–140, 3–212 (రిటైర్డ్ నాటౌట్), 4–235. **బౌలింగ్:** వోక్స్ 17–4–43–1, ఆర్చర్ 16–2–44–0, కార్స్ 16–1–60–0, స్టోక్స్ 14–2–47–2, డాసన్ 15–1–45–1, రూట్ 5–0–19–0.

అన్షుల్ కంబోజ్ @ 318

పేస్ బౌలర్ అన్షుల్ కంబోజ్ ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. భారత్ తరఫున టెస్టు మ్యాచ్ ఆడిన 318వ ఆటగాడిగా అతను నిలిచాడు. హరియాణాకు చెందిన 24 ఏళ్ల అన్షుల్ 24 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 22.88 సగటుతో 79 వికెట్లు పడగొట్టాడు. లార్డ్స్ టెస్టులో ఆడిన జట్టు నుంచి మూడు మార్పులతో భారత్ బరిలోకి దిగింది. గాయాలతో దూరమైన నితీశ్, ఆకాశ్‌దీప్‌కు బదులుగా అన్షుల్, శార్దుల్‌లను ఎంపిక చేయగా...కరుణ్ నాయర్‌ను తప్పించి సాయి సుదర్శన్‌కు అవకాశం కల్పించారు.


జెర్సీ నంబర్ ఏకే-47

అన్షుల్ కంబోజ్‌పై కథనం... సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ పేపర్‌లో...

రిషభ్ పంత్‌కు గాయం!

భారత్‌ను ఈ టెస్టులో ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉన్న ఘటన తొలి రోజే చోటు చేసుకుంది. వికెట్ కీపర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ చేస్తూ గాయపడి రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. వోక్స్ వేసిన బంతిని రివర్స్ స్వీప్ ఆడబోగా బంతి నేరుగా అతని కుడి పాదంపై పడింది. ఎల్బీడబ్ల్యూ అప్పీల్‌కు అంపైర్ స్పందించకపోవడంతో ఇంగ్లండ్ రివ్యూ కోరింది. బంతి కాలికి తగిలే ముందే బ్యాట్‌ను తాకుతూ వెళ్లడంతో అతను నాటౌట్‌గా తేలాడు. అయితే బంతి బలంగా తాకడంతో పంత్ తీవ్ర నొప్పితో విలవిల్లాడాడు. సహచరుల అండతో ఒంటికాలిపై అడుగు వేయాల్సి వచ్చింది. చివరకు కార్ట్‌లో అతడిని మైదానం బయటకు తీసుకెళ్లారు. గాయం తీవ్రత ఎలాంటిదనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఆ తర్వాత ఈ టెస్టులో అతని పరిస్థితి ఏమిటనేది తెలుస్తుంది.


పంత్ సాయి సుదర్శన్

సింధు శుభారంభం

తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్‌పై విజయం



చాంగ్జౌ: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 21–15, 8–21, 21–17తో ప్రపంచ ఆరో ర్యాంకర్ టొమోకా మియజాకి (జపాన్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 62 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధుకు గట్టిపోటీ ఎదురైనా కీలకదశలో పాయింట్లు సాధించి మియజాకిపై తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో సింధు ఆడుతుంది. తొలి రౌండ్‌లో ఉన్నతి 21–11, 21–16తో కిర్‌స్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలిచింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–13, 21–9తో మిత్సుహాషి–హిరోకి (జపాన్) జోడీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతపర్ణ–శ్వేతాపర్ణ (భారత్) 12–21, 13–21తో యెంగ్ టింగ్–యెంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయారు.

పారదర్శకతకు పెద్దపీట వేస్తూ...

- పార్లమెంట్ ముందుకు నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు
- లోక్‌సభలో ప్రవేశ పెట్టిన కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ: దేశంలోని అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)లను ఒకే గొడుగు కిందికి తీసుకొస్తూ... భారత ప్రభుత్వం కొత్త క్రీడా బిల్లును ప్రవేశపెట్టింది. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం లోక్‌సభలో 'నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు'ను ప్రవేశ పెట్టారు. క్రీడా సమాఖ్యల్లో జవాబుదారీతనం పెంచడంతో పాటు పారదర్శకతకు పెద్దపీట వేయడం వంటి పలు కీలక అంశాలను ఇందులో పొందుపరిచారు. క్రీడా సమాఖ్యల బాధ్యత పెంపొందించేందుకు... జాతీయ క్రీడా బోర్డు (ఎన్‌ఎస్‌బీ) పలు నిబంధనలతో కూడిన బిల్లును మాండవీయ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం ఇకపై జాతీయ క్రీడా సమాఖ్యలు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందాలంటే ముందు ఎన్‌ఎస్‌బీ గుర్తింపు తప్పనిసరి. దేశంలో గుర్తింపు పొందిన అన్ని క్రీడా సంఘాలు... సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కిందకు రానున్నాయి. గతంలో స్పోర్ట్స్ కోడ్‌లో భాగంగా లేని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి కూడా ఇకపై ఇది వర్తించనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నా పేరు సూర్య!


సూర్య

'కొబ్బరికాయ కొట్టి కర్పూరం వెలిగిస్తే శాంతించే దేవుడు కాదు... మనసులో మొక్కుకుని మిరపకాయలు దంచితే రుద్రుడే దిగొచ్చే దేవుడు' అనే డైలాగులతో 'కరుప్పు' చిత్రం టీజర్ ఆరంభమైంది. సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కరుప్పు'. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇంద్రన్స్, నట్టి, సుప్రీత్ రెడ్డి ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. సూర్య పుట్టినరోజుని (జూలై 23) పురస్కరించుకుని ఈ సినిమా టీజర్‌ని బుధవారం విడుదల చేశారు మేకర్స్. 'నా పేరు సూర్య... నాకు ఇంకో పేరుంది' (బ్యాక్‌గ్రౌండ్‌లో కాలభైరవ అంటూ పాట), 'మేరా భాయ్... ఇది మన టైమ్' అంటూ సూర్య చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'కరుప్పు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జీకే విష్ణు, సంగీతం: సాయి అభ్యంకర్.

నా ఇంట్లోనే నన్ను వేధిస్తున్నారు

- తనుశ్రీ దత్తా



''నా ఇంట్లోనే నాకు భద్రత లేకుండా పోయింది. నన్ను చాలా వేధిస్తున్నారు. ఈ బాధ భరించలేకపోతున్నాను. పోలీసులకు కాల్ చేస్తే స్టేషన్‌కు వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయమని సూచించారు. నేడో, రేపో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తాను'' అని బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా కన్నీటి పర్యంతమవుతూ ఓ వీడియో షేర్ చేశారు. 2004లో ఫెమినా మిస్ ఇండియా యూనివర్స్‌గా నిలిచిన ఆమె 'ఆషిక్ బనాయా ఆప్నే' చిత్రంతో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. బాలకృష్ణ హీరోగా నటించిన 'వీరభద్ర' సినిమా ద్వారా తెలుగుకి పరిచయమయ్యారామె. పలు హిందీ, తమిళ సినిమాల్లో నటించిన తనుశ్రీ 2013 తర్వాత సినిమాలకు దూరమయ్యారు. బాలీవుడ్‌లో 'మీటూ' ఉద్యమానికి బాటలు వేసి, వార్తల్లో నిలిచిన ఆమె తాజాగా మరోసారి వ్యక్తిగత జీవితంతో వార్తల్లోకెక్కారు. ''2018 నుంచి నరకం అనుభవిస్తున్నాను. నా ఇంట్లోనే వేధిస్తున్నారు. ప్రశాంతంగా ఉండలేను. రాత్రివేళ్లలో ఇంటి బయట వినిపించే శబ్దాలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇది కూడా వేధింపుల్లో భాగమే. నిద్రలేక, ప్రశాంతత లేక మానసికంగా విసిగి పోయాను. నా ఆరోగ్యం క్షీణించింది. క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్‌తో(విపరీతమైన అలసటతో కూడుకున్న వ్యాధి) బాధపడుతున్నాను. ప్లీజ్ నాకెవరైనా సాయం చేయండి'' అని పోస్ట్ చేశారు. ఆమె వీడియోపై పలువురు నెటిజన్లు, అభిమానులు స్పందించి, తనుశ్రీకి తక్షణ సహాయం అందించాలంటూ పోస్టులు పెడుతున్నారు.

సైమా నామినేషన్స్‌లో తగ్గేదే లే

- 11 నామినేషన్స్ దక్కించుకున్న 'పుష్ప 2'
- 'కల్కి 2898 ఏడీ, హను–మాన్'కి 10 నామినేషన్లు

'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' (సైమా) వేడుక ఈ ఏడాది సెప్టెంబరులో జరగనుంది. ఈ 13వ సైమా అవార్డు వేడుకను సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్ వేదికగా నిర్వహించనున్నారు. దక్షిణాదిలోని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల నుంచి గత ఏడాది విడుదలైన సినిమాలకు సంబంధించి నామినేట్ అయిన సినిమాల జాబితాను బుధవారం అవార్డుల కమిటీ ప్రకటించింది. తెలుగులో 'పుష్ప 2: ది రూల్' 11 నామినేషన్స్‌తో 'తగ్గేదే లే' అంటూ తొలి స్థానంలో నిలిచింది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జోడీగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా 2024 డిసెంబరు 4న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డులు సృష్టించిన ఈ చిత్రం ఇప్పటికే ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది. తాజాగా 'సైమా' అవార్డుల్లో 11 విభాగాల్లో నామినేషన్స్ దక్కించుకుంది. ఇకపోతే ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం 10 నామినేషన్స్‌తో ద్వితీయ స్థానంలో నిలిచింది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర కీలక పాత్రల్లో నటించారు. సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ సినిమా 2024 జూన్ 27న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. అలాగే తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన 'హను–మాన్' కూడా 10 నామినేషన్స్ దక్కించుకోవడం విశేషం. ఈ సినిమా 2024 జనవరి 12న సంక్రాంతికి విడుదలై, అద్భుతమైన విజయం సాధించింది.


అల్లు అర్జున్


ప్రభాస్


తేజ సజ్జ

జోరుగా నేను రెడీ


హవీష్

జోరుగా, జోష్‌గా నేను రెడీ అంటూ ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు హీరో హవీష్. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో హవీష్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'నేను రెడీ'. హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీపై నిఖిలా కోనేరు ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ''పూర్తి స్థాయి వినోదాత్మక, కుటుంబ కథా చిత్రంగా 'నేను రెడీ'ని రూపొందిస్తున్నాం. ఇప్పటివరకూ జరిపిన షెడ్యూల్స్‌లో కీలక సన్నివేశాలు, ఒక పాట చిత్రీకరించాం. పూర్తయినంతవరకూ రషెస్ చూసి, మా యూనిట్ అంతా హ్యాపీగా ఉన్నాం. దాంతో మరింత జోరుగా, జోష్‌గా షూటింగ్ చేస్తున్నాం. ఈ సినిమా హవీష్‌కి మంచి బ్రేక్ ఇస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.

హార్డ్ వర్క్‌తోనే సక్సెస్

- కృష్ణతేజ



''హార్డ్ వర్క్‌ని నమ్ముకుని సినిమాల్లోకి వచ్చాను. వచ్చిన ప్రతి పాత్రకీ వంద శాతం న్యాయం చేయడానికి కృషి చేస్తుంటాను. నా కృషికి అదృష్టం తోడై వరుసగా అవకాశాలు వస్తున్నాయి'' అన్నారు కృష్ణతేజ. 'అతడు, ఖలేజా, శ్రీమంతుడు, ఇష్క్, ఒక లైలా కోసం'... ఇలా పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, 'పైసా పరమాత్మ, క్షుద్ర, అందరిలా నేను ప్రేమించాను' తదితర చిత్రాల్లో లీడ్ రోల్స్ చేశారు కృష్ణతేజ. తాజాగా 'విరాటపాలెం'లో చేసిన రంగ పాత్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్ వీక్షకులకూ తనను దగ్గర చేసింది. ఈ సందర్భంగా కృష్ణతేజ చెప్పిన విషయాలు.

- 'విరాటపాలెం' సిరీస్‌లో రంగ అనే ఇంపార్టెంట్ రోల్ చేశాను. నేను హీరోగా చేసిన సినిమాలపై నాకు అంచనాలు ఉంటాయి. ఈ సిరీస్‌లో ముఖ్య పాత్ర కాబట్టి ఏమీ ఎక్స్‌పెక్ట్ చేయలేదు. కానీ రంగ పాత్రలో చాలా షేడ్స్ ఉండటంతో నటించేటప్పుడు బాగా అనిపించింది. నా పెర్ఫార్మెన్స్ చూసి, ఇంకొన్ని సీన్స్ కూడా పెంచారు. నాకు మంచి పేరు తెచ్చిన ఈ క్యారెక్టర్ ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు.
- 'విరాటపాలెం' సిరీస్‌లో రంగ రైతు. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. కరోనా టైమ్‌లో ఆగనివి రెండే రెండు. ఒకటి వైద్యం, రెండోది వ్యవసాయం. ఈ రెంటిలో ఒకదాంట్లో నేను ఉండటం సంతృప్తిగా ఉంటుంది. కరోనా టైమ్‌లో చాలామంది ఇంటికి పరిమితం అయితే, నేను వంద మంది కూలీలతో మా పొలంతో పాటు ఇంకొందరి పొలాల్లో వ్యవసాయం చేయించాను.
- సినిమా నేపథ్యం లేని కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. బ్యాక్‌గ్రౌండ్ ఉంటే రెండు మూడు అవకాశాలు రావడానికి ఉపయోగపడుతుందేమో కానీ... టాలెంట్ ఉంటేనే నిలబడతాం. అలాగే దర్శక–నిర్మాతల ఫోకస్ పడటం ముఖ్యం. నేనింత దాకా వచ్చానంటే కొందరి ఫోకస్ నా మీద పడటం, నా కష్టం, అదృష్టం కారణం. నన్ను నమ్మి చాన్స్ ఇచ్చినవాళ్లను మరచిపోను. అలాగే కొంతవరకూ కెరీర్‌లో సక్సెస్ కావడం హ్యాపీ.
- నటుడిగానే కాకుండా విడిగా 'కేటీ' మీడియా ద్వారా ఈవెంట్స్, ఇంకా యాడ్ మేకింగ్... వంటి వాటితో బిజీగా ఉంటాను. యాడ్ ఫిల్మ్స్‌కి నేనే డైరెక్షన్ చేస్తాను. అలాగే నా పరిధిలో వీలైనంత మేరకు ఇతరులకు సహాయం చేస్తుంటాను. ఇక నేను నటించిన 'ఎమ్4ఎమ్, హ్యాపీ జర్నీ' ఇంకా రెండు మూడు సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. కొన్ని ప్రాజెక్ట్స్ చేస్తున్నాను.

నేను కొడితే హిట్టే

- రాశీ


అరుణాచలం, రాశీ, జనని

''ప్రేయసి రావే' చిత్రంలో పాత్ర పరంగా హీరో శ్రీకాంత్‌ని కొట్టాను. ఆ సినిమా హిట్ అయ్యింది. అలాగే 'ఉసురే'లో హీరోని, హీరోయిన్‌ని కొట్టాను. నాకున్న సెంటిమెంట్ ప్రకారం 'ఉసురే' కూడా హిట్ అవుతుంది. ఈ సినిమాలో నా పాత్ర చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అందరి హృదయాలను మా చిత్రం హత్తుకుంటుంది'' అని నటి రాశీ తెలిపారు. టి. అరుణాచలం, జననీ కునశీలన్ జోడీగా రాశీ ముఖ్య పాత్ర పోషించిన చిత్రం 'ఉసురే'. నవీన్ డి. గోపాల్ దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో మౌళి ఎం. రాధాకృష్ణ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 1న విడుదల కానుంది. కిరణ్ జోజ్ సంగీతం అందించిన ఈ చిత్రం పాటల విడుదల కార్యక్రమంలో నవీన్ డి. గోపాల్ మాట్లాడుతూ– ''కమల్‌హాసన్‌గారికి మా సినిమా ట్రైలర్ చూపించాను. ఆయనకు బాగా నచ్చింది. ఈ సినిమా హిట్టవ్వాలని ఆయన ఆకాంక్షించారు'' అన్నారు. ''ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఓ బర్నింగ్ ఇష్యూని మా చిత్రంలో చర్చించాం. ప్రతి ఒక్కరి హృదయానికి హత్తుకునే ప్రేమకథ ఇది'' అని మౌళి ఎం. రాధాకృష్ణ చెప్పారు.

ఇక భద్రకాళి విజయ్ ఆంటోని...


రామాంజనేయులు, తృప్తి, విజయ్, సురేష్‌బాబు, అరుణ్ ప్రభు

''విజయ్ ఆంటోనిగారు ప్రతిదీ చాలా వివరంగా డిజైన్ చేస్తారు. మా సినిమా రాబోతోందనే విషయాన్ని ప్రేక్షకులకు చెప్పడం చాలా ముఖ్యం. 'భద్రకాళి' చిత్రాన్ని ఎంతో ఉత్సాహంగా ప్రమోట్ చేస్తుండటం మంచి పరిణామం. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని నిర్మాత డి. సురేష్‌బాబు అన్నారు. విజయ్ ఆంటోని నటించిన చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తృప్తి రవీంద్ర హీరోయిన్. మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న రిలీజ్ కానుంది. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా విడుదల కానుంది. బుధవారం నిర్వహించిన ఈ చిత్రం సమావేశానికి డి. సురేష్‌బాబు అతిథిగా హాజరయ్యారు. విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''భద్రకాళి'లో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. గతంలో వచ్చిన పొలిటికల్ సినిమాలన్నింటికీ మా 'భద్రకాళి' చాలా వైవిధ్యంగా ఉంటుంది'' అని చెప్పారు. ''భద్రకాళి' నా ఫస్ట్ తెలుగు రిలీజ్. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు అరుణ్ ప్రభు. ''విజయ్‌గారిని 'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోని అంటున్నారు. ఈ సినిమా రిలీజ్ తర్వాత 'భద్రకాళి' ఫేమ్ విజయ్ ఆంటోని అని పిలుస్తారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత రామాంజనేయులు తెలిపారు.

సాక్షి బిజినెస్
గురువారం
24-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	పాయింట్లు	ముగింపు
సెన్సెక్స్ ▲	540	82,727
నిఫ్టీ ▲	159	25,220

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	20,943	▲	51
డోజోన్స్	44,934	▲	432
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,061	▲	38
డాక్స్	24,241	▲	199
షాంఘై	3,582	▲	1
నికాయ్	41,171	▲	1,396

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.00	87.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.55
€	యూరో	ఎస్‌బీఐ	100.20	102.98
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.19	59.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.70	57.93
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.01	68.66
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.14	23.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.60	23.85
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.15	12.97

వెండి కొత్త రికార్డ్

- ఒకే రోజు రూ.4,000 పెరుగుదల
- కొనసాగుతున్న పసిడి పరుగు.
- మరో రూ.1,000 జంప్..

న్యూఢిల్లీ: వెండి, బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బుధవారం ఒక్కరోజే వెండి రూ.4,000 పెరిగి ఢిల్లీ మార్కెట్లో రూ.1,18,000 స్థాయిని నమోదు చేసింది. ఇది నూతన ఆల్‌టైమ్ రికార్డు కావడం గమనార్హం. వెండి మంగళవారం సైతం రూ.3,000 పెరగడం గమనార్హం. గత మూడు సెషన్లలోనే రూ.7,500 లాభపడింది. బంగారం ధర సైతం క్రమంగా పెరుగుతూ నూతన జీవితకాల గరిష్టాన్ని సమీపించింది. 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.1,000 పెరిగి రూ.1,01,020 స్థాయిని చేరుకుంది. జూన్ 13న నమోదైన రూ.1,01,540 ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిగా ఉంది. మరో రూ.500 మించి పెరిగితే బంగారంలోనూ కొత్త రికార్డు నమోదు కానుంది. అంతర్జాతీయంగా అనిశ్చితులు పెరగడంతో బంగారానికి డిమాండ్ కొనసాగినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.




ఇన్ఫోసిస్.. గుడ్

- క్యూ1లో నికర లాభం రూ. 6,921 కోట్లు; 9 శాతం అప్
- ఆదాయం రూ. 42,279 కోట్లు
- 2025–26 ఆదాయ అంచనాలు పెంపు
- 20,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 9 శాతం ఎగసి రూ. 6,921 కోట్లను తాకింది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 6,368 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతం పుంజుకుని రూ. 42,279 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 39,315 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,189 కోట్ల నుంచి రూ. 5,173 కోట్లకు స్వల్పంగా తగ్గాయి.

1–3 శాతం వృద్ధి

పూర్తి ఏడాదికి ఆదాయంలో స్థిర కరెన్సీ ప్రాతిపదికన 1–3 శాతం పురోగతి సాధించగలమని ఇన్ఫోసిస్ తాజాగా అంచనా (గైడెన్స్) వేసింది. తద్వారా గతంలో ప్రకటించిన 0–3 శాతం గైడెన్స్‌ను స్వల్పంగా మెరుగుపరచింది. 20–22 శాతం స్థాయిలో నిర్వహణ మార్జిన్లు సాధించగలమన్న గత అంచనాలను కొనసాగించింది. కాగా.. ప్రస్తుత సమీక్షా కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) 6 శాతం వృద్ధితో రూ. 8,803 కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్లు 21.1 శాతం నుంచి 20.8 శాతానికి స్వల్పంగా నీరసించాయి. ఫ్రీ క్యాష్‌ఫ్లో 18 శాతం తక్కువగా రూ. 7,533 కోట్లకు చేరింది.



ఏఐలో పటిష్టం

కొత్త ఏడాదిని పటిష్టంగా ప్రారంభించాం. ఏఐ సామర్థ్యాలు, క్లయింట్ కన్సాలిడేషన్‌లో విజయవంత నిర్ణయాలు, 3 లక్షల మంది ఉద్యోగుల అంకిత భావం ఇన్ఫోసిస్ పనితీరులో ప్రతిఫలిస్తున్నాయి. పోటీలో కంపెనీ ప్రత్యేకతను చాటుకోవడం, క్లయింట్లతో పటిష్ట సంబంధాలు.. భారీ డీల్స్ గెలుపొందడాన్ని పట్టి చూపుతున్నాయి.

– సలీల్ పరేఖ్, సీఈవో, ఎండీ, ఇన్ఫోసిస్

విభాగాలవారీగా..

ఇన్ఫోసిస్ క్యూ1 ఆదాయంలో ఫైనాన్షియల్ సరీ్వసుల వాటా 28 శాతం కాగా.. తయారీ 16 శాతం, రిటైల్ 13.4 శాతం చొప్పున ఆక్రమించాయి. ప్రాంతాలవారీగా చూస్తే ఉత్తర అమెరికా నుంచి ఆదాయంలో దాదాపు 57 శాతం సమకూరింది. గత క్యూ1లో ఇది 59 శాతంకాగా.. యూరప్ వాటా 32 శాతంగా నమోదైంది. గత క్యూ1లో ఇది 28 శాతమే. గత కొన్ని త్రైమాసికాలుగా యూరప్‌లో బలమైన వృద్ధిని సాధిస్తున్నట్లు కంపెనీ సీఎఫ్‌వో జయేష్ ఎస్. పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం యూరప్‌లో చేపట్టిన పెట్టుబడుల ఫలితమిదని తెలియజేశారు. అయితే ఇప్పటికీ యూఎస్ అతి పెద్ద మార్కెట్‌గా నిలుస్తున్నట్లు వెల్లడించారు.

క్యూ1లో ఇతర విశేషాలు..

- 3.8 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది. వీటిలో 55 శాతం కొత్తగా పొందినవే.
- 210 మంది ఉద్యోగులను జత కలుపుకుంది. మొత్తం సిబ్బంది సంఖ్య 3,23,788కు చేరింది.
- గతంలో ప్రకటించినట్లుగా పూర్తి ఏడాదిలో 20,000 మంది ఫ్రెషర్స్ నియామకం.
- ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు దాదాపు యథాతథంగా 14.4 శాతంగా నమోదైంది.

మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు బీఎస్‌ఈలో 0.3 శాతం బలపడి రూ. 1,574 వద్ద ముగిసింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,410 కోట్లు

- క్యూ1లో స్వల్ప వృద్ధి
- ఆదాయం 8,545 కోట్లు; 11% అప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 1,410 కోట్ల నికర లాభాన్ని (కన్సాలిడేటెడ్) ప్రకటించింది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 1,392 కోట్లతో లాభం స్వల్పంగా పెరిగింది. మరోవైపు సమీక్షాకాలంలో ఆదాయం 11 శాతం పెరిగి రూ. 7,673 కోట్ల నుంచి రూ. 8,545 కోట్లకు చేరింది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే రెండంకెల స్థాయిలో ఆదాయ వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ సహ–చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. బ్రాండెడ్ ఉత్పత్తుల మార్కెట్లో పనితీరు నిలకడగా ఉండటం, నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్‌ఆర్‌టీ) పోర్ట్‌ఫోలియో పటిష్టంగా ఉండటం ఇందుకు దోహదపడినట్లు వివరించారు. లెనాలిడోమైడ్ ఔషధం ధరలకు సంబంధించి అమెరికా జనరిక్స్ మార్కెట్లో ఒత్తిడి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపర్చుకుంటూ, కొత్త ఉత్పత్తులను ప్రవేశపెడుతూ, ప్రధాన వ్యాపార విభాగాలను బలోపేతం చేసుకోవడంపై మరింతగా దృష్టి పెట్టడాన్ని కొనసాగిస్తామని ప్రసాద్ చెప్పారు. స్థూలకాయాన్ని తగ్గించే ఇంజెక్షన్ సెమాగ్లూటైడ్ జనరిక్ వెర్షన్‌ను వచ్చే ఏడాది భారత్ సహా పలు దేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు విలేకరుల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా కంపెనీ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ తెలిపారు.



మరిన్ని విశేషాలు..

- విభాగాలవారీగా చూస్తే గ్లోబల్ జనరిక్స్ వ్యాపారం సుమారు 10 శాతం పెరిగి రూ. 6,886 కోట్ల నుంచి రూ. 7,562 కోట్లకు చేరగా, ఫార్మా సర్వీసెస్ అండ్ యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్‌ఏఐ) సెగ్మెంట్ 7 శాతం వృద్ధితో రూ. 766 కోట్ల నుంచి రూ. 818 కోట్లకు పెరిగింది.
- గ్లోబల్ జనరిక్స్ విషయంలో, కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఆదాయం 11 శాతం క్షీణించి రూ. 3,846 కోట్ల నుంచి రూ. 3,412 కోట్లకు తగ్గింది. లెనాలిడొమైడ్ సహా కొన్ని కీలక ఉత్పత్తుల ధరల తగ్గుదల ఇందుకు కారణమైంది.
- ఎన్‌ఆర్‌టీ పోర్ట్‌ఫోలియో కలిపి యూరప్ మార్కెట్ రూ. 526 కోట్ల నుంచి రూ. 1,274 కోట్లకు చేరింది.
- అయిదు కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం, ధరల పెరుగుదల వంటి అంశాల దన్నుతో భారత మార్కెట్ 11 శాతం పెరిగి రూ. 1,325 కోట్ల నుంచి రూ. 1,471 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో డాక్టర్ రెడ్డీస్ షేరు స్వల్పంగా పెరిగి రూ. 1,247.55 వద్ద క్లోజయ్యింది.

మార్కెట్‌కు ‘ట్రేడ్ డీల్స్’ లాభాలు

- బ్లూ చిప్ షేర్లలో కొనుగోళ్లు
- సెన్సెక్స్ 540 పాయింట్లు ప్లస్

ముంబై: అమెరికా–జపాన్ మధ్య ట్రేడ్ డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన, భారత్ – బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు జరగనుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం అరశాతం లాభపడింది. బ్యాంకులు, చమురు రంగాల్లోని అధిక వెయిటేజీ షేర్లు రాణించి బెంచ్‌మార్క్ సూచీల ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఫలితంగా సెన్సెక్స్ 540 పాయింట్లు పెరిగి 82,727 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 159 పాయింట్లు బలపడి 25,220 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 600 పాయింట్లు బలపడి 82,786 వద్ద, నిఫ్టీ 172 పాయింట్లు పెరిగి 25,233 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి.

- రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో టెలికం 1.14%, ఆటో 0.86%, బ్యాంకెక్స్ 0.75%, టెక్ 0.74% చొప్పున లాభపడ్డాయి.



- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (1%), రిలయన్స్ (1%), ఐసీఐసీఐ బ్యాంకు (1%), ఎయిర్‌టెల్(2%) రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి.
- కంపెనీ చరిత్రలో తొలిసారి ఈ క్యూ1లో రూ.122 కోట్ల నికరలాభాన్ని ఆర్జించడంతో పేటీఎమ్ షేరు 2% లాభపడి రూ.1,071 వద్ద క్లోజైంది.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

భారత వృద్ధి అంచనాలు కట్	తిలక్‌నగర్ చేతికి ఇంపీరియల్ బ్లూ

ఎకానమీకి గూగుల్ ప్లే, ఆండ్రాయిడ్ దన్ను



2024లో రూ. 4 లక్షల కోట్ల ప్రయోజనం: పబ్లిక్ ఫస్ట్ నివేదిక

న్యూఢిల్లీ: భారత ఎకానమీ వృద్ధికి గూగుల్ ప్లే, ఆండ్రాయిడ్ కూడా ఇతోధికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు రీసెర్చ్ కన్సల్టెన్సీ సంస్థ పబ్లిక్ ఫస్ట్ తెలిపింది. 2024లో యాప్ పబ్లిషర్లకు, విస్తృత ఆర్థిక వ్యవస్థకు ఇవి సుమారు రూ. 4 లక్షల కోట్ల మేర ఆదాయ ప్రయోజనం చేకూర్చినట్లు వివరించింది. ప్రపంచంలోనే అతి పెద్దదైన, అత్యంత వేగంగా ఎదుగుతున్న డిజిటల్ ఎకానమీల్లో భారత్ కూడా ఒకటని పబ్లిక్ ఫస్ట్ ఒక నివేదికలో వివరించింది. స్మార్ట్‌ఫోన్ల వినియోగం వేగంగా పెరగడం, డేటా చౌకగా లభిస్తుండటం, డెవలపర్లు.. ఎంట్రప్రెన్యూర్లకు అనువైన పరిస్థితులు నెలకొనడం తదితర అంశాలు ఇందుకు దోహదపడుతున్నట్లు పేర్కొంది. రిపోర్టు ప్రకారం గూగుల్ ప్లే, ఆండ్రాయిడ్ యాప్ వ్యవస్థ దాదాపు ముప్పైఅయిదు లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను కల్పించింది. గూగుల్ ప్లేలో నమోదు చేసుకున్న యాక్టివ్ డెవలపర్లకు సంబంధించి 10 లక్షల డెవలపర్ జాబ్స్‌తో భారత్ రెండో స్థానంలో ఉంది. సుమారు 79% మంది యాప్ డెవలపర్లకు విదేశీ యూజర్లు ఉన్నారు. ప్లే స్టోర్ నుంచి భారతీయ డెవలపర్ల యాప్‌ల డౌన్‌లోడ్‌లు 720 కోట్లుగా ఉండగా, ఇందులో దేశీ యూజర్ల డౌన్‌లోడ్‌లు 600 కోట్లు, విదేశీ యూజర్ల డౌన్‌లోడ్‌లు 120 కోట్లుగా నమోదయ్యాయి. ఆండ్రాయిడ్ సర్వీసులకు సంబంధించి గూగుల్ ప్లే అధికారిక యాప్ స్టోర్.

ఆడ్‌కాక్ వాటాలపై నాట్కో కన్ను

రూ. 2,100 కోట్ల ఆఫర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దక్షిణాఫ్రికాకు చెందిన ఔషధ సంస్థ ఆడ్‌కాక్ ఇన్‌గ్రాం హోల్డింగ్స్‌లో మైనారిటీ షేర్‌హోల్డర్ల వాటాలను కొనుగోలు చేయనున్నట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. ఇందుకోసం నగదు డీల్ రూపంలో రూ. 2,100 కోట్ల వరకు ఆఫర్ చేసినట్లు తెలిపింది. ఒకవేళ ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే ఆడ్‌కాక్‌లో నాట్కోకు గతంలో ఉన్న 0.80 శాతంతో కలిపి మొత్తం 35.75 శాతం వాటా (సుమారు 5,16,43,319 షేర్లు) దక్కుతుంది. దీని విలువ 226 మిలియన్ డాలర్లు. ప్రస్తుతం ఆడ్‌కాక్ వేల్యుయేషన్ సుమారు 632 మి. డాలర్లుగా ఉంది. డీల్ తర్వాత కంపెనీలో బిడ్‌వెస్ట్ (64.25%), నాట్కో (35.75%) ప్రధాన వాటాదార్లుగా ఉంటాయి. 1890లో ఏర్పాటైన ఆడ్‌కాక్ ఇన్‌గ్రాం ప్రధానంగా ప్రిస్క్రిప్షన్, ఓటీసీ తదితర 4 సెగ్మెంట్లలో కార్యకలాపాలు సాగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 536 మిలియన్ డాలర్ల ఆదాయం, 33.4% స్థూల మార్జిన్ నమోదు చేసింది.



దక్షిణాఫ్రికా మార్కెట్లో విస్తరించేందుకు, కొత్త ఆదాయ మార్గాలను అందిపుచ్చుకునేందుకు ఈ డీల్ ఉపయోగపడుతుందని నాట్కో ఫార్మా సీఈవో రాజీవ్ నన్నపనేని తెలిపారు. కంపెనీకి గల సుదీర్ఘ చరిత్ర, బ్రాండ్స్‌పై గల నమ్మకానికి ఈ ఒప్పందం నిదర్శనంగా నిలుస్తుందని ఆడ్‌కాక్ సీఈవో ఆండ్రూ హాల్ తెలిపారు. ఈ డీల్ నాలుగు నెలల్లో ముగియవచ్చని అంచనా.

డీల్ నేపథ్యంలో నాట్కో షేరు సుమారు 2% పెరిగి రూ. 1,034 వద్ద స్థిరపడింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

ఏఆర్‌సీఐలో సైంటిస్ట్ కొలువులు

- 11 ఉద్యోగాలకు ప్రకటన విడుదల

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్ (ఏఆర్‌సీఐ).. పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా 11 సైంటిస్ట్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. అభ్యర్థులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఉద్యోగాల్లోకి తీసుకుంటారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు

సైంటిస్ట్ ఈ-3, సైంటిస్ట్ సీ-1, సైంటిస్ట్ బీ-7 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

- **సైంటిస్ట్–ఈ:** ఫిజికల్ సైన్స్‌లో డాక్టరేట్ డిగ్రీ/ఇంజినీరింగ్/టెక్నాలజీ మాస్టర్స్ డిగ్రీతోపాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో పరిశ్రమలు/రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్/సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థల్లో పదేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. ఆర్ అండ్ డీ ప్రాజెక్టులు, ప్రోగ్రాముల్లో పనిచేసినవారికి ప్రాధాన్యమిస్తారు.
- **సైంటిస్ట్ సీ:** ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజ నీరింగ్ డిగ్రీ, ఆర్ అండ్ డీ , విద్యా సంస్థలు, సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థల్లో నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. మాస్టర్స్ డిగ్రీ చేసినవారికి ప్రాధాన్యమిస్తారు.
- **సైంటిస్ట్ బీ:** ఫిజికల్ సైన్సెస్/ కెమికల్ సైన్సెస్లో మాస్టర్స్ డిగ్రీ, డాక్టరేట్ డిగ్రీ చేసినవారికి ప్రాధాన్యమిస్తారు. రీ సెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.

వయసు

సైంటిస్ట్–ఈకి 45 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక ఇలా

- ఎంపిక ప్రక్రియలో భాగంగా సైంటిస్ట్ బీ అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటాయి. రాత పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్నకు మూడు మార్కుల చొప్పున 100 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్–ఏలో సబ్జెక్ట్ సంబంధిత 90 ప్రశ్నలకు– 270 మార్కులు. సెక్షన్–బీలో అనలిటికల్ స్కిల్స్/లాజికల్ రీజనింగ్‌కు చెందిన 10 ప్రశ్నలు – 30 మార్కులకు పరీక్ష ఉంటుంది.



- ఆయా పోస్టులకు సంబంధించి కనీస అర్హత మార్కులు సాధించిన వారిని 1:10 నిష్పత్తిలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీనికి 100 మార్కులు కేటాయించారు. రాత పరీక్షకు 50 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 50 శాతం వెయిటేజీ కల్పిస్తారు. రాత పరీక్ష ఆగస్టులో జరిగే అవకాశం ఉంది.

ఇంటర్వ్యూ

- రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలను ఏఆర్‌సీఎల్, హైదరాబాద్‌లో నిర్వహిస్తారు.
- సైంటిస్ట్–ఈ పోస్టులకు 15–20 నిమిషాల ప్రజెంటేషన్ ఇవ్వాలి. గత ఉద్యోగంలో నిర్వర్తించిన విధులు, రీసెర్చ్ ప్రపోజల్ గురించి వివరించగలగాలి.
- సైంటిస్ట్–సీ పోస్టులకు గత ఉద్యోగ బాధ్యతలకు సంబంధించి 15–20 నిమిషాల ప్రజంటేషన్ ఇవ్వాలి.

వేతనం

ఎంపికైన సైంటిస్–ఈ ఉద్యోగులకు నెలకు రూ.2,38,895, సైంటిస్ట్–సీ వారికి రూ. 1,36,405, సైంటిస్ట్–బీకి రూ.1,14,945. మూల వేతనంగా చెల్లిస్తారు. అలాగే వీరికి అదనంగా డీఏ, హెచ్‌ఎస్‌ఏ, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, ఎన్‌పీఎస్, గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎన్టీసీ, వైద్య సదుపాయాలు కూడా ఉంటాయి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 28.07.2025
- వెబ్‌సైట్: www.arci.res. in/careers

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

» ఏపీలో 691 ఎఫ్‌బీఓ, ఏబీఓ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. ఏపీ ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 691 పోస్టులను భర్తీ చేయనుంది. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి. స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ ఎఫ్‌బీఓ, ఏబీఓ నోటిఫికేషన్, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- **నోటిఫికేషన్:** ఏపీపీఎస్సీ– ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్‌సర్వీస్.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 691
- **పోస్టుల వివరాలు:** ఫారెస్ట్ బీట్ ఆఫీసర్(ఎఫ్‌బీఓ)–256,అసిస్టెంట్ బీట్ ఆఫీసర్(ఏబీవో)–435.

అర్హతలు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత ఉండాలి. దీంతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. పురుష అభ్యర్థులకు కనీసం 163 సెంటీమీటర్ల ఎత్తు, మహిళా అభ్యర్థులకు 150 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు బోనస్ మార్కులు లభిస్తాయి.

వయసు

01.07.2025 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ఐదేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు రూ.25,220–రూ.80,910; అసిస్టెంట్ బీట్ ఆఫీసర్‌కు రూ.23,120–రూ.74,770 వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ టెస్టుల(వాకింగ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్) ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తుది ఎంపికలో.. మెయిన్‌లో సాధించిన మెరిట్‌తోపాటు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టును పరిగణనలోకి తీసుకుంటారు.

150 మార్కులకు స్క్రీనింగ్ టెస్ట్

ఎంపిక ప్రక్రియ తొలి దశలో 150 మార్కులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల విధానంలో జరుగుతుంది. ఇందులో రెండు విభాగాలు పార్ట్ ఏ, పార్ట్ బీ ఉంటాయి. పార్ట్ ఏలో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ నుంచి 75 ప్రశ్నలు–75 మార్కులకు అడుగుతారు. పార్ట్ బీలో జనరల్ సైన్స్ అండ్ జనరల్ మ్యాథమెటిక్స్(ఎస్‌ఎస్‌సీ స్టాండర్డ్) నుంచి 75 ప్రశ్నలు– 75 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 150 నిమిషాలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కును తగ్గిస్తారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులను మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ పరీక్ష ఇలా

- ఎంపిక ప్రక్రియ రెండో దశలో మెయిన్ పరీక్ష ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రైటింగ్‌తోపాటు పేపర్ 1, పేపర్ 2 ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. అర్హత పరీక్ష ఎస్సేను(ఇంగ్లిష్/తెలుగు/ఉర్దూ) డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో ఒక ఎస్సే 50 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. అడవులు, పర్యావరణం సంబంధిత అంశాలపై ప్రశ్న అడిగే అవకాశం ఉంది. ఇందులో సాధించే మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.
- పేపర్ 1లో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ 100 ప్రశ్నలు–100 మార్కులకు నిర్వహిస్తారు. దీనికి కేటాయించిన పరీక్ష సమయం 100 నిమిషాలు.
- పేపర్ 2లో జనరల్ సైన్స్ అండ్ జనరల్ మ్యాథమెటిక్స్(ఎస్‌ఎస్‌సీ స్టాండర్డ్) 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటాయి. దీనికి కేటాయించిన పరీక్ష సమయం 100 నిమిషాలు. ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే పేపర్1, పేపర్2ల్లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కును తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 16.07.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 05.08.2025
- వెబ్‌సైట్: https://psc.ap.gov.in



ప్రిపరేషన్ పక్కాగా

- స్క్రీనింగ్ పరీక్ష పార్ట్ ఏలో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీలో.. జనరల్ సైన్స్, జాతీయ, ఆంధ్రప్రదేశ్ సంబంధిత కరెంట్ అఫైర్స్, భారతదేశ చరిత్ర (ఫోకస్ ఆన్ ఏపీ అండ్ నేషనల్ మూమెంట్), ఆంధ్రప్రదేశ్–ఇండియా జాగ్రఫీ; ఇండియన్ పాలిటీ, ఎకానమీ, మెంటల్ ఎబిలిటీ, సుస్థిరాభివృద్ధి–పర్యావరణ పరిరక్షణ, విపత్తుల నిర్వహణపై ప్రశ్నలు అడుగుతారు. ఇందులో స్కోర్ చేసేందుకు జాతీయ, ప్రాంతీయ తాజా పరిణామాలతోపాటు భారత, ఏపీ చరిత్ర, ఎకానమీ, పాలిటీపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు సైన్స్ రంగంలో తాజా పరిణామాలు, పరిశోధనలు, పర్యావరణం, విపత్తులకు సంబంధించిన సమాచారం సేకరించుకొని ప్రిపరేషన్ సాగించాలి.
- స్క్రీనింగ్ పరీక్ష పార్ట్ బీలోని జనరల్ సైన్స్ అండ్ జనరల్ మ్యాథమెటిక్స్ విభాగంలో... సోర్స్ ఆఫ్ ఎనర్జీ(రెన్యువబుల్, నాన్ రెన్యువబుల్), లివింగ్ వరల్డ్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఎక్స్‌క్రిషన్, రిప్రొడక్షన్–గ్రోత్–హెరిడిటీ అండ్ ఎవల్యూషన్, నేచురల్ రిసోర్సెస్, కార్బన్ కాంపౌండ్స్, ఎన్విరాన్మెంట్ అండ్ ఎన్విరాన్మెంటల్ ప్రాబ్లమ్స్, ఎథనోబాటనీ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అదేవిధంగా జనరల్ మ్యాథమెటి క్స్ నుంచి అర్థిమెటిక్, జామెట్రీ, స్టాటిస్టిక్స్ నుంచి పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు తొమ్మిది, పదో తరగతుల సైన్స్, మ్యాథమెటిక్స్‌పై పట్టు సాధించడం ద్వారా పార్ట్ బీలో మంచి స్కోర్ సాధించే అవకాశముంది.
- స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ సిలబస్ అంశాలు దాదాపు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. మెయిన్‌లో ప్రశ్నలు లోతుగా అడిగే అవకాశముంది. మెయిన్ ఎగ్జామ్ జనరల్ సైన్స్‌లో ద యూనివర్స్–సోలార్ సిస్టమ్, స్పేస్‌కు సంబంధించి ఒక టాపిక్ అదనంగా ఇచ్చారు. అదేవిధంగా మ్యాథమెటిక్స్‌లో అల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, మెన్సురేషన్ టాపిక్స్‌ను అదనంగా చేర్చారు. అభ్యర్థులు స్క్రీనింగ్ సమయంలోనే కొంత లోతుగా అధ్యయనం, ప్రాక్టీస్ చేయడం ద్వారా మొదటి రోజు నుంచి స్క్రీనింగ్, మెయిన్ పరీక్షలకు ప్రిపరేషన్ కొనసాగించే వీలుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

యూసీఎస్ఎల్, కర్ణాటకలో 12 గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్‌లు

కర్ణాటక రాష్ట్రం మాల్పేలో ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్/టెక్నీషియన్(డిప్లొమా)/ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 12.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వెల్డర్స్, ప్లంబర్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరంగ్ డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. » **వయసు:** 16.07.2025 నాటికి 18 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రాడ్యుయేట్ పోస్టులకు రూ. 12,000, టెక్నీషియన్(డిప్లొమా) పోస్టులకు 10,200,ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.8000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హతల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2025
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

స్విమ్స్, తిరుపతిలో 100 నర్సింగ్ అప్రెంటిస్‌లు

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌వీఐఎంఎస్) తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో టెర్షియరీ కేర్ రిఫరల్ సెంటర్ నర్సింగ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 100.
» **అర్హత:** బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(హానర్స్) నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. రాష్ట్ర నర్సింగ్ రిజిస్ట్రేషన్ కౌన్సిల్ ద్వారా నమోదు చేసుకొని ఉండాలి. హిందూ మతానికి చెందిన వారై ఉండాలి. నర్సింగ్ డిగ్రీ 2021 తర్వాత పూర్తిచేసిన వారు మాత్రమే అర్హులు. » **వయసు:** 30.06.2025 నాటికి 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు మొత్తం రూ.21,500(ఎన్‌ఏటీఎస్ ద్వారా రూ.4,500, ఎస్‌వీఐఎంఎస్ ద్వారా రూ.17,000)
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
» **పరీక్ష తేది:** 18.08.2025.
» **ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ తేది:** 19.08.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 20.08.2025.
» **ఫైనల్ సెలక్షన్ లిస్ట్ తేది:** 25.08.2025.
» **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–పౌరశాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–మార్కెటింగ్ అవేర్‌నెస్

మీకు.. ఊబకాయం వస్తుందా?



సాక్షి, స్పెషల్ డెస్క్: ఊబకాయం.. దాదాపు ప్రతి ఇంటా వింటున్న ఆరోగ్య సమస్య. ఇదొక్కటే ఉండదు.. గుండెజబ్బులు, కేన్సర్లు, మధుమేహం లాంటి వాటినీ ఒంటికి తీసుకొస్తుంది. మరి, అలాంటి స్థూలకాయం మనకు వస్తుందో రాదో బాల్యంలోనే తెలిసిపోతే? ఎంచక్కా నివారణ చర్యలు తీసుకోవచ్చు కదా. కేంద్ర ప్రభుత్వం సంస్థ, హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సీసీఎంబీ భాగస్వామిగా ఉన్న ప్రపంచస్థాయి అధ్యయనం ఈ విషయంలో విజయం సాధించింది. వీళ్లు రూపొందించిన పాలిజెనిక్ రిస్క్ స్కోర్ (పీఆర్ఎస్).. స్థూలకాయం ముప్పును ముందే పసిగడుతుంది. పెరిగి పెద్దయ్యాక ఊబకాయం వస్తుందా రాదా అనే విషయాన్ని బాల్యంలోనే తెలుసుకునే కిటుకు దొరికింది. అంటే.. చిన్నప్పుడే తెలిస్తే.. భవిష్యత్తులో స్థూలకాయం రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవచ్చన్నమాట. ఇది ప్రపంచ వ్యాప్తంగా రెండు దశాబ్దాలుగా సాగిన సుదీర్ఘ అధ్యయనం సాధించిన విజయం. ఇందులో భాగంగా స్థూలకాయానికి జన్యుపరమైన కొత్త కారణాలు తెలుసుకునే తెలుసుకునేందుకు, ఐదు సంవత్సరాల వయసు నుంచే ఊబకాయం వచ్చే అవకాశాన్ని అంచనా వేయగల పాలిజెనిక్ రిస్క్ స్కోర్‌ను (పీఆర్ఎస్) రూపొందించారు. ఇందులో మనదేశం నుంచి మైసూరు, ముంబై, పుణే నగరాలకు చెందినవారు పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 51 లక్షల మంది వ్యక్తుల జన్యు సమాచారాన్ని ఉపయోగించి పీఆర్ఎస్ మోడల్ రూపొందించారు. గతంలో రూపొందించిన మోడల్స్ కంటే ఇది రెండింతలు ప్రభావవంతంగా ఉందని తేలింది.

ఊబకాయం ముప్పును బాల్యంలోనే పసిగట్టేలా

500 సంస్థలు చేపట్టిన ప్రపంచ స్థాయి అధ్యయనం


ఇందులో చేతులు కలిపిన 'సీఎస్ఐఆర్-సీసీఎంబీ'

వివిధ దేశాల ప్రజల జన్యు సమాచారంపై పరిశోధన

ఊబకాయంపై చేపట్టిన ఈ అధ్యయనంలో హైదరాబాద్ కు చెందిన సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీఎస్ఐఆర్- సీసీఎంబీ), ఎల్వీ

సీఎస్ఐఆర్-సీసీఎంబీతో సహా

ప్రసాద్ కంటి ఆసు పత్రి, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సహా ప్రపంచ వ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలకు చెందిన 600 మందికి పైగా శాస్త్రవేత్తలు పాలుపంచుకున్నారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న 51 లక్షల మందిలో.. ఆఫ్రికన్లు (4.6%ప్రజలు), అమెరికన్లు (14.4%), తూర్పు ఆసియా (8.4%), ఐరోపా (71.1%), దక్షిణాసియా వాసులు(1.5%) ఉన్నారు. ప్రముఖ జర్నల్ నేచర్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం.. జన్యువుల కారణంగానే ఊబకాయం ముప్పు అత్యధికంగా ఉందని వెల్లడించింది. అంటే తల్లి/తండ్రికి ఈ సమస్య ఉంటే వారసత్వంగా వచ్చే అవకాశాలే అధికం. కానీ వీరు జీవనశైలి మార్పులతో దీన్ని దూరం చేసుకోవచ్చు. అంటే శారీరక శ్రమ చేయడం, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం వంటివి చేయడం ద్వారా బరువును నియంత్రించుకోవచ్చు. కానీ ఎప్పుడైతే ఇవన్నీ వీరు మానేస్తారో మళ్లీ వెంటనే తిరిగి బరువు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం తెలిపింది.



ఐదు సంవత్సరాల వయసులో ఉన్న ఒకరికి.. వారు యుక్త వయసుకు వచ్చేసరికి ఊబకాయం వచ్చే అవకాశం ఉందా లేదా అనే విషయాన్ని అంచనా వేయగల సామర్థ్యం ఈ స్కోర్‌కు ఉంది. ఒక విధంగా చెప్పాలంటే ముందస్తు హెచ్చరిక సాధనంగా పీఆర్ఎస్ పనిచేస్తుంది. అంటే సమస్య వస్తుందని తెలుసు కాబట్టి చిన్నప్పటి నుంచే సరైన ఆహారం, వ్యాయామం ద్వారా సమస్య నుంచి గట్టెక్కవచ్చన్నమాట. ఇప్పటివరకు నిర్వహించిన

ముందస్తు హెచ్చరికగా..


అత్యంత విస్తృత విభిన్న తరాల అధ్యయనాలలో ఇది ఒకటి. యూరోపియన్లలో ఊబకాయానికి కారణమైన జన్యు రకాలు.. భారతీయులపై పెద్దగా ప్రభావం చూపడం లేదని ఈ అధ్యయనంలో గుర్తించారు. భవిష్యత్తులో భారతీయులకు ప్రత్యేకంగా పీఆర్ఎస్ రూపొందించాలని మన శాస్త్రవేత్తలు భావించారు. అంతేకాదు, ఈ స్కోరుతో కేవలం ఊబకాయమే కాదు.. గుండె సంబంధ సమస్యలనూ పసిగట్టవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే, అందుకు పరిశోధనలు చేయాల్సి ఉంది.


- ప్రపంచవ్యాప్తంగా అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నవారి సంఖ్య 1990లో 92.9 కోట్లు. 2021 నాటికి 260 కోట్లకు పెరిగిందని లాన్సెట్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం వెల్లడించింది.
- 2035 నాటికి ప్రపంచ జనాభాలో సగానికి పైగా అధిక బరువు, ఊబకాయం బారిన పడవచ్చని ప్రపంచ ఊబకాయ సమాఖ్య హెచ్చరించింది.
- అధిక బరువు, ఊబకాయం ఉన్న పెద్దలలో సగం కంటే ఎక్కువ మంది చైనా, భారత్, యూఎస్, బ్రెజిల్, రష్యా, మెక్సికో, ఇండోనేషియా, ఈజిప్ట్ దేశాలలో నివసిస్తున్నారు.
- 2035 నాటికి 79% పెద్దలు, 88% మంది పిల్లలు ఊబకాయం, అధిక బరువుతో తక్కువ-మధ్య ఆదాయ దేశాలలో నివసిస్తారు. 7% దేశాలు మాత్రమే ఊబకాయంతో ముడిపడిన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి తగిన ఆరోగ్య వ్యవస్థలను కలిగి ఉన్నాయి.


టుడేస్ గ్రాఫిక్..


ప్రపంచవ్యాప్తంగా వెబ్ బ్రౌజర్ల మార్కెట్ లీడర్‌గా కొనసాగుతున్న ఆల్ఫాబెట్‌కు చెందిన గూగుల్ క్రోమ్‌కు సవాల్ విసిరేందుకు టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఎన్విడియాకు చెందిన పర్ప్లెక్సిటీ ఏఐ సిద్ధమవుతోంది. త్వరలోనే కామెట్ పేరుతో ఏఐ ఆధారిత సామర్థ్యంగల వెబ్ బ్రౌజర్‌ను తీసుకురానుంది. మార్కెట్.యూఎస్ అనే సంస్థ నివేదిక ప్రకారం 2024లో 4.5 బిలియన్ డాలర్లుగా ఉన్న ఏఐ ఆధారిత వెబ్ బ్రౌజర్ల మార్కెట్.. 2034 నాటికి 76.8 బిలియన్ డాలర్లకు చేరుకొనే అవకాశం ఉంది. స్టాట్‌కౌంటర్ అనే సంస్థ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచ వెబ్ బ్రౌజర్ల మార్కెట్‌లో క్రోమ్ 68 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రపంచంలోనే అత్యధికం మంది యూజర్లు ఉపయోగిస్తున్న వెబ్ బ్రౌజర్‌గా మార్కెట్‌ను సుస్థిరం చేసుకొని ఇతర ప్రముఖ వెబ్ బ్రౌజర్లయిన సఫారీ, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్, ఫైర్‌ఫాక్స్‌కు అందనంత ఎత్తులో ఉంది.











యూజర్లకు లభించేవి ఇవీ..

సాధారణ బ్రౌజర్లతో పోలిస్తే ఏఐ ఆధారిత బ్రౌజర్లు యూజర్లు కోరిన కంటెంట్‌ను సంక్షిప్తంగా అందించగలవు. అలాగే టాస్క్‌లను ఆటోమేట్ చేయగలవు. ఉదాహరణకు ఈ-మెయిళ్లకు ఆటోమేటిక్‌గా రిప్లైలు పంపడం, సోషల్ మీడియా పోస్టులను షెడ్యూల్ చేయడం, దరఖాస్తుల్లోని డేటాను సంగ్రహించడం లాంటివి అన్నమాట. ముఖ్యంగా సందర్భానుసారంగా జవాబులు అందించగలవు. అంటే యూజర్లు అందించే ఇన్‌పుట్‌లు, డేటా హిస్టరీని పరిగణనలోకి తీసుకొని, వాటిని విశ్లేషించి జవాబులను అందించడం, వివిధ డేటా సోర్స్‌ల నుంచి సమాచారాన్ని క్రోడీకరించి నేరుగా సమాధానాలు ఇవ్వడం చేయగలవు. అపాయింట్‌మెంట్‌ల బుకింగ్‌లు, ఉత్పత్తులను పోల్చడం వంటి సంక్లిష్ట పనులను కూడా చక్కబెట్టగలవు. - సాక్షి, సెంట్రల్‌డెస్క్

క్లుప్తంగా...

వైద్యారోగ్యశాఖలో పదోన్నతుల జాతర

తాజాగా 309 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖలో పదోన్నతుల జాతర సాగుతోంది. వైద్య కళాశాలలు, టీచింగ్ ఆస్పత్రుల్లో పెద్దఎత్తున పదోన్నతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 44 మంది ప్రొఫెసర్లకు అదనపు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్‌లు కూడా ఇచ్చింది. తాజాగా బుధవారం 309 మంది అసోసియేటెడ్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 33 స్పెషాలిటీ విభాగాల్లో వీరికి పదోన్నతులు ఇవ్వడంతోపాటు పోస్టింగ్‌లు కూడా ఇచ్చింది.

త్వరలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా..

అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా నియమిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిలో అర్హులైన వారిని అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించేందుకు ఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. వీరికి పదోన్నతి ఇచ్చే ముందు కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరపాలని నిర్ణయించింది. ఇటీవల 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. దీనికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆర్థికశాఖ మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆమోదం తెలపడంతో త్వరలో నోటిఫికేషన్ ఇచ్చే పనిలో వైద్యారోగ్య శాఖ ఉంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకంతోపాటు ఉన్న వారిని సీనియారిటీ ప్రకారం అసోసియేటెడ్ ప్రొఫెసర్లుగా నియమించాలని నిర్ణయించారు.

కిడ్నీ రాకెట్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: అంతర్రాష్ట్ర కిడ్నీ ముఠాకు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రధారులను రాష్ట్ర సీఐడీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అక్రమ కిడ్నీ శస్త్ర చికిత్సల కేసులో సీఐడీ అధికారులు మొత్తం 19 మందిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కీలక సూత్రధారులు పాములపాటి పవన్, ప్రదీప్‌కుమార్ గుప్తాను తాజాగా అరెస్టు చేసినట్లు సీఐడీ చీఫ్, అదనపు డైరెక్టర్ జనరల్ చారు సిన్హా తెలిపారు. కిడ్నీ రాకెట్‌కు చెందిన ముఠాలో 17 మంది నిందితులను ఇదివరకే అరెస్టు చేశామన్నారు. పవన్ .. తమిళనాడులో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండే వారిని గుర్తించి, వారికి డబ్బు ఆశ చూపించి.. కారు చౌకగా కిడ్నీలు తీసుకునే వాడన్నారు. ఇతను ఒక్కో కిడ్నీకి రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు కమిషన్‌గా తీసుకునే వాడని పేర్కొన్నారు. అలాగే ప్రదీప్‌కుమార్ గుప్తా ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్రలలో డబ్బు కోసం కిడ్నీ ఇచ్చే వారిని గుర్తించే వాడని తెలిపారు. ఇద్దరు కీలక నిందితులను కోర్టు ముందు హాజరు పరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ సికింద్రాబాద్ బెంచ్ మెంబర్‌గా జాన్ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ సికింద్రాబాద్ బెంచ్ గౌరవ సభ్యుడి (టెక్నికల్)గా జాన్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ 1986 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇంతకుముందు అమరావతి బెంచ్‌లోని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో మెంబర్‌గా పనిచేశారు. అంతకుముందు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్, నైరుతి రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్, హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. చెన్నైలోని సదరన్ రీజియన్ కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కూడా పనిచేశారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి జాన్ ప్రసాద్ పొలిటికల్ సైన్స్‌లో పీజీ పట్టా పొందారు.

అది అటవీ భూమి కానే కాదు

కంచ గచ్చిబౌలిపై సుప్రీంకోర్టులో సర్కార్ అఫిడవిట్

సీఈసీ నివేదిక లోపభూయిష్టంగా ఉంది

రెండు దశాబ్దాలుగా స్టేటస్‌కోతో చెట్లు పెరిగాయి..

అంతమాత్రాన అటవీ భూమిగా పరిగణించలేం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ భూమి కానే కాదని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అదనపు అఫిడవిట్ దాఖలు చేసింది. కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) దాఖలు చేసిన నివేదిక లోపభూయిష్టంగా ఉందని వెల్లడించింది. వ్యాజ్యాల కారణంగా రెండు దశాబ్దాలుగా స్టేటస్‌కో ఆదేశాలు ఉండటంతో చెట్లు పెరిగాయని, అంతమాత్రాన అటవీ భూమిగా పేర్కొనడం సరికాదంది. గతంలో ఎప్పుడూ రాని 'అటవీ'ప్రస్తావన ఇప్పుడే తెరపైకి రావడం విడ్డూరమని చెప్పింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ సాగింది. మే 14న సీఈసీ సమర్పించిన అనుబంధ నివేదికపై ప్రభుత్వం తరపున ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అఫిడవిట్ దాఖలు చేశారు.

ఊహలతో సీఈసీ నివేదిక..

'గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో మొత్తంగా 2,374.02 ఎకరాల భూమి ఉంది. అందులో 400 ఎకరాలపై వివాదం నెలకొంది. ఎలాంటి ఆధారాలు లేకుండా సీఈసీ పదేపదే అటవీ భూమి అని, డీమ్డ్ ఫారెస్ట్ అని పేర్కొనడం ఆక్షేపణీయం. ఆ భూమిని ఎప్పుడు కూడా అడవిగా ప్రకటించలేదు. అధ్యయనం లేకుండా ఊహలతో సమర్పించిన సిఫార్సులు ప్రతికూల ప్రభావం చూపుతాయి. 'అటవీ భూమి' లేదా 'డీమ్డ్ ఫారెస్ట్'కేటగిరీలోకి వస్తుందన్న నివేదిక వాస్తవ దూరం. 1954-55 నాటి ఖాస్రా పహాణీలో ఈ భూమి 'కంచ పోరంబోక్ సర్కారీ'గా నమోదై ఉంది. రెవెన్యూ రికార్డు ప్రకారం ఆ భూమిని ప్రభుత్వ యాజమాన్యంలో మేత, బంజరు భూమిగా వర్గీకరిస్తారు. అటవీ భూమిగా ఎప్పుడూ నోటిఫై చేయలేదు. 'కంచ'అనేది వ్యవసాయేతర, ప్రజా ప్రయోజనాల కోసం సాధారణంగా ఉపయోగించే సాగు చేయని, బంజరు భూమి. 'సర్కారీ'అనే పదం ప్రభుత్వ భూమిగా హోదాను నిర్ధారిస్తుంది. ఆ భూమిని సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధి అధికార పరిధిలోకి తెచ్చారు. తర్వాత ఈ అథారిటీని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో విలీనం చేశారు. ఆ తర్వాత భూమి హెచ్ఎండీఏ నియంత్రణలోకి వచ్చింది. అయితే, 2007 నుంచి 2024 వరకు దీర్ఘకాలిక వ్యాజ్యాల కారణంగా అక్కడ అభివృద్ధి నిలిచిపోయింది.



చెట్ల పెంపకానికి కట్టుబడి ఉన్నాం

'వన (సంరక్షణ్) నిబంధనలు-2023 కింద రూపొందించిన నియమాలకు కట్టుబడి తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోంది. కోర్టు ఆదేశాల మేరకు వివాద భూముల్లోనూ చెట్ల పెంపకానికి అన్ని ఏర్పాట్లు చేశాం. టీజీఐఐసీ ద్వారా వివిధ పారిశ్రామిక ఎస్టేట్‌లు, అభివృద్ధి కారిడార్‌లలో విస్తృతంగా మొక్కల పెంపకం డ్రైవ్‌లను నిర్వహిస్తున్నాం. హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. 400 ఎకరాల భూమి అభివృద్ధికి అనుకూలంగా ఉంది. నగరం 2024లోనే 70కి పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఆకర్షించింది. 84వేల మందికి ఉపాధి అవకాశాలతో రూ.16వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనలున్నాయి. 'అడవి'లేదా అలా అనిపించే భూములను గుర్తించడానికి జియోస్పేషియల్ ఇమేజరీ, సంబంధిత ప్రభుత్వ రికార్డులను సమీక్షించడంలో చురుకుగా పనిచేస్తుంది. వీలైనంత త్వరగా కేసు పరిష్కరించాలి'అని సీఎస్ విజ్ఞప్తి చేశారు.

స్టేటస్ కో ఆదేశాలతో వృక్ష సంపద, పచ్చదనం ఏర్పడింది. అది ఏ భూమిలోనైనా సహజం. పొదలు, గడ్డి, చెట్లు పెరిగినంత మాత్రాన అడవిగా పేర్కొనలేం. ఈ రెండు దశాబ్దాల్లో ఎవరూ అటవీ భూమిగా పేర్కొనలేదు. ఇప్పుడు కొత్తగా ఈ వాదన తెరపైకి తెచ్చారు. 2006 నుంచి భూమికి సంబంధించి ఉపగ్రహ చిత్రాలను కూడా సమర్పిస్తున్నాం' అని సీఎస్ నివేదించారు.

..బుల్డోజర్లు ఎందుకు?

▶ మొదటి పేజీ తరువాయి

తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

తాజా నివేదికను దాఖలు చేశాం

ప్రస్తుతం కంచ గచ్చిబౌలిలో అన్ని పనులను నిలిపేసినట్లు ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ ధర్మాసనానికి తెలిపారు. అక్కడ ఎటువంటి పనులు జరగట్లేదని, కోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా పాటిస్తుందని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి సమగ్ర అంశాలతో కూడిన నివేదికను కోర్టులో దాఖలు చేశామన్నారు. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌ను పరిశీలించేందుకు తమకు సమయం కావాలని అమికస్ క్యూరీ పరమేశ్వర్, దామా శేషాద్రినాయుడు, పి.మోహిత్ రావు, ఎస్.నిరంజన్ రెడ్డి ధర్మాసనాన్ని కోరారు. దీంతో వచ్చే వారం వాదనలు వింటామని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. దీనిపై స్పందించిన... ప్రతివాదులు మరింత సమయం కావాలని కోరగా.. ఆగస్టు 13కు తదుపరి విచారణను వాయిదా వేశారు. పర్యావరణ అంశాలపై సుప్రీంకోర్టుకు సహాయం చేసేందుకు కేంద్ర సాధికారక కమిటీ (సీఈసీ) స్వయంగా ఆ ప్రదేశాన్ని సందర్శించి తమకు నివేదిక సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

మేం అడవులను కాపాడాం

'సరే ప్రస్తుతానికైతే అటవీ భూమిని కాపాడారు కదా?'అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ధర్మాసనం అడిగింది. అది అటవీ భూమా.. కాదా?' అనే అంశంపై మరోసారి విచారణ జరగాల్సిన అవసరం ఉందని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'ఏదేమైనా సరే ప్రస్తుతానికి ఆ స్థలంలో చెట్లు సంరక్షించబడ్డాయి. అభివృద్ధి కోసం అడవులను నరకడం అనేది సమంజసం కాదు. సుస్థిర అభివృద్ధిని నేను వ్యక్తిగతంగా సమర్థిస్తాను. అంటే దానర్థం రాత్రికిరాత్రి 30-40 బుల్డోజర్లను పెట్టి మొత్తం అడవిని ధ్వంసం చేయడాన్ని సమర్థిస్తానని మాత్రం కాదు' అని అన్నారు. అటవీ భూమిని కాపాడకపోతే అధికారులను అక్కడే టెంపరరీ జైలుకు పంపుతామని గతంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అడవుల ను సంరక్షించాలా లేదా మీ అధికారులను జైలుకు పంపాలా అనే దానిపై నిర్ణయం తీసుకోండి అని జస్టిస్ గవాయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ ఏడాదినుంచే యూజీ, పీజీ కోర్సులు

- బోధనకు సిద్ధంగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీ
- సిబ్బంది, సౌకర్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారుల సమీక్ష

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం నుంచే యూజీ, పీజీ కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఇటీవల మంజూరైన ఈ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం ఏ కోర్సులు ప్రారంభించాలి, విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి, తక్షణం ఎంతమంది సిబ్బంది అవసరం తదితర అంశాలపై బుధవారం కొత్తగూడెంలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యాశాఖ అధికారులు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా కొత్తగూడెంలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కాలేజీని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం మూడు విశాలమైన లెక్చర్ హాళ్లు, మూడు సెమినార్ హాళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో సెమినార్ హాళ్లను ల్యాబ్‌లుగా ఉపయోగించుకునే వీలుంది. దీంతో ఈ గదుల్లో ఈ ఏడాది యూజీలో కనీసం రెండు కోర్సులు, పీజీలో రెండు కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా..

డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి 'దోస్త్'లో మూడో విడత అడ్మిషన్లు పూర్తి కావొస్తున్నాయి. ఆగస్టు మొదటి వారంలో చివరి విడత అడ్మిషన్లు జరగనున్నాయి. అప్పటిలోగా ఈ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం ప్రారంభించబోయే కోర్సులు, టీచింగ్ స్టాఫ్, మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్ని నిధులు అవసరం అవుతాయనే అంశాలపై తుది నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు, యూనివర్సిటీల వీసీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా యూనివర్సిటీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. సమీక్షలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు విద్యాశాఖ కార్యదర్శి, యూనివర్సిటీ వీసీ యోగితారాణా, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేశ్, కాకతీయ, అంబేడ్కర్ యూనివర్సిటీల వీసీలు ప్రతాపరెడ్డి, ఘంటా చక్రపాణి, వర్సిటీ రిజిస్ట్రార్ వి.రామచంద్రం పాల్గొన్నారు.



యూనివర్సిటీ వద్ద మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మంచి కాలేజీకే మొగ్గు!

- సాధారణ ఇంజనీరింగ్ కాలేజీలపై విద్యార్థుల అనాసక్తి

సాక్షి, హైదరాబాద్: కొన్ని కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలో సీటు వచ్చినా విద్యార్థులు ససేమిరా అంటున్నారు. మంచి కాలేజీ వస్తేనే చేరుతాం అంటున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు. ఏకంగా 12,224 మంది ఇంజనీరింగ్ కంప్యూటర్, ఐటీ కోర్సుల్లో సీట్లు వచ్చినా చేరలేదు. జిల్లాలు, రాజధాని పరిసర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. టాప్ 20 తర్వాత కాలేజీల్లో సీట్లు పెద్ద ఎత్తున మిగిలిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లోనైతే 50 శాతం సీట్లు కూడా భర్తీ అవ్వలేదు. రాష్ట్రంలో కన్వీనర్ కోటా కింద 83,054 ఇంజనీరింగ్ సీట్లున్నాయి. తొలి రౌండ్‌లో 77,561 సీట్లు కేటాయించారు. సీట్లు వచ్చిన వాళ్ళు ఈ నెల 22లోగా రిపోర్టు చేయాల్సి ఉండగా..అన్ని బ్రాంచీలకు కలిపి 59,980 మంది మాత్రమే సెల్ఫ్ రిపోర్టు చేశారు. అంటే కేటాయించిన సీట్లలో 17,581 భర్తీ కాలేదన్నమాట. కాగా తొలి రౌండ్‌లో కేటాయించని సీట్లు కలిపితే మొత్తం 23,074 సీట్లు మిగిలిపోయాయి.

వీళ్లు ఆ కాలేజీల జోలికే వెళ్లలేదు..

ఎప్‌సెట్‌లో 20 వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు టాప్ 25 తర్వాత ఉన్న కాలేజీలకు అసలు ఆప్షన్లే ఇవ్వలేదు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఈ ర్యాంకు పొందిన వాళ్ళు 13,680 మంది ఉన్నారు. 20 నుంచి 30 వేల ర్యాంకు వచ్చిన విద్యార్థులు 13,967 మంది ఉన్నారు. వీళ్ళు టాప్ 25 నుంచి 50 కాలేజీలకు మూడు, ఆపైన ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో సీట్లు వచ్చినా 90 శాతం మంది చేరేందుకు ఇష్టపడలేదు. కంప్యూటర్ సైన్స్ కోర్సులే వచ్చినా ససేమిరా అన్నారు. 50 నుంచి లక్ష ర్యాంకు ఉన్న విద్యార్థులు 25,096 మంది ఉన్నారు. వీళ్ళు అన్ని కాలేజీలకు ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 15 వేల మందికి సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు వచ్చాయి. లక్ష నుంచి 1.50 లక్షల ర్యాంకులు వచ్చిన వాళ్ళు 17,753 మంది అన్ని కాలేజీల్లో కంప్యూటర్‌తో పాటు, ఇతర బ్రాంచీలకు ఆప్షన్లు ఇచ్చారు. 1.50 లక్షలపైన ర్యాంకర్లు 739 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. వీళ్ళు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినా.. మరో రౌండ్ కోసం నిరీక్షిస్తున్నారు. మంచి కాలేజీ వస్తుందని ఆశిస్తున్నారు.

తొలి రౌండ్ తర్వాత కొన్ని ముఖ్యమైన బ్రాంచీల వారీగా మిగిలిపోయిన సీట్ల వివరాలు..

బ్రాంచీ	అందుబాటులో	కేటాయించినవి	భర్తీ	మిగిలినవి	మొత్తంగా మిగిలినవి
సీఎస్ఈ, ఐటీ, ఎమర్జింగ్	58742	57042	44798	12224	13944
ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్	16112	14054	10594	3460	5518
మెకానికల్, సివిల్	7100	5632	3943	1689	3157

12,055 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో వివిధ కేటగిరీల కింద పనిచేస్తున్న 12,055 మంది కాంట్రాక్టు, ఫిక్స్‌డ్ టెన్యూర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది సర్వీసును వచ్చే మార్చి 31 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలు, కార్యక్రమాల అమల్లో భాగంగా పీఆర్ ఆర్‌డీ శాఖలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల వారికి ఊరట లభించినట్లు అయింది. ఈ ఏడాది మార్చి 31తోనే వీరి కాంట్రాక్ట్, సర్వీసు పరిమితి ముగియగా.. ఏప్రిల్ 1 నుంచి వచ్చే మార్చి 31 దాకా పొడిగించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ పంపించిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. ఇందుకు అనుగుణంగా బుధవారం ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

ఆగస్టు 16న భారత్ గౌరవ్ స్పెషల్ టూరిస్టు రైలు

జ్యోతిర్లింగ క్షేత్రాలతోపాటు అంబేడ్కర్ జన్మస్థలం సందర్శన

సాక్షి, హైదరాబాద్: జ్యోతిర్లింగ క్షేత్రాలతోపాటు అంబేడ్కర్ జన్మస్థలం, ఆయన బౌద్ధమతం స్వీకరించిన ప్రాంతాలను చుట్టివచ్చేలా ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును ప్రకటించింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఆగస్టు 16న ప్రారంభమయ్యే ఈ రైలు టూర్ 24వ తేదీ వరకు (8 రాత్రులు-9 రోజులు) కొనసాగుతుంది. ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగాలను, నాగ్‌పూర్‌లోని శ్రీ స్వామినారాయణ మందిరం, నాసిక్ త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, పుణేలోని భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర్ జ్యోతిర్లింగ క్షేత్రాలతోపాటు మోవ్ వద్ద అంబేడ్కర్ జన్మస్థలం, ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించిన దీక్షా భూమి స్తూపం ప్రాంతాలను కూడా చుట్టి వస్తుంది. సికింద్రాబాద్‌తోపాటు కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్ఖేడ్, నాందేడ్ - పూర్ణ తదితర స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. ఆయా ప్రాంత పర్యాటకులు ఆ స్టేషన్లలోనే రైలు ఎక్కి, దిగేందుకు వీలుంటుంది. ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతి ఉంటుందని పేర్కొంది. పర్యాటకులకు అవసరమైన ఎస్కార్ట్ భద్రత (సీసీటీవీ కెమెరాలు సహా) ఉంటుందని వివరించింది. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సౌకర్యం, ప్రయాణ బీమా వసతి ఉంటుందని తెలిపింది.

డబుల్/ట్రిపుల్ షేర్‌టికెట్ ధరలు

స్లీపర్ రూ. 14,700 (నాన్ ఏసీ హోటల్ గది - షేరింగ్), 3 ఏసీ రూ. 22,900 (ఏసీ హోటల్ గది - షేరింగ్), 2 ఏసీ రూ. 29,900 (ఏసీ హోటల్ గది నాన్ షేరింగ్), పిల్లల(5-11 వయసు)కు స్లీపర్ రూ.13,700, 3 ఏసీ రూ. 21,700, 2ఏసీ రూ. 28,400 బుకింగ్ కోసం: 9701360701, 9281030712, 9281030711 నంబర్లలో.. ఆన్‌లైన్ బుకింగ్‌ల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్: www.irctctourism.comను సందర్శించవచ్చని ఐఆర్‌సీటీసీ సూచించింది.

రచయిత మోహన్ గురుస్వామికి 'జైపాల్‌రెడ్డి డెమోక్రసీ' అవార్డు

26న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ రచయిత మోహన్ గురుస్వామి 'జైపాల్‌రెడ్డి డెమోక్రసీ'అవార్డుకు ఎంపికైనట్లు ఇక్ఫాయ్ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవి శేఖర రాజు తెలిపారు. ఇక్ఫాయ్ లా స్కూల్, క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు వెల్లడించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కె.పురుషోత్తం రెడ్డి, ఇక్ఫాయ్ డైరెక్టర్ సుధాకర్ రావుతో ఆయన మాట్లాడారు. క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ తరపున మరో 14 మంది దేశానికి న్యాయ రంగంలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలను అభినందించాలనే లక్ష్యంతో అవార్డులను అందించనున్నట్టు వెల్లడించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 24-7-2025




ప్రపంచం మెచ్చినా.. పాలకులు మెచ్చలే..!

- సౌకర్యాలకు నోచుకోని భూదాన్ పోచంపల్లి
- ప్రతిపాదనలకే పర్యాటకాభివృద్ధి
- నిరాశతో వెనుదిరుగుతున్న పర్యాటకులు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిని ప్రపంచం మెచ్చినా మన పాలకులు మాత్రం మెచ్చలేదు. యునెస్కో అనుబంధ ప్రపంచ పర్యాటక సంస్థ.. పోచంపల్లికి ఉత్తమ టూరిజం విలేజ్ అవార్డు అందజేసింది. కానీ ప్రభుత్వాలు మాత్రం ఇక్కడ టూరిజం అభివృద్ధికి తీసుకొన్న చర్యలు శూన్యం. రూరల్ టూరిజం కేంద్రంగా పోచంపల్లి సరైన గుర్తింపునకు నోచుకోలేదు. ఈ సంవత్సరం మే 15న.. భూదాన్‌పోచంపల్లిలో 25 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారుల బృందం పర్యటించింది. స్థానిక టూరిజం పార్కులో చేనేత ఇక్కత్ వస్త్రాలతో మోడల్స్‌తో ర్యాంప్‌వాక్ నిర్వహించారు. మిస్ వరల్డ్ పోటీదారుల రాకతో.. పోచంపల్లి ఇక్కత్‌కు మరింత గుర్తింపు వచ్చి కార్మికుల ఉపాధి మెరుగవుతుందని భావించారు. ప్రచార ఆర్భాటాలే తప్ప, కార్మికుల ఉపాధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. మార్కెట్ మందగించి వస్త్రాలను కొనుగోలు చేసేవారు లేక మాస్టర్‌వీవర్స్, ఇక్కత్ వస్త్ర వ్యాపారులు దివాలా తీస్తున్నారు. రూ.కోట్ల విలువైన వస్త్రాల నిల్వలు పేరుకుపోతున్నాయి. సహకార సంఘాల నుంచి టెస్కో అరకొర వస్త్రాలను కొనుగోలు చేస్తుండగా, సహకారేతర రంగాల్లోని వ్యాపారులు గిరాకీ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



పోచంపల్లి పర్యాటక కేంద్రం



పోచంపల్లికి బహూకరించిన ఉత్తమ టూరిజం విలేజ్ అవార్డు

పేరుకే పర్యాటకం..

2007లో పోచంపల్లి చెరువు సమీపంలో గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు రెస్టారెంట్, సరైన వసతి సౌకర్యాలు కల్పించలేదు. దాంతో పోచంపల్లికి వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమంగా తగ్గింది. గత ప్రభుత్వ హయాంలో పోచంపల్లిని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ మాదిరిగా.. మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది, చెరువులో బోటింగ్, చెరువు మధ్యలో ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి, భూదానోద్యమ పిత ఆచార్య వినోబాభావే విగ్రహాలను ఏర్పాటు చేసి లేజర్ షో నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. రామోజీ ఫిల్మ్ సిటీ నుంచి వయా పోచంపల్లి మీదుగా యాదగిరిగుట్ట వరకు టూరిజం బస్సులను నడపడం ద్వారా.. పోచంపల్లి పర్యాటకానికి కొత్త ఊపు తీసుకురావాలని భావించినా కార్యరూపం దాల్చలేదు.

75 దేశాలతో పోటీపడి..

భూదానోద్యమంతో చరిత్ర పుటల్లోకి ఎక్కి, ఇక్కత్ వస్త్రాల తయారీ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందిన భూదాన్‌పోచంపల్లికి 2021లో ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా పనిచేస్తున్న ప్రపంచ పర్యాటక సంస్థ (యూఎన్‌డబ్ల్యూటీవో) బెస్ట్ టూరిజం విలేజ్ అవార్డు అందజేసింది. ప్రపంచ వ్యాప్తంగా 75 దేశాల నుంచి 170 ప్రతిపాదనలు వచ్చాయి. గ్రామీణ టూరిజం, అక్కడి ప్రజల జీవన శైలి, సంస్కృతి సంప్రదాయాలను వినూత్న పద్ధతిలో ప్రపంచానికి తెలియజేసినందుకు.. మన దేశంలో తెలంగాణ నుంచి పోచంపల్లికి బెస్ట్ టూరిజం విలేజ్‌గా అరుదైన గౌరవం లభించింది. డిసెంబర్ 2, 2021లో స్పెయిన్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ 24వ జనరల్ అసెంబ్లీ సమావేశంలో భారత్ తరఫున.. స్పెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం రెండో కార్యదర్శి సుమన్‌శేఖర్ అవార్డును స్వీకరించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన పోచంపల్లిని తిలకించేందుకు వచ్చే దేశ, విదేశీ పర్యాటకులు చూడదగ్గ ప్రదేశాల్లేక నిరుత్సాహంతో వెనుదిరిగి పోతున్నారు. ప్రభుత్వాలు పర్యాటక కేంద్రంలో కనీస మౌలిక వసతులు కల్పించలేదు.



పోచంపల్లిని సందర్శించిన మిస్‌వరల్డ్ పోటీదారుల బృందం (ఫైల్)



పోచంపల్లిలో నిర్వహించిన ఫ్యాషన్‌షోలో పాల్గొన్న మోడల్స్ (ఫైల్)



పోచంపల్లి పర్యాటక కేంద్రాన్ని సందర్శించిన విదేశీ పర్యాటకులు (ఫైల్)

పర్యాటకాభివృద్ధి చేయాలి



జాతీయ రహదారులు, ముఖ్య ప్రదేశాలలో పోచంపల్లి ప్రాధాన్యాన్ని తెలిపే హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి. పోచంపల్లిలో చెరువుకట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి. పర్యాటకులను ఆకర్షించేలా జాతీయ రహదారి నుంచి పోచంపల్లి పట్టణం వరకు రోడ్డు వెంట చేనేత ప్రాధాన్యం తెలిపే స్వాగత ద్వారాలను ఏర్పాటు చేయాలి. పోచంపల్లి టూరిజం పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దాలి.

– వేముల సుమన్, భూదాన్ పోచంపల్లి

ఇక్కత్‌పై ప్రచారం పెంచాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలపై ప్రచారం పెంచాలి. టీవీ యాంకర్లు, సెలబ్రిటీలు, హీరోయిన్లను బ్రాండ్ అంబాసిడర్స్‌గా నియమించి వస్త్రాలను ప్రమోట్ చేయాలి. ఎయిర్‌పోర్టుల వద్ద పోచంపల్లి ఇక్కత్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి. ఇటీవల మిస్‌వరల్డ్ పోటీదారులు రావడం వల్ల పోచంపల్లికి పేరు వచ్చింది తప్ప, వ్యాపారం పెరగలేదు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా మేము నేసిన చీరలను ప్రదర్శిస్తూ అమ్ముకొంటున్నాం.

–రచ్చ సురేశ్, చేనేత వ్యాపారి, భూదాన్ పోచంపల్లి

పార్లమెంట్‌లో తెలంగాణ

సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణకు ప్రాధాన్యం

ఎంపీలు చామల, అర్వింద్ ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన కేంద్రం





సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సెమీకండక్టర్, డిస్‌ప్లే తయారీ వ్యవస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇండియా సెమీకండక్టర్ మిషన్'కింద తెలంగాణకు విశేష ప్రాధాన్యం లభిస్తోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు పలు ప్రాజెక్టుల పరిశీలన జరుగుతోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద బుధవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్, క్రిస్టల్ మ్యాట్రిక్స్ ప్రాజెక్టులను ఇండియా సెమీకండక్టర్ మిషన్ పరిధిలో పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

రైల్వే సురక్షకు 'కవచ్' వేగంగా విస్తరణ

ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి సమాధానం

దుర్ఘటనల నివారణకు భారతీయ రైల్వేలు స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన 'కవచ్'వ్యవస్థ అమలు వేగం పుంజుకుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. 2025 జూలై 14 వరకు కవచ్ అమలులో జరిగిన పనుల పురోగతిని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ లోక్‌సభ వేదికగా రైల్వే శాఖ తెలిపింది. ఇప్పటికే అనేక కీలక పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2025 జూన్ వరకు కవచ్ పనులపై రూ.2015 కోట్లు ఖర్చు చేయగా... 2025–26 సంవత్సరానికి రూ.1673.19 కోట్లు కేటాయించామని కేంద్రమంత్రి తెలిపారు.

స్పష్టమైన విధానంతో సింగరేణి బొగ్గు విక్రయాలు

కడియం కావ్య ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానం

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ద్వారా బొగ్గు విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టత ఇచ్చింది. పబ్లిక్, ప్రైవేట్ రంగాలకు బొగ్గు అందించడంలో కేంద్రం రూపొందించిన వివిధ విధానాలను సింగరేణి అనుసరిస్తోందని..ఇవి పారదర్శకతతోపాటు రాష్ట్రాల ఆదాయవృద్ధికి దోహదం చేస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. బొగ్గు అమ్మకాల ద్వారా వ్యాపార అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పన్నుల రూపంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు లాభాలు దక్కుతున్నాయా అని కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

ఆమె కల్వకుంట్ల కవిత కాదు.. కన్ఫ్యూజన్ కవిత

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కల్వకుంట్ల కవిత కాదని, ఆమె కన్ఫ్యూజన్ కవిత అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు. కన్ఫ్యూజన్‌లో ఉండబట్టే ఆమె ప్రతిపక్ష నాయకుడి మీద చేయాల్సిన కామెంట్లను రాష్ట్ర ముఖ్యమంత్రిపై చేశారని విమర్శించారు. బుధవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవిత చెప్పినట్టు రేవంత్‌రెడ్డి ఫైట్‌మోడ్ సీఎం కాదని, పబ్లిక్‌మోడ్, పవర్‌మోడ్ సీఎం అని పేర్కొన్నారు. కానీ అసెంబ్లీ ఎన్నికలు అయిపోయినప్పటి నుంచి కవిత తండ్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో స్లీప్ మోడ్‌లో ఉన్నారని, ఆయనే ఫైట్‌మోడ్ ప్రతిపక్ష నేత అని ఎద్దేవాచేశారు. కేటీఆర్ సైలెంట్ మోడ్ అయితే, హరీశ్‌రావు పాజ్‌మోడ్ అని, సంతోష్‌రావు మిస్సింగ్ మోడ్ అయితే బీఆర్ఎస్ పార్టీ డిస్మాండల్ మోడ్ అని బల్మూరి వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్‌ను ముందు ఫైట్ మోడ్‌నుంచి పబ్లిక్ మోడ్‌లోకి రమ్మని చెప్పాలని కవితకు సూచించారు. బీసీ బిల్లును స్వాగతించిన కవిత ఆ బిల్లును ఆమోదించుకునేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం గురించి కామెంట్ చేయడం ఆమె ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. బీసీలకు న్యాయం జరగాలని ఆమె కోరుకుంటే సీఎం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతించాలని హితవు పలికారు.

కాంగ్రెస్ బీసీ ద్రోహి: కాసం వెంకటేశ్వర్లు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నీచ రాజకీయాలు పరాకాష్టకు చేరాయని, ఆ పార్టీ బీసీ ద్రోహిగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ మండిపడ్డారు. ముస్లింలకు బీసీ ముసుగు వేసి రిజర్వేషన్‌లు ఇస్తామంటే బీజేపీ ఒప్పుకోదన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు న్యాయ నిపుణుడిగా రిజర్వేషన్లపై తలెత్తబోయే పరిస్థితులను ప్రస్తావించారని తెలిపారు. తమ అధ్యక్షుడు లేవనెత్తిన చట్ట, న్యాయపరమైన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కోర్టులో న్యాయబద్ధంగా నిలబడే ఆర్డినెన్స్‌ను తీసుకురావాలన్నారు. అందుకు భిన్నంగా ధర్మం, న్యాయం, చట్టాలను ఉల్లంఘించి మంత్రులు, నేతలు మాట్లాడటం ఏంటని వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రకరకాల వాదనలు చేస్తూ తెలంగాణ ప్రజల్ని అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి లేదా ఆ పార్టీ నేతలకు, బీసీ డిక్లరేషన్ రాసిన వారికి 50 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి సుప్రీం తీర్పుల గురించి తెలియదా? అని నిలదీశారు.

బీసీ వ్యతిరేక పార్టీ బీజేపీ: మెట్టు సాయికుమార్

సాక్షి, హైదరాబాద్: బీసీల వ్యతిరేక పార్టీ బీజేపీ.. అని తేలిపోయిందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు. దొడ్డిదారిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన ఎన్.రాంచందర్‌రావు.. బీసీ రిజర్వేషన్ల గురించి అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అసలాయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలా అయ్యారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. సాయికుమార్ బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని రాంచందర్‌రావు అంటుంటే.. బీజేపీలోని బీసీ నేతలు ఎలా మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీజేపీ నేతలు వంకర టింకరగా మాట్లాడితే రాష్ట్రంలో తిరగనీయమని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని బీసీలు బహిష్కరిస్తారని మెట్టు సాయి స్పష్టం చేశారు.



హైదరాబాద్‌లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు కాలనీలను వాన నీరు ముంచెత్తింది. పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.



రానున్న స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లు కేటాయించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి

పెట్రోలియం ఉత్పత్తులపై చర్చ

పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడిన ఎంపీ వద్దిరాజు

సాక్షి, న్యూఢిల్లీ: పెట్రోలియం ఉత్పత్తులపై జరిగిన సమావేశానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. బుధవారం రాత్రి పెట్రోలియం, సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్ తర్కరే సునీల్ దత్తాత్రే అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెట్రోలియం, సహజ వాయువు వాటి హెచ్చుతగ్గులు, వినియోగదారుల అవసరాలు, వారికి అందుతున్న సేవలు, డిమాండ్, మెరుగైన నాణ్యత వంటి విషయాలను వద్దిరాజు కేంద్రం దృష్టికి తెచ్చారు.

'42 శాతం అమలుకు' ముస్లిం రిజర్వేషన్లు అడ్డుకాదు

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ముస్లిం రిజర్వేషన్లు ఏమాత్రం అడ్డంకి కాదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ బీసీ కమిషన్‌లో నమోదైన 2,633 బీసీ కులాలలో దాదాపు 200 పైచిలుకు కులాలు ముస్లిం మతానికి చెందినవేనన్నారు. గుజరాత్‌లో 39, మధ్యప్రదేశ్‌లో 27, పశ్చిమ బెంగాల్లో 36, బిహార్‌లో 20, యూపీలో 50, రాజస్తాన్‌లో 30 ముస్లింకులాలు జాతీయ ఓబీసీ జాబితాలో ఉన్నాయని, సంబంధిత రాష్ట్రాలలో బీసీ రిజర్వేషన్ల ఫలాలు అందుకుంటున్నాయని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని సురేశ్ అభినందించారు. గతంలో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తమ రాష్ట్రంలో రిజర్వేషన్లను 69 శాతానికి పెంచడానికి ఢిల్లీ కేంద్రంగా చేసిన తీవ్ర ప్రయత్నాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ జరిగే వరకూ రేవంత్ ఢిల్లీలోనే పాగా వేయాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్టీలు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలన్నారు. గత ఐదు సంవత్సరాలుగా బీసీ వాదాన్ని బీసీ రాజ్యాధికార సమితి క్షేత్రస్థాయిలో బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్ని తిరుగుబాటుకు సిద్ధం చేసిందని సురేశ్ తెలిపారు.

దేశీయంగా పెరిగిన యూరియా ఉత్పత్తి

- ఆరు కొత్త ప్లాంట్లలో యూరియా ఉత్పత్తి
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో 314.07 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి
- త్వరలో ఆర్ఎఫ్‌సీఎల్‌లో సల్ఫర్ కోటెడ్ యూరియా



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): దేశీయంగా ఎరువుల ఉత్పత్తి లక్ష్యంగా మేకింగ్ ఇండియాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2014–15 ఆర్థిక సంవత్సరంలో ఆరు కొత్త యూరియా యూనిట్లను స్థాపించింది. ప్రతీ యూనిట్ ఉత్పత్తి సామర్థ్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నులు. తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలో రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్), ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బిహార్‌లోని హిందుస్థాన్ ఉర్వారక్ రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్ఎల్), గోరక్‌పూర్‌లోని సింద్రీ, గ్రీన్‌ఫీల్డ్ యూరియా ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా 25 గ్యాస్ ఆధారిత యూరియా యూనిట్లను స్థాపించారు. దీంతో 2014–15 ఆర్థిక సంవత్సరంలో 225 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి.. 2023–24లో రికార్డుస్థాయిలో 314.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి పెంచడానికి ఇవి దోహదపడ్డాయి. ఏటా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుండడంతో.. దిగుబడి పెంచేందుకు యూరియా వినియోగం అధికమైంది. ఫలితంగా కొన్ని రాష్ట్రాలలో యూరియా కొరత ఏర్పడుతోంది.

అందుబాటులోకి దేశీయ యూరియా..

2023-24 ఆర్థిక సర్వే ప్రకారం భారత వ్యవసాయ రంగం.. జనాభాలో దాదాపు 42.3 శాతం మందికి ఉపాధినిస్తోంది. గతంలో వ్యవసాయ రంగానికి అవసరమయ్యే యూరియా తయారీ కోసం వివిధ రసాయనాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. దిగుమతి సుంకాలు, రవాణాతో ధరలు అధికంగా ఉండడంతో రైతులపై ఆర్థిక భారం పడేది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విధానంతో సబ్సిడీ పథకాలతో దేశీయంగా యూరియా, డీఏపీ, సేంద్రియ ఎరువులను రైతులకు అందుబాటులోకి తెచ్చారు.

ప్రారంభానికి నోచుకోని సల్ఫర్ కోటెడ్ యూరియా..

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో ఏటా 12.7 లక్షల మెట్రిక్ టన్నుల నీమ్ కోటెడ్ యూరియాను తయారు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సల్ఫర్ కోటెడ్ యూరియా ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. ఇందుకోసం రూ.150 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. అయితే, సల్ఫర్ కోటెడ్ యూరియాను ఉత్పత్తి చేసేందుకు మరోకొత్త ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంది. నేటివరకు పనులు ప్రారంభం కాలేదు. కేంద్ర ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక చొరవ చూపి.. రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో త్వరితగతిన సల్ఫర్ కోటెడ్ యూరియా ఉత్పత్తి ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



సైనిక వందనానికి సిద్ధం

పాకిస్తాన్‌పై యుద్ధంలో సాధించిన విజయానికి చిహ్నంగా విశాఖ బీచ్‌రోడ్డులో విక్టరీ ఎట్ సీ స్థూపం ఏర్పాటు చేశారు. దీనిని నావికాదళం నిర్వహణలో ఎంతో సుందరంగా తీర్చిదిద్దింది. వివిధ సందర్భాలలో ఇక్కడ ఉన్నతాధికారులు, సైనికులు హాజరై వీర సైనికులను గౌరవ వందనం సమర్పిస్తారు. అటువంటి ఈ ప్రముఖ ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో సైనికులు నిమగ్నమయ్యారు. ప్రతీ ఆదివారం నావికాదళం, జీవీఎంసీ సంయుక్తంగా ఇక్కడ లేజర్ షోను సైతం ప్రదర్శిస్తున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



దారికి పచ్చ తోరణం

కనువిందు చేసే పచ్చని చెట్లు, బడలికను పోగొట్టే చల్లగాలికి ఎవరైనా సరే ఈ మార్గంలో ఒక్కసారి ప్రయాణిస్తే ఫిదా అవ్వాల్సిందే. అనంతపురం జిల్లా గార్లదిన్నె నుంచి మిడ్ పెన్నార్ డ్యామ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు వాహనచోదకుల మనసును ఇట్టే దోచేస్తున్నాయి. అటువైపుగా వెళ్లే వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నిద్ర సుఖమెరుగదు

ఆకలి రుచి ఎరుగదు... నిద్ర సుఖమెరుగదు.. దీనికి అద్దం పడుతోంది ఈ చిత్రం. విశాఖలోని రోడ్డుపై భిక్షాటన చేస్తూ జీవనంగడిపే ఒక కుటుంబం మధ్యాహ్నం సమయంలో ఇలా చెట్ల కింద ఫుట్‌పాత్‌పైనే నిద్రిస్తున్నారు. కూలి పనికి వచ్చిన వారు సైతం మధ్యాహ్నం భోజనం తరువాత కొద్దిసేపు కునుకు తీసి తిరిగి పనికి ఉపక్రమిస్తున్నారు. ఎండ ప్రభావం తీవ్రంగా ఉన్నా.. రణగొణ ధ్వనులు ఉన్నా ఆదమరచి నిద్రపోతూ కనిపించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

3600 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ



ఒంగోలు సిటీ: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఒంగోలులో బుధవారం 3,600 అడుగుల పొడవైన జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శిద్దా వెంకట సూర్యప్రకాష్‌రావు, ఎస్పీ ఏఆర్ దామోదర్ చొరవతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు, వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు జిల్లా పోలీస్ గ్రౌండ్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు.

తెలంగాణ ప్రభుత్వం వివాదాలు సృష్టిస్తోంది

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి



కర్నూలు కల్చరల్: ఏపీ జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం వివాదాలు సృష్టిస్తోంది. రాయలసీమ రైతులు భూములు త్యాగం చేసి కూడా నీరు వాడుకోలేని పరిస్థితి ఉంది. పెండింగ్ ప్రాజెక్టులు, బనకచర్ల ప్రాజెక్టులపై తెలంగాణ కేంద్రానికి లేఖ రాయడం దారుణమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతం కోసం పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్ జిల్లాల పర్యటనను ప్రారంభిస్తున్నారన్నారు.

'బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి'

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పలువురు ఎంపీలు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏపీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓబీసీ సెమినార్‌ను నిర్వహించారు. మేమెంతో మాకంత అన్నట్లు చేయాలని ఎంపీలు మల్లు రవి, ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావులు డిమాండ్ చేశారు.

ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీఈడబ్ల్యూఐడీసీ

సాక్షి, అమరావతి: సాగరమాల ప్రాజెక్టు కింద రాష్ట్రంలో నిర్మించతలపెట్టిన 12 ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణం, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో మౌలిక వసతుల కల్పనకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ)ను నియమిస్తూ మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మసాజు మాటున గలీజు

స్పా ముసుగులో వ్యభిచారం



- విదేశాల నుంచి యువతుల దిగుమతి
- ఇన్‌స్టా, వాట్సాప్ గ్రూపుల ద్వారా హైటెక్ వ్యాపారం
- విశాఖలోని పోలీసుల దాడులతో బట్టబయలు
- ఇప్పటికే రెండు స్పాలపై చర్యలు మిగిలిన వాటిపై పోలీసుల నిఘా

విశాఖ సిటీ : విశాఖ హైటెక్ వ్యభిచారానికి కేంద్రంగా మారిపోయింది. స్పా సెంటర్ల ముసుగులో గలీజు వ్యవహారం సాగుతోంది. మసాజు మాటున వ్యభిచారం నడుస్తోంది. సామాజిక మాధ్యమాలు, మెసేజింగ్ యాప్‌ల ద్వారానే దందా జరుగుతోంది. వెల్‌నెస్.. స్పా సెంటర్ల పేరుతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కేంద్రాలు కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వీటి నిర్వాహకులు కొందరు విదేశాల నుంచి యువతులను దిగుమతి చేసుకుంటూ.. వారితో చీకటి వ్యాపారానికి తెరలేపుతున్నారు. సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన యాడ్స్ ద్వారా విటులను ఆకర్షిస్తున్నారు. అన్ని రకాల సేవలను అందిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా స్పా సెంటర్లపై పోలీసులు ఫిర్యాదులు అందాయి. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీటిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. గత వారంలో వరుసగా రెండు స్పా సెంటర్లపై చేసిన దాడుల్లో వారి మసాజ్ బాగోతం బయటపడింది.

హైటెక్ దందా

సామాజిక మాధ్యమాల ద్వారానే 80 శాతం హైటెక్ వ్యభిచారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అసాంఘిక కార్యకలాపాలకు పలువురు నిర్వాహకులు లొకేంటో, ఇన్‌స్టా, టెలిగ్రామ్, వాట్సాప్.. ఇలా సామాజిక మాధ్యమాలు, మెసేజింగ్ యాప్‌ను వినియోగించుకుంటున్నారు. వీటిలో డిజిటల్ యాడ్స్ ద్వారా విటులను ఆకర్షిస్తున్నారు. వాటిలో ఉన్న నెంబర్‌కు మెసేజ్ చేస్తే చాలు. వెంటనే ఆటో జనరేటెడ్ రిప్లయ్ వచ్చేస్తుంది. ఎటువంటి సేవలు అందిస్తారన్న వివరాలు అందులో ఉంటాయి. మరో నిమిషంలోనే ఫోన్ మోగుతుంది. మధురమైన వాయిస్‌తో వారి అందించే సేవలు, వారి ఛార్జీలు వివరిస్తారు. ఓకే అంటే చాలు.. వెంటనే లొకేషన్ మొబైల్‌కు వచ్చేస్తుంది. ఇదీ విశాఖలో సాగే హైటెక్ వ్యభిచారం. సాధారణ మసాజ్‌లకు రూ.1000 నుంచి రూ.2500 ఛార్జ్ చేస్తున్నారు. అయితే క్రాస్ మసాజ్ నుంచి ప్రత్యేక సేవలకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత సేవలు కావాలంటే రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు.

విశాఖలో 71 స్పా సెంటర్లు

ఆకర్షణీయమైన ఎంట్రన్స్.. లోపల అడుగుపెడితే అద్భుతమైన యాంబియన్స్.. అందమైన యువతులతో స్వాగతాలు.. స్టార్ హోటల్‌ను తలపించే రూమ్‌లు.. ఇలా నగరంలో ఇలా రూ.కోట్లు ఖర్చు పెట్టి స్పా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 71 వరకు ఈ వెల్‌నెస్, స్పా, రిలాక్స్ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. సిరిపురం, పాండురంగాపురం, బీచ్ రోడ్డు, సీతమ్మధార, గాజువాక ప్రాంతాల్లోనే సగం కంటే ఎక్కువగా సెంటర్లు ఉన్నాయి. వీటిలో కొన్ని స్పా సెంటర్ల నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలకు పూనుకుంటున్నారు. విదేశాల నుంచే కాకుండా ఈశాన్య రాష్ట్రాల నుంచి యువతులను దిగుమతి చేసుకుంటున్నారు. శరీరం అలసిపోయిన, కండరాలు బిగుసుకుపోయిన వారికి అనేక రకాల మసాజ్ సేవలు అందిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. కానీ లోపల జరిగే తంతే వేరుగా ఉంటోంది. చట్ట విరుద్ధ కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నెలవారీ మామూళ్లు..



స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్న చీకటి వ్యాపారానికి పోలీసుల నుంచి సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంలో ఒక్కో స్పా సెంటర్ నుంచి నెలకు రూ.10 వేలు స్టేషన్‌కు అందుతున్నట్లు సమాచారం. అసాంఘిక కార్యకలాపాలు సాగించే సెంటర్ల నుంచి రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు ముట్టజెబుతున్నారన్న టాక్ ఉంది. అందువల్లే ఇన్నాళ్లు ఆ స్పా సెంటర్ల వ్యవహారం బయటపడలేదన్న వాదనలు ఉన్నాయి. వీటి నిర్వహణ, చట్ట విరుద్ధ కార్యక్రమాలపై అనేక ఫిర్యాదులు రావడంతో సీపీ శంఖబ్రత బాగ్చి గతంలో ప్రతి 2,3 నెలలకోసారి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో అన్ని కేంద్రాల్లో దాడులు చేపట్టినా ఒక్క కేంద్రంలోనూ ఈ తరహా వ్యవహారం వెలుగు చూడలేదు. తనిఖీలకు వెళుతున్న సమాచారం నిర్వాహకులకు ముందుగానే అందుతుందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..



కూటమి ప్రభుత్వంలో విశాఖలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయింది. ఒక వైపు డ్రగ్స్, గంజాయి వినియోగం విస్తృతంగా పెరిగిపోయింది. హత్యలు, గ్యాంగ్‌వార్‌లు, దాడులు, దోపిడీలతో ప్రశాంత విశాఖలో అలజడి రేగుతోంది. తాజాగా ఈ స్పా సెంటర్లలో వ్యభిచారం వ్యవహారం బట్టబయలవడం నగరంలో పరిస్థితికి అద్దం పడుతోంది. గత వారంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో రెండు స్పా కేంద్రాల్లో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు.

ఏఐతో బీసీ సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణ

- పీ–4 మోడల్‌తో హాస్టళ్ల దత్తత
- అన్ని బీసీ హాస్టళ్లలోనూ ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు
- మంత్రి సవిత వెల్లడి



సాక్షి, అమరావతి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా బీసీ సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణ చేపట్టనున్నామని, ఇందుకోసం త్వరలోనే యాప్ తయారు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏఐ ద్వారా మెనూ అమలు, పరిశుభ్రత పర్యవేక్షణ, విద్యార్థులు, సిబ్బంది హాజరు వంటి అంశాలను పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఏఐతో పర్యవేక్షణతో హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు భద్రతతో కూడిన విద్య అందించనున్నట్లు చెప్పారు. హాస్టళ్ల జవాబుదారీతనం మరింత పెంచేలా ఏఐను వినియోగించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలో బుధవారం ఆయా జిల్లాల బీసీ సంక్షేమ శాఖాధికారులు, డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీ డబ్ల్యూఈవోలతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఆగస్టు 5వ తేదీలోగా అడ్మిషన్లు పూర్తి చేయాలన్నారు. డీబీసీడబ్ల్యూఈవోలు, ఏబీసీడబ్ల్యూఈవోలు తరుచూ హాస్టళ్లను సందర్శించాలని, వీలైతే రాత్రి బస చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి టూర్ డైరీ తయారు చేసి ప్రతీ నెలా 5వ తేదీలోగా రాష్ట్ర కార్యాలయానికి పంపించాలన్నారు. బీసీ హాస్టళ్ల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.13 కోట్లు వెచ్చిస్తున్నామని, పనులు ఆగస్టు 30 నాటికి పూర్తి చేయాలన్నారు. అన్ని బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఆదికర్మయోగి కోసం మాస్టర్ ట్రైనీలకు శిక్షణ

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన ఆది కర్మయోగి కార్యక్రమాన్ని రాష్ట్రంలో సమర్థంగా అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఒక్కో మాస్టర్ ట్రైనర్‌కు రూ.5,500 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని, 40 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. ఇందుకోసం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మార్గదర్శక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన 8 మంది మాస్టర్ ట్రైనీలకు బెంగళూరులో ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాల్లో ఎంపికైన అధికారులకు వారు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు.

పొదుపు మహిళలకు రూ.30,635 కోట్ల రుణాలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.30,635 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సెర్ప్ కార్యక్రమాల అమలుపై డీఆర్‌డీఏ పీడీలకు నిర్వహించిన రెండురోజుల వర్కుషాపు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కింద 2025–26లో రాష్ట్రంలో 2.5 లక్షల మంది మహిళలకు బ్యాంకుల నుంచి వ్యక్తిగత రుణసౌకర్యం కల్పించి వస్తు తయారీ, సేవారంగాల్లో వ్యాపారసంస్థలను ఏర్పాటుచేసే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 350 రైతు ఉత్పత్తి గ్రూపులకు మంజూరైన నిధులను పారదర్శకంగా, సమర్థంగా వినియోగించి స్పష్టమైన ఫలితాలు సాధించాలని సూచించారు.

ఏపీఈఆర్‌సీ ఛైర్‌పర్సన్‌ను ఎప్పటిలోపు నియమిస్తారు?

ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఛైర్‌పర్సన్ నియామకంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు బుధవారం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఎప్పటిలోపు ఈ నియామకం జరుపుతారో తెలపాలని నిర్దేశిస్తూ, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది.

మూడున్నర నెలల్లో జలవిపత్తుల్లో 258 మంది మృతి

ఏప్రిల్ నుంచి ఈ నెల 16 వరకు రాష్ట్రంలోనే అత్యధికమంది మృతి

- జలవాతావరణ విపత్తులకు దేశంలో 1,297 మంది బలి
- లోక్‌సభలో కేంద్ర హోంశాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడున్నర నెలల్లోనే జలవాతావరణ విపత్తుల్లో 258 మంది మృతిచెందారు. ఏ రాష్ట్రంలోను లేనివిధంగా మన రాష్ట్రంలోనే జలవాతావరణ విపత్తులకు ఇంత పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన సమాచారం ప్రకారం జలవాతావరణ విపత్తుల కారణంగా మొత్తం 1,297 మంది మృతిచెందారని, ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోనే 258 మంది మరణించారని లోక్‌సభలో కేంద్ర హోంశాఖ వెల్లడించింది. రాష్ట్రంలో మూడున్నర నెలల్లోనే ఎక్కువమంది మృతి చెందడానికి కారణం వివిధ జలశయాల దగ్గర తగిన భద్రత చర్యలను చేపట్టకపోవడమేనని అర్థమవుతోంది. జలశయాలు దగ్గర ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. దీంతో చాలామంది జలాశయాల్లో దిగి మృతి చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ తరువాత హిమాచల్‌ప్రదేశ్‌లో 171 మంది, మధ్యప్రదేశ్‌లో 148 మంది అత్యధికంగా జలవాతావరణ విపత్తులకు మృతి చెందినట్లు హోంశాఖ పేర్కొంది. జలవాతావారణ విపత్తుల సంభవించిన రాష్ట్రాల్లో నష్టాలను అంచనా వేసిన తరువాత జాతీయ విపత్తుల నిధి నుంచి కేంద్రం ఆర్థికసాయం అందిస్తుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 15వ తేదీ నాటికి జాతీయ విపత్తుల నిధి నుంచి కేంద్రం వాటాగా 22 రాష్ట్రాలకు రూ.9578.40 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించింది. సాధారణంగా జూన్ 1న రుతుపవనాలు ప్రారంభమవుతాయని, ఈ ఏడాది ఎనిమిది రోజులు ముందుగానే మే 24న కేరళను తాకాయిని తెలిపింది. 2009లో మే 23న రుతుపవనాలు కేరళను తాకాయని, మళ్లీ 17 సంవత్సరాల తరువాత ఈ ఏడాది అత్యంత ముందుగా వచ్చాయని వివరించింది.



ఈ ఏడాది ఏప్రిల్ 1 వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు జలవాతావరణ విపత్తుల కారణంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మృతిచెందిన వారి సంఖ్య

రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	మృతుల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	258
అరుణాచల్‌ప్రదేశ్	14
అసోం	32
బిహార్	101
ఛత్తీస్‌గఢ్	11
గోవా	2
గుజరాత్	63
హిమాచల్‌ప్రదేశ్	171
కర్ణాటక	89
కేరళ	71
మధ్యప్రదేశ్	148
మహారాష్ట్ర	69
మణిపూర్	7
మేఘాలయ	14
మిజోరం	14
నాగాలాండ్	3
ఒడిశా	2
పంజాబ్	24
రాజస్థాన్	43
సిక్కిం	8
త్రిపుర	23
ఉత్తర ప్రదేశ్	21
ఉత్తరాఖండ్	75
అండమాన్ -నికోబార్	1
జమ్ము-కశ్మీర్	33
మొత్తం	1,297




శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ నారాయణగిరి వరకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 79,467 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.42 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె : చిత్తూరు జిల్లా బోయకొండలోని గంగమ్మ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్కరోజే సుమారు 15 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఆలయ ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో అధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.




సంస్కృత వర్సిటీలో కేంద్ర అధికార భాష డీడీ

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీని కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వశాఖ బెంగుళూరు ప్రాంతీయ కార్యాలయ అధికార భాషా విభాగం డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ బుధవారం సందర్శించారు. వర్సిటీలోని రాజభాష విభాగాన్ని పరిశీలించిన అనంతరం వీసీ కృష్ణమూర్తితో పాటు అధికారులతో బృందం సమావేశమైంది. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 351 ప్రకారం, పాలనా పని సమర్థవంతంగా జరగాలన్నారు.

28 నుంచి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట మైదానంలో ఈ నెల 28 నుంచి రెండు రోజులపాటు బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 28న అండర్-14, 16బాలబాలికలకు, 29న అండర్-18, 20 బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు.


● హంపి విరూపాక్ష ఆలయం


యునెస్కో వారసత్వ సంపదలో మరో ఏడు అద్భుత ఆలయాలు

దక్షిణ భారతదేశం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలకు నిలయం. వీటి అద్భుతమైన వాస్తుశిల్పం, చారిత్రక ప్రాధాన్యం, ఆధ్యాత్మిక మహత్తు అద్భుతం. అందుకే ఈ దేవాలయాల్లో చాలా వరకు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తింపు పొందాయి. రాతి శిల్పాలు, సంగీత స్తంభాలు, రథాకార నిర్మాణాలు ఈ ఆలయాలకు ఒక ప్రత్యేకతను, గుర్తింపునూ తీసుకువచ్చాయి. ప్రతి దేవాలయం ఒక అపురూప కట్టడం. అంతేకాదు, ప్రాచీన సంస్కృతికి అద్దం పడుతుంది. ఇటీవలే యునెస్కో తాజాగా మరో ఏడు ఆలయాలకు వారసత్వ గుర్తింపును ఇచ్చింది. అవేమిటో చూద్దాం..

1. కడలేకల్ గణేశాలయం - హంపి

బాల గణేశుడు తన తల్లి పార్వతీ దేవి ఒడిలో ముద్దుగా కూర్చుని, చిట్టి చేతులను ఆ జగదంబ వీపుమీద వేసినట్లుగా ఉన్న ఈ విగ్రహం చూడగానే ఆహా అనిపిస్తుంది. హంపీలోని ప్రముఖ శిల్పాలలో ఒకటైన కడలేకల్ గణేశ విగ్రహం ఏకశిల నుంచి చెక్కబడింది.

విజయనగర సామ్రాజ్య శిల్పకళా చాతుర్యాన్ని ప్రతిబింబించే ఈ ఆలయం వినాయకుడి భక్తులకు ఎంతో ప్రీతికరమైనది. 'కడలేకల్' అనే పేరు గణేశుడి పొట్టను పోలి ఉండటం వల్ల వచ్చింది.


● షోర్ టెంపుల్, మహాబలిపురం

2. బృహదీశ్వరాలయం - తంజావూరు

రాజరాజ చోళుడు 1010లో నిర్మించిన ఈ అద్భుత ఆలయం, శివుని వాహనమైన నందితో సహా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలోని రాతి శిల్పాలు అబ్బురపరుస్తాయి. ప్రతి రోజు రాత్రి జరిగే పూజ ప్రత్యేక ఆకర్షణ. పూజారులు వేద మంత్రాలతో బృహదీశ్వరునికి పవిత్ర జలాలు, పాలతో అభిషేకం చేస్తారు. పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అందంగా మార్చుతుంది.


● బృహదీశ్వరాలయం, తంజావూరు

3. ఐరావతేశ్వరాలయం - దారాసుర

రథాకార శిల్పాలకు పెట్టిన పేరైన ఈ ఆలయం సురపతి అయిన ఇంద్రుడి వాహనం శ్వేత మత్తేభం ఐరావతం పేరు మీదుగా ప్రసిద్ధికెక్కింది. గోడలపై పురాణాలు చెక్కబడి ఉంటాయి. ప్రత్యేక ఆకర్షణ – సంగీత మెట్లు. ఏడు మెట్లు, ఏడు సంగీత స్వరాలను సూచిస్తాయి. ఇక్కడికి వచ్చిన భక్తులు ఆలయంలోని సూర్య పుష్కరిణి అనే పవిత్ర పుష్కరిణిలో ముందుగా స్నానం చేసి ఆ తర్వాత స్వామిని సందర్శించటం ఆనవాయితీ.


● మహిషాసుర మర్దిని మండపం

4. మహిషాసురమర్దిని మండపం

మహాబలిపురం పల్లవ రాజవంశం నిర్మించిన ఈ రాతి శిల్పాల ఆలయం, మహిషాసురుడు, దుర్గాదేవి మధ్య యుద్ధాన్ని చూపించే అద్భుత దారు శిల్పాలతో ప్రసిద్ధికెక్కింది. అంతేకాక, శ్రీ మహావిష్ణువు తన పానుపైన ఏడు తలల ఆదిశేషుని పైన విశ్రాంతి తీసుకుంటున్న శిల్పం చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది.


● విఠలాలయం, హంపి

5. షోర్ టెంపుల్, మహాబలిపురం

మహాబలిపురం పల్లవ రాజు 11వ నరసింహవర్మ 8వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం ఒకప్పుడు ఏడు దేవాలయాల సమూహంలో భాగం. వరద ముంపులో మిగతా ఆలయాలన్నీ నీట మునిగిపోయినా, ఇది మాత్రమే నిలిచి ఉంది. ప్రతి సంవత్సరం మహా శివరాత్రి, వైకుంఠ ఏకాదశి పండుగలకు ఇక్కడ ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి.


● ఐరావతేశ్వరాలయం, దారాసురం

6. విరూపాక్షాలయం - హంపి

హంపి మధ్యలో ఉన్న ఈ ఆలయం మహాశివునికి అంకితం చేయబడింది. పంప అనే బ్రహ్మ కుమార్తె ఇక్కడ తపస్సు చేసి శివుడిని వివాహం చేసుకుందనే కథనం దీనికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం తెచ్చింది. ఇక్కడ పంచామృత అభిషేకం, పూల అలంకారం, పూజారుల వృత్తాకార ఊరేగింపులు ముఖ్య విశేషాలు.


● కడలేకల్ గణేశాలయం


7. విఠలాలయం - హంపి

ఈ ఆలయం సంగీత స్తంభాలు (మొత్తం 56) కు ప్రసిద్ధి. స్తంభాలను మీటితే వినసొంపైన స్వరాలు వినిపిస్తాయి. విష్ణువు అవతారమైన విఠలేశ్వరుడికి అంకితం చేయబడిన ఈ ఆలయం ఆధ్యాత్మికతకే కాదు, గొప్ప కళాత్మకతకు కూడా నిదర్శనంగా నిలుస్తుంది.

సదా స్మరణీయులు మహావతార్ బాబాజీ

''ఆయనను పూజించ నక్కరలేదు. ఆరాధనలు, అభిషేకాలు చేయనక్కరలేదు. ఎవరయినా సరే, ఎప్పుడైనా సరే, భక్తితో నోరారా ఒక్కసారి బాబాజీ... అని స్మరించుకుంటే చాలు... తక్షణమే ఆయన నుంచి ఆధ్యాత్మిక అనుగ్రహం లభిస్తుంది.'' అంటారు లాహిరీ మహాశయులు.

మహాగురువు లాహిరీ మహాశయుల ఈ విశిష్టమైన ఉటంకింపును, పరమహంస యోగానంద తమ 'ఒక యోగి ఆత్మకథ'లో పేర్కొన్నారు. ఇది మహావతార్ బాబాజీ అపారమైన ఆధ్యాత్మిక, అతీంద్రియ శక్తుల ప్రాముఖ్యతను, నిజాయితీగా తనను అనుసరించేవారందరి జీవితాలపై ఆయన చూపే కాలాతీత ప్రభావాన్ని శక్తిమంతంగా వివరిస్తుంది.





లాహిరీ మహాశయుల విశిష్ట శిష్యులైన స్వామి శ్రీ యుక్తేశ్వర్ గిరి చెప్పినట్లు, బాబాజీ ఆధ్యాత్మిక ఉన్నతి మానవుల మేధకు, అవగాహనకు అందనిది. అయినప్పటికీ, సామాన్య ప్రజలు మహాగురువుల స్ఫూర్తి, బోధనలతో అనుసంధానంలో ఉండడానికి ప్రయత్నిస్తే చాలు... వారు తమ ఆధ్యాత్మిక ప్రయాణాలలో ప్రయోజనాలెన్నో పొందుతారు.

ఆధునిక యుగంలో భారతదేశపు ప్రాచీన 'క్రియాయోగ' బోధలను పాశ్చాత్య ప్రపంచానికి వ్యాప్తి చేయడానికి బాబాజీ... యోగానందను ఏరికోరి మరీ ఎంపిక చేసుకున్నారు. లాహిరీ మహాశయులకు 'క్రియాయోగ' శాస్త్రజ్ఞానాన్ని ప్రసాదిస్తూ.. ఆయన అభ్యర్థన మేరకు, ఈ పవిత్రమైన, రహస్యమైన పద్ధతిని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిజాయితీగల సత్యాన్వేషకులందరికీ బోధించేందుకు బాబాజీ ఆయనను నియోగించుకున్నారు. 'ఒక యోగి ఆత్మకథ' పుటల నుండి, బాబాజీకి లాహిరీ మహాశయులపై ఉన్న శాశ్వత ప్రేమ గురించి, అనగా గురువుకు తన శిష్యుడి పట్ల జన్మజన్మలకు, అనంతర కాలం వరకూ కూడా ఉండే అవ్యాజమైన ప్రేమ గురించి కూడా మనం తెలుసుకుంటాం.

హిమాలయాలలో వారి చారిత్రాత్మక సమావేశంలో బాబాజీ లాహిరీ మహాశయులతో ఇలా అన్నారు, ''తల్లిపక్షి తన పిల్లలను కాపాడుకుంటూ ఉన్నట్టుగా– చిమ్మచీకటిలో, తుఫానులో, అల్లకల్లోలంలో, వెలుగులో, నేను నీ వెనకాలే ఉంటూ వచ్చాను.'' దానికి లాహిరీ మహాశయులు ఎంతో సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూనే తమ గురువు మహోన్నతమైన తేజో వలయంలో పూర్తిగా మునిగిన వారై ఇలా ప్రత్యుత్తరమిచ్చారు, ''గురుదేవా, ఏం చెప్పగలను నేను? ఇటువంటి అమర ప్రేమ గురించి ఎక్కడయినా, ఎవ్వరయినా విన్నారా?''

'ఒక యోగి ఆత్మకథ' పుటలు ఈ విధంగా నిజమైన గురువుకు, సంసిద్ధుడైన శిష్యుడికి మధ్య ఉన్న బంధాన్ని, అనంతత్వాన్ని మన కళ్ళకు, హృదయాలకు, ఆత్మలకు వెల్లడిస్తాయి. పరమహంస యోగానంద తన గురువు శ్రీ యుక్తేశ్వర్ నుండి తన పరమ గురువుల నుండి జీవితాన్ని వృద్ధి చేసే, ఆత్మను విముక్తి చేసే 'క్రియాయోగ' జీవన విధానాన్ని వారసత్వంగా పొందారు.

వై.ఎస్.ఎస్. ఆఫ్ ఇండియా ఈ బోధనల ఆధారంగా వివరణాత్మకంగా 'జీవించడం ఎలా' పాఠాలను కూడా ప్రచురిస్తుంది. వాటిని ముద్రిత రూపంలో, డిజిటల్ రూపంలో కూడా సభ్యులందరికీ అందుబాటులోకి తెస్తుంది. ధ్యానం ప్రాథమిక ఉన్నత ప్రక్రియలు పాఠాల ద్వారా వై.ఎస్.ఎస్. సన్యాసులచే నిర్వహించబడే ప్రత్యేక తరగతుల ద్వారా, సమావేశాలలో లేదా సంగమాలలో, భారతదేశం నలుమూలల ఉన్న ప్రాంతాలకు సన్యాసుల సందర్శనల సమయంలో బోధించబడతాయి.

తద్వారా యోగ ధ్యానం సర్వోత్కృష్టమంతమైనదయినప్పటికీ సులభంగా అందుబాటులో ఉండే, శాస్త్రీయ పద్ధతుల ఉనికిని తెలుసుకోవడానికి, నేర్చుకోవడానికి లక్షలాది మంది స్ఫూర్తి పొందుతారు.

> అజరామర గురువుగా ప్రసిద్ధి చెందిన మహావతార్ బాబాజీ స్మృతి దివస్ లేదా సంస్మరణ దినోత్సవం భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై 25న యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వై.ఎస్.ఎస్.) భక్తులు ప్రపంచవ్యాప్తంగా సెల్ఫ్-రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్.ఆర్.ఎఫ్.) సభ్యులు జరుపుకుంటారు. ఆధ్యాత్మికోన్నతిని కలిగించే క్రియాయోగ మార్గానికి చెందిన బోధనలను మహావతార్ బాబాజీ, లాహిరీ మహాశయులు, స్వామి శ్రీయుక్తేశ్వర్ గిరి, 1917లో వై.ఎస్.ఎస్.ను స్థాపించిన పరమహంస యోగానంద ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మానవాళికి అందించారు.

మరింత సమాచారం కోసం: yssofindia.org

● నిర్మల వాణి

ఆ నామాల్లో అపార శక్తి

విద్యుచ్ఛక్తి వలన ఎలాగయితే మన చుట్టూ ఉన్న ఫ్యాన్ లు, లైట్‌లు, ఏసీలు వంటి అనేక విద్యుత్ ఉపకరణాలు పని చేస్తూ ఉంటాయో, అదేవిధంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి శక్తి వలన మానవుని సూక్ష్మ శరీరంతో పాటు అండ పిండ బ్రహ్మాండంతో నిండిన ఈ చరాచర జగత్తు మొత్తం నడుస్తుంది.


శ్రీ మాతాజీ నిర్మలాదేవి

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రంలో 867, 868 నామాల వద్ద అమ్మ వారిని 'అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా' అని వర్ణిస్తారు. అంటే మన చిత్తం బహిర్ముఖమై ఉన్నప్పుడు మనం ఆ తల్లిని చేరుకోవడం దుర్లభమని అర్థం. అమ్మవారిని ఆరాధన చేయడానికి మన చిత్తం అంతర్ముఖం కావాలి. మనం అంతర్ముఖులమై ధ్యానం చేసినప్పుడు మాత్రమే కుండలినీ శక్తి జాగృతి చెందుతుంది.



215 వ నామం వద్ద అమ్మవారిని 'మహామాయ' అంటూ వర్ణిస్తారు. అంటే ఆమె మహామాయ రూపంలో మన లోపలే ఉంటూ మనల్ని ప్రలోభాలకు గురి చేసి పరీక్షిస్తూ ఉంటారు. ఆ తల్లి పెట్టే పరీక్షలలో సద్గుణాలతో ఆమె మాయను దాటగలిగిన వారిని తనకు దగ్గరగా తీసుకుంటారు. అప్పుడు వారి చిత్తం అంతర్ముఖమై ఆమె మాయ నుండి ముక్తిని పొందుతారు. అటువంటి సాధకులలో కుండలినీ శక్తి ఉత్థానం జరిగి మోక్ష ప్రాప్తి కలుగుతుంది. మరోవైపు ఆమె మాయను దాటలేక ప్రలోభాలకు లోనయిన వారు ఆమె కృపాకటాక్షాలకు నోచుకోలేరు. ఇదంతా నిత్య లీలా వినోదిని అయిన అమ్మవారి లీలా విలాసం. ఆమె ఒక్క కంటి చూపుతో మొత్తం బ్రహ్మాండాన్ని సృష్టించ గలరు. అదే ఒక్క కంటి చూపుతో మొత్తం బ్రహ్మాండాన్ని నాశనమూ చేయగలరు. అందుకే ఆమెను 'కటాక్ష కటాక్ష నిరీక్షణ' అని వర్ణిస్తారు.

– డా. పి. రాకేష్
(సహజ యోగ సంస్థాపకురాలు, పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి ప్రవచనాల ఆధారంగా)

● ఇస్లాం వెలుగు

నిత్య సంతోషం... ఇహ పర సాఫల్యం

సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి జీవితాన్ని కోరుకుంటారు. శాంతి, సుఖ సంతోషాలు తమ సొంతం కావాలని అభిలషిస్తారు. కష్టనష్టాలను, అశాంతిని ఎవ్వరూ ఆశించరు. కానీ ఏదీ ఆశించినట్లు, అనుకున్నట్లు జరగదు. జీవితంలో అనుకూల, ప్రతికూల పరిస్థితులు వస్తూనే ఉంటాయి. ఎగుడు దిగుళ్ళు మానవ జీవితంలో అనివార్యం. అనుకూల పరిస్థితుల్లో పొంగిపోవడం, ప్రతికూల పరిస్థితుల్లో కుంగిపోవడం మానవుడి చంచల స్వభావానికి నిదర్శనం. అసలు మంచి జీవితమంటే ఏమిటి? సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలంటే ఏమిటి? అందమైన భవంతి, కళ్ళు చెదిరే ఆస్తులు, హోదా, అధికారం, వాహనాలు, భార్యాపిల్లలు, కుటుంబం – ఇవన్నీ సమకూరితే మంచిజీవితం లభించినట్లేనా? సుఖ సంతోషాలు సొంతమైనట్లేనా? కాదు.., ఇవన్నీ ఆనందంలో ఒక భాగమే తప్ప, పరిపూర్ణ సంతోషానికి సోపానాలు కాలేవు. ఇది అనుభవం చెప్పే యథార్థం. ఎందుకంటే, అందమైన ఇల్లు, కోరుకున్న భార్య, రత్నాల్లాంటి బిడ్డలు, విలాసవంతమైన వాహనాలు, కావలసినంత బ్యాంకుబ్యాలెన్సు, బలం, అధికారం, – ఇంకా రకరకాల విలాసవంతమైన సాధనా సంపత్తి నిత్యం అందుబాటులో ఉన్నప్పటికీ, సంతోషంకోసం, సంతృప్తికరమైన జీవితం కోసం వెదుకులాట మానవ సమాజంలో ప్రతినిత్యం మనం చూస్తున్నాం. అన్నీ ఉండికూడా అనుభవించలేని అనేకమంది సంపన్నులూ మనకు పరిచయమే. అంటే ఇవన్నీ పాక్షిక ఆనందాన్ని మాత్రమే అందించగలవుకాని, పరిపూర్ణ సంతోషానికి సోపానం కాలేవని మనకు అర్థమవుతోంది. అయినా మనిషి అనాదిగా శాంతి, సంతోషాలకోసం తంటాలు పడుతూనే ఉన్నాడు. తనకు తోచిన ప్రయోగాలతోపాటు, తనలాంటి వారు చెప్పే సూత్రాలన్నిటినీ పాటిస్తున్నాడు. ఎవరెవరి చుట్టూనో తిరుగుతూ, చెప్పిందల్లా చేస్తూ, తులమో ఫలమో సమర్పించుకుంటూ ఉన్నాడు. కాని ఎక్కడా శాంతి, సంతోషం లభించడంలేదు. ధనం ధారపోసి కొనుక్కుందామంటే, అది మార్కెట్లో లభ్యమయ్యే వస్తువు కూడా కాదాయె. మరేమిటీ మార్గం? మంచిజీవితం, శాంతి, సంతోషం, సంతృప్తి ఇవన్నీ ఎండమావేనా? ఇదే విషయాన్ని ఒక శిష్యుడు ముహమ్మద్ ప్రవక్త (స) వారిని అడిగాడు. అప్పుడాయన గారు,' అల్లాహ్ ను (దైవాన్ని) బాగా స్మరించు. అనాథలను ఆదరించు. పేదసాదలకు శక్తిమేర సహాయం చెయ్యి.' అని ఉపదేశించారు. అంటే, ఇలా చెయ్యడం ద్వారా నువ్వు కోరుకుంటున్న శాంతి, సంతోషాలతో నిండిన మంచి జీవితం ప్రాప్తమవుతుంది అని అర్థం. కాని నాలుగు రాళ్ళసంపాదన సమకూరగానే దురదృష్టవశాత్తూ మనుషుల్లో అహం పెరిగి పోతోంది. దైవాన్ని స్మరించడం తరువాత సంగతి, అసలు దైవాన్నే మరిచి పోయి, పేదసాదలను దగ్గరికి రానివ్వని పరిస్థితి నెలకొంటోంది. మరిక శాంతి లభించాలంటే ఎలా లభిస్తుంది.? కాబట్టిసర్వకాల సర్వావస్థల్లో దైవాన్ని స్మరిస్తూ, సాధ్యమైనంతమేర మంచి పనులు చేస్తూ, చెడులకు దూరంగా ఉండే ప్రయత్నం చెయ్యాలి. సత్కార్యాల్లో లభించే సంతోషం సంతృప్తి మరెందులోనూ లభించదు. ధర్మబద్ధమైన సంపాదన, ధర్మసమ్మతమైన ఖర్చు, సత్కార్యాల్లో సమయాన్ని వెచ్చించడం – ఇదిగనక మనం ఆచరించగలిగితే నిత్య సంతోషం, ఇహపర సాఫల్యం సొంతమనడంలో సందేహమే లేదు.



– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● సువార్త

ఉన్నతోన్నత ఉపదేశం

'వాస్తవమైన జీవము'ను గూర్చి అరవై ఆరు పుస్తకాలు గల గ్రంథరాజమనే బైబిలు చాలా విస్తారంగా మాట్లాడుతూ ఉంది. వాస్తవమైన జీవము ఏదైతే ఉందో దాన్ని సంపాదించుకొనుటకు అన్ని విధాలా ప్రయాస పడుట మేలు అన్నది పౌలు ఉన్నతోన్నత ఉపదేశం. ఈ విషయమై పౌలు తిమోతికి బోధిస్తూ సద్భక్తి సంబంధిత విషయాలను తెలియజేస్తూ వీటిని సంఘానికి, సంఘం నుండి తప్పిపోయిన ఇతరులకు తెలియజేయడం కాదు, ఆజ్ఞాపించుము అంటున్నాడు (1తిమోతి 6 : 17–21).

ఏది వాస్తవమైన జీవంగా చెప్పబడుతుందో ఏది ఇలా అనబడుతుందో అదంతా గ్రంథమందు సవివరంగా లిఖితమై ఉంది. అపొస్తలుడైన పౌలు క్రీస్తు ప్రభువు సమక్షంలో అనగా ఆయన ప్రత్యక్షమైన సమయాలలోనే కాక, కలలు దర్శనాల ద్వారానూ వాస్తవమైన విషయాలను నేర్చుకొన్నాడు. క్రీస్తును మించిన బోధకుడు ఎవరుంటారు? క్రీస్తు దగ్గర నేర్చుకొనే విషయాలంటే ఎవరికైనా అమితాసక్తే కదా! తిమోతి పౌలుకు అంత దగ్గరవుటకు కారణం ఇదొకటి.

రక్షణార్థమైన జ్ఞానం కలిగించే శక్తిగల పరిశుద్ధ లేఖనముల యందు, రూఢియని తెలిసికొన్న వాటియందు నిలుకడగా ఉండుము. నీకు అప్పగింపబడిన బోధను కాపాడుకో. అపవిత్రమైన వట్టి మాటలకు దూరంగా ఉండు. జ్ఞానమని చెప్పబడే అబద్ధాలకు, విపరీత వాదాలకు దూరంగా ఉండు.

వాదోప వాద విషయాలలో ప్రవీణులం అంటూ చెప్పుకుంటూ తిరిగే కొందరు విశ్వాసం నుండి తప్పిపోయారు. ఇలా తిమోతికి హెచ్చరికలు, జాగ్రత్తలు చెప్పకముందు 'వాస్తవ జీవము' ను గూర్చి పౌలు బోధించడం గమనార్హం.

ఇహమందు ధనవంతులైనవారు ఎన్నడూ గర్విష్ఠులు, అహంకారులు కాకూడదు. వారు అస్థిరమైన తమ ధనమునందు నమ్మిక ఉంచకూడదు. సుఖంగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారళంగా ఇచ్చు ఒక్క దేవుని యందే నమ్మిక ఉంచుడని వారికి ఆజ్ఞాపించు. 'వాస్తవమైన జీవము'ను సంపాదించుకొను నిమిత్తం వారంతా ఈ విషయాలు తెలుసుకొని వాటిపై తమ మనస్సు పెట్టాలి. రాబోవు కాలానికి మంచి పునాది తమ కొరకు వేసుకోవాలి. ఎల్లరకు మేలు చేయువారుగా వారు ఉండాలి. సత్క్రియలు అను ధనము గలవారుగా ఉండాలి. వారు ఔదార్యం గలవారుగా ఉంటూ అది ఎప్పుడూ చాటుతుండాలి. వారు తప్పక తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారై ఉండి తీరాలి. సత్య సంబంధమైన వీటి విషయమై చెప్పడం వేడుకోవడం తెలియజేయడం సమాచారం ఇవ్వడం కాదు, ఎప్పుడూ తగ్గక ఆజ్ఞాపించు తిమోతీ! అంటూ పౌలు తిమోతికి బోధ చేయడం విశేషం.

విశ్వాస విషయమున స్వస్థులగు నిమిత్తం వారిని కఠినంగా గద్దించాలి అనేది పౌలు హిత బోధ కూడానూ. ఇలా ఆజ్ఞాపించే పౌలు, తిమోతి వంటి సద్భక్తిపరులను మన చుట్టూ ఉంచుకోవడం మనకు ఎప్పుడూ మేలే చేస్తుంది.

– జేతమ్

> వాస్తవమైన జీవం సంపాదించే నిమిత్తం మనం అపొస్తలుల బోధను బట్టి ఆజ్ఞాపించబడిన వారమైతే దానికి విధేయంగా తల వంచుటను మించిన భాగ్యం మరొకటి లేదు. వాస్తవమైన జీవం అంత గొప్పది మరి. దాని విలువ పరదైసులో ఉన్న లాజరు, అబ్రాహాములను అడిగితే తెలుస్తుంది.ఎక్కడో కాదు ఈ భూమి మీదనే వాస్తవమైన జీవాన్ని సాధించడం లేదా గెలుపొందడం ద్వారా మానవ జీవితం సార్థకం అవుతుంది. దీనికోసం చేసే జీవన పోరాటమే ఈ మానవ జీవితాన చెప్పకోదగిన ఆత్మ సంబంధ యుద్ధంగా రాజ గ్రంథమనే పరిశుద్ధ బైబిలు అభివర్ణించడం గమనించదగ్గది.



భారత వృద్ధి అంచనాలు కట్

- 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గింపు
- ఆసియా అభివృద్ధి బ్యాంక్ ప్రకటన
- 6.3 శాతానికి తగ్గించిన ఇండ్-రా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి అంచనాలను తగ్గిస్తున్నట్టు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) ప్రకటించాయి. ఏడీబీ 0.20 శాతం మేర, ఇండ్-రా 0.30 శాతం చొప్పున కోత పెట్టాయి. భారత జీడీపీ 2025-26లో 6.7 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని ఏడీబీ లోగడ అంచనా వేయగా.. తాజాగా దీన్ని 6.5 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. భారత ఎగుమతులు, పెట్టుబడులపై వాణిజ్య అనిశ్చితులు, అమెరికా టారిఫ్‌లు ప్రభావం చూపించొచ్చని పేర్కొంది. అయినప్పటికీ ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని తెలిపింది. ''అమెరికా కనీస టారిఫ్‌లు, సంబంధిత విధానపరమైన అనిశ్చితి వల్లే వృద్ధి అంచనాను సవరించాం. దీనికి అదనంగా అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి నిదానించడం, భారత ఎగుమతులపై అమెరికా అదనపు టారిఫ్‌లు, విధానపరమైన అనిశ్చితులు పెట్టుబడులపైనా ప్రభావం చూపిస్తాయి''అని ఏడీబీ పేర్కొంది. దేశీ ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయంటూ.. గ్రామీణ డిమాండ్ పుంజుకోవడంతో దేశీ వినియోగం బలంగా వృద్ధి చెందనుందని అంచనా వేసింది. భారత వృద్ధిని ప్రధానంగా వ్యవసాయం, సేవల రంగాలు నడిపిస్తాయని తెలిపింది. సాధారణం కంటే అధిక వర్షపాతం అంచనాలు వ్యవసాయ రంగం పనితీరుకు మద్దతుగా నిలుస్తాయని వివరించింది.

2025-26 సంవత్సరంలో జీడీపీ 6.3-6.8 శాతం మధ్య ఉండొచ్చని ఆర్థిక సర్వే పేర్కొనగా, 6.5 శాతంగా ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనాగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) జీడీపీ 6.5 శాతం వృద్ధి చెందడం గమనార్హం.

2026-27లో 6.7 శాతం..

భారత ప్రభుత్వ ద్రవ్య పరిస్థితులు పటిష్టంగా ఉన్నాయని, అంచనాలకు మించి ఆర్‌బీఐ డివిడెండ్ రావడంతో ద్రవ్యలోటును క్రమంగా తగ్గించుకోవాలన్న లక్ష్యాన్ని చేరుకునే దిశలో ఉన్నట్టు ఏడీబీ తెలిపింది. 2026-27లో భారత జీడీపీ 6.7 శాతం వృద్ధిని చేరుకోవచ్చని అంచనా వేసింది. సానుకూల ఆర్థిక పరిస్థితులు, విధానపరమైన అనిశ్చితి తగ్గుముఖం పట్టడం, పెట్టుబడుల్లో వృద్ధి, ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు నిర్ణయాలు అనుకూలించొచ్చని పేర్కొంది.

6.3 శాతానికి పరిమితం కావొచ్చు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని ఇండ్-రా అంచనా వేసింది. 2024 డిసెంబర్ అంచనాల్లో పేర్కొన్న 6.6%తో పోల్చి చూస్తే 0.30% తగ్గించింది. అమెరికా టారిఫ్‌ల పరంగా అనిశ్చితులు నెలకొనడంతోపాటు, పెట్టుబడుల వాతావరణం బలహీనంగా ఉండడాన్ని ప్రస్తావించింది. అన్ని దేశాలపై టారిఫ్‌లను అమెరికా ఏకపక్షంగా పెంచేయడం, పెట్టుబడుల వాతావరణం అంచనాలకు మించి బలహీనంగా ఉండడాన్ని ప్రతికూలతలుగా పేర్కొంది. పరపతి విధానం సరళీకరించడం (రెపో రేట్ల కోత), ద్రవ్యోల్బణం వేగంగా తగ్గుముఖం పట్టడం, సాధారణం కంటే అధిక వర్షపాతం అంచనాలను అనుకూలతలుగా ఇండ్-రా ముఖ్య ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్ తెలిపారు. సగటున రిటైల్ ద్రవ్యోల్బణం 3% స్థాయిలో, డాలర్‌తో రూపాయి మారకం 86.9% స్థాయిలో ఉండొచ్చని ఇండ్-రా అంచనా వేసింది.

చమురు ధరలు కనిష్ట స్థాయిల్లో ఉండడం కూడా భారత ఆర్థిక వ్యవస్థకు అనుకూలిస్తుందని అభిప్రాయపడింది.

క్యూ1 ఫలితాలు

టాటా కన్సూమర్ లాభం జూమ్

క్యూ1లో రూ. 332 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ కంపెనీ టాటా కన్సూమర్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 332 కోట్లను తాకింది. దేశీ మార్కెట్లో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 289 కోట్లు ఆర్జించింది. టాటా గ్రూప్ సంస్థ మొత్తం ఆదాయం సైతం 10 శాతం బలపడి రూ. 4,779 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 4,352 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ. 4,355 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలిపి మొత్తం టర్నోవర్ 10 శాతం ఎగసి రూ. 4,820 కోట్లను దాటింది. ఈ కాలంలో టీ, కాఫీ, వాటర్ తదితర మొత్తం బ్రాండెడ్ బిజినెస్ 11 శాతం వృద్ధితో రూ. 4,271 కోట్లను తాకగా.. దీనిలో దేశీ అమ్మకాలు రూ. 3,126 కోట్లుగా నమోదయ్యాయి. ఇది 11 శాతం వృద్ధి. అంతర్జాతీయంగా బ్రాండెడ్ బిజినెస్ 9 శాతం బలపడి రూ. 1,145 కోట్లను అధిగమించింది. ప్లాంటేషన్ తదితర నాన్‌బ్రాండెడ్ విభాగం 7 శాతం అధికంగా రూ. 536 కోట్లకు చేరింది. టాటా స్టార్‌బక్స్(జేవీ) 80 పట్టణాలలో 485 స్టోర్లకు విస్తరించింది.

ఫలితాల నేపథ్యంలో టాటా కన్సూమర్ షేరు 2% నష్టంతో రూ. 1,063 వద్ద ముగిసింది.

సింజీన్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 87 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ఫార్మా రంగ కాంట్రాక్ట్ రీసెర్చ్, అభివృద్ధి, తయారీ(సీఆర్‌డీఎంవో) కంపెనీ సింజీన్ ఇంటర్నేషనల్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 61 శాతం జంప్‌చేసి రూ. 87 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 54 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 790 కోట్ల నుంచి రూ. 875 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో సింజీన్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం లాభపడి రూ. 680 వద్ద ముగిసింది

కాల్గేట్ పామోలివ్ లాభం డౌన్

క్యూ1లో రూ. 321 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ దిగ్గజం కాల్గేట్ పామోలివ్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 321 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 364 కోట్లు ఆర్జించింది. పట్టణాలలో డిమాండ్ మందగించడం, పరిశ్రమలో తీవ్ర పోటీ ప్రభావం చూపాయి. మొత్తం ఆదాయం సైతం 4 శాతం నీరసించి రూ. 1,421 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 1,486 కోట్ల అమ్మకాలు ప్రకటించింది. అయితే మొత్తం వ్యయాలు 1 శాతం తక్కువగా రూ. 1,020 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో కాల్గేట్ షేరు బీఎస్ఈలో 4 శాతం నష్టంతో రూ. 2,285 వద్ద ముగిసింది.

క్రిసిల్ డివిడెండ్ రూ. 9

క్యూ2 లాభం రూ. 172 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025) రెండో త్రైమాసికంలో దేశీ రేటింగ్ దిగ్గజం క్రిసిల్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ2)లో నికర లాభం 14 శాతం ఎగసి రూ. 172 కోట్లను తాకింది. గతేడాది(2024) ఇదే కాలంలో రూ. 150 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 9 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఆగస్ట్ 8కల్లా చెల్లించనుంది. మొత్తం ఆదాయం సైతం 6 శాతం పుంజుకుని రూ. 867 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 815 కోట్ల టర్నోవర్ సాధించింది. కంపెనీ జనవరి-డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. సొంత అనుబంధ సంస్థ కోయలిషన్ సింగపూర్ పీటీఈ లిమిటెడ్ మూసివేతకు బోర్డు అనుమతించినట్లు క్రిసిల్ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో క్రిసిల్ షేరు బీఎస్ఈలో 1 శాతం పెరిగి రూ. 5,858 వద్ద ముగిసింది.

డీసీఎం శ్రీరామ్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 114 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ కంపెనీ డీసీఎం శ్రీరామ్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 13 శాతం ఎగసి రూ. 114 కోట్లను తాకింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 100 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,099 కోట్ల నుంచి రూ. 3,477 కోట్లకు బలపడింది. ఉత్తరప్రదేశ్ వెలుపల ఇథనాల్‌ను విక్రయించడం(ఎగుమతి)తో విధించిన రూ. 36 కోట్ల గతకాలపు సుంకం(లెవీ) ప్రతికూల ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో డీసీఎం శ్రీరామ్ షేరు 3 శాతం లాభంతో రూ. 1,441 వద్ద ముగిసింది.

ఢిల్లీలో వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సు

సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు నిర్వహణ



న్యూఢిల్లీ: 'వరల్డ్ ఫుడ్ ఇండియా 2025' సదస్సు సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు ఢిల్లీలో జరగనుంది. కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నట్టు మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రకటించారు. ఈ రంగంలో పెట్టుబడుల అవకాశాలను అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు పరిచయడం చేయడం, ఫుడ్ ప్రాసెసింగ్‌లో భారత్ స్థానాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సదస్సును 'భారత్ మండపం'లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌ను మంత్రి ఆవిష్కరించారు. గతంలో నిర్వహించిన మూడు ఎడిషన్లు (సదస్సులు) విజయవంతమైనట్టు, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అనుకుంటున్నట్టు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ కార్యదర్శి అవినాష్ జోషి తెలిపారు. గత దశాబ్ద కాలంలో ఈ రంగం ఎంతో పురోగతి సాధించినట్టు చెప్పారు. దేశ వ్యవసాయ ఎగుమతుల్లో ఈ విభాగం నుంచే 20 శాతం ఉంటున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎక్విప్‌మెంట్ తయారీదారులు, ప్యాకేజింగ్ సొల్యూషన్ కంపెనీలు, లాజిస్టిక్స్ సంస్థలు, స్టార్టప్‌లు పాల్గొనున్నట్టు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-7-2025

విశాఖ	485-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	450-00
వరంగల్	452-00
రిటైల్ ధర	5.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	690.9	2.6
BHARTIARTL	1,948.70	2.2
SHRIRAMFIN	654	2.16
APOLLOHOSP	7,389.00	1.97
BAJFINANCE	968	1.62

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,064.00	-1.92
HINDUNILVR	2,456.80	-0.92
INFY	1,558.90	-0.76
GRASIM	2,703.70	-0.7
BEL	400.6	-0.62

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,602
ఎన్ఎస్ఈ	93,826
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,50,746
ఎఫ్ఐఐ	- 4,209
డీఐఐ	+ 4,358

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.27 (రాత్రి 11.30కు)	$	65.31 (గత ముగింపు)
బ్రెంట్	66.85 (రాత్రి 11.30కు)	$	68.59 (గత ముగింపు)

తిలక్‌నగర్ చేతికి ఇంపీరియల్ బ్లూ

డీల్ విలువ రూ. 4,150 కోట్లు

ముంబై: దేశీ లిక్కర్ కంపెనీ తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ తాజాగా సుప్రసిద్ధ విస్కీ బ్రాండ్ ఇంపీరియల్ బ్లూను సొంతం చేసుకోనుంది. ఇందుకు ఫ్రెంచ్ లిక్కర్ దిగ్గజం దేశీ యూనిట్ పెర్నాడ్ రికార్డ్ ఇండియాతో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. డీల్ ప్రకారం రూ. 4,150 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో కొనుగోలు చేయనుంది. దీనిలో రూ. 282 కోట్లు లావాదేవీ ముగిసిన నాలుగేళ్ల తదుపరి చెల్లించేందుకు వీలుంది. డీల్ వివరాలను రెండు సంస్థలూ వెల్లడించాయి. కాగా.. ఈ డీల్ ద్వారా పాప్యులర్ బ్రాందీ బ్రాండ్ మ్యాన్షన్ హౌస్‌ను ఉత్పత్తి చేసే తిలక్‌నగర్ విస్కీ విభాగంలోనూ సుప్రసిద్ధ బ్రాండ్‌ను సొంతం చేసుకోనుంది. వెరసి దేశీ తయారీ విదేశీ మద్యం(ఐఎంఎఫ్ఎల్) విభాగంలో రెండు భారీ బ్రాండ్లను విక్రయించేందుకు వీలు చిక్కనుంది. అమ్మకాల పరిమాణంరీత్యా ఇంపీరియల్ బ్లూ దేశీయంగా మూడో పెద్ద విస్కీ బ్రాండ్‌గా నిలుస్తోంది. గతేడాది(2024-25) రూ. 3,067 కోట్ల అమ్మకాలు సాధించింది. రెండు సొంత యూనిట్లు, బాట్లింగ్ సహతయారీ సర్వీసులు డీల్‌లో భాగం కానున్నాయి.

షేరు పరుగు..

కొనుగోలు వార్తల నేపథ్యంలో తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ షేరు గత కొద్ది రోజులుగా బలపడుతూ వస్తోంది. తాజాగా బీఎస్ఈలో 0.7 శాతం లాభపడి రూ. 473 వద్ద ముగిసింది. గత నెల రోజుల్లో 30 శాతంపైగా లాభపడటం గమనార్హం! ఈ ఏప్రిల్ 7న రూ. 205 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకిన షేరు మంగళవారానికల్లా(22న) రూ. 488 వద్ద 52 వారాల గరిష్టానికి చేరింది!!

మింత్రాపై ఈడీ ఫెమా కేసు

ఎఫ్‌డీఐ నిబంధనలు ఉల్లంఘించిందని ఆరోపణలు



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఈ-కామర్స్ సంస్థ మింత్రాపై విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా) కింద కేసు నమోదైంది. రూ. 1,654 కోట్ల పెట్టుబడుల విషయంలో మింత్రాతో పాటు, దానితో సంబంధమున్న కంపెనీలు, డైరెక్టర్లపై తమ బెంగళూరు జోనల్ ఆఫీసు ఫిర్యాదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ పేరిట విదేశీ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమీకరించిన మింత్రా, దాని అనుబంధ కంపెనీలు మల్టీ-బ్రాండ్ రిటైల్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయనేది ప్రధాన ఆరోపణ. కంపెనీ సింహ భాగం ఉత్పత్తులను వెక్టార్ ఈ-కామర్స్ సంస్థకు విక్రయిస్తోండగా, సదరు కంపెనీ అంతిమంగా కస్టమర్లకు రిటైల్‌గా విక్రయిస్తోందని ఈడీ వివరించింది. ఈ రెండు సంస్థలూ ఒకే గ్రూప్‌లో భాగమని తెలిపింది. మరోవైపు, చట్టాలను తాము గౌరవిస్తామని, విచారణకు పూర్తిగా సహకరిస్తామని మింత్రా ప్రతినిధి తెలిపారు. డిజిటల్ కామర్స్ ద్వారా దుస్తుల పరిశ్రమకు సాధికారత కల్పించడం ద్వారా దేశ నిర్మాణానికి కంపెనీ తన వంతు తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రస్తు నిబంధనల ప్రకారం మార్కెట్‌ప్లేస్ విధానంలో కార్యకలాపాలు సాగించే కంపెనీల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతులున్నాయి. 2007లో ఏర్పాటైన మింత్రా ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌లో భాగంగా ఉంది.

లక్ష్మీ ఇండియా @ రూ. 150-158

- ఈ నెల 29-31 మధ్య ఐపీవో
- రూ. 254 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి తాజాగా రూ. 150-158 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 29న ప్రారంభమై 31న ముగియనుంది. దీనిలో భాగంగా 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 56.38 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 254 కోట్లకుపైగా సమీకరించాలని భావిస్తోంది. 2025 మార్చికల్లా నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) రూ. 1,277 కోట్లకు ఎగశాయి. 2023 మార్చికల్లా రూ. 687 కోట్ల ఏయూఎం నమోదైంది. ప్రధానంగా ఉత్తరాదిన 158 బ్రాంచీలతో నెట్‌వర్క్‌ను విస్తరించింది. గతేడాది(2024-25) ఆదాయం 42 శాతం ఎగసి రూ. 246 కోట్లను తాకింది. నికర లాభం సైతం 60% జంప్‌చేసి రూ. 36 కోట్లకు చేరింది.

కొత్త ఆవిష్కరణలపై బ్యాంక్ ఆఫ్ బరోడా దృష్టి

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తమ 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా పలు కొత్త ఆవిష్కరణలు, కార్యక్రమాలను ప్రకటించింది. వ్యాపార వర్గాల కోసం ఉద్దేశించిన వరల్డ్ బిజినెస్ యాప్, బాబ్ ఈ-పే ఇంటర్నేషనల్, ఇన్‌సైట్ బ్రెయిలీ డెబిట్ కార్డు, గ్రీన్ ఫైనాన్సింగ్ స్కీములు మొదలైనవి ఉన్నాయి. టెక్నాలజీ ఆధారిత బ్యాంకింగ్ సేవలను అందించడం ద్వారా సమ్మిళిత వృద్ధి సాధనలో బీవోబీలాంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు తెలిపారు. బ్యాంకింగ్ సేవలను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు, లావాదేవీల నిర్వహణను సరళతరంగా, సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని బీవోబీ ఎండీ దేబదత్త చంద్ తెలిపారు.

ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్‌తో పేపాల్ జట్టు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ పేమెంట్స్ దిగ్గజం పేపాల్ తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఇంటర్నేషనల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. సీమాంతర చెల్లింపు లావాదేవీలను మరింత సులభతరం చేసేలా పేపాల్ వరల్డ్ ప్లాట్‌ఫాంనకు యూపీఐని అనుసంధానించేందుకు ఇది ఉపయోగపడనుంది. యూపీఐని అంతర్జాతీయంగా మరింత ప్రాచుర్యంలోకి తెచ్చే దిశగా పేపాల్‌తో భాగస్వామ్యం ఒక కీలక ముందడుగని ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ ఎండీ రితేశ్ శుక్లా తెలిపారు. నిధులను వివిధ దేశాలవ్యాప్తంగా బదిలీ చేయడం సంక్లిష్టమైన ప్రక్రియే అయినప్పటికీ దాదాపు రెండు వందల కోట్ల మంది వినియోగదారులు, వ్యాపారాలకు తమ ప్లాట్‌ఫాం దీన్ని సరళతరం చేస్తోందని పేపాల్ ప్రెసిడెంట్ అలెక్స్ క్రిస్ తెలిపారు.

బీ న్యూ మొబైల్స్ స్టోర్లలో వీవో ఎక్స్ ఫోల్డ్5 స్మార్ట్‌ఫోన్లు




హైదరాబాద్: ప్రముఖ మొబైల్స్ విక్రయ సంస్థ 'బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్' వివో ఎక్స్ ఫోల్డ్ 5, ఎక్స్ 200 ఎఫ్ఈ 5జీ స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి తెచ్చింది. నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో సినీ నటి పూజితా పొన్నాడా వీటిని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా విస్తరిస్తున్న బీ న్యూ మొబైల్స్ స్టోర్లలో 'వివో ఎక్స్ ఫోల్డ్ 5' స్మార్ట్‌ఫోన్లు లభిస్తున్నాయి. దగ్గర్లోని బీ న్యూ స్టోర్లలో ఈ మొబైల్స్ కొనండి అన్నారు. లాంచింగ్ ఆఫర్‌లో భాగంగా ఇయర్ బడ్స్, స్మార్ట్ వాచ్, ఫ్లాష్‌గార్డ్ ఉచితంగా పొందవచ్చు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎండీ వై.డి.బాలాజి చౌదరి, సీఈవో వై.సాయి నిఖిలేష్, ఎండీ వై.సాయి నితీష్, వివో జీఎం అతిష్ భార్గవ్, డీజీఎం రెడ్డి వసంత్, రిటైల్ మేనేజర్ పిచ్చేశ్వర రావు పాల్గొన్నారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆషాఢమాసం సర్‌ప్రైజ్ ఆఫర్

హైదరాబాద్: ఆషాఢమాసం సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ 'సర్‌ప్రైజ్' ఆఫర్ ప్రకటించింది. ప్రతి కొనుగోలు, లావాదేవీలపై కచ్చితమైన ఆశ్చర్యపోయే బహుమతి అందిస్తుంది. కస్టమర్లు ఆషాఢమాసం అంతా ఈ సర్‌ప్రైజ్ బహుమతులు పొందవచ్చు. ఈ ప్రత్యేక ఆఫర్ బంగారు నాణేలు, బార్లపై వర్తించదు. అలాగే ఇతర ప్రమోషన్లతో కలిసి వినియోగించలేమని కంపెనీ తెలిపింది. 'ప్రతి ఆషాఢం సీజన్‌ను ఒక అందమైన బహుమతిగా మార్చాలని సంకల్పించాము. అందుకే ఎంచుకునే ప్రతి ఆభరణంపై ఒక ప్రత్యేక బహుమతి అందిస్తున్నాము' అని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ 'ఆనంద్' అనంత పద్మనాభన్ తెలిపారు.


డీపీఐఐటీతో మారుతీ సుజుకీ ఎంవోయూ



న్యూఢిల్లీ: ఆటోమొబైల్స్ తయారీ రంగానికి టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణలను అందించేలా అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగంతో (డీపీఐఐటీ) కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం స్టార్టప్ ఇండియా కింద డీపీఐఐటీ గుర్తింపు పొందిన అంకుర సంస్థలకి, మారుతీ సుజుకీ ఇన్నోవేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

రియల్టీ కంపెనీలలో వాటా విక్రయం

- ఇన్వెస్కో 2 కోట్ల షేర్ల అమ్మకం
- వీటి విలువ రూ. 3,202 కోట్లు
- జాబితాలో లోధా డెవలపర్స్, ఒబెరాయ్ రియల్టీ



న్యూఢిల్లీ: దేశీ రియల్టీ రంగ కంపెనీలు ఒబెరాయ్ రియల్టీ, లోధా డెవలపర్స్‌లో యూఎస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఇన్వెస్కో తాజాగా 2 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఒబెరాయ్ రియల్టీలో 2.95 శాతం వాటాకు సమానమైన కోటికిపైగా షేర్లను అమ్మివేసింది. బీఎస్ఈ బల్క్‌డీల్ వివరాల ప్రకారం అనుబంధ సంస్థ ఇన్వెస్కో డెవలపింగ్ మార్కెట్స్ ఫండ్ షేరుకి రూ. 1,754.26 ధరలో వీటిని విక్రయించింది. తద్వారా రూ. 1,883 కోట్లకు అందుకుంది. 2025 జూన్‌కల్లా ఇన్వెస్కో ఫండ్‌కు ఒబెరాయ్ రియల్టీలో 3.01 శాతం వాటా ఉంది. కాగా.. ఈ బాటలో లోధా డెవలపర్స్‌లోనూ 1 శాతం వాటాకు సమానమైన 95.25 లక్షల షేర్లను విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్‌డీల్ ప్రకారం షేరుకి రూ. 1384.93 ధరలో అమ్మివేయడం ద్వారా రూ. 1,319 కోట్లకుపైగా సమకూర్చుకుంది.

ఎస్‌బీఐ ఫండ్ కొనుగోలు

ఒబెరాయ్ రియల్టీలో 1.13% వాటాకు సమానమైన 40.94 లక్షల షేర్లను ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ సొంతం చేసుకుంది. షేరుకి రూ. 1,754.10 సగటు ధరలో రూ. 718.2 కోట్లకు కొనుగోలు చేసింది. బీఎస్ఈ గణాంకాల ప్రకారం ఇతర కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. ఇదేవిధంగా ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం లోధా డెవలపర్స్ షేర్ల కొనుగోలుదారుల వివరాలు సైతం వెల్లడికాలేదు.

బల్క్ డీల్స్ నేపథ్యంలో లోధా డెవలపర్స్(మాక్రోటెక్) షేరు 8 శాతం పతనమై రూ. 1,332 వద్ద ముగిసింది. ఇక ఒబెరాయ్ రియల్టీ షేరు 3.2 శాతం క్షీణించి రూ. 1,767 వద్ద నిలిచింది.

సరికొత్తగా రెనో ట్రైబర్...



ముంబై: ఫ్రెంచ్ వాహన తయారీ దిగ్గజం రెనో సరికొత్త 'ఆల్-న్యూ రెనో ట్రైబర్'ను లాంచ్ చేసింది. ఈ కొత్త ట్రైబర్‌లో దాని ప్రత్యేకమైన 7 సీటర్ కెపాసిటీని, సీట్లను మార్చుకునే వెసులుబాటును అలాగే ఉంచుతూ డిజైన్, ఫీచర్లలో పలు మార్పులు తీసుకొచ్చింది. ప్రారంభ ధర రూ.6.29 లక్షలుగా ఉంది. ఈ సందర్భంగా రెనో ఇండియా ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లి మాట్లాడుతూ.. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన వ్యవస్థ మెరుగైన వృద్ధి సాధించిన తర్వాతే మార్కెట్లోకి ఈవీ ఉత్పత్తులను విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం భారత ఈవీ మార్కెట్, నిబంధనలు, ఎకో సిస్టమ్ అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. సరైన సమయంలో ఈవీలను ఆవిష్కరిస్తామన్నారు.


జెర్సీ నంబర్ ఏకే-47

- భారత క్రికెట్‌లో దూసుకొచ్చిన అన్షుల్ కంబోజ్
- దేశవాళీ క్రికెట్‌లో ఆకట్టుకునే ప్రదర్శనలు

దాదాపు ఆరు వారాల క్రితం... నార్తాంప్టన్‌లో ఇంగ్లండ్ లయన్స్‌తో భారత్ 'ఎ' తలపడిన అనధికారిక టెస్టులో అన్షుల్ కంబోజ్ సభ్యుడిగా ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో 4 వికెట్లు తీయడంతో పాటు అతను అర్ధ సెంచరీ కూడా సాధించాడు. మరో 10 రోజుల్లో భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా జట్టులో ప్రధాన పేసర్ ఒకరు గాయంతో బాధపడుతుండటంతో ముందు జాగ్రత్తగా మరో పేసర్‌ను టీమ్‌తో చేర్చాలని మేనేజ్‌మెంట్ భావించింది. 'ఎ' తరఫున ప్రదర్శన చూసిన తర్వాత కంబోజ్‌కు అవకాశం దక్క వచ్చని అంతా అనుకున్నారు. అయితే హర్షిత్ రాణాను జట్టు ఎంచుకుంది.

స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాతి రోజు ఉదయమే తాను రోజూ సాధన చేసే అకాడమీకి కంబోజ్ చేరుకున్నాడు. ఇంగ్లండ్ నుంచి వస్తూ వస్తూ అతను కొన్ని డ్యూక్స్ బంతులను వెంట తెచ్చుకున్నాడు. సింగిల్ స్టంప్‌ను పెట్టుకొని వాటితో ప్రాక్టీస్ మొదలు పెట్టేశాడు. కోచ్ ఎలా ఉన్నావు అడిగితే 'అంతా బాగుంది సర్. కానీ నాకు ఇంకా నమ్మకం ఉంది' అంటూ జవాబిచ్చాడు. జట్టులో స్థానంపై ఆశలు కోల్పోని కంబోజ్‌కు కొద్ది రోజులకే తీపి కబురు వచ్చింది. డ్యూక్స్ బంతులతో సాధన ఇంగ్లండ్‌తో మ్యాచ్ కోసమేనా అన్నట్లుగా వచ్చీ రాగానే టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేసే అవకాశం కూడా లభించింది.

- సాక్షి క్రీడా విభాగం





హరియాణాలో బాక్సర్లకు అడ్డా అయిన కర్నాల్ సమీపంలో ఫజిల్‌పూర్ అన్షుల్ స్వస్థలం. చాలా మందిలాగే అతనూ మట్టి మైదానాల్లో క్రికెట్ ఆడుతూ వచ్చాడు. 14 ఏళ్ల వయసు వచ్చాకే బౌలింగ్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాడు. తండ్రి ఉధమ్ సింగ్ అన్ని రకాలుగా అండగా నిలవగా... స్థానిక కోచ్ సతీశ్ రాణా అతడిని తీర్చి దిద్దాడు. అకాడమీలో చేర్పించిన అనంతరం అన్షుల్ ఆట పదునెక్కింది. ఆస్ట్రేలియా దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్‌ను విపరీతంగా అభిమానించే అతను... మెక్‌గ్రాత్ తరహాలోనే పేస్ కంటే కూడా కచ్చితత్వంపైనే ఎక్కువగా ఆధారపడతాడు. భారత్‌లో స్వింగ్ బౌలింగ్‌కు బాగా అనుకూలించే మైదానంగా గుర్తింపు పొందిన లాహ్లిలో ఎక్కువగా ప్రాక్టీస్ చేయడం కలిసి రాగా, తీవ్ర సాధనతో అన్షుల్ సీమ్ బౌలింగ్‌లో రాటుదేలాడు. ఇప్పుడే అదే ప్రత్యేకత అతడిని తొలిసారి టెస్టు జట్టుకు ఎంపిక య్యేలా చేసింది.

నాన్నకు ఆనందం పంచుతూ...

ఆరేళ్ల క్రితం భారత అండర్-19 జట్టుకు ఎంపిక కావడం అన్షుల్ కెరీర్‌లో కీలక మలుపు. నిజానికి అంతకు కొద్ది రోజుల ముందే అండర్-19 వరల్డ్ కప్‌లో ఆడే భారత జట్టులో చోటు లభించే అవకాశం రాగా, గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. ఆ సమయంలో తీవ్రంగా బాధపడిన అన్షుల్ ఆటను వదిలేద్దామనుకున్నాడు. కానీ అతనిలోని ప్రతిభ గురించి తెలిసిన తండ్రి కొనసాగమని గట్టిగా ప్రోత్సహించాడు. దాంతో పట్టుదలగా ఆడుతూ ముందుకు వెళ్లిన అన్షుల్ 2022లో తొలిసారి హరియాణా తరఫున రంజీ ట్రోఫీ మ్యాచ్ బరిలోకి దిగాడు. మూడేళ్లు గడిచేసరికి ఇప్పుడు భారత్ తరఫున టెస్టు క్రికెట్ ఆడటంతో తండ్రి ఆనందానికి అవధుల్లేవు. గత పదేళ్లుగా ఉధమ్ సింగ్ నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కంబోజ్ ఎంపిక తండ్రి బాధలన్నీ ఒక్క క్షణంలో దూరం చేసిందని అతని సోదరుడు సంయమ్ చెప్పాడు. కంబోజ్ మ్యాచ్ ఆడే సమయంలోనే అతని తల్లికి కిడ్నీ సంబంధిత సర్జరీ కూడా ఉంది. ఆ సమయంలో కొడుకు లేకపోయినా... కోలుకున్న తర్వాత ఆ కుటుంబంలో కనిపించే సంతోషం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పటి వరకు 24 మ్యాచ్‌ల ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 22.88 సగటుతో 79 వికెట్లు పడగొట్టిన అన్షుల్ తొలి టెస్టులో బౌలింగ్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాడు.



కుటుంబ సభ్యులతో...



ఆ రెండు ప్రదర్శనలు...

అన్షుల్ అనూహ్యంగా దూసుకు వచ్చిన తరహా ఆటగాడు కాదు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాడు. 2023-24 సీజన్ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని హరియాణా గెలుచుకోవడంలో 17 వికెట్లతో అతను కీలక పాత్ర పోషించాడు. ఇది అతనికి రూ.20 లక్షలతో తొలి ఐపీఎల్ అవకాశం ఇప్పించింది. 2024 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరఫున 3 మ్యాచ్‌లు ఆడగలిగాడు. తొలి మ్యాచ్‌లో ట్రవిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేయగా... అది నోబాల్‌గా తేలింది. ఈ స్థాయిలో ఆడటం అంత సులువు కాదని అది తనకు నేర్పించిందని అతను గుర్తు చేసుకున్నాడు. అన్షుల్ ప్రతిభకు ఐపీఎల్ 2025లో గుర్తింపు దక్కింది. వేలంలో రూ.3 కోట్ల 40 లక్షలకు అతడిని సొంతం చేసుకున్న చెన్నై సూపర్ కింగ్స్ 8 మ్యాచ్‌లలో అవకాశం ఇచ్చింది. ఈ హరియాణా ప్లేయర్ తన పేరును, జెర్సీ నంబర్‌ను ఒకే చోట చేర్చి (అన్షుల్ కంబోజ్-ఏకే 47) పేరుతో జెర్సీని ధరించి ఐపీఎల్ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగాడు. గత సీజన్ దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భారత్ 'సి' తరఫున ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన అన్షుల్, రంజీ మ్యాచ్‌లో కేరళపై ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా ఘనతను అందుకున్నాడు. అనంతపురంలో జరిగిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో బౌలింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేని పిచ్‌పై భారత్ 'సి' 525 పరుగులు చేయగా... అన్షుల్ దెబ్బకు 'బి' 332 పరుగులకే ఆలౌటైంది. 'ప్రతిభ మాత్రమే కాదు...జహీర్, బుమ్రా తరహాలో తనదైన వ్యూహంతో బౌలింగ్ చేయగల అరుదైన పేసర్ అన్షుల్' అంటూ అతని సీఎస్‌కే సహచరుడు అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. ఇంగ్లండ్ గడ్డపై తనకు లభించిన అవకాశాలను అన్షుల్ సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లడం ఖాయం.

కొత్త క్రీడా బిల్లులో ఏమున్నాయంటే...



న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా.... భారత ప్రభుత్వం కొత్త క్రీడా బిల్లును ప్రవేశపెట్టింది. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం లోక్‌సభలో 'నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు'ను ప్రవేశపెట్టారు. నేషనల్ స్పోర్ట్స్ బోర్డు, నేషనల్ స్పోర్ట్స్ ట్రిబ్యునల్, నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానెల్, సమాచార హక్కు చట్టం అమలు, ప్రభుత్వ విచక్షణాధికారాలు, వయో పరిమితికి సంబంధించిన నిబంధనలు, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు-2025 ఇలా అందులోని కొన్ని కీలక అంశాలు ఇవి...

- జాతీయ క్రీడా బోర్డు (ఎన్‌ఎస్‌బీ)కు ఓ చైర్‌పర్సన్ ఉండనున్నాడు. అతడిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. సామర్థ్యం, సమగ్రత, అర్హత ప్రతిపాదికన బోర్డు సభ్యుల ఎంపిక జరుగుతుంది. క్రీడలపై అవగాహనతో పాటు పాలన అనుభవం ఉన్న వ్యక్తులకు పెద్దపీట వేయనుంది. ప్రజల నుంచి సలహాలు సూచనలు తీసుకొని విస్తృత సంప్రదింపులు జరిపిన అనంతరం సెలక్షన్ కమిటీ సిఫార్సులతో ఈ నియమకాలు జరుగుతాయి.
- సెలక్షన్ కమిటీకి క్యాబినెట్ సెక్రటరీ లేదా కేంద్ర క్రీడా శాఖ కార్యదర్శి, జాతీయ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జనరల్ చైర్ పర్సన్ అవుతారు. ఇందులో జాతీయ క్రీడా సంఘాలకు అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన ఇద్దరు క్రీడా నిర్వాహకులతో పాటు ఖేల్‌రత్న, ద్రోణాచార్య, అర్జున అవార్డు పొందిన ఓ ప్రముఖ క్రీడాకారుడు ఉంటాడు.
- భారత ఎన్నికల సంఘం మాజీ సభ్యులు లేదా రాష్ట్రాల మాజీ ప్రధాన ఎన్నికల అధికారులతో కూడిన జాతీయ క్రీడా ఎన్నికల ప్యానెల్‌ను కూడా ఈ బిల్లు అందించనుంది. ఈ ప్యానెల్ జాతీయ క్రీడా సంస్థల కార్యనిర్వాహక కమిటీలు, అథ్లెట్ల కమిటీకి ఎన్నికలు నిర్వహించనుంది.
- క్రీడల్లో డోపింగ్‌కు ఏమాత్రం అవకాశం ఉండకూడదనే ఉద్దేశంతో... సమగ్ర ప్రక్షాళనకు కేంద్ర నడుం బిగించింది. జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు-2025 ప్రకారం క్రీడా కార్యకలాపాలు, దర్యాప్తులకు సంబంధించిన నిర్ణయాల్లో స్వయంప్రతిపత్తి ఉంటుంది.
- సివిల్ కోర్టుకు ఉండే అన్నీ అధికారాలు గల జాతీయ క్రీడా ట్రిబ్యునల్ ప్రతిపాదన కూడా బిల్లులో ఉంది. ఇది వేర్వేరు క్రీడాంశాల్లో ప్లేయర్ల ఎంపికల నుంచి మొదలుకొని... సంఘాల ఎన్నికలు, వాటి వివాదాలను పరిష్కరించనుంది. ఇది అమల్లోకి వచ్చాక కేవలం సుప్రీంకోర్టుకు మాత్రమే ఈ నిర్ణయాలను సవాలు చేసే అధికారం ఉండనుంది.
- క్రీడా మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం... ప్రస్తుతం క్రీడా రంగానికి సంబంధించిన 350 కేసులు వేర్వేరు న్యాయస్థానాల్లో నడుస్తున్నాయి. జాతీయ స్పోర్ట్స్ ట్రిబ్యునల్ ప్రారంభమైతే... అథ్లెట్లకు ఎంతో ఉపకరించనుంది.
- జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు-2025ను సైతం కేంద్ర మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) సూచించిన మార్పులను ఇందులో పొందుపరిచారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) పనితీరులో ప్రభుత్వాల జోక్యం అధికంగా ఉండటంపై 'వాడా' గతంలో అభ్యంతరం వ్యక్తం చేసింది.
- 2022లో ఈ చట్టాన్ని ఆమోదించారు. అయితే 'వాడా' లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా దాని అమలును నిలిపి వేయాల్సి వచ్చింది. గతంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులతో కూడిన బోర్డు... 'నాడా'ను పర్యవేక్షించేది. అయితే స్వయం ప్రతిపత్తి గల సంస్థలో ప్రభుత్వ జోక్యాన్ని 'వాడా' తప్పుబట్టింది.



ఇన్‌గ్లిస్, గ్రీన్ మెరుపులు





- 173 పరుగుల లక్ష్యాన్ని 15.2 ఓవర్లలో ఛేదించిన ఆస్ట్రేలియా
- రెండో టి20లోనూ ఓడిన వెస్టిండీస్
- అంతర్జాతీయ క్రికెట్‌కు రసెల్ వీడ్కోలు

కింగ్‌స్టన్: జోష్ ఇన్‌గ్లిస్ (33 బంతుల్లో 78 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు), కామెరూన్ గ్రీన్ (32 బంతుల్లో 56 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధశతకాలతో విజృంభించడంతో వెస్టిండీస్‌తో రెండో టి20లో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన రెండో పోరులో ఆసీస్ 8 వికెట్ల తేడాతో నెగ్గి 2-0తో ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. బ్రాండన్ కింగ్ (51; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కరీబియన్ ఆల్‌రౌండర్ రసెల్ (15 బంతుల్లో 36; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఉన్నంతసేపు అదరగొట్టాడు. కెప్టెన్ షై హోప్ (9), హెట్‌మైర్ (14), రోస్టన్ ఛేజ్ (16), పావెల్ (12), రూథర్‌ఫోర్డ్ (0), హోల్డర్ (1) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా 3... మ్యాక్స్‌వెల్, ఎలీస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఆస్ట్రేలియా 15.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. ఓపెనర్లు షాన్ మార్ష్ (21), మ్యాక్స్‌వెల్ (12) ఎక్కువసేపు నిలువలేకపోగా... ఇన్‌గ్లిస్, గ్రీన్ వీరవిహారం చేశారు. దాంతో మరో 28 బంతులు మిగిలుండగానే ఆసీస్ లక్ష్యాన్ని ఛేదించింది.

మ్యాచ్ ప్రారంభానికి ముందు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్న రసెల్‌కు రెండు జట్ల ఆటగాళ్లు 'గార్డ్ ఆఫ్ ఆనర్'తో గౌరవం ఇచ్చారు. ఈ సందర్భంగా విండీస్ క్రికెట్ బోర్డు రసెల్‌కు జ్ఞాపిక అందించింది. వెస్టిండీస్ తరఫున ఒక టెస్టు, 56 వన్డేలు, 86 టి20 మ్యాచ్‌లు ఆడిన 37 ఏళ్ల రసెల్ మూడు ఫార్మాట్‌లలో కలిపి 2159 పరుగులు చేయడంతోపాటు 132 వికెట్లు తీశాడు.



ఫరూఖ్ ఇంజినీర్‌కు అరుదైన గౌరవం

ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో స్టాండ్‌కు పేరు





మాంచెస్టర్: భారత మాజీ వికెట్ కీపర్, తమ జట్టుకు సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన ఫరూఖ్ ఇంజినీర్‌ను లాంకషైర్ కౌంటీ క్లబ్ సముచితంగా గౌరవించింది. ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో ఒక స్టాండ్‌కు దిగ్గజం క్రికెటర్ క్లయివ్ లాయిడ్‌తో కలిపి 'సర్ క్లయివ్ లాయిడ్ అండ్ ఫరూఖ్ ఇంజినీర్ స్టాండ్' అని పేరు పెట్టింది. నాలుగో టెస్టు ఆరంభానికి ముందు ఈ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ముంబైకి చెందిన ఫరూఖ్ ఇంజినీర్ 1961-1975 మధ్య భారత్ తరఫున 46 టెస్టులు ఆడి 2611 పరుగులు చేయడంతో పాటు కీపర్‌గా 82 వికెట్ల పతనంలో భాగస్వామిగా ఉన్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్‌లో చాలా భాగం ఇంగ్లండ్ కౌంటీ లాంకషైర్‌నే తన సొంత జట్టుగా చేసుకున్న ఫరూఖ్... లాంకషైర్ తరఫున 175 మ్యాచ్‌లలో 5942 పరుగులు సాధించి 429 క్యాచ్‌లు పట్టారు. విండీస్ ఆల్‌టైమ్ గ్రేట్ లాయిడ్ లాంకషైర్ తరఫున 219 మ్యాచ్‌లలో 12,764 సాధించారు. వీరిద్దరు ప్రాతినిధ్యం వహించిన ఎనిమిదేళ్ల సమయంలో జట్టు వరుస విజయాలతో ఏడు ట్రోఫీలు గెలుచుకుంది. అందుకే వీరిద్దరిని గౌరవిస్తూ స్టాండ్‌కు పేరు పెట్టింది. సొంత దేశంలో లభించని గౌరవం తనకు ఇక్కడ లభించడం పట్ల ఫరూఖ్ ఇంజినీర్ సంతోషం వ్యక్తం చేశారు.

సెమీఫైనల్లో పంకజ్

మనామా (బహ్రెయిన్): వరల్డ్ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీతో పాటు భారత్‌కే చెందిన ఆదిత్య మెహతా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో పంకజ్ 5-4 (39-26, 18-55, 43-5, 64-1, 42-1, 0-70, 0-59, 0-68, 38-14) ఫ్రేమ్‌ల తేడాతో చెన్ కియెన్ (చైనా)పై, ఆదిత్య 5-2 (74-0, 42-17, 2-39, 48-0, 0-38, 38-8, 75-0) ఫ్రేమ్‌ల తేడాతో మనన్ చంద్ర (భారత్)పై గెలిచారు. సెమీఫైనల్లో ఆదిత్యతో పంకజ్ తలపడతాడు.

సింగిల్స్‌లోనూ వీనస్ విజయం





వాషింగ్టన్: సుదీర్ఘ విరామం తర్వాత ప్రొఫెషనల్ టెన్నిస్‌లో పునరాగమనం చేసిన అమెరికా దిగ్గజం వీనస్ విలియమ్స్ సింగిల్స్ విభాగంలోనూ శుభారంభం చేసింది. సిటీ డీసీ ఓపెన్-500 టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో 45 ఏళ్ల వీనస్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో వీనస్ 6-3, 6-4తో ప్రపంచ 35వ ర్యాంకర్, 23 ఏళ్ల పేటన్ స్టెర్న్స్‌పై గెలుపొందింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వీనస్ తొమ్మిది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ఈ గెలుపుతో మహిళల ప్రొఫెషనల్ టెన్నిస్‌లో విజయం సాధించిన రెండో అతిపెద్ద వయస్కురాలిగా వీనస్ గుర్తింపు పొందింది. ఇంతకుముందు 2004లో మార్టినా నవ్రతిలోవా 47 ఏళ్ల వయస్సులో సింగిల్స్ మ్యాచ్ నెగ్గింది. 2024 మయామి ఓపెన్‌లో చివరిసారి ఆడిన వీనస్ ఆ తర్వాత గాయాల కారణంగా ఆటకు విరామం ఇచ్చింది. 2023 ఆగస్టులో జరిగిన సిన్సినాటి ఓపెన్ టోర్నీ తర్వాత వీనస్ సింగిల్స్ మ్యాచ్ నెగ్గడం ఇదే మొదటిసారి కావడం విశేషం. 'నేను పూర్తి ఆరోగ్యంగా ఉండాలని దేవుడిని పదేపదే ప్రార్థిస్తున్నాను' పేటన్‌పై విజయానంతరం వీనస్ వ్యాఖ్యానించింది. ఈ మ్యాచ్‌ను వీనస్ కాబోయే భర్త, ఇటలీకి చెందిన సినీ నటుడు, నిర్మాత ఆండ్రియా ప్రెటి కూడా తిలకించాడు. డీసీ ఓపెన్ డబుల్స్‌లో అమెరికాకే చెందిన హైలీ బాప్టిస్ట్‌తో కలిసి బరిలోకి దిగిన వీనస్ క్వార్టర్ ఫైనల్ చేరుకుంది.



సోమవారం ఆందోళన సందర్భంగా పార్లమెంట్ భవనం మెట్ల మీద నిల్చున్న కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ఎస్పీ నాయకురాలు జయాబచ్చన్


సోమవారం పార్లమెంట్‌లో బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా నివాళులర్పించాక లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో గుసగుసలాడుతున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గే


ఆందోళన సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో డీఎంకే నేత టీఆర్ బాలు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎస్పీ ఎంపీ అఖిలేశ్ యాదవ్

మిగ్ స్థానంలో తేజస్

సెప్టెంబర్‌లో మిగ్-21కు వీడ్కోలు పలకనున్న వాయుసేన

తేజస్ ఎంకే-1ఏ యుద్ధవిమానాలతో భర్తీ

శత్రుసేనల గుండెల్లో భయం పుట్టిస్తూ, భారత వాయుసేనకు ఆరు దశాబ్దాలపాటు సేవలందించిన, ఘన చరిత గల మిగ్-21 యుద్ధవిమానాల స్థానంలో అధునాతన తేజస్ ఎంకే-1ఏ తేలికపాటి యుద్ధవిమానాలను విధుల్లోకి తీసుకోవాలని భారతవాయుసేన నిర్ణయించింది. సెప్టెంబర్‌లో మిగ్-21 యుద్ధవిమానాలకు వాయుసేన వీడ్కోలు పలకనుంది. సెప్టెంబర్ 19న చండీగఢ్‌లోని వైమానిక స్థావరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీటి సేవలకు లాంఛనంగా స్వస్తిపలకనున్నట్లు ఇప్పటికే వాయుసేన ఒక ప్రకటనలో పేర్కొంది. చండీగఢ్ ఎయిర్‌బేస్‌లోనూ మిగ్-21 యుద్ధవిమానాలు విధుల్లో ఉన్న విషయం విదితమే. ఇకమీదటా వీటి బాధ్యతలను తేజస్ తమ భుజస్కంధాలపై మోయనున్నాయి. అమెరికాలోని జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) ఎఫ్404 అత్యంత శక్తివంతమైన ఇంజిన్ అమర్చిన తేజస్ 4.5 తరం అధునాతన యుద్ధవిమానం. పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపుదిద్దుకున్న తేలికపాటి యుద్ధవిమానంగానూ ఇది రికార్డులకెక్కింది. ప్రస్తుతం రెండు మాత్రమే మిగ్-21 స్క్వాడ్రాన్‌లు విధుల్లో ఉన్నాయి. ఇందులో మొత్తంగా 36 మిగ్ విమానాలు ఉన్నాయి. రాజస్థాన్‌లోని నాల్ ఎయిర్‌బేస్‌లోనూ మిగ్-21 విమానాలు విధులు నిర్వర్తిస్తున్నాయి.



1963లో మొదలైన మిగ్ ప్రస్థానం

ఒక్కటే ఇంజిన్, ఒక్కటే పైలట్ సీటుతో రూపుదిద్దుకున్న బహుళ ప్రయోజన మిగ్-21 యుద్ధవిమానాలను భారతసైన్యం తొలిసారిగా 1963లో తమ దళాల్లోకి తీసుకుంది. భూతలం మీది లక్ష్యాలను ఛేదించేందుకు ప్రధానంగా దీనిని వినియోగించారు. నాటి సోవియట్ యూనియన్‌లోని మికోయన్-గురేవిచ్ డిజైన్ బ్యూరో(ఓకేబీ) దీని డిజైన్‌ను అభివృద్ధిచేసింది. 1965లో ఇండో-పాకిస్తాన్ యుద్ధం, 1999 కార్గిల్ యుద్ధం, 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో మిగ్-21 యుద్ధవిమానాలు కీలకపాత్ర పోషించాయి. పాకిస్తాన్‌లోని బాలాకోట్‌లో భారత వాయుసేన జరిపిన సర్జికల్ స్ట్రైక్‌లోనూ మిగ్ విమానాలు దాడులుచేశాయి. గగనతలంలో శత్రువిమానాలతో పోరులో పాకిస్తాన్‌కు చెందిన అత్యంత అధునాతన ఎఫ్-16 యుద్ధవిమానాన్ని భారత వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ ఈ మిగ్-21 నడుపుతూనే బాంబులతో నేలకూల్చి మిగ్ సత్తాను చాటారు. దాంతో ఆనాడు మరోసారి మిగ్‌ల శక్తిసామర్థ్యాలు ప్రపంచానికి తెలిశాయి.

విమర్శలకూ కేంద్రబిందువుగా..

కీర్తితోపాటు అపకీర్తిని మిగ్ విమానాలు భారీగా మూటగట్టుకున్నాయి. ఎన్నో విమానాలు సాంకేతిక సమస్యలతో కుప్పకూలాయి. ఎంతో ప్రతిభావంతులైన పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. దీంతో పైలట్ల మరణాలతో వారి సతీమణులను వితంతువులుగా మార్చే క్రతువులో మిగ్‌లు బిజీగా మారాయని గతంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. గగనతలంలో విధి నిర్వహణలో ఇప్పటిదాకా ఏకంగా 500 మిగ్ విమానాలు కుప్పకూలినట్లు, 170 మందికిపైగా పైలట్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి.

ఆధునిక పంథాలో వాయుసేన

కాలంచెల్లిన విమానాల స్థానంలో సమకాలీన అవసరాలు తీర్చే ఆధునిక సాంకేతికత దన్నుతో గగనతలాన్ని ఏలా కొత్త విమానాలను రంగంలోకి దింపాలని వాయుసేన గతంలోనే నిర్ణయించింది. అందులోభాగంగానే హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారీ తేలికపాటి యుద్ధవిమానం(ఎల్‌సీఏ) రకం తేజస్‌ను వాయుసేనలోకి తీసుకుంటున్నారు. ఇజ్రాయెల్ తయారీ ఈఎల్/ఎం 2025 ఏసా రాడార్, కొత్తతరం ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, జామర్, నేరుగా కనిపించంత దూరంలో ఉన్న లక్ష్యాన్ని సైతం ఛేదించే సత్తాతో కొత్త విమానాన్ని వాయుసేన రంగంలోకి దింపుతోంది. పాతకాలంనాటి మెకానికల్ ఫ్లైట్ కంట్రోలర్‌లకు బదులుగా ఎలక్ట్రానిక్ ఇంటర్‌ఫేజ్ కంట్రోల్ కంప్యూటర్ సదుపాయాలు తేజస్‌లో ఉన్నాయి. మొత్తంగా తొమ్మిది వేర్వేరు రకాలైన ఆయుధాలను ఇది ప్రయోగించగలదు. ఇజ్రాయెల్ తయారీ డెర్బీ క్షిపణులతోపాటు దేశీయంగా తయారైన అస్త్ర మిస్సైల్‌ను తేజస్ సునాయసంగా ప్రయోగించగలదు. దీనికి రిపేర్లు చేయడం కూడా చాలా సులువు. గగనతల రక్షణతోపాటు నిఘా, దాడి వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

48వేల కోట్ల డీల్

తేజస్ ఎంకే-1ఏ రకం 83 విమానాలను తయారుచేసి సరఫరాచేసేందుకు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ సంస్థతో భారత రక్షణ మంత్రిత్వశాఖ రూ.48,000 కోట్ల ఒప్పందాన్ని 2021 ఫిబ్రవరిలోనే కుదుర్చుకుంది. ఇవిగాక మరో 97 యుద్ధవిమానాల కొనుగోలు కోసం ప్రభుత్వం రూ. 67,000 కోట్లు ఖర్చుచేసేందుకు సిద్ధపడింది. అయితే తేజస్‌లో అమర్చేందుకు కావాల్సిన జీఈ ఎఫ్404 రకం 99 ఇంజిన్ల కొనుగోలు కోసం అమెరికాకు చెందిన జీఈ ఏరోస్పేస్‌తో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ రూ.5,375 కోట్ల విలువైన ఒక ఒప్పందాన్ని 2021 ఆగస్ట్‌లోనే కుదుర్చుకుంది. ఏడాది ఆలస్యంగా ఇవి సంస్థకు అందాయి. తొలి దశలో 12 తేజస్ విమానాలను వాయుసేనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. విదేశీ ఇంజిన్‌ను చెక్‌చేసి, ప్రధాన బాడీకి బిగించి, మళ్లీ తనిఖీ చేయడం సుదీర్ఘప్రక్రియ. అందుకే తేజస్‌ల తుది డెలివరీ ఆలస్యమవుతోంది.

– సాక్షి, నేషనల్‌డెస్క్

గాజాలో ఆగని మరణ మృదంగం

ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల్లో 21 మంది మృతి

గాజా: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ సైన్యం సామాన్య జనంపై దాడులకు తెగబడుతూనే ఉంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జరిగిన దాడుల్లో కనీసం 21 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. బాధితుల్లో సగానికి పైగా మహిళలు, బాలలే ఉన్నారని వెల్లడించింది. మొత్తం మూడు చోట్ల క్షిపణి దాడులు జరిగాయని, చాలామంది గాయపడ్డారని పేర్కొంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టంచేసింది. అయితే, పౌరుల మరణానికి హమాస్ మిలిటెంట్లే కారణమని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఇప్పటిదాకా ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందినవారి పాలస్తీనా పౌరుల సంఖ్య దాదాపు 60 వేలకు చేరడం గమనార్హం. లక్షల మంది క్షతగాత్రులుగా మారిపోయారు. చాలామంది శాశ్వత అంగవైకల్యం బారినపడ్డారు.

బెంగళూరు బస్టాండ్‌లో పేలుడు పదార్థాలు



బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని కలాసిపాల్య బస్టాండ్‌లో పేలుడు పదార్థాలు లభించాయి. బస్టాండ్ సమీపంలో టాయిలెట్స్ బయట ఓ ప్లాస్టిక్ కవర్‌లో దాచి ఉంచిన ఆరు జిలెటిన్ స్టిక్స్ దొరికాయి. అలాగే కొన్ని డిటోనేటర్లు కూడా లభించాయి. దీనిపై యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), స్థానిక పోలీసులు వెంటనే స్పందించారు. ఆ ప్రదేశాన్ని సందర్శించి, స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. జిలెటిన్ స్టిక్స్‌ను మైనింగ్ పరిశ్రమలు, భవన నిర్మాణాలు, రోడ్లు, రైల్వేలు, సొరంగాలు వంటి నిర్మాణ సంబంధిత పనుల కోసం ఉపయోగిస్తారు. ఇవి చౌకైన పేలుడు పదార్థాలు. అయితే డిటోనేటర్ లేకుండా వీటిని పేల్చలేరు. రద్దీగా ఉండే రవాణా ప్రాంతంలో జిలెటిన్ స్టిక్స్ దొరకడం, వాటితోపాటు డిటోనేటర్లు కూడా ఉండటంతో స్థానికంగా అలజడి సృష్టించింది.

'మింత్రా'పై ఈడీ కేసు నమోదు

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఈ-కామర్స్ పోర్టల్ 'మింత్రా'తోపాటు దాని అనుబంధ కంపెనీలు, వాటి డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వెల్లడించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు(ఎఫ్‌డీఐ) సంబంధించి రూ.1,654 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు తెలియజేసింది. 'ఫెమా'నిబంధనలు ఉల్లంఘనకు గురయ్యాయని ఉద్ఘాటించింది. ఈ అక్రమాల్లో మింత్రా సహా ఆయా కంపెనీల హస్తం ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. తమ బెంగళూరు జోనల్ ఆఫీసు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొంది. ఆయా కంపెనీలు హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారం ముసుగులో మల్టీ-బ్రాండ్ రిటైల్ వ్యాపారం చేస్తున్నాయని తెలియజేసింది. ఇది నిబంధనలకు విరుద్ధమేనని స్పష్టచేసింది. హోల్‌సేల్ వ్యాపారం పేరిట రూ.1,654 కోట్ల మేర ఎఫ్‌డీఐలను సేకరించాయని తెలిపింది. ఈ మేరకు ఈడీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈడీ దర్యాప్తునకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని బెంగళూరులో మింత్రా ప్రధాన కార్యాలయ అధికార ప్రతినిధి తెలిపారు.

ప్రపంచ టాప్ 10లో ముంబై విమానాశ్రయం

వరుసగా మూడో సంవత్సరం చోటు

ముంబై: ప్రపంచంలోని అత్యుత్తమ టాప్ 10 అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం (సీఎస్ఎంఐఏ) నిలిచింది. 84.23 రీడర్ స్కోర్‌తో ట్రావెల్, లీజర్ వరల్డ్స్ బెస్ట్ అవార్డ్స్ 2025 జాబితాలో చోటు దక్కించుకుంది. వరుసగా ఈ జాబితాలో నిలిచిన ఏకైక భారతీయ విమానాశ్రయంగా నిలిచింది. ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో ఆసియా, విమానాశ్రయాలు మరోసారి ఆధిపత్యం చెలాయించాయి. తుర్కియేలోని ఇస్తాంబుల్ విమానాశ్రయం అగ్రస్థానంలో నిలిచింది. సింగపూర్‌లోని చాంగి, ఖతార్, దోహాలో ఉన్న హమద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాతి స్థానాలను దక్కించుకున్నాయి. అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం, దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఫిన్లాండ్‌లోని హెల్సింకి-వాంటా విమానాశ్రయం, టోక్యోలోని హనేడా విమానాశ్రయం, దక్షిణ కొరియాలోని ఇంచియాన్ అంతర్జాతీయ విమానాశ్రయం జాబితాలో వరుసగా నిలిచాయి. ఇక మన ముంబై విమానాశ్రయం తొమ్మిదవ స్థానంలో నిలిచింది. ట్రావెల్, లీజర్ నిర్వహించిన ప్రపంచ సర్వే ఆధారంగా వీటిని ఎంపిక చేవారు. దాదాపు 180,000 మంది ఇందులో పాల్గొన్నారు. కేవలం లాజిస్టిక్స్‌కు పరిమితం కాకుండా డిజైన్, భోజన ఏర్పాట్లు, ప్రయాణ అనుభవాల ఆధారంగా సర్వే నిర్వహించారు. ఇక ముంబై సీఎస్ఎంఐఏ 1,900 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే సింగిల్-రన్‌వే విమానాశ్రయం. మన దేశంలో అత్యంత రద్దీగా ఉండే రెండవ విమానాశ్రయం ఇదే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 55.12 మిలియన్ల ప్రయాణికులను చేరవేసింది. ప్రతిరోజూ దాదాపు 1,000 విమానాల రాకపోకలు జరిగాయి.

సెప్టెంబర్ 22 నుంచి కర్ణాటకలో కులగణన

సీఎం సిద్ధరామయ్య నిర్ణయం

శివాజీనగర: కర్ణాటక ప్రభుత్వం మరోసారి కులగణనకు తేదీలను ఖరారుచేసింది. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 7వ తేదీదాకా కులగణన చేపట్టాలని బుధవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. కులగణన లక్ష్యంగా జరగనున్న నూతన సామాజిక, ఆర్థిక, విద్యా సర్వే విషయమై ముఖ్యమంత్రి నివాస కార్యాలయంలో ప్రత్యేక భేటీ జరిగింది. వివిధ శాఖల మంత్రులు, వెనుకబడిన వర్గాల కమిషన్ అధ్యక్షుడైన మధుసూదన్ పాల్గొని కులగణన నిర్వహించే విధానంపై చర్చించారు. ఎలాంటి లోపాలు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకుని సర్వే చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ''రాష్ట్రంలో కులగణన అనేది చాలా ప్రాముఖ్యమైన అంశం. ప్రతిపక్షాలచే ఆరోపణలు రానివ్వకూడదు. మానవ వనరులతో పాటుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పకడ్బందీగా నిర్వహించండి. కులవివక్షను రూపుమాపడంతోపాటు వెనుకబడిన వర్గాలకు తగు పథకాలు అమలుచేసేందుకు ఈ కులగణన గణాంకాలు సాయపడతాయి''అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 7 కోట్ల జనాభా ఉన్న రాష్ట్రవ్యాప్తంగా కేవలం 15 రోజుల్లోనే సర్వేను పూర్తి చేయాలని సీఎం సూచించారు. అక్టోబర్ నెలాఖరుకల్లా సర్వే నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. కొన్ని నెలల కిందటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణనను నిర్వహించిన సంగతి తెల్సిదే. అయితే సర్వేలో తమ జనాభాను తక్కువ చేసి చూపించారని ఒక్కలిగ, వీరశైవ లింగాయత్, ఎస్సీలు, బీసీల కులాలు తీవ్ర ఆందోళన చేయడం విదితమే. అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా అసంతృప్తిని వ్యక్తంచేశారు. దీనివల్ల ప్రభుత్వం మరోసారి కులగణనకు సిద్ధమైంది. గతంలో కంథరాజు కమిషన్ సారథ్యంలో సర్వే చేపట్టారు. ఆనాడు 54 ప్రశ్నలకు సమాధానాలను ప్రజల నుంచి సేకరించారు. ఈసారి మొబైల్ యాప్‌ను వినియోగించనున్నారు. ఈసారి 1.65 లక్షల మంది ఎన్యూమరేటర్లు ఈ సర్వేలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సీఎంతో భేటీలో వెనకబడిన కులాల సంక్షేమ మంత్రి శివరాజ్, బీసీ కమిషన్ చైర్మన్ మధుసూదన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ వ్యాఖ్యలపై మౌనమెందుకు?

- **బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల మోసం**
- **ప్రధానిపై రాహుల్ విమర్శలు**

న్యూఢిల్లీ: భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పుకుంటున్నా, ప్రధాని నరేంద్ర మోదీ దానిపై ఎందుకు నోరు విప్పడం లేదని లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ''కాల్పుల విరమణ ఒప్పందం తానే కుదిర్చానని ట్రంప్ ఇప్పటికే 25 సార్లు చెప్పారు. అసలు మనదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చడానికి ట్రంప్ ఎవరు? అది ఆయన పని కాదు. అయినా.. ప్రధాని ఒక్కసారి కూడా సమాధానం ఇవ్వలేదు''అని ఆయన మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్ పట్ల పరస్పర వైరుధ్య వ్యాఖ్యలు చేయడాన్ని రాహుల్ ఎత్తి చూపారు. 'ఒకవైపు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది అంటున్నారు, మరోవైపు, విజయం సాధించామంటున్నారు. అది కొనసాగుతోందా? లేదా ముగిసిందా? మరోవైపు ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని ట్రంప్ చెబుతున్నారు. కాబట్టి 'కుచ్ తో దాల్ మే కాలా హై నా'(ఏదో తేడాగా ఉంది)'అని రాహుల్ అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం న్యూయార్క్‌లో జరిగిన ఓ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, భారత్-పాక్‌ల మధ్య పెద్ద యుద్ధాన్ని తానే నిరోధించానని పునరుద్ఘాటించడాన్ని రాహుల్ ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత విదేశాంగ విధానం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రపంచ వేదికపై భారత్‌ను ఒంటరి చేస్తోందని ఆరోపించారు. ట్రంప్ వాదన కారణంగానే ప్రధాని మోదీ పార్లమెంటుకు దూరంగా ఉంటున్నారన్నారు.

ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల మోసం..

బిహార్‌లో పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా సవరణను కూడా రాహుల్ తీవ్రంగా విమర్శించారు. ప్రక్రియను బీజేపీ ఎన్నికల మోసంగా ఆయన అభివర్ణించారు. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి బీజేపీ ఓటర్ల జాబితాను తారుమారు చేసిందని గుర్తు చేశారు. 'బిహార్‌లో 52 లక్షల మంది మాత్రమే కాదు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మోసం చేశారు. ఓటర్ల జాబితాను చూపించమని ఈసీని అడిగితే నిరాకరించింది. వీడియోగ్రఫీ గురించి అడిగితే నియమాలను మార్చేసింది. మహారాష్ట్రలో 1 కోటి మంది కొత్త ఓటర్లను చేర్చారు. కర్ణాటకలో భారీ మోసాన్ని బయటపెట్టి.. ఎన్నికల కమిషన్ ముందుంచాం. తమ ఆటలు ఇక చెల్లవని తెలిసి ఓటర్లను తొలగించారు'అని ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ సమర్థించారు. కీలకమైన విషయాలపై చర్చించేందుకు మోదీ నిరాకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'ట్రంప్ తన కాల్పుల విరమణ ప్రకటనతో రజతోత్సవం జరుపుకుంటున్న సమయంలో, ప్రధానమంత్రి పూర్తిగా మౌనంగా ఉన్నారు. విదేశాలకు వెళ్లడానికి, స్వదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను అస్థిరపరచడానికి మాత్రమే సమయం వెతుక్కుంటున్నారు'అని ఆయన ఎక్స్‌లో ఎద్దేవా చేశారు.

బయల్దేరిన చోటే మళ్లీ ల్యాండింగ్

మలప్పురం: కేరళలోని కాలికట్ విమానాశ్రయం నుంచి దోహాకు బయల్దేరిన ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సాంకేతిక సమస్యలతో మళ్లీ కాలికట్‌కే వచ్చి ల్యాండయింది. బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు, సిబ్బందిసహా 188 మందితో ఉదయం 9.07 గంటలకు ఈ విమానం బయల్దేరింది. మార్గమధ్యంలో క్యాబిన్ ఏసీలో సమస్య తలెత్తింది. దీంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. దీంతో 11.12 గంటలకు మళ్లీ అదే కాలికట్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండయింది. కాగా, సాంకేతిక సమస్య కారణంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి డయ్యూకు బయల్దేరి వెళ్లాల్సిన ఇండిగో విమానం చివరినిమిషంలో టేకాఫ్ తీసుకోకుండా అక్కడే ఆగిపోయింది. బుధవారం ఉదయం 11.15 గంటలకు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 6ఇ7966 విమానం కేంద్రపాలిత ప్రాంతం డయ్యూకు బయల్దేరాలి. ఆఖరినిమిషంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో మళ్లీ దానికి రన్‌వే నుంచి పక్కకు తీసుకెళ్లారు.

ఆ రెండు మృతదేహాలు మా వారివి కావు

- **ఎయిరిండియా ప్రమాద బాధిత యూకే కుటుంబాలు**
- **అంత్యక్రియల నిలిపివేత**

లండన్: ఎయిరిండియా ప్రమాదంలో మృతిచెందిన రెండు యూకే బాధిత కుటుంబాలకు తమవారి మృతదేహాలు కాకుండా వేరేవరివో మృతదేహాలు అందాయి. శవపేటికలో ఉన్న మృతదేహం తమ కుటుంబ సభ్యుడిది కాదని తేలడంతో ఒక కుటుంబం అంత్యక్రియలను నిలిపివేసింది. మరో శవపేటికను తెరవగా రెండు మృతదేహాలున్నాయి. తమ కుటుంబ సభ్యుడి మృతదేహాన్ని గుర్తించిన కుటుంబం అంత్యక్రియలు నిర్వహించింది. మరో మృతదేహం ఎవరిదో తెలియడం లేదు. ప్రమాద బాధితుల మృతదేహాలు గుర్తించడంతో తప్పు జరిగిందని, యూకేకి తప్పుడు మృతదేహాలు పంపారని కుటుంబాలకు నేతృత్వం వహిస్తున్న సంస్థ కీస్టోన్ లా న్యాయవాది జేమ్స్ హీలీ ప్రాట్ తెలిపారు. 'ప్రమాదంలో చనిపోయిన తమ కుటుంబ సభ్యుల మృతదేహాలను కడసారి చూడటానికి వారు నెలరోజుల నుంచి ఎదురుచూస్తున్నారు, ఇప్పుడు ఈ గందరగోళం ఏర్పడింది. ఇప్పుడా కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు'అని ప్రాట్ ప్రశ్నించారు.

మా పాత్ర లేదు: ఎయిరిండియా

అయితే.. ఈ గందరగోళంతో తమ పాత్ర లేదని ఎయిరిండియా తెలిపింది. అహ్మదాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో డీఎన్ఏ పరిశీలన తరువాత మృతదేహాలను సీలు చేసిన శవపేటికల్లో పంపామని స్పష్టం చేసింది. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి గాట్విక్ వెళ్తున్న ఎయిరిండియా171 విమానం కూలిపోయిన ఘటనలో 241 మంది మరణించడం, వారిలో 53 మంది బ్రిటిష్ జాతీయులు ఉండటం తెలిసిందే. అయితే.. అనేకమంది బ్రిటిష్ పౌరుల అంత్యక్రియలు భారత్‌లోనే జరిగాయి. 12 మృతదేహాలను మాత్రమే యూకేకు పంపారు. స్వదేశానికి తిరిగి వచ్చిన బ్రిటన్ వాసుల డీఎన్ఏలను, కుటుంబాల నమూనాలతో సరిపోల్చడానికి ఇన్నర్ వెస్ట్ లండన్ కరోనర్ డాక్టర్ ఫియోనా విల్కాక్స్ ప్రయత్నించగా విషయం వెలుగులోకి వచ్చింది.

అందులో నిజం లేదు

భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో రెండు మృతదేహాలు తారుమారు అయ్యాయంటూ బ్రిటిష్ మీడియాలో వచ్చిన వార్తలను భారత విదేశాంగ శాఖ బుధవారం ఖండించింది. మృతదేహాలను బాధిత కుటుంబాలకు అప్పగించడం పూర్తయ్యిందని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని వెల్లడించింది. జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 260 మంది మరణించారు. వీరిలో 53 మంది బ్రిటిష్ జాతీయులు ఉన్నారు. సొంత మనుషుల మృతదేహాలు కాకుండా వేరే మృతదేహాలు అప్పగించినట్లు బ్రిటన్‌లో రెండు కుటుంబాలు ఆరోపించాయని స్థానిక మీడియా వెల్లడించింది. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. మృతదేహాలను సంబంధిత కుటుంబాలకు అప్పగించడంలో ఇండియా తరఫున ఎలాంటి తప్పిదాలు జరగలేదని స్పష్టంచేశారు. మీడియా కథనాలపై బ్రిటిష్ అధికారులతో మాట్లాడుతున్నారని తెలిపారు.

గుజరాత్‌లో ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు

అహ్మదాబాద్: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా అనుబంధ సంస్థతో సంబంధాలున్న నలుగురిని గుజరాత్ ఉగ్రవ్యతిరేక బృందం(ఏటీఎస్) బుధవారం అరెస్ట్‌చేసింది. ఈ నలుగురూ అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (ఏక్యూఐఎస్) ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తిచేస్తున్నారని, నకిలీ కరెన్సీ రాకెట్ నడుపుతున్నారని ఏటీఎస్ పేర్కొంది. సాయుధ తిరుగుబాటు ద్వారా భారత్‌లో షరియా పాలనను తీసుకురావడం, అల్‌ఖైదీ భావజాల వీడియోలను సోషల్‌మీడియా వేదికల ద్వారా అందరికీ షేర్ చేయడం వంటి నేరాలకు ఈ నలుగురూ పాల్పడ్డారని ఏటీఎస్ తెలిపింది. హింస చెలరేగాలని, ఈ మేరకు ముస్లిం యువత తమ సంస్థలో పాలుపంచుకోవాలని కోరుతూ ఐదు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నుంచి పెద్దసంఖ్యలో సలహాలు, సూచనలు వస్తున్నట్లు ఏటీఎస్‌కు సమాచారం అందింది. దీంతో దర్యాప్తు మొదలెట్టి ఈ నలుగురినీ వేర్వేరు చోట్ల అరెస్ట్‌చేశారు. వీరు తమ డేటా పోలీసులకు చిక్కకూడదనే ఉద్దేశంతో ఆటోడెలీట్ యాప్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

మతోన్మాదం, ఉగ్రవాదంలో మునిగిన పాక్

ఐరాస వేదికపై ధ్వజమెత్తిన భారత్

ఐక్యరాజ్యసమితి: సమయం, సందర్భం కాకపోయినా కశ్మీర్ అంశాన్ని ప్రతిసారీ అంతర్జాతీయ వేదికపై ప్రస్తావిస్తున్న పాకిస్తాన్‌కు భారత్ మరోసారి దీటుగా బదులిచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో జూలై నెల సమావేశంలోభాగంగా మంగళవారం ''బహుళత్వం ద్వారా అంతర్జాతీయ శాంతిభద్రత ప్రోత్సాహం, శాంతియుతంగా వివాదాల పరిష్కారం''అంశంపై జరిగిన చర్చలో పాకిస్తాన్ తొలుత ప్రసంగించింది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌ను ఉద్దేశిస్తూ పాకిస్తాన్ ఉపప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ప్రసంగించారు. ''కశ్మీర్‌ను భారత్ ఆక్రమించింది. తాజా ఉద్రిక్తతలను అడ్డంపెట్టుకుని సింధూ నదీజలాల ఒప్పందం అమలును భారత్ రద్దుచేసింది. కశ్మీర్‌సహా భారత్‌తో నెలకొన్ని ప్రతిష్టంభనకు అంతర్జాతీయ జోక్యం తప్పనిసరి''అని ఇషాక్ దార్ అన్నారు. ఈయన వ్యాఖ్యలపై ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ దీటుగా బదులిచ్చారు. ''బాధ్యతాయుతంగా ఉంటూ ప్రపంచ శాంతి, భద్రత కోసం భారత్‌కృషిచేస్తోంది. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదనే అంతర్జాతీయ ప్రాథమిక సూత్రాన్ని భారత్ పాటిస్తోంది. ప్రజాస్వామ్య పథంలో పైపైకి దూసుకెళ్తూ, ఆర్థిక శక్తిగా అవతరిస్తూ, బహుళత్వానికి, సామాజిక సమ్మిళిత వృద్ధిని సాధిస్తూ భారత్ బిజీగా ఉంటే ఉగ్రవాదం, మతోన్మాదం, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) వంటి చోట్ల వేల కోట్ల రుణాలుచేస్తూ పాకిస్తాన్ బిజీగా ఉంది''అని హరీశ్ దెబ్బిపొడిచారు. పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ 2.1 బిలియన్ డాలర్ల రుణాలు మంజూరుచేసిన విషయం తెల్సిందే. ''పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ఉగ్రసంస్థకు అనుబంధంగా పనిచేసే ది రెసిస్టెంట్ ఫ్రంట్ సంస్థ ఉగ్రవాదులే పహల్గాంలో పాశవిక హత్యాకాండకు తెరలేపారు''అని హరీశ్ గుర్తుచేశారు.

మత ఉద్యమాలు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

- మధ్యయుగ ప్రారంభంలో హిందూ, ముస్లిం మతాల్లో సమాంతరంగా రెండు మత ఉద్యమాలు జరిగాయి. అవి.. భక్తి, సూఫీ ఉద్యమాలు.
- ఈ రెండు ఉద్యమాలు సమాజంలో మూఢాచారాలను ఖండించాయి. ఈ రెండూ దేవుడి పట్ల భక్తికి తప్ప దేనికీ ప్రాధాన్యత ఇవ్వలేదు.
- ప్రేమ, స్వేచ్ఛ ఈ రెండు ఉద్యమాల్లో ముఖ్య లక్షణాలు.

భక్తి ఉద్యమం

- భక్తి ఉద్యమం ముస్లిం పాలన వల్ల ప్రారంభమైంది అనేది నిజం కాదు. భక్తి అనే భావన చాలా ప్రాచీనమైంది. ఆర్యుల కాలంలోనే ఉపనిషత్తులు, భాగవతం మొదలైనవాటికి పెద్దపీట వేశారు.
- ప్రాచీన యుగ చివరి దశలో ఆళ్వార్లు, నాయనార్లు భక్తి గొప్పతనాన్ని తెలియజేశారు.
- మళ్లీ మధ్యయుగ ప్రారంభంలో శంకరాచార్యులు భక్తి ఉద్యమాన్ని దేశం నలువైపులా ప్రచారం చేశారు. తర్వాత ఎందరో భక్తి ఉద్యమకారులు వివిధ ప్రాంతాల్లో భక్తి ప్రాధాన్యతను వివరించారు.

భక్తి ఉద్యమకారులు

వీరిలో సుగుణ భక్తి, నిర్గుణ భక్తి అనే రెండు రకాల భక్తిని ప్రబోధించిన వారున్నారు.

శంకరాచార్యులు

- కేరళలోని కాలడిలో జన్మించారు. 8వ శతాబ్దానికి చెందినవారు.
- తండ్రి శివ గురువు, తల్లి ఆర్యాంబ.
- గురువు గోవింద పాదాచార్యులు. శంకరులు తన 8వ ఏటనే సన్యాసం స్వీకరించారు.
- శంకరుల సిద్ధాంతం అద్వైతం. అంటే ఉన్నది పరమాత్మ ఒక్కడే. ప్రపంచమంతా మాయ.
- అద్వైత సిద్ధాంతాన్ని అనుసరించే వారిని స్మార్థులు అంటారు.
- శంకరులు బ్రహ్మ సూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీతకు వ్యాఖ్యానాలు రచించారు.
- శంకరులు తన సిద్ధాంతాల ప్రచారం కోసం భారత్‌లో నాలుగు దిక్కుల్లో నాలుగు మఠాలు స్థాపించారు. అవి..

నం.	దిక్కు	స్థలం	రాష్ట్రం
1.	ఉత్తరం	బదరీనాథ్	జమ్ముకాశ్మీర్
2.	దక్షిణం	శృంగేరి	కర్ణాటక
3.	తూర్పు	పూరి	ఒడిశా
4.	పశ్చిమ	ద్వారక	గుజరాత్

- సాంప్రదాయం ప్రకారం కంచిలో కూడా శంకరాచార్యులే మఠాన్ని ఏర్పాటు చేశారని అంటారు.

రామానుజాచార్యులు

- తమిళనాడులో శ్రీ పెరంబదూరులో క్రీ.శ. 1017లో జన్మించారు. క్రీ.శ.1137లో పరమపదించారు.
- ఈయన సిద్ధాంతం.. విశిష్టాద్వైతం
- బ్రహ్మసూత్రాలకు 'శ్రీభాష్యం' అనే వ్యాఖ్యాన గ్రంథం రచించారు.
- వేదాంత సారం, వేదాంత దీపం, భగత్ రత్నకార్, గీతా భాష్యం తదితర గ్రంథాలను రాశారు.
- కుళోత్తుంగుని ఆగ్రహం వల్ల చాళుక్య.. చోళ రాజ్యం విడిచి హోయసాల రాజ్యానికి వెళ్లిపోయారు.
- ద్వైత, అద్వైత సిద్ధాంతాలను సమన్వయం చేస్తూ బేధాబేధ సిద్ధాంతాన్ని రూపొందించిన నింబార్కుడు.. రామానుజాచార్యకు సమకాలీనుడు.

మధ్వాచార్యులు

- కర్ణాటకలో జన్మించారు. ఈయన పూర్వనామ వాసుదేవుడు.
- శంకరుల, రామానుజుల సిద్ధాంతాలకు భిన్నంగా ద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.
- ద్వైత సిద్ధాంతం ప్రకారం ఆత్మ, పరమాత్మ వేర్వేరుగా ఉంటాయి.
- ఎన్నో వ్యాఖ్యాన గ్రంథాలు రచించారు.

రామానంద

- భక్తి ఉద్యమకారుల్లో అగ్రగణ్యులు. ఈయన 15వ శతాబ్దంలో జీవించారు.
- క్రీ.శ.1400లో జన్మించి 1470లో పరమ పదించారు.
- ఉత్తర భారతదేశ మొదటి భక్తి ఉద్యమ కారుడు.
- కుల, మత బేధాలకు అతీతంగా వివిధ నిమ్న కులాల నుంచి ఎంతోమందిని శిష్యులుగా స్వీకరించారు.
- రామ భక్తిని చాటారు. హిందీలో బోధనలు చేసి ప్రజలకు చేరువయ్యారు.
- ముస్లిం అయిన కబీర్, చెప్పులు కుట్టే కులానికి చెందిన రామ్‌దాస్, మంగలి కులానికి చెందిన సైన్థాస్, రైతైన ధన, ఇలా ఎన్నో వర్గాలకు చెందినవారు రామానంద శిష్యుల్లో ఉన్నారు.

కబీర్

- క్రీ.శ.1440–1518 మధ్య కాలంలో జీవించారు.
- బ్రాహ్మణ వితంతువుకు జన్మించినా, ముస్లిం నేత పనివారి ఇంట్లో పెరిగారు.
- రామ భక్తిని ప్రబోధించడమే కాకుండా హిందూ, ముస్లిం ఐక్యతకు కృషి చేశారు.
- సమాజంలోని మూఢాచారాలను చతురతతో చిన్న చిన్న పద్యాలతో వివరించారు. వాటిని దోహాలు అంటారు.
- కబీర్ దోహాలను 'బిజక' అనే పేరుతో సంకలనం చేశారు.
- కబీర్ ఢిల్లీ సుల్తానత్‌ను పాలించిన సికిందర్‌లోడీకి సమకాలికుడు.
- కబీర్ భార్య లోయ, కుమారుడు కమల్.
- కబీర్ మరణానంతరం ఆయన ముస్లిం శిష్యులు మఘర్ శాఖగా ఏర్పడ్డారు.

దాదూ దయాళ్

- కబీర్ శిష్యుల్లో ముఖ్యుడు దాదూ దయాళ్. క్రీ.శ.1544లో అహ్మదాబాద్‌లో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. 1603లో పరమపదించారు.
- సమాజంలో ఉన్న వివిధ నమ్మకాలను ఒకే సిద్ధాంతంగా మార్చడానికి బ్రహ్మ సంప్రదాయ/పరబ్రహ్మ సంప్రదాయ అనే విధానాన్ని సృష్టించారు.
- ఇతరుల బోధనలన్నింటినీ సేకరించిన మొదటి వ్యక్తి.
- దాదూ అంటే అన్న, దయాళ్ అంటే జాలి అని అర్థం.

గురునానక్

- క్రీ.శ. 1469లో పంజాబ్‌లో 'తల్వండి'లో జన్మించారు.
- హిందూ, ముస్లింలే కాకుండా వివిధ మతాలు, కులాల మధ్య సమానత్వానికి ప్రయత్నించారు. గురుకాలంగర్ అనే సామూహిక వంటశాలలు ప్రారంభించారు.
- ఈయన బోధనలు గురు గ్రంథ సాహెబ్/ఆది గ్రంథ్‌లో సంకలనం చేశారు.
- క్రీ.శ. 1539లో పంజాబ్‌లో కర్తార్‌పూర్‌లో మరణించారు.
- ఇతని తదనంతరం శిష్యులు సిక్కు మతంగా రూపాంతరం చెందారు.



వల్లభాచార్యులు

- క్రీ.శ.1479లో తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు.
- ఈయన శుద్ధ ద్వైతాన్ని ప్రబోధించారు. భక్తి మార్గాన్ని పుష్టి మార్గం అంటారు.
- ఈయన రాధాకృష్ణుల మధుర భక్తిని ప్రబోధించారు.
- శ్రీకృష్ణదేవరాయలకు సమకాలికులు. సిద్ధాంతి రహస్యం, సుబోధిని తదితర గ్రంథాలు రచించారు.
- కృష్ణుణ్ని 'శ్రీనాథ్‌జీ' అనే పేరుతో పూజించారు.
- క్రీ.శ. 1531లో పరమపదించారు.

చైతన్యుడు

- క్రీ.శ.1486లో బెంగాల్‌లో నవద్వీపంలో జన్మించారు. విశ్వంభర అనేది ఇతని పూర్వనామం.
- భక్తి ఉద్యమకారులందరిలో విశిష్టుడు.
- శచి, జగన్నాథ మిశ్రాలు ఇతని తల్లిదండ్రులు.
- ఈయన తన చదువును పూర్తిచేసిన తర్వాత విద్యాసాగరుడు అని ప్రజలు పిలిచేవారు.
- ఈశ్వరపురి అనే గురువు ద్వారా సన్యాసం స్వీకరించారు.
- పూరిలో నివసించారు. ఇక్కడే క్రీ.శ.1533లో పరమపదించారు.
- ఈయన మరణానంతరం శిష్యులు గౌడ వైష్ణవ శాఖగా ఏర్పడ్డారు.

మీరాబాయి

- మీరాబాయి క్రీ.శ. 1498–1557 మధ్య జీవించింది.
- ఈమె ఓ రాజపుత్ర యువరాణి. మేవార్‌ను పాలించిన రతన్‌సింగ్ కుమార్తె.
- ఈమెకు రాణా సంగ్రామ సింగ్ పెద్ద కుమారుడైన భోజ రాజుతో క్రీ.శ. 1516లో వివాహం జరిగింది.
- భర్త అకాల మరణం తర్వాత కృష్ణుణ్ని మధుర భక్తితో ఆరాధించింది. ఈమె బ్రిజ్ భాష, గుజరాతీ, రాజస్థానీ తదితర భాషల్లో ఎన్నో పద్యాలు రచించింది.

సూరదాసు

- 16వ శతాబ్దానికి చెందినవారు.
- రాధా, కృష్ణ భక్తిని అనుసరించారు.
- సూర్ సారవళి, సాహిత్య రత్న, సూర్ సాగర్ తదితర గ్రంథాలు రచించారు.
- కృష్ణుణ్ని చిన్న కృష్ణుడిగా ఎక్కువగా ఆరాధించారు.
- అంధుడు. 'ఆగ్రా అంధకవి' అని ఈయనను పిలిచేవారు.
- వల్లభాచార్య శిష్యులను 'అష్టచివ' కవులంటారు. వారందరిలోనూ సూరదాస్ అగ్రగణ్యుడు అని చెప్పవచ్చు.

తులసీదాసు

- ఈయన క్రీ.శ. 1532–1623 మధ్య కాలంలో జీవించారు.
- రామభక్తిని ప్రబోధించారు.
- రామచరితమానస్ అనే ప్రముఖ గ్రంథంతో పాటు గీతావళి, కవితావళి, వినయపత్రిక తదితరాలు ఆయన రచనలు.
- ఇతను అక్బర్ సమకాలికుడు.

జ్ఞానదేవ్

- 13వ శతాబ్దానికి చెందిన మహారాష్ట్ర భక్తి ఉద్యమకారుడు.. జ్ఞానదేవ్
- విఠలుని భక్తుడు. భగవద్గీతపై 'జ్ఞానేశ్వరి' పేరుతో మరాఠీ భాషలో వ్యాఖ్యానం రాశారు.
- అమృతానుభవ, చెంగదేవ ప్రశస్తి అనే ఇతర గ్రంథాలు కూడా రచించారు.
- వర్ణ వ్యవస్థ, మూఢాచారాలను ఖండించారు.

నామ దేవుడు

- 14వ శతాబ్దానికి చెందిన మహారాష్ట్ర భక్తి ఉద్యమకారుడు.
- పండరీపురం కేంద్రంగా భక్తిని ప్రబోధించారు. 'విఠోభాకేశర' అనే గురువు నుంచి సన్యాస దీక్ష తీసుకున్నారు.
- మరాఠీ భాషలో ఎన్నో పద్యాలు రాయడమే కాకుడా, పరకాఠీ సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు.
- నామదేవుడి రచనలను అభంగములు అంటారు.

హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

పౌరశాస్త్రం

లౌకికతత్వం - ప్రపంచశాంతి - భారతదేశం

'లౌకిక' అంటే మతంతో సంబంధం లేనిది అని అర్థం. 'లౌకికతత్వం' అంటే మతంతో ప్రమేయం లేని చింతన లేదా తత్వం. లౌకికతత్వాన్ని అనుసరించే దేశం ప్రజల మత సంబంధమైన విషయాల్లో జోక్యం చేసుకోదు. భారతదేశం వివిధ మతాలకు పుట్టినిల్లు. హిందూ, బౌద్ధం, జైనం, ఇస్లాం, క్రైస్తవం, పార్శీ మతాలు మనదేశంలో ఉన్నాయి. భారతదేశం ఒక లౌకిక రాజ్యం. క్రీస్తుపూర్వం నుంచి మతాలను పరిశీలిస్తే అశోకుడు మొదట హిందువు. తర్వాత ఉపగుప్తుడనే బౌద్ధమతాచార్యుని బోధనలతో బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆ కాలంలోనే పరమత సహనాన్ని పాటించిన చక్రవర్తి అశోకుడు. హర్షుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు కూడా లౌకికతత్వాన్ని అనుసరించారు. ఇక మధ్యయుగంలో తొలి లౌకిక చక్రవర్తి అక్బర్. దిన్-ఇ-ఇలాహీ అనే నూతన మతానికి అక్బర్ శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా ఇబాదత్ ఖానా అనే ప్రార్థన మందిరంలో సర్వమతాల వారు ప్రార్థనలు చేసుకొనే అవకాశం కల్పించాడు. ప్రస్తుతం మనదేశంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మొదలైనవారు తమ మతాలు నిర్ణయించిన ఆచార వ్యవహారాలను పాటిస్తూ శాంతియుతంగా జీవిస్తున్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక అనే పదాన్ని భారత రాజ్యాంగ పీఠికలో ప్రవేశపెట్టారు. భారతీయ లౌకికవాదం ఉదారమైంది. ప్రేమ, సహనం, సర్వమత సమానత్వం అనే సూత్రాలకు ప్రాముఖ్యత ఇస్తుంది. మతవాదానికి బదులు మానవతావాదాన్ని పౌరులు అలవరుచుకోవాలి. మతం పేరుతో ఇతరులపై దాడులు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంది. తద్వారా అల్ప సంఖ్యాకుల్లో భయాందోళనలను తొలగిస్తుంది.

ప్రపంచ శాంతి

యుద్ధ భయం మానవాళిని అనాదిగా వేధిస్తోంది. మానవుల శాంతియుత సహజీవనానికి యుద్ధాలు తీవ్రమైన అంతరాయం కలిగిస్తున్నాయి. వీటివల్ల ఎంతో నష్టం కలుగుతుంది. 20వ శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా పెను విధ్వంసాన్ని సృష్టించాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914–18 మధ్య కాలంలో జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలం 1939–45. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా తటస్థంగా ఉంది. మళ్లీ ప్రపంచ యుద్ధమే సంభవిస్తే ప్రపంచం మొత్తం కొద్ది క్షణాల్లో ధ్వంసం అవుతుందని అంచనా. అందుకే ప్రపంచ శాంతి నెలకొల్పడం ఎంతో అవసరమని వివిధ దేశాలు గుర్తించాయి. ఈ లక్ష్యసాధన కోసం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నానాజాతి సమితి, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పడ్డాయి. నానాజాతి సమితి 1920లో జెనీవా ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. 1945, అక్టోబర్ 24న న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్యసమితి ఏర్పడింది.



భారతదేశం పాత్ర

ప్రపంచ శాంతి నెలకొల్పడానికి, కొన్ని దేశాలు గణనీయమైన కృషి చేస్తున్నాయి. వాటిలో భారతదేశం ఒకటి. ప్రపంచ శాంతిని కాపాడటం భారత విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. జాతీయ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఇతర దేశాలతో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాల విషయంలో రూపొందించిన విధానాన్ని విదేశాంగ విధానం అంటారు. భారత విదేశాంగ విధానానికి మొదటి ప్రధాని నెహ్రూ రూపకల్పన చేశారు.

పంచశీల సూత్రాలు: టిబెట్ విషయంపై భారతదేశం, చైనా చేసుకున్న ఒడంబడికలో శాంతియుత సహజీవన సూత్రాలను పేర్కొన్నారు. వీటినే పంచశీల సూత్రాలు అంటారు. 1954 జూన్ 28న భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఈ ఒప్పందాన్ని ఆమోదించారు.

అలీనోద్యమం(నామ్): భారత మొదటి ప్రధాని నెహ్రూ, యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో, ఈజిప్టు అధ్యక్షుడు కమాలుద్దీన్ నాజర్ అలీనోద్యమానికి మూల పురుషులు. వీరికి ప్రపంచ శాంతి, సహజీవనం, సామరస్యం, సహకారం వంటి అంశాలపై నమ్మకం అపార నమ్మకం ఉంది. అటు అమెరికా ఆధ్వర్యంలోని పెట్టుబడిదారి దేశాల కూటమి, ఇటు రష్యా నాయకత్వంలోని సామ్యవాద దేశాల కూటమిలో చేరని దేశాలను అలీన దేశాలు అంటారు. నామ్ 1961లో ఏర్పడింది. మొదటి సదస్సులో 25 దేశాలు పాల్గొన్నాయి. ప్రస్తుతం నామ్‌లో సభ్య దేశాల సంఖ్య–107. నామ్ ఏడో సదస్సు 1983లో న్యూఢిల్లీలో జరిగింది.

ఈ సమావేశానికి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. భారత్ నామ్ ద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణకు విశేష కృషి చేస్తోంది. క్యూబా సమస్య విషయంలో 1962లో అమెరికా-రష్యాల మధ్య రాజీని కుదర్చడంలో భారతదేశం ముఖ్యపాత్రను పోషించింది. అంతేకాకుండా శాంతిస్థాపన దిశగా 1983, 1985, 1988లలో పాకిస్థాన్‌తో ఒప్పందాలను కుదుర్చుకుంది.

మాదిరి ప్రశ్నలు

1. మనదేశంలో సంపూర్ణ అక్షరాస్యతా సంవత్సరంగా ఎప్పుడు ప్రకటించారు?
   1) 1992 2) 1991
   3) 1990 4) 1989
2. స్త్రీలలో అక్షరాస్యత అతి తక్కువ ఉన్న రాష్ట్రం ?
   1) మేఘాలయ 2) రాజస్థాన్
   3) ఒడిశా 4) బీహార్
3. జీవించే హక్కును ఏ నిబంధన ద్వారా ప్రసాదించారు?
   1) 22 2) 20 3) 21 4) 24
4. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కును ఎప్పుడు చట్టబద్ధం చేశారు?
   1) 1985 2) 1989 3) 1984 4) 1983
5. మొట్టమొదటిసారిగా షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని ఏ సంవత్సరంలో ఉపయోగించారు?
   1) 1940 2) 1945
   3) 1947 4) 1935
6. అస్పృశ్యతను ఒక పాపంగా అభివర్ణించినవారు?
   1) గౌతమబుద్ధుడు
   2) జవహర్‌లాల్ నెహ్రూ
   3) గాంధీజీ 4) అంబేద్కర్
7. దేశంలో భాష ప్రాతిపదికగా ఏర్పడిన మొదటి రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కర్నాటక
   3) కేరళ 4) తమిళనాడు
8. ఒక జాతికి ఉండే లక్షణాలు?
   1) సంఘీభావం
   2) ఐకమత్యం
   3) భాష, మాండలికాలు
   4) సార్వభౌమాధికారం
9. రాజ్యాంగంలోని ఏ విభాగం నిర్బంధ ప్రాథమిక విద్య గురించి వివరిస్తుంది?
   1) ప్రవేశిక 2) ప్రాథమిక విధులు
   3) ఆదేశ సూత్రాలు
   4) పౌరహక్కులు
10. హెబియస్ కార్పస్ రిట్ అంటే ఏమిటి?
    1) ఇది అన్యాయమైన అరెస్టును నిరోధిస్తుంది
    2) అధికారిని పనిచేయమని
    3) నీ పని నీవు చేయమని
    4) ప్రతిషేధం
11. Sons of soil (భూమిపుత్రుల) సిద్ధాంతం ఎవరిది?
    1) శివసేన 2) బీహార్
    3) తెలంగాణ 4) విదర్భ
12. భారత రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక అనే పదాన్ని ఏ సంవత్సరంలో చేర్చారు?
    1) 1978 2) 1972
    3) 1976 4) 1970
13. ఐక్యరాజ్యసమితి ఏ నగరంలో ఉంది?
    1) చికాగో 2) న్యూయార్క్
    3) జెనీవా 4) శాన్‌ఫ్రాన్సిస్కో
14. దిన్-ఇ- ఇలాహీ అనే మతాన్ని ప్రవేశపెట్టిన వారు ఎవరు?
    1) బాబర్ 2) షాజహాన్
    3) ఔరంగజేబు 4) అక్బర్
15. భారతీయ లౌకికతత్వం ఎలాంటిది?
    1) సామాజికమైంది 2) నైతికమైంది
    3) ఉదారమైంది 4) ఏదీకాదు
16. రెండో ప్రపంచ యుద్ధంలో దారుణంగా ధ్వంసమైన నగరం?
    1) పెకింగ్ 2) నాగసాకి
    3) టోక్యో 4) తైవాన్
17. ఆసియా రాజ్యాల మొదటి మహాసభ జరిగిన నగరం ఏది?
    1) బాగ్దాద్ 2) నాగసాకి
    3) పెకింగ్ 4) ఢిల్లీ
18. భారత్-చైనాల మధ్య శాంతి ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది?
    1) 1987 2) 1988
    3) 1985 4) 1983
19. అలీనవిధానం పితామహుడు ఎవరు?
    1) చౌ-ఎన్-లై 2) భుట్టో
    3) నెహ్రూ 4) గాంధీజీ
20. బాండుంగ్ సమావేశం జరిగిన సంవత్సరం?
    1) 1947 2) 1949
    3) 1950 4) 1955
21. మొదటి అలీనదేశాల సదస్సుకి హాజరైన సభ్య దేశాల సంఖ్య?
    1) 45 2) 35 3) 25 4) 55
22. పంచశీల ఎవరి ఒప్పందాల ఫలితం?
    1) రాజీవ్‌గాంధీ- బెనజీర్ భుట్టో
    2) ఇందిరాగాంధీ- జుల్ఫికర్ ఆలీభుట్టో
    3) నెహ్రూ-చౌ-ఎన్-లై
    4) సుకర్నో-టిటో
23. మారణాయుధాల సంఖ్య పెరగడానికి కారణం ?
    1) మిత్రదేశాలు ఉచితంగా ఇవ్వడం
    2) శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి
    3) ఖర్చు తగ్గడం
    4) శాస్త్రీయ విజ్ఞాన లోపం
24. వియత్నాం విప్లవాన్ని బలపరిచిన సమావేశం జరిగిన నగరం?
    1) అల్జీర్స్ 2) జకార్తా
    3) హవానా 4) హరారే
25. ఏ లక్ష్యసాధన కోసం ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశారు?
    1) ఏకీయత 2) జాతీయత
    3) శాంతి 4) మత సహనం
26. ఏ సంవత్సరంలో చైనా- ఇండియాల మధ్య యుద్ధం జరిగింది?
    1) 1965 2) 1948
    3) 1962 4) 1971
27. ఇండియా తొలిసారిగా అణు విస్ఫోటన పరీక్ష జరిపిన సంవత్సరం?
    1) 1974 2) 1970
    3) 1968 4) 1975
28. సార్క్ ఆవిర్భావం ఎక్కడ జరిగింది?
    1) సిలోన్ 2) ఢాకా
    3) ఢిల్లీ 4) ఖాట్మాండు
29. బ్రిటీషువారు పరిపాలించిన వలస రాజ్యాల కూటమిని ఏమని వ్యవహరిస్తారు?
    1) కామన్‌వెల్త్
    2) బ్రిటీష్ సమాఖ్య
    3) యూరోపియన్ దేశాల కూటమి
    4) నాటో

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 3; 9) 3; 10) 1; 11) 1; 12) 3; 13) 4; 14) 4; 15) 3; 16) 2; 17) 4; 18) 1; 19) 3; 20) 4; 21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3; 26) 3; 27) 1; 28) 2; 29) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమిలో విజిటింగ్ ప్రొఫెసర్ పోస్టులు

హైదరాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమి(ఎస్‌వీపీఎన్‌పీఏ) ఒప్పంద ప్రాతిపదికన విజిటింగ్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** లా, టీచింగ్ మెథడాలజీ, సైబర్ లా అండ్ సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఫిల్/పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 28 నుంచి 65 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,50,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమి, శివరామ్‌పల్లి, హైదరాబాద్–500052, తెలంగాణ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.svpnpa.gov.in

ఆర్ఆర్ఐ, బెంగళూరులో క్వాంటమ్ సైంటిస్ట్/క్వాంటమ్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) క్వాంటమ్ సైంటిస్ట్/క్వాంటమ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 నుంచి రూ.1,50,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.08.2025
» **వెబ్‌సైట్:** https://www.rri.res.in

ఐఐటీ బీహెచ్‌యూలో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బనారస్ హిందూ యూనివర్శిటీ(ఐఐటీ-బీహెచ్‌యూ).. కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ, బీటెక్/ఎంటెక్, ఎంఎస్సీ ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి. -వయసు: 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** dinesh.che@iitbhu.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
» **వెబ్‌సైట్:** https://iitbhu.ac.in

ఐఐటీ తిరుపతిలో ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), తిరుపతి.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్, ఎంఎస్, ఎంఎస్సీ, బీటెక్/బీఈలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.25,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.07.2025
» **వెబ్‌సైట్:** https://iittp.ac.in

శ్రీకాకుళం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ శాఖలో ఒప్పంద ప్రాతిపదికన ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఏ /బీఎస్సీ /బీకాం /బీసీఏ/బీఈ/పీజీ/ఎంసీఏ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, లోకల్ లాంగ్వేజ్ తదితర నైపుణ్యాలు ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.07.2025.
» **హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తేది:** 05.08.2025.
» **పరీక్ష తేది:** 10.08.2025.
» **వెబ్‌సైట్:** https://srikakulam.ap.gov.in

నిట్ వరంగల్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంటెక్/బీటెక్/ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.08.2025
» **వెబ్‌సైట్:** https://nitw.ac.in

ఆధునికీకరణతోనే అదనపు నిల్వ సామర్థ్యం

భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తులను కొంత కాలం నిల్వ చేసేందుకు వీలు కల్పించే గిడ్డంగి సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. లభ్యమవుతున్న వసతులు అశాస్త్రీయంగా ఉండటంతో రైతులు పంట చేతికి వచ్చిన వెంటనే తమ ఉత్పత్తులను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. అందువల్ల వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో గ్రామీణ రుణగ్రస్థత పెరుగుతోంది. ఉత్పత్తిలో పెరుగుదల నేపథ్యంలో ఆహార ఉత్పత్తుల నిల్వసామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం ఏర్పడింది.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

నిల్వ సామర్థ్యం (Storage Capacity)

వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 'సమ్మిళిత వృద్ధి' సాధ్యపడాలంటే వ్యవసాయ రంగంలో సమూల ప్రగతి అవసరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత్‌లో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేదు. ఈ కారణంగా ఏటా మొత్తం ఉత్పత్తిలో 12 నుంచి 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. వీటి విలువ రూ. 50,000 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా.

1994–95 తర్వాతి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి 1.20 శాతంగా నమోదైంది. 1990–91లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.4 మిలియన్ టన్నులు కాగా, 2013–14 నాటికి 264.4 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇటీవల రబీలో గోధుమ, బియ్యం, Cereals, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా ఖరీఫ్, రబీ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమానంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఉత్పత్తిలో పెరుగుదలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాలను పటిష్టపరిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నిల్వ సౌకర్యాలు – గిడ్డంగులు

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సంబంధించి భారత్‌లో గిడ్డంగులు (గోడౌన్లు) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గిడ్డంగుల నిర్మాణం శాస్త్రీయంగా ఉన్నప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పరిమాణాలను పరిరక్షించవచ్చు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్లు గిడ్డంగులను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అతిపెద్ద ప్రభుత్వ రంగ గిడ్డంగి నిర్వహణదారుగా పేర్కొనవచ్చు. ఇది సుమారుగా 120 వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు భద్రతతో కూడిన నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, శ్రేణీకరణ, పంపిణీ లాంటి సేవలను కూడా నిర్వహిస్తోంది. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక గిడ్డంగి కార్పొరేషన్లను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన వాటా మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ సమానంగా సమకూరుస్తాయి. కేంద్ర, రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లతో పాటు భారత ఆహార సంస్థ కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది.

2010 చివరి నాటికి కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ), రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు, భారత ఆహార సంస్థల మొత్తం నిల్వ సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరింది. రైతులు వారి ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించకుండా నిరోధించే క్రమంలో గ్రామీణ గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2001 మార్చి నుంచి అమలు పరుస్తోంది. ఇప్పటివరకు 67 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న గ్రామీణ గోడౌన్లను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఉత్పత్తి ధోరణి, విక్రయమైన మిగులు పరిశీలించినప్పుడు భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. 2012 ఫిబ్రవరి 1 నాటికి భారత ఆహార సంస్థ 300.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం (సొంత, అద్దె గోడౌన్లు కలిపి) కలిగి ఉండగా రాష్ట్ర ఏజెన్సీలు 153.54 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తంగా భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం 91 మిలియన్ టన్నులకు పైగా పెరిగింది. ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి నిల్వ సామర్థ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఆహార ధాన్యాల నిల్వకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రత కల్పించే క్రమంలో ప్రభుత్వ ఏజెన్సీల ఆహార ధాన్యాల సేకరణ పెరుగుతున్న క్రమంలో లభ్యమయ్యే నిల్వ సామర్థ్యంపై అధిక ఒత్తిడి ఉంది. అధిక మద్దతు ధరల కారణంగా ఆహార ధాన్యాల సేకరణలో నిమగ్నమవుతున్న రాష్ట్ర ఏజెన్సీల నిల్వ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. నాబార్డ్ మంజూరు చేసిన గోడౌన్ల సగటు నిల్వ సామర్థ్యం 1261 మెట్రిక్ టన్నులు కాగా, మొత్తం గోడౌన్లలో 75 శాతం నిల్వ సామర్థ్యం వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంది. నాబార్డ్ సహకారంతో రైతులు ఏర్పాటు చేసుకున్న చిన్న, మధ్య తరహా గోడౌన్ల వల్ల వారి ఉత్పత్తులను తక్కువ ధర వద్ద విక్రయించే పరిస్థితి తగ్గి, గిట్టుబాటు ధర పొందగలుగుతున్నారని అనేక అనుభవ పూర్వక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

నిల్వ సామర్థ్యం – ప్రాంతీయ అసమానతలు

ఉత్పత్తి కేంద్రాలుగా భారత్‌లో నిల్వ సామర్థ్యం కొన్ని ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉన్న ముఖ్య రాష్ట్రాల్లో 22 శాతం నిల్వ సామర్థ్యం లభ్యమవుతోంది. అవసరాలకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు నెల లోపు నిల్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. రాష్ట్రాల మధ్య ఆహార, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తేడా; వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిమిత్తం మండీల ఏర్పాటులో వ్యత్యాసాలు నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రాంతీయ అసమానతలు పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. స్థానిక ఉత్పత్తిదారులకు గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించి వారిలో అవగాహన, బ్యాంక్ అధికారుల వైఖరి లాంటివి కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ప్రాంతాల మధ్య అసమానతలకు కారణంగా ఉన్నాయి. మొత్తం గోడౌన్లు, నిల్వ సామర్థ్యంలో ఆహార ధాన్యాలు, సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా పండించే కొద్దిమంది రైతులే ఎక్కువగా కలిగి ఉన్నారు. అందువల్ల ధనిక రైతులే గిట్టుబాటు ధరలు పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలతో పాటు ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. భారత్‌లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఉత్తర భారతదేశం వాటా 48 శాతం ఉండగా, దక్షిణ భారతదేశం 22%, పశ్చిమ ప్రాంతం 13%, మధ్య భారత దేశం 9%, తూర్పు ప్రాంతం 7% వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా దేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యంలో 1% మాత్రమే. నిల్వ సామర్థ్యంలో ప్రాంతాల మధ్య అసమానతల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ సామర్థ్యం పరిమితంగా ఉంది. గోడౌన్లలో నిల్వ చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలపై గోధుమ, బియ్యం వాటా అధికంగా ఉంది. తర్వాతి స్థానాల్లో నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పత్తి నిలిచాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నప్పటికీ గోధుమ, బియ్యం నిల్వల్లోనే పెరుగుదల కనిపిస్తోంది.

గిడ్డంగుల నియంత్రణ విధానం: గిడ్డంగుల ఏర్పాటులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వేర్‌హౌసింగ్ పరిశ్రమ అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2007లో 'ది వేర్‌హౌసింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్)' చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం 2010 అక్టోబర్‌లో వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. వేర్‌హౌసింగ్ అభివృద్ధి, నియంత్రణ చట్టం ముఖ్య ఉద్దేశం నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్ (NWR) మంజూరులో నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం. NWR మంజూరు చేసే గిడ్డంగులకు వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) గుర్తింపునిస్తుంది. ఇది 2011 మార్చి 31 నాటికి పరిశీలనకు వచ్చిన 300 దరఖాస్తుల్లో 51 అప్లికేషన్లకు అనుమతినిచ్చింది.

కోల్డ్ స్టోరేజీలు

భారత్‌లో పండ్లు, కూరగాయల సాంవత్సరిక ఉత్పత్తి 130 మిలియన్ టన్నులుగా అంచనా. వైవిధ్య వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అనేక అవకాశాలున్నప్పటికీ ఆయా ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన శీతల గిడ్డంగులు (Cold Storages) తగినంతగా లేవు. శీతల గిడ్డంగుల సౌకర్యం అధికంగా సింగిల్ కమోడిటీస్ అయిన బంగాళాదుంప, ఆరెంజ్, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ, పూలు లాంటి వాటికి మాత్రమే అందుబాటులో ఉంది. అంటే శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు. బహుళ ఉత్పత్తులను నిల్వ చేసే విధంగా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. ఇది ఉత్పత్తిదారుల ఆర్థిక స్తోమతపై ఆధారపడి ఉంటుంది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థను శీతల గిడ్డంగులు నిర్వహిస్తాయి. వస్తువులు నిల్వ చేయడానికి వీలుగా గది వాతావరణాన్ని రిఫ్రిజిరేషన్ వ్యవస్థ నియంత్రిస్తుంది. దేశంలోని 5274 శీతల గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 24.31 మిలియన్ టన్నులుగా అంచనా. శీతల గిడ్డంగులు ఎక్కువగా ప్రైవేటు రంగంలో ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, సహకార రంగంలో ఏర్పాటైన శీతల గిడ్డంగుల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం దేశంలోని శీతల గిడ్డంగుల్లో పండ్లు, కూరగాయలు, పత్తి, మిరపకాయల నిల్వలు కొనసాగుతున్నాయి. అసోం, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, కేరళ, సిక్కిం, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 1% మాత్రమే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్‌లోని మొత్తం శీతల గిడ్డంగుల సగటు నిల్వ సామర్థ్యం కంటే అధిక నిల్వ సామర్థ్యం ఉంది. మొత్తం మీద వీటి డిమాండ్ వ్యవసాయ ఉత్పత్తులకే అధికంగా ఉంది..

నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు

- గత దశాబ్ద కాలంలో నిల్వ సామర్థ్యం సగటు సాంవత్సరిక వృద్ధి 6.7%గా నమోదైంది. నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేనందువల్ల ఏటా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 20 నుంచి 30 శాతం వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాష్ట్ర గిడ్డంగులను ఆధునికీకరించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రాష్ట్ర ఏజెన్సీలు నిర్వహిస్తున్న గిడ్డంగులు 20 ఏళ్ల పైబడి ఉన్నాయి. అందువల్ల ఆయా గిడ్డంగుల ఆధునికీకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వీటి ఆధునికీకరణకు 37 నుంచి 40 బిలియన్ రూపాయల వ్యయం అవుతుందని అంచనా.
- ఖరీఫ్, రబీ కాలాల్లో వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతౌల్యం సాధించాలి. వినియోగ అవసరాల దృష్ట్యా సాంవత్సరిక ఉత్పత్తిలో 70% నిల్వ చేసే విధంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దీని కోసం గ్రామీణ గోడౌన్ల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి. ప్రస్తుతం సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సుమారుగా 30% ఉత్పత్తి అవుతున్నట్లుగా భావించి, మొత్తం 70 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ నిమిత్తం నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వృథా అవుతున్న ఆహార ధాన్యాల ఉత్పత్తిని 70 మిలియన్ టన్నులుగా భావిస్తే వాటి మొత్తం విలువ 70 నుంచి 100 బిలియన్ రూపాయల వరకు ఉంటుంది.
- ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి గోధుమ, బియ్యం అధిక మొత్తంలో ఆక్రమించినందువల్ల ఇతర ఆహార ధాన్యాలు, వ్యవసాయ వస్తువుల నిల్వకు అవరోధం ఏర్పడుతోంది. జొన్నలు, సజ్జలు, కార్న్, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి, సుగర్ కేన్ లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నిర్వహణలో ఉన్న గిడ్డంగుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి వేర్‌హౌస్ పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లను ప్రవేశ పెట్టాలి.
- ప్రైవేటు రంగంలో నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రోత్సాహకాలు అవసరం. నాబార్డ్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా గిడ్డంగి పరిశ్రమ అభివృద్ధిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. 2010 మార్చి నాటికి మొత్తం నిల్వ సామర్థ్యం 91 మిలియన్ మెట్రిక్ టన్నుల్లో నాబార్డ్ పథకం కింద లబ్ధి పొందిన గిడ్డంగుల సామర్థ్యం 24 శాతం కాగా, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద లబ్ధి పొందిన గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 17 శాతం. గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. రుణగ్రస్థత కారణంగా చిన్న, సన్నకారు రైతులు గిట్టుబాటు ధర లభించే వరకు వేచి చూడకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ ఆదాయాలు తగ్గి వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి రైతులు తమ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునేవిధంగా ప్రోత్సహించాలి. గుర్తింపు ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్‌ను అందిస్తే బ్యాంకుల నుంచి రైతులు స్వల్పకాల రుణాన్ని పొందగలుగుతారు. తద్వారా గిట్టుబాటు ధర లభించే వరకు వారి ఉత్పత్తులను విక్రయించకుండా వేచి చూస్తారు. ఈ స్థితి వ్యవసాయ ఆదాయాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపునకు దారితీస్తుంది. NWR మంజూరు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి ప్రవాహం పెంపునకు, కాస్ట్ ఆఫ్ క్రెడిట్ (పరపతి వ్యయం) తగ్గింపునకు తోడ్పడుతుంది. ప్రామాణీకరణ, శ్రేణీకరణ, ప్యాకేజింగ్, బీమా సేవలు లాంటి ఇతర కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అగ్రి – బిజినెస్‌లోని లాజిస్టిక్ చైన్‌లో ఉన్న తారతమ్యాన్ని ఇది పూరిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పెంపుతో పాటు మూలధన సబ్సిడీ లాంటివి కల్పించడం ద్వారా రైతులను సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలి. సహకార సంఘాల ద్వారా అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

One thing that is usually true…



BANK EXAMS
MARKETING AWARENESS

1. The term marketing refers to:
   a) New product concepts and improvements
   b) Advertising and promotion activities
   c) A philosophy that stresses more on customer value and satisfaction
   d) Planning sales campaigns
   e) None of these
2. In the history of marketing, when did the production period end?
   a) In the late 1800s
   b) In the early 1900s
   c) In the 1920s
   d) After the end of the Second World War
   e) None of these
3. A marketing philosophy summarized by the phrase 'a stronger focus on social and ethical concerns in marketing' is characteristic of the ____ period.
   a) production b) sales
   c) marketing
   d) societal marketing
   e) None of these
4. Which skills and capabilities will marketers need to increasingly have?
   a) Market research
   b) Digital and social media marketing
   c) Strategic marketing
   d) Sales
   e) None of these
5. Which of the following is not part of the external marketing environment?
   a) Political b) Legal
   c) Product d) Socio-cultural
   e) None of these
6. Tobacco advertising is now virtually banned in all marketing communication forms in many countries around the world. This can be explained as an influence of:
   a) Technological environment
   b) Legal environment
   c) Economic environment
   d) Ecological environment
   e) None of these
7. A firm has decided to alter its pricing and promotional strategies in response to slower than expected job growth and declining personal incomes. The firm is responding to changes in it's:
   a) Socio-cultural environment
   b) Political environment
   c) Economic environment
   d) Competitive environment
   e) None of these
8. The process of collecting information about the external marketing environment is:
   a) Environmental management
   b) Environmental scanning
   c) Marketing management
   d) Marketing research
   e) None of these
9. Which is NOT classified in buy classes?
   a) New task
   b) Information gathering
   c) Modified re-buy
   d) Straight re-buy
   e) None of these
10. With respect to consumer behaviour, one's friends and relatives could be considered a/an:
    a) Impersonal influence
    b) Reference group influence
    c) Perceptual influence
    d) Institutional influence
    e) None of these
11. Which of the following is not part of the consumer proposition acquisition process?
    a) Motive development
    b) Information gathering
    c) Proposition evaluation
    d) Perception
    e) None of these
12. The purchasing department reorders on a routine basis, very often working from an approved list of suppliers. This is referred to as:
    a) Straight re-buy b) New task
    c) Modified re-buy
    d) Routine buying
    e) None of these
13. Which sampling techniques are often selected in qualitative research?
    a) Non-probability sampling
    b) Probability sampling
    c) Stratified sampling
    d) Random sampling
    e) None of these
14. What is the term used to describe the degree to which the data elicited in a study is replicated in a repeat study?
    a) Replication b) Pre-code
    c) Reliability d) Convenience
    e) None of these
15. One thing that is usually true of focus groups is that:
    a) Most groups involve a small number of participants
    b) They usually average 5 to 10 minutes in length
    c) The moderator's job is to keep the group busy for the entire time and not let anyone leave
    d) The questions used are highly structured and response-driven
    e) None of these
16. Which type of research methods are designed to elicit responses to predetermined, standardized questions from a large number of respondents?
    a) Quantitative
    b) Qualitative
    c) Non-probability
    d) Probability e) None of these
17. The ____ process commences at corporate level. Here the organization sets out its overall mission, purpose and values.
    a) researching
    b) strategic planning
    c) controlling d) managing
    e) None of these
18. A statement about what an organization wants to become, which sets out an organization's future, is referred to as:
    a) Mission b) Values
    c) Organizational goals
    d) Vision e) None of these
19. A statement that sets out what the organization wishes to achieve in the long term is referred to as:
    a) Mission b) Vision
    c) Values
    d) Strategic context
    e) None of these
20. Organizational values are important because they ___.
    a) help shape mission statements
    b) help increase sales
    c) help guide behaviour and the recruitment and selection decisions
    d) help define market research
    e) None of these
21. A commonly used basis for segmenting consumer markets:
    a) Organizational size
    b) Demographics
    c) Product type
    d) Price e) None of these
22. Which of the following is not an example of a behavioural variable?
    a) Product usage
    b) Media usage
    c) Purchase occasion
    d) Personality e) None of these
23. ACORN, a segmentation analysis technique, stands for which of the following?
    a) A Corresponding Official Residential Notation
    b) A Classification of Reported Nationals
    c) A Classification of Residential Neighbourhood
    d) A Countrywide Official Resources Navigation
    e) None of these
24. The family life cycle:
    a) is a way to apply psychographic segmentation
    b) refers to the process of family formation and dissolution
    c) provides insights into the relationships among age, occupation, income and housing
    d) is composed of the 11 stages of personal growth from infancy to retirement
    e) None of these
25. Offerings move through a sequential, pre-determined pattern of development similar to the biological path that life forms follow. This is the concept of:
    a) Process of diffusion
    b) New product development
    c) Product life cycle
    d) Brand management
    e) None of these
26. Which of the following is NOT a service innovation strategy?
    a) Branded service innovation
    b) Established service innovation
    c) Incremental service innovation
    d) Radical service innovation
    e) None of these
27. ____ is concerned with value creation generated through novel or unusual service concepts.
    a) Established service innovation
    b) Radical service innovation
    c) Generic service innovation
    d) Incremental service innovation
    e) None of these
28. At the highest end of innovation maturity, firms seek to integrate the services dimension as part of their total offer. This is known as:
    a) Servitization b) Reutilization
    c) Diffusion d) Productization
    e) None of these
29. In marketing terms, ____ refers to what we get for what we pay.
    a) Revenue b) Cost
    c) Value d) Product
    e) None of these
30. ____ act as cues by indicating to a potential customer that there is a bargain to be had.
    a) Odd-number pricing
    b) Sale signs c) Relative price
    d) Price surplus e) None of these
31. ____vary according to the number of units of goods made or services sold.
    a) Product assets
    b) Price elasticity
    c) Fixed costs d) Variable costs
    e) None of these
32. Costs which do not vary according to the number of units of product made or service sold:
    a) Fixed costs b) Moving assets
    c) Working capital
    d) Fixed capital e) None of these
33. This is a hierarchy of effects or sequential model used to explain how advertising works:
    a) ADD b) AIDA
    c) PESTLE d) SWOT
    e) None of these
34. AIDA stands for Awareness, ___, Desire and _____.
    a) Interest; Action
    b) Intensity; Appeal
    c) Involvement; Action
    d) Involvement; Appeal
    e) None of these
35. Marketing communications is used to achieve one of two principal goals. The first concerns the development of brand values. What is the other goal?
    a) Increasing sales
    b) Informing about products
    c) Changing the behavior of target audiences
    d) Channeling communication tools
    e) None of these
36. Sharing of meaning created through the transmission of information:
    a) Communication
    b) Noise c) Transfer
    d) Understanding
    e) None of these
37. Users are able to create content and become more involved with a brand through:
    a) Door to door
    b) Online communities
    c) Direct mail d) Telemarketing
    e) None of these
38. A commercial activity, whereby one party permits another an opportunity to exploit an association with a target audience in return for funds, services or resources is referred to as:
    a) Advertising b) Exchange
    c) Sponsorship
    d) Public relations e) None
39. These sell directly to end consumers and may purchase directly from manufacturers and/or deal with wholesalers:
    a) Distributors b) Franchising
    c) Merchant d) Retailers
    e) None of these
40. These store goods for moderate to long periods:
    a) Storage warehouses
    b) Distribution centres
    c) Haulage transport
    d) Electronic data interchange
    e) None of these

KEY

1) c;	2) c;	3) d;	4) b;
5) c;	6) b;	7) c;	8) b;
9) b;	10) b;	11) d;	12) a;
13) a;	14) c;	15) a;	16) a;
17) b;	18) d;	19) a;	20) c;
21) b;	22) d;	23) c;	24) b;
25) c;	26) a;	27) b;	28) a;
29) c;	30) b;	31) d;	32) a;
33) b;	34) a;	35) c;	36) a;
37) b;	38) c;	39) d;	40) a.